

'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 206

శుక్రవారం 17-10-2025


అమ్మ... నాన్న... నాలుగో సింహం -II


పండగ రోజులు కదా... ఎర వేస్తారు! -II

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL





- 'సాక్షి' ఫ్యామిలీతో మహిళా ఐపీఎస్‌ల మనోగతం



రోజుకు 5 నుండి 7 గంటలు తలను ఫోన్ ముందు వంచి గడపడాన్ని 'టెక్స్ట్ నెక్' అని పిలుస్తున్నారు. టెక్స్ట్ నెక్ అనేది మెడలోని కండరాలు, నరాలను ఒత్తిడికి గురి చేస్తుంది. ఒక వ్యక్తి గంటల తరబడి ఫోన్ ముందు వంగి ఉండడం వల్ల అది వెన్నుపూసల మధ్య డిస్క్‌లపై మూడు నుంచి అయిదు రెట్లు ఎక్కువ ఒత్తిడి కలిగిస్తుందంటున్నారు వైద్యనిపుణులు.

అమ్మ... నాన్న... నాలుగో సింహం

అణువంత ప్రోత్సాహంతో అంతులేనన్ని విజయాలు సాధిస్తామని నిరూపించారు. అపజయాలెన్ని ఎదురైనా వెరవకుండా లక్ష్యాన్ని సాధించి చూపారు. అమ్మానాన్నలు ఇచ్చిన ప్రోత్సాహం.. భరోసాతో దేశంలోనే అత్యున్నత సర్వీస్‌లలో ఒకటైన ఇండియన్ పోలీస్ సర్వీసెస్‌కు ఎంపికై శభాష్ అనిపించుకున్నారు. ఓ కూతురు కండక్టర్ అయిన తన తండ్రి కల నెరవేర్చితే... మరో కూతురు తన తండ్రి నుంచి పొందిన స్ఫూర్తితో సమాజ సేవకు సిద్ధమైంది. అమ్మ అండతో సాటి మహిళలకు భరోసాగా నిలిచే పోలీస్ అధికారి అవుతానని మరొకరు నిరూపించారు. నేషనల్ పోలీస్ అకాడమీలో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న 174 మందిలో 77 ఆర్ఆర్ (రెగ్యులర్ రిక్రూటీస్) బ్యాచ్ ఐపీఎస్ అధికారులు నేడు నిర్వహించనున్న పాసింగ్ ఔట్‌పరేడ్‌తో బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా బ్యాచ్‌లోని ముగ్గురు మహిళా ఐపీఎస్‌ల మనోగతం... వారి మాటల్లోనే...



అమ్మ ఇచ్చిన భరోసాతోనే ముందుకు వెళ్లా!
- జయశర్మ

నేను ఐపీఎస్ అధికారి అయ్యానంటే అందుకు వందశాతం మా అమ్మే కారణం. నేను ఓటమి పాలైన ప్రతిసారి నాలో ధైర్యాన్ని నింపింది అమ్మ. ఒత్తిడిలో కూరుకుపోయిన ప్రతిసారీ నాకు భరోసా ఇచ్చి నన్ను ఇక్కడివరకు నడిపింది మా అమ్మ నీతూశర్మే. నా పేరు జయశర్మ. నా స్వస్థలం హర్యానాలోని హిస్సార్. మా నాన్న ప్రమోద్ కుమార్ శర్మ. నాన్న డిస్ట్రిక్ట్ ఫుడ్ సప్లై కంట్రోలర్‌గా పనిచేస్తున్నారు. అమ్మ గృహిణి. నేను ఢిల్లీ యూనివర్సిటీలో బీఎస్సీ మ్యాథ్స్ ఆనర్స్, ఐఐటీ ఢిల్లీ నుంచి ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్ పూర్తి చేశాను. నాకు ఐపీఎస్ కావాలని చిన్ననాటి నుంచే కల. అమ్మ ప్రోత్సాహం, నాన్న అండతో నేను గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన తర్వాత సివిల్ సర్వీసెస్‌పై దృష్టి పెట్టా. ఇది ఎంతో కష్టమైన పని. కొన్నిసార్లు మనపై మనం నమ్మకాన్ని కోల్పోతాం. ఇది మన వల్ల కాదనిపిస్తుంది. అలాంటప్పుడు మనల్ని ప్రోత్సహించేవాళ్లు, భరోసా ఇచ్చేవాళ్లు ఎంతో అవసరం. నేను కూడా మూడుసార్లు సివిల్స్‌కి ఎంపిక కాకపోయినా నిరుత్సాహ పడలేదు. తప్పులు సరిచేసుకుంటూ ముందు వెళ్లా. ఐపీఎస్ ఎలాగైనా సాధించాలన్న నా పట్టుదలకు తోడు నా కుటుంబం, స్నేహితులు అండగా నిలిచారు. నాల్గో ప్రయత్నంలో నేను అనుకున్నట్టుగానే ఐపీఎస్‌కి ఎంపికయ్యాను.

నేషనల్ పోలీస్ అకాడమీ (ఎన్‌పీఏ)లో శిక్షణ పూర్తిగా భిన్నమైంది. నేను ఎన్‌పీఏలోకి రాకముందు కనీసం వంద మీటర్లు కూడా పరిగెత్తినట్టు గుర్తు లేదు. కానీ ఇక్కడ శిక్షణతో ఇప్పుడు ఒంటిపై బరువు, చేతిలో రైఫిల్‌తో 40 కిలోమీటర్లు కూడా రన్నింగ్ చేసేంత స్థైర్యం వచ్చింది. మహిళా ఐపీఎస్ అధికారిగా మహిళా భద్రత, సైబర్ భద్రతపై ప్రత్యేక దృష్టి పెడతాను.

నాలుగుసార్లు ఓడినా.. నాన్న ప్రోత్సాహం తగ్గలేదు
- అశ్వినీ.ఎస్

మా స్వస్థలం తమిళనాడులోని కన్యాకుమారి. నాన్న బస్ కండక్టర్‌గా పనిచేసి ఈ ఏడాది రిటైర్ అయ్యారు. అమ్మ గృహిణి. మా అక్క ప్రైవేటు ఉద్యోగిని. మేం ఇద్దరమూ అమ్మాయిలమే అయినా.. నాన్న మమ్మల్ని అన్నింటిలో ప్రోత్సహించేవారు. నేను అన్నా యూనివర్సిటీ నుంచి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్‌లో ఇంజినీరింగ్ పూర్తి చేశాను. ప్రభుత్వ అధికారిగా ఉంటేనే సమాజానికి దగ్గరగా పనిచేయవచ్చని నాకు మొదటి నుంచి ఉండేది. అందుకే ఇంజినీరింగ్ తర్వాత ప్రైవేటు ఉద్యోగాలవైపు వెళ్లలేదు. తమిళనాడులో స్టేట్ జీఎస్టీ విభాగంలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేశాను. కానీ.. నన్ను ఐపీఎస్ ఆఫీసర్‌ను చేయాలన్నది నాన్న కల. అయితే సివిల్స్‌కు ఎంపిక కావడం అంత సులువేం కాదు. ఐదో ప్రయత్నంలో ఐపీఎస్ సాధించానంటే నాన్న ఇచ్చిన ప్రోత్సాహమే కారణం. ఎప్పటికప్పుడు గతంలో చేసిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకుంటూ, వ్యక్తిగతంగా నోట్స్ తయారు చేసుకుంటూ నా ప్రయత్నాన్ని కొనసాగించాను. చివరికి విజయం దక్కింది. ఎన్నో కొత్త విషయాలను నేర్చుకునే అవకాశంతోపాటు మనలో ఉన్న సామర్థ్యాన్ని మనకు తెలియజేస్తుంది నేషనల్ పోలీస్ అకాడమీ ట్రైనింగ్. ఈ శిక్షణ తర్వాత నేను ఎంతో భరోసాగా చెప్పగలను – పోలీస్ ఉద్యోగం మహిళలు కూడా ఎంతో బాగా చేయగలరని! మా బ్యాచ్‌లో కూడా 65 మంది మహిళా ఐపీఎస్‌లు ఉండడమే అందుకు ఉదాహరణ. సివిల్స్‌కి ప్రిపేర్ అవుతున్న వాళ్లకి నా సలహా ఒక్కటే..సివిల్స్ సాధించడం అనేది మీ లక్ష్యం అయితే, ఎన్ని అడ్డంకులు వచ్చినా మధ్యలో వదలొద్దని ముందే నిర్ణయించుకోవాలి. ఒత్తిడి లేకుండా ప్రణాళిక ప్రకారం పరీక్షలకు సిద్ధం కావాలి. అప్పుడు విజయం మనదే.

నాకు స్ఫూర్తి మా నాన్నే
- కీర్తియాదవ్

నాన్న ఎయిర్ మెన్‌గా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో పని చేసి రిటైర్ అయ్యారు. ఇంట్లో ఎంతో క్రమశిక్షణ ఉండేది. నా చిన్నప్పటి నుంచి నాన్నను అలా యూనిఫాంలో చూస్తూ పెరగడంతో నాకు కూడా యూనిఫాం సర్వీసెస్ అంటే ఎంతో గౌరవం ఏర్పడింది. ఆయనే నాకు ఎప్పటికీ స్ఫూర్తి. స్కూలింగ్ పూర్తయి, కాలేజీకి వచ్చాక నాకు స్పష్టత వచ్చింది ఐపీఎస్ అధికారి అయితే ప్రజలకు నేరుగా సేవ చేసే అవకాశం ఉంటుందని. అందుకే ఎప్పటికైనా ఐపీఎస్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకుని ముందుకు వెళ్లా. అయితే గ్జేవియర్స్ కాలేజ్ కోల్‌కతా నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తయి తర్వాత నేను మొదటి ప్రయత్నంలో సీఐఎస్ఎఫ్‌లో అసిస్టెంట్ కమాండెంట్‌గా ఎంపికయ్యాను. 2020లో ట్రైనింగ్ చేస్తూనే సివిల్స్ ప్రిపరేషన్ కొనసాగించాను. ఆ తర్వాత ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్‌కు ఎంపికయ్యాను. అయినా, ఐపీఎస్ కలను వదల్లేదు. నాల్గో ప్రయత్నంలో నాకు ఐపీఎస్ వచ్చింది. నాన్న ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేయడం.. మొదటి నుంచి ఎంతో క్రమశిక్షణతో పెరగడంతో ఇక్కడి ట్రైనింగ్ కష్టంగా అనిపించలేదు. సులువుగానే శిక్షణ పూర్తి చేశా. ఇక్కడ నేర్చుకున్న విషయాలు వృత్తిగతంగానే కాకుండా వ్యక్తిగతంగా నన్ను ఎంతో మార్చాయి. నాకు తెలంగాణ పోలీసులో మహేశ్ భగవత్ ఇన్‌స్పిరేషన్. ఐపీఎస్ అధికారిగా నేను మహిళా భద్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాను. నేను హర్యానాలో పుట్టిపెరిగాను. అక్కడి పరిస్థితులు చూశాక..మహిళా భద్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నా.

– నాగోజు సత్యనారాయణ, స్టేట్ క్రైమ్ రిపోర్టర్, సాక్షి, హైదరాబాద్
ఫొటోలు : ఏ. జాన్

● నయా వంచన | డిజిటల్ మోసాలు

పండగ రోజులు కదా... ఎర వేస్తారు!

స్టే స్మార్ట్ స్టే సేఫ్



పండగ కదా.... ఆన్‌లైన్ షాపింగ్ ప్రయత్నాలలో ఉన్నప్పుడు 'ఫ్రీ దీపావళి గిఫ్ట్' అంటూ పాపప్ కనిపించవచ్చు. 'ఈ ప్రశ్నలకు జవాబు చెప్పి దీపావళి బహుమతులు గెలుచుకోవచ్చు' అనే ప్రకటన మెరుపులా మెరియవచ్చు.

దీపావళిని పురస్కరించుకొని దుస్తుల నుంచి వస్తువుల వరకు ఆన్‌లైన్ షాపింగ్ ఊపందుకుంటుంది. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ మోసగాళ్లకు చేతినిండా పనే!

పండగ రోజుల్లో ఆన్‌లైన్ స్కామ్‌లు ఎక్కువగా జరగడానికి అవకాశం ఉంది. నకిలీ ఈ–మెయిల్స్, టెక్ట్స్, కాల్స్ ద్వారా స్కామ్‌లు జరుగుతుంటాయి. ఈ పండగ సీజన్‌లో మోస్ట్ కామన్ స్కామ్... నకిలీ ఆర్డర్ లేదా అకౌంట్. మీ అకౌంట్ తాత్కాలికంగా నిలిపివేయబడిందని, ఆర్డర్‌కు పేమెంట్ వెరిఫికేషన్ అవసరమని పేర్కొంటూ హానికరమైన లింక్‌లను క్లిక్ చేసేలా, వ్యక్తిగత వివరాలు షేర్ చేసే విధంగా కస్టమర్‌లను ప్రేరేపిస్తారు.

'గత సంవత్సరం 55,000 ఫిషింగ్ వెబ్‌సైట్‌లను, 12,000 స్కామ్ ఫోన్ నంబర్లను బ్లాక్ చేశాం. పండగ సీజన్ ముందు ఆన్‌లైన్ స్కామ్‌లపై వినియోగదారులకు అవగాహన కలిగించడానికి ఇండియన్ సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్‌తో కలి పనిచేశాం' అన్నారు అమెజాన్ ఇండియా, వైస్ ప్రెసిడెంట్ (లీగల్) రాకేష్ బక్షీ.

'స్కామర్‌లు నకిలీ షాపింగ్ వెబ్‌సైట్‌లను లేదా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లాంటి ప్రసిద్ధ బ్రాండ్‌లను అనుసరించి ఆన్‌లైన్ ప్రకటనలను సృష్టిస్తారు. నమ్మశక్యం కాని డిస్కౌంట్‌లతో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తారు. పరిమిత కాల ఆఫర్‌లతో కస్టమర్‌లను ఆకర్షిస్తారు. ఒక కస్టమర్ ఆర్డర్ చేసి చెల్లింపు చేసిన తర్వాత నకిలీ ప్రాడక్ట్స్ అందుతాయి. అసలు ఏమీ అందకపోవచ్చు కూడా. నకిలీ వెబ్‌సైట్‌లు తరచుగా అధికారిక బ్రాండ్ లోగోలు, ప్రాడక్ట్ ఇమేజ్‌లను, చట్టబద్ధమైన సైట్‌లను తలపించేలా పాలిష్ చేసిన డిజైన్‌లను ఉపయోగిస్తాయి. కొందరు నిజమైన వెబ్‌సైట్‌ల లేఅవుట్, డొమైన్ పేరును కూడా క్లోన్ చేస్తారు. తేడాను గుర్తించడం కష్టంగా ఉంటుంది' అంటున్నారు సైబర్ సెక్యూరిటీ ఎక్స్‌పర్ట్ శుభంసింగ్.

చాలామంది స్కామర్‌లు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లాంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఫేక్ 'గివ్ అవే' పోటీలు లేదా లక్కీ డ్రాల గురించి పోస్ట్ చేస్తారు. మీ బ్యాంక్ వివరాలను షేర్ చేయమని లేదా క్లెయిమ్ యువర్ ప్రైజ్ లింక్‌పై క్లిక్ చేయమని అడగవచ్చు. వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని ఎప్పుడూ షేర్ చేయవద్దు.

అనుమానాస్పద ఎకౌంట్‌ల గురించి వెంటనే రిపోర్ట్ చేయండి. బ్లాక్ చేయండి. బ్యాంక్ స్టేట్‌మెంట్‌లను క్రమం తప్పకుండా తనిఖీ చేసుకోండి.

స్త్రీ హెల్త్‌పై దృష్టిపెట్టాలి



కృతిసనన్

చలం, అంబేద్కర్‌ల నుంచి నటి, ఐక్యరాజ్యసమితి పాపులేషన్ ఫండ్ (యూఎన్ఎఫ్‌పీఏ) జెండర్ ఈక్వాలిటీకి ఈ దేశపు రాయబారి కృతిసనన్ దాకా అందరి మాటా ఒకటే స్త్రీ ఆరోగ్యమే దేశ భవిష్యత్ భాగ్యం అని!

నిజానికి మహిళా ఆరోగ్యం, లింగ సమానత్వం గురించి మాట్లాడుకోవడానికి ప్రత్యేక సందర్భం అక్కర్లేదు.. అయినా ఈ ప్రస్తావనకు ప్రత్యేక సందర్భమూ ఉంది. అదే బెర్లిన్ (జర్మనీ)లో జరిగిన వరల్డ్ హెల్త్ సమ్మిట్ 2025. ఇందులో ఆమె మహిళల ఆరోగ్యం మీద శ్రద్ధ పెట్టాల్సిన అవసరం గురించి మాట్లాడారు. ఇలా వరల్డ్ హెల్త్ సమ్మిట్‌లో ప్రసంగించిన తొలి భారతీయ నటిగా కీర్తి గడించారు. ఆ ప్రసంగంలో కీర్తి సనన్ ఏం మాట్లాడారంటే..

'మహిళల ఆరోగ్యం నిర్లక్ష్యం చేయాల్సిన లేదా పక్కన పెట్టాల్సిన విషయం కాదు. తక్షణమే దృష్టిపెట్టాల్సిన అత్యంత అవసరమైన అంశం. ఆమె ఆరోగ్యం.. మానవాళి ప్రగతికి, భవిష్యత్‌కు మూల స్తంభం. అందుకే మహిళా ఆరోగ్యానికి సంబంధించి సుస్థిరమైన పెట్టుబడులు కావాలి. ఆవిష్కరణలు జరగాలి. ఇందుకోసం చేసే ప్రతి ప్రయత్నం అద్భుతమైన ఆర్థిక, సామాజిక మార్పులుగా ప్రతిఫలిస్తుంది. ఏటా ముప్పై కోట్లు ఇన్వెస్ట్ చేస్తే పదమూడు వందల కోట్ల రాబడి కనిపిస్తోంది. అంటే దాదాపు తొమ్మిది రెట్ల లాభం. ఈ ఇన్వెస్ట్‌మెంట్ నైతికావసరమే కాదు మన మూకుమ్మడి భవిష్యత్‌కు భరోసా కూడా! ఎందుకంటే మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబాలు, సమాజం.. ఆరోగ్యంగా ఉంటాయి. ఆరోగ్యవంతమైన సమాజం ఆర్థిక సుస్థిరతకు చిహ్నం. కానీ ప్రపంచ జనాభాలో సగంగా ఉన్న మహిళల ఆరోగ్యం ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురవుతూనే ఉంది. యూఎన్ఎఫ్‌పీఏ జెండర్ ఈక్వాలిటీ అంబాసిడర్‌గా చాలా ప్రాంతాలు తిరిగాను. అవన్నీ కూడా బాల్యవివాహాలకు సాక్ష్యంగా కనపడ్డాయి. అమ్మాయిలకు మానసిక ఆరోగ్యం సంగతి అటుంచి కనీసం శారీరక ఆరోగ్య కేంద్రాలు కూడా అందుబాటులో లేని దుస్థితిలో ఉన్నాయి. వీళ్ల జీవితాలు మారాలంటే మహిళల ఆరోగ్యానికి సంబంధించి దృష్టి పెరగాలి. తక్షణమే ఆ దిశగా కార్యాచరణ నిర్ణయాలు జరగాలి' అన్నారు కృతిసనన్.

పండగలకు, సంప్రదాయ వేడుకలకూ నిండైన హుందాతనాన్ని తీసుకువచ్చేలా కట్టూ బొట్టు విషయంలో అతివలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటారు. ఈ దీపావళి వేళ మరింత స్పెషల్‌గా కనిపించాలనుకునే వారికోసం బెంగాలీ చీరకట్టు ఆధునికతనూ అద్దుకొని కొంగొత్తగా మెరిసిపోతుంది. సెలబ్రిటీలూ ముచ్చటపడే ఈ కట్టుకు వారు జోడించే హంగులు ఇవి...

పండగంతా నిండుగా...

ఫ్యాషన్



పండగలు, ఇతర సంప్రదాయ వేడుకలలో బెంగాలీ స్టైల్ చీర కట్టును దేశవ్యాప్తంగా మహిళలు ధరించడానికి ఇష్టపడుతున్నారు. ఉత్తేజాన్ని కలిగించే ఎరుపు–తెలుపు కాంబినేషన్‌లో ఉండే ఈ చీర కట్టు, నుదుటన పెద్ద బిందీ, శంఖం ఆకృతిలో నెక్ డిజైన్, చీర పల్లూకున్న అందమైన డిజైన్.. ఇవన్నీ పండుగను మరింత ప్రత్యేకంగా చేస్తాయి. దుర్గాపూజల సమయాల్లో ఈ రంగు చీరలను బెంగాలీలు ప్రత్యేకంగా ధరిస్తారు. ఆ స్టైల్ కట్టును ఇప్పుడు లక్ష్మీ పూజలు, వివాహ వేడుకల సమయాల్లో ధరించడానికి ఆసక్తి చూపుతున్నారు. అయితే, ఈ కట్టును మనం అనుసరించాలంటే మాత్రం ఈ సూచనలు తప్పక అవసరం.

హెయిర్ స్టైల్- మేకప్
హెయిర్ స్టైల్ కోసం ఒక బన్ తయారు చేసి, దానిని మల్లె పువ్వులు లేదా ఎరుపు, తెలుపు పువ్వులతో అలంకరించవచ్చు. పువ్వులతో కాకున్నా హెయిర్ బన్‌కు హెయిర్ పిన్ జ్యువెలరీని జోడించడం ద్వారా అందాన్ని పెంచుకోవచ్చు. మేకప్ కోసం ఎరుపు లిప్‌స్టిక్, తేలికపాటి ఐ మేకప్ సరిపోతాయి. ధరించిన చీరకు మేకప్ సెట్ అవుతుందా అనేది సరి చూసుకుంటే చాలు. మెడలోనూ, చేతులకు ఎక్కువ నగల లేకుండా చూసుకుంటే చాలు. మీ రూపం ఆధునికతను అద్దుకున్న సంప్రదాయంతో కొంగొత్తగా మెరిసిపోతుంది.



ఎంపికలో సరైన చీర
పూజలు, నోములు, వ్రతాల సమయంలో ఎరుపు అంచుతో ఉన్న తెలుపు లేదా ఆఫ్–వైట్ బేస్ చీరను ఎంచుకోవాలి. అంచు ఉన్న కాటన్, పట్టు లేదా టస్సర్ చీరలు ఈ బెంగాలీ లుక్‌కు సరైనవి. వీటిలో మనవైన చేనేతలు కూడా ఉండవచ్చు. ఈ చీరకట్టు సౌకర్యంగా ఉండటమే కాకుండా పూజ, పండగల సమయాల్లో రోజంతా ధరించడం సులభం కూడా.



కట్టుతో కట్టడి
బెంగాలీ స్టైల్‌లో నిజమైన ఆకర్షణ దాని డ్రేపింగ్ శైలిలోనే ఉంటుంది. చీర కుచ్చిళ్ల నుంచి ఎడమ వైపుగా, పొడవాటి పల్లూను ఛాతీ మీదుగా భుజం వరకు తీసుకుంటూ వెళ్లాలి. పొడవాటి పల్లూ భాగాన్ని కుడి చేతి భుజం కిందుగా తీసి, పైకి అంచు భాగం కనిపించేలా బ్లౌజ్‌కు జత చేయాలి. పొడవుగా తీసుకున్న కొంగు భాగాన్ని కుడి చేత్తో ముందుకు తీసుకువచ్చి పట్టుకోవడం కూడా ఈ కట్టులో అందంగా కనిపిస్తుంది. భుజం మీదుగా తీసిన పల్లూని కొప్పుకు అటాచ్ చేసి, ఎడమ భుజం కిందుగా తీసుకురావచ్చు. ఈ కట్టు లలనల రూపాన్ని మరింత సంప్రదాయంగా మారుస్తుంది. డ్రేపింగ్ చేసేటప్పుడు, కుచ్చుల భాగం మడతలు లేకుండా సెట్ చేసి, పల్లూ చాలా తేలికగా ఉన్నట్టు చూసుకోవాలి.


నగలపై ప్రత్యేక శ్రద్ధ
పెద్ద పెద్ద చెవిపోగులు, గాజులు, నెక్లెస్‌లు ఈ స్టైల్ చీరకట్టుకు రాయల్ టచ్‌ను జోడిస్తాయి. హెవీగా ఆభరణాలు అక్కర్లేదు అనుకుంటే పెద్ద చెవిపోగులు, గాజులు ఈ అలంకరణకు సరిపోతాయి.

గుండ్రని వెడల్పాటి బిందీ
బెంగాలీ స్టైల్ డ్రేపింగ్ సంపూర్ణం కావాలంటే నుదుటన పెద్ద, గుండ్రని ఎరుపు బిందీ తప్పక ఉండాలి. ఇది పండుగల రోజుల్లో మొత్తం మేకప్‌ను పూర్తి చేస్తుంది. నుదుటిపై బిందీతో పాటు సిందూర్ చుక్కలను కూడా అదనంగా పెట్టడం వల్ల లుక్ మరింత మెరుగవుతుంది. ఈ లుక్‌కి ఎరుపు లేదా ముదురు గులాబీ రంగు బిందీ ఆకర్షణీయంగా కనిపిస్తుంది.

● టెక్నాలజీ

ఇంటిపని నుంచి తోటపని వరకు... ఫిగర్ వో 3





'ఫిగర్ ఏఐ' అనేది హ్యూమన్ రోబోలకు సంబంధించిన స్టార్టప్. తాజాగా 'ఫిగర్ వో 3' అనే హ్యూమన్ రోబో గురించి ప్రకటించింది కంపెనీ. 'రోజువారీ అవసరాలకు ఉపయోగపడే సాధారణ హ్యూమనాయిడ్ రోబో ఇది. గదిని శుభ్రం చేయడం, మొక్కలకు నీళ్లు పెట్టడం, ఆహారాన్ని వడ్డించడం, గిన్నెలు కడగడం, బట్టలు మడత పెట్టడం...మొదలైన ఎన్నో పనులు చేస్తుంది' అని 'ఫిగర్ వో 3' వివరాలు వెల్లడి చేసింది కంపెనీ. కాలిఫోర్నియాకు చెందిన 'ఫిగర్ ఏఐ' స్టార్టప్ మునుపటి తరం హ్యూమనాయిడ్‌లతో పోల్చితే సరికొత్త, సాంకేతికంగా ఒక అడుగు ముందుండే హ్యూమనాయిడ్స్ దృష్టి పెట్టింది. పూర్తిగా రీడిజైన్ చేసిన సెన్సరీ సూట్, హ్యాండ్ సిస్టమ్, నెక్స్ట్ జనరేషన్ విజన్ సిస్టమ్‌తో ఈ సరికొత్త హ్యూమనాయిడ్ రోబో మార్కెట్‌లోకి అడుగు పెట్టనుంది.

బులియన్
(బంగారం 10 గ్రా.; వెండి కిలో) అక్టోబర్ 16న ముగింపు రూ.లలో

హైదరాబాద్		విజయవాడ		విశాఖపట్నం		రాజమండ్రి		ప్రొద్దుటూరు		చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,31,900	బంగారం (24 క్యారెట్లు)	1,31,320	బంగారం (24 క్యారెట్లు)	1,29,440	బంగారం (24 క్యారెట్లు)	1,31,320	బంగారం (24 క్యారెట్లు)	1,31,300	బంగారం (24 క్యారెట్లు)	1,29,810
బంగారం (22 క్యారెట్లు)	1,22,790	బంగారం (22 క్యారెట్లు)	1,18,650	బంగారం (22 క్యారెట్లు)	1,18,650	బంగారం (22 క్యారెట్లు)	1,22,210	బంగారం (22 క్యారెట్లు)	1,20,800	బంగారం (22 క్యారెట్లు)	1,19,000
వెండి	1,90,000	వెండి	1,82,900	వెండి	2,06,000	వెండి	1,82,900	వెండి	1,80,000	వెండి	2,06,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.


'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 206

శుక్రవారం 17-10-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

● వికాసం

నిరుద్యోగిగా ఉన్నా సరే...



కొద్దిమందిలో ఉండే అపోహ...

'కష్టపడుతున్నప్పుడే ఒత్తిడికి గురవుతాం'

అసలు విషయం ఏమిటంటే, కష్టపడుతున్నప్పుడే కాదు పనిచేయకుండా, ఏమీ పట్టకుండా ఉన్నప్పుడు కూడా ఒత్తిడికి గురవుతాము. మనం ఏదైనా విషయానికి సంబంధించి తరచుగా ఒత్తిడికి గురవుతుంటే 'అదంతేలే' అని అనుకోవడానికి లేదు. 'ఎందుకు ఇలా జరుగుతుంది?' అని విశ్లేషించుకుంటే ఒక పరిష్కార మార్గం తప్పనిసరిగా కనిపిస్తుంది.

ఒత్తిడిగా అనిపించినప్పుడు ఎవరికైనా చిన్న ఫోన్ కాల్ చేయండి, లేదా ఇమెయిల్ పంపించండి. చిన్న పని అయినా సరే, అది మీ ఒత్తిడిని తగ్గించడంలో కీలకం అవుతుంది.

నిరుద్యోగిగా ఉన్నా సరే క్రమశిక్షణకు దూరం కాకూడదు. ఎప్పుడూ ఏదో ఒకటి నేర్చుకుంటూనే ఉండాలి. ఒకటి కాకుంటే మరొకటి ఇంటర్వ్యూలకు హాజరవుతూనే ఉండాలి.

– జెఫ్ బెజోస్, ఫౌండర్, అమెజాన్

● ఆర్ట్ అండ్ కల్చర్

బొమ్మల కళ

బొమ్మలు మాట్లాడవు.
తమ గురించి మాట్లాడేలా చేస్తాయి.
అలా మాట్లాడాలంటే ఆర్టిస్ట్‌లో అద్భుత సృజన ఉండాలి.
అలాంటి ఒక ఆర్టిస్ట్ ఆమదాలవలసకు చెందిన ప్రియాంక.
శుభకార్యాలకు తగ్గట్టు రకరకాల థీమ్స్‌తో బొమ్మల సిరీస్ రూపొందిస్తూ పాతకళకు కొత్త కళ తీసుకువస్తోంది ప్రియాంక...



'చిన్నప్పుడు ఆడుకున్న ఆటల్లో బొమ్మలే నా బతుకు బండిని నడిపిస్తాయని నేను అసలు ఊహించనే లేదు' అంటుంది ప్రియాంక. బొమ్మల ద్వారా నేటి తరానికి సంప్రదాయ విలువలను వివరించడంలో ఆనందం ఉందంటారు ఆమె. తన మనసులో మెదిలిన ఊహకు సృజనాత్మకంగా ప్రాణం పోస్తూ, బొమ్మలను థీమ్‌కు తగ్గట్టు రూపొందిస్తూ వినియోగదారుల మనసు గెలుచుకుంటుంది ప్రియాంక. ఆ బొమ్మలు సనాతన సంప్రదాయాలకు ప్రతీకలుగా కనిపిస్తాయి. కనుమరుగవుతున్న కళలు కళ్ల ముందు కనబడతాయి.

అనుబంధాల రైలుబండి

కాంక్రీట్ జంగిల్‌లో న్యూక్లియర్ ఫ్యామిలీల నడుమ దూరమవుతున్న అనుబంధాలు ప్రియాంక తయారుచేసే బొమ్మలతో గుర్తుకు వస్తాయి. ఆమదాలవలసకు చెందిన ఒక పెద్దాయన 60వ పుట్టిన రోజు వేడుకను భిన్నంగా చేయాలని కుటుంబ సభ్యులు ఆలోచించారు. ప్రియాంకకు విషయాన్ని వివరించారు. అరవై ఏళ్లలో జరిగిన ఘట్టాలను అద్భుతమైన రీతిలో బొమ్మల రూపంలో కళ్లకు కట్టేలా తీర్చిదిద్దింది ప్రియాంక. అన్నప్రాసన వేడుక నుంచి పదవీ విరమణ వేడుక వరకు... ఆ పెద్దాయన జీవితంలోని వివిధ దశలను చిన్న రైలు బండి మాదిరిగా బొమ్మల్లో తయారు చేసి శభాష్ అనిపించుకుంది.

తాళికట్టు శుభవేళ

పలాసకు చెందిన ఒక వ్యాపారి నూతన గృహ ప్రవేశ వేడుకను భిన్నంగా చేయాలనుకున్నాడు. కాన్సెప్ట్‌ను వివరించాడు. బిల్డింగ్ నమూనా నుంచి సత్యనారాయణ వ్రతం, గో మాత ప్రవేశంతో సహా అన్నింటిని చక్కని బొమ్మలతో కళ్లకు కట్టింది ప్రియాంక. శుభకార్యానికి వచ్చిన అతిథులంతా ఈ థీమ్‌ను చూసి భలే ముచ్చటపడ్డారు.

శ్రీకాకుళం నగరంలోని ఒక కార్పొరేట్ బ్యాంక్‌లో నవరాత్రి పూజలు నిర్వహించాలని బ్యాంక్ సిబ్బంది భావించారు. రెండు రోజులు కష్టపడి నవరాత్రి వేడుకల థీమ్‌ను తయారు చేసి బ్యాంక్‌ను లక్ష్మీనిలయంగా మార్చింది ప్రియాంక. వివాహ వేడుకకు ప్రారంభ ఘట్టమైన గోధుమరాయి కార్యక్రమం నుంచి తాళికట్టు శుభవేళ వరకు తయారు చేసిన వెడ్డింగ్ సెట్ ప్రియాంక స్పెషల్. ఆ సెట్ చూస్తే మన కళ్ల ముందే పెళ్లి జరిగినంత సంబరం మన సొంతం అవుతుంది.

– దువ్వూరి గోపాలరావు,
సాక్షి, శ్రీకాకుళం
ఫొటోలు:
జయశంకర్ కుప్పిలి

ఇదే నా ప్రపంచం

చిన్నప్పుడే కాదు పెద్దయ్యాక కూడా బొమ్మలను వదల్లేదు. అమ్మ సాయంతో వాటిని చక్కగా అలంకరించడం చిన్నప్పటి నుంచి నా అలవాటు. డిగ్రీ పూర్తయింది. ఉపాధి కోసం ఏదో ఒకటి చేయాలి అనుకున్నాను. బొమ్మలతోనే కొత్తగా ఏదైనా చేయాలనుకున్నాను. బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాను. నా ఆలోచనలను నాన్నతో పంచుకున్నాను. ఆయన ప్రోత్సహించారు. వర్క్‌షాపులో కొంత భాగం నన్ను వినియోగించుకోమన్నారు. ఆర్టిస్టిక్‌గా షోరూమ్‌ను సిద్ధం చేశారు. విభిన్న రకాల థీమ్‌లను సిద్ధం చేశాను. సోషల్ మీడియా వేదికగా నేను తయారుచేసిన బొమ్మలను, ఫొటోలను షేర్ చేయడం మొదలుపెట్టాను. ఆర్డర్లు పెరిగాయి. బొమ్మల ద్వారా సంప్రదాయాల్ని వివరిస్తున్నందుకు ఆనందంగా ఉంది.

- ప్రియాంక

● టెక్... టాక్

జీవం ఉట్టిపడే ఇమేజ్ జనరేషన్‌తో జెమిని 'నానో బనానా మోడల్' పాపులర్ అయింది. నానో బనానా ఏఐ మోడల్‌ను ప్రారంభించినప్పటి నుంచి 500 మిలియన్‌లకు పైగా ఇమేజ్‌లకు ఉపయోగించబడింది. తాజాగా... జెమిని యాప్స్ నుంచి సెర్చ్ అండ్ లెన్స్‌కు నానో బనానా మోడల్‌ను విస్తరించారు. ఇమేజ్‌లు జనరేట్ చేయడానికి, ఎడిట్ చేయడానికి నానో బనానాను ఏఐ మోడ్, గూగుల్ లెన్స్‌తో అనుసంధానించారు. దీనివల్ల యూజర్‌లు గూగుల్ ఎకోసిస్టమ్ దాటకుండానే అడ్వాన్స్‌డ్ ఏఐ ఇమేజ్ ఎడిటింగ్ అండ్ క్రియేషన్ టూల్స్‌తో యాక్సెస్ కావచ్చు. గూగుల్ సెర్చ్ ఏఐ మోడల్‌లో ప్రాంప్ట్ బాక్స్ దిగువన ఎడమవైపు కొత్త ప్లస్ ఐకాన్ కనిపిస్తుంది. ఈ ఐకాన్‌ను నొక్కితే కొత్త గ్యాలరీ, కెమెరా, క్రియేట్ ఇమేజ్‌లాంటి కొత్త క్రియేటివ్ ఆప్షన్స్ కనిపిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న యూజర్‌లకు ఈ ఇంటిగ్రేషన్ అందుబాటులో ఉందా లేదా అనే విషయంలో స్పష్టత లేదు.



● ఏఐ ఏరియా

మాయి–ఇమేజ్–1




ఈ సంవత్సరం ప్రారంభం నుంచి మైక్రోసాఫ్ట్ ఏఐ(మాయి) ఇన్–హౌజ్ జనరేటివ్ మోడల్స్‌ను అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టింది. గత ఆగస్ట్‌లో స్పీచ్ జనరేషన్ మోడల్ మాయి–వాయిస్–1 లాంచ్ చేసింది.

తాజాగా తమ మొట్టమొదటి మాయి–ఇమేజ్–1ను ఆవిష్కరించింది.

ఇది 10 టెక్స్ట్–టు–ఇమేజ్ జాబితాలో చోటు సాధించడం విశేషం.

జనరల్ పర్పస్ ఏఐ మోడల్స్‌లా కాకుండా 'మాయి–ఇమేజ్–1'ను 'పర్పస్–బిల్ట్' మోడల్‌గా తీర్చిదిద్దారు. ప్రాక్టికల్, రియల్ వరల్డ్ క్రియేటివ్ టాస్క్‌లకు ఈ మోడల్ బాగా ఉపయోగపడుతుందని కంపెనీ తెలియజేసింది. ఈ మోడల్‌కు సంబంధించి సాంకేతిక విషయాలను వివరంగా వెల్లడించనప్పటికీ లైటింగ్, ప్రకృతి దృశ్యాలు, ఇతర సృజనాత్మక దృశ్యాలతో సహా ఫోటోరియలిస్టిక్ చిత్రాలను రూపొందించడంలో ఈ మోడల్ బలాన్ని కంపెనీ హైలైట్ చేసింది.

ఇతర మోడల్స్‌తో పోల్చితే 'మాయి–ఇమేజ్–1' చాలా త్వరగా రిజల్ట్‌ను చూపిస్తుందని, వేగం, నాణ్యత మధ్య బ్యాలెన్స్ చూపిస్తుందని తెలియజేసింది మైక్రోసాఫ్ట్.



విన్ బై ఏ నోస్

చాలా తక్కువ తేడాతో విజయం సాధించడానికి సంబంధించి వాడే మాట... విన్ బై ఏ నోస్
ఉదా: శ్రావణి వోన్ ది రేస్, బట్ షీ వోన్లీ వోన్ బై ఏ నోస్

వెల్ అప్ ఇన్ ఇయర్స్

'వయసు పైబడిన' 'పాత' అనేదానికి సంబంధించి వాడే మాట... వెల్ అప్ ఇన్ ఇయర్స్
ఉదా: జాన్స్ వెల్ అప్ ఇన్ ఇయర్స్ బట్ హెల్తీ

ఇట్ ఈజ్ ఏ లాంగ్ లేన్ దట్ హ్యాజ్ నో టర్నింగ్

'కష్టాలు శాశ్వతం కాదు' అనే చెప్పే సందర్భంలో ఉపయోగించే మాట... ఇట్ ఈజ్ ఏ లాంగ్ లేన్ దట్ హ్యాజ్ నో టర్నింగ్. **ఉదా:** బట్ ఇట్ ఈజ్ ఏ లాంగ్ లేన్ దట్ హ్యాజ్ నో టర్నింగ్. ఐయామ్ ష్యూర్ థింగ్స్ విల్ చేంజ్ సూన్

శాంసంగ్ గెలాక్సీ ట్యాబ్ ఎస్ 11



డిస్‌ప్లే:	14.60 అంగుళాలు
రిఫ్రెష్ రేట్:	120 హెచ్‌జడ్
రిజల్యూషన్:	1848×2960 పిక్సెల్స్
మెమోరీ:	128జీబి 12జీబి ర్యామ్/ 256జీబి 12జీబి ర్యామ్/ 512 జీబి 12జీబి ర్యామ్
ఫ్రంట్ కెమెరా:	12 ఎంపీ
బ్యాటరీ:	11600 ఎంఏహెచ్

హెచ్‌ఎండీ టచ్ 4జీ



సైజ్:	3.2 అంగుళాలు
రిజల్యూషన్:	240×320 పిక్సెల్స్
బరువు:	100 గ్రా.
కలర్స్:	డార్క్ బ్లూ, సియాన్
ఇంటర్నల్:	64 ఎంబీ 128 ఎంబీ ర్యామ్

వన్‌ప్లస్ పాడ్ లైట్



డిస్‌ప్లే:	11.00 అంగుళాలు
ఫ్రంట్ కెమెరా:	5 ఎంపీ,
రిజల్యూషన్:	1920× 1200 పిక్సెల్స్
ర్యామ్:	6జీబి
ఇంటర్నల్ స్టోరేజ్:	128జీబి
బ్యాటరీ:	9340 ఎంఏహెచ్
బరువు:	530 గ్రా.

సాక్షి సినిమా

ముచ్చటగా మూడోసారి!



● నెల్సన్, రజనీకాంత్

హీరో రజనీకాంత్, డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్‌లది హిట్ కాంబినేషన్. వీరి కాంబోలో వచ్చిన తొలి చిత్రం 'జైలర్' 2023 ఆగస్టు 10న విడుదలై, బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. తాజాగా వీరిద్దరి కలయికలో 'జైలర్ 2' సినిమా రూపొందుతోన్న సంగతి తెలిసిందే. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. 'జైలర్' సూపర్ హిట్ కావడంతో 'జైలర్ 2' సినిమాపై ఇటు ఇండస్ట్రీలో అటు ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. 2026 జూన్‌లో 'జైలర్ 2' విడుదల కానుంది. ఇదిలా ఉంటే... రజనీకాంత్–నెల్సన్ దిలీప్ కుమార్ కాంబినేషన్ ముచ్చటగా మూడోసారి రిపీట్ కానుందని కోలీవుడ్ టాక్. ఇప్పటికే 'జైలర్ 2' చిత్రీకరణ సుమారు 70 శాతం పూర్తయిందట. ఈ సినిమా తర్వాత మరోసారి రజనీకాంత్‌తో ఓ మూవీ కోసం నెల్సన్ దిలీప్ స్క్రిప్ట్ సిద్ధం చేస్తున్నారని టాక్. ఈ స్టోరీ లైన్‌ని ఇటీవల రజనీకాంత్‌కి వినిపించగా ఆయన కూడా పచ్చజెండా ఊపారట. మరి... రజనీ–నెల్సన్ కాంబినేషన్‌లో మూడో చిత్రం ఉంటుందా? అనే విషయం తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాలి.

తిలక్ వర్మ ప్రతిభ అసాధారణం

- చిరంజీవి



● సుస్మిత, తిలక్ వర్మ, చిరంజీవి, అనిల్ రావిపూడి

ఇటీవల జరిగిన ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై భారత్ ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన యువ క్రికెటర్ తిలక్ వర్మను హీరో చిరంజీవి సన్మానించారు. చిరంజీవి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. ఈ సినిమాలో నయనతార హీరోయిన్‌గా, కేథరిన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో అర్చన సమర్పణలో సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ సెట్స్‌కి ఇటీవల తిలక్ వర్మని ఆహ్వానించి, యూనిట్ సమక్షంలో సన్మానించారు చిరంజీవి. ''ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్‌లో భారత్– పాకిస్థాన్ తలపడ్డాయి. ఎంతో ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఆడుతూ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో భారత్ విజయంలో కీలక భాగస్వామి అయిన తిలక్ వర్మ ప్రతిభ అసాధారణం. కృషి, క్రమశిక్షణ అన్నది కేవలం క్రీడల్లోనే కాకుండా జీవితంలోనూ విజయానికి మార్గదర్శకం'' అని చిరంజీవి చెప్పారు.

కాంబినేషన్ సెట్?



● విజయ్ దేవరకొండ

హీరో విజయ్ దేవరకొండ–డైరెక్టర్ విక్రమ్ కె. కుమార్ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందనుందా? అంటే అవుననే వార్తలు వినిపిస్తున్నాయి. విజయ్ దేవరకొండ ప్రస్తుతం రెండు సినిమాలతో బిజీగా ఉన్నారు. తనకు 'టాక్సీవాలా' (2018) వంటి హిట్ మూవీ అందించిన దర్శకుడు రాహుల్ సంకృత్యాన్‌తో రెండో సినిమా చేస్తున్నారు విజయ్. మరోవైపు 'రాజావారు రాణిగారు' చిత్రదర్శకుడు రవికిరణ్ కోలా దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. ఈ రెండు చిత్రాల తర్వాత డైరెక్టర్ విక్రమ్ కె. కుమార్‌తో విజయ్ దేవరకొండ ఓ సినిమా చేయనున్నారని టాక్. 'ఇష్క్, మనం, హలో, నానీస్ గ్యాంగ్‌లీడర్' వంటి పలు చిత్రాలను తెరకెక్కించి, తెలుగు ప్రేక్షకుల్లో తనకంటూ ఓ గుర్తింపు సొంతం చేసుకున్నారు విక్రమ్ కె. కుమార్. ఇక ఆ మధ్యలో నితిన్ హీరోగా ఓ సినిమా తెరకెక్కిస్తారనే వార్తలు వచ్చినప్పటికీ ఎలాంటి ప్రకటన లేదు. అయితే తన తాజా చిత్రాన్ని విజయ్‌తో చేయనున్నారట విక్రమ్. ఇందుకోసం కథ సిద్ధం చేసే పనిలో ఉన్నారట. మరి... ఈ కాంబినేషన్ సెట్ అవుతుందా? వేచి చూడాల్సిందే.



● విక్రమ్ కె. కుమార్

కచ్చితంగా నచ్చుతుంది డ్యూడ్

- ప్రదీప్ రంగనాథన్



● రవిశంకర్, బుచ్చిబాబు, హను, సాయి, ప్రదీప్, మమిత, కీర్తిశ్వరన్, నవీన్

''తెలుగు ప్రేక్షకులు నా సినిమాలన్నింటినీ గొప్పగా ఆదరించారు. మీ అభిమానానికి కృతజ్ఞతలు. మీ కుటుంబంలో ఒకరిగా చూసినందుకు చాలా థ్యాంక్స్. నేను నటించిన 'లవ్ టుడే, డ్రాగన్' సినిమాలు మీకు నచ్చినట్లయితే.. మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన 'డ్యూడ్' చిత్రం కూడా కచ్చితంగా అందరికీ నచ్చుతుంది. నాకు మంచి చాన్స్ ఇచ్చిన మైత్రి మూవీ మేకర్స్‌కి ధన్యవాదాలు'' అని ప్రదీప్ రంగనాథన్ చెప్పారు. కీర్తిశ్వరన్ దర్శకత్వంలో ప్రదీప్ రంగనాథన్, మమిత బైజు జంటగా నటించిన చిత్రం 'డ్యూడ్'. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై. రవి శంకర్ నిర్మించిన ఈ చిత్రం నేడు తెలుగు, తమిళ, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి దర్శకులు హను రాఘవపూడి, బుచ్చిబాబు, సాయి రాజేశ్, రాహుల్ సాంకృత్యాన్, మహేశ్, శివ నిర్వాణ అతిథులుగా హాజరై, 'డ్యూడ్' ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. కీర్తిశ్వరన్ మాట్లాడుతూ– ''నేను 'డ్యూడ్' స్క్రిప్ట్ రాసుకుని దర్శకుడు కావాలనుకున్న తర్వాత చెన్నై మొత్తం తిరిగాను. ఫైనల్‌గా మైత్రీ మూవీ మేకర్స్‌లో నా సినిమా ప్రయాణం ప్రారంభం అయింది. ఈ బ్యానర్‌లో పని చేస్తానని నా కలలో కూడా అనుకోలేదు'' అని చెప్పారు. ''అందమైన ప్రేమకథగా రూపొందిన ఈ చిత్రంలో బలమైన భావోద్వేగాలు ఉన్నాయి'' అని రవిశంకర్ అన్నారు. ''ఈ సినిమా తప్పకుండా అందర్నీ అలరిస్తుంది'' అని నవీన్ యెర్నేని పేర్కొన్నారు. ఈ వేడుకలో కెమెరామేన్ నికిత్ బొమ్మి, సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్, పాటల రచయిత రామజోగయ్య శాస్త్రి తదితరులు మాట్లాడారు.

ఎల్లమ్మలో...



● దేవిశ్రీ ప్రసాద్

ప్రముఖ సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ హీరోగా నటించనున్నారని తెలిసింది. 'బలగం' ఫేమ్ దర్శకుడు వేణు యెల్దండి తర్వాతి చిత్రం 'ఎల్లమ్మ'. ఈ సినిమాను 'దిల్' రాజు నిర్మించనున్నారు. విలేజ్ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో హీరోగా నాని, నితిన్ వంటి వార్ల పేర్లు తెరపైకి వచ్చాయి. తాజాగా ఈ సినిమాలో దేవిశ్రీ ప్రసాద్ హీరోగా నటించనున్నారనే వార్త ప్రచారంలోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన సంప్రదింపులు జరుగుతున్నాయని, ఈ చిత్రంలో నటించేందుకు దేవిశ్రీ కూడా ఆసక్తి చూపిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది.

పడి పడి నవ్వుకుంటారు

- కిరణ్ అబ్బవరం



● జైన్స్ నాని, శివ, రాజేష్ దండ, యుక్తి తరేజా, కిరణ్ అబ్బవరం

''కె-ర్యాంప్' చిత్రం మేము అనుకున్నదానికంటే ఇంకా బాగా వచ్చింది. ఈ సినిమాని అనుకున్నప్పుడే దీపావళికి రిలీజ్ అని ఫిక్స్ అయ్యాం. థియేటర్స్‌లోకి వెళ్లేముందు ఇది పూర్తి వినోదాత్మక చిత్రం అని గుర్తుపెట్టుకోండి. కచ్చితంగా పడి పడి నవ్వుతారు. మీ టికెట్ డబ్బులు వృథా కావు.. ఇందుకు నాది గ్యారెంటీ'' అని కిరణ్ అబ్బవరం తెలిపారు. ఆయన హీరోగా, యుక్తి తరేజా హీరోయిన్‌గా నటించిన చిత్రం 'కె- ర్యాంప్'. జైన్స్ నాని రచన, దర్శకత్వంలో హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్‌పై రాజేష్ దండ, శివ బొమ్మకు నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదలకానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి దర్శకులు విజయ్ కనకమేడల, వీఐ ఆనంద్, రామ్ అబ్బరాజు, సుబ్బు, చంద్రమోహన్ అతిథులుగా హాజరై,''దీపావళి పండగ కళ 'కె-ర్యాంప్'లో కనిపిస్తోంది. ఈ సినిమా మంచి విజయం సాధిస్తుంది'' అని తెలిపారు. రాజేశ్ దండ మాట్లాడుతూ– ''మేము ఎంత ఏడ్చినా, తొడలు కొట్టినా, ఎన్ని చెప్పినా సినిమాలో కంటెంట్ ఉంటేనే ప్రేక్షకులు ఆదరిస్తారు. ఈ దీపావళికి రిలీజ్ అవుతున్న సినిమాలన్నీ బ్లాక్‌బస్టర్ కావాలి'' అని తెలిపారు. ''మా సినిమా అదిరిపోయింది. ఈ దీపావళికి పెద్ద హిట్ అవుతుంది'' అన్నారు జైన్స్ నాని. ''తెలుగులో నేను చేసిన మూడో చిత్రమిది. 'కె-ర్యాంప్' చూశాక ప్రేక్షకులు నన్ను మరింతగా ఇష్టపడతారు'' అని యుక్తి తరేజా పేర్కొన్నారు.

ఓటీటీ | ఇది చూడొచ్చు

సమయం విలువ తెలిపే సినిమా

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం 'ది డెస్పరేట్ అవర్' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



ఓ ఆలోచన కథగా మారి సినిమాగా రావాలంటే ఎంతో మంది మార్పులం, వ్యయ ప్రయాసలు అవసరం. కానీ రచయితకు వచ్చిన ఆలోచనను దర్శకుడు నేరుగా తెరకెక్కిస్తేనే ప్రేక్షకులు ఆ సినిమాకి దగ్గరవుతారు. ఇప్పుడున్న ట్రెండ్‌కి అనుగుణంగా ఓ సినిమా తీయాలంటే కత్తి మీద సామే. ఎందుకంటే నేటి తరం ప్రేక్షకులు దర్శకుల ఆలోచనను అర్థక్షణంలోనే పట్టేస్తున్నారు. అందుకేనేమో ఇప్పటి దర్శకులు తమ సినిమాలలో వైవిధ్యానికి పెద్ద పీట వేస్తున్నారు. అటువంటి వారిలో హాలీవుడ్ దర్శకులు కాస్త ముందుంటారనే చెప్పాలి. ఆ కోవకు చెందిన వాటిలో వచ్చినదే దర్శకుడు ఫిలిప్ నాయిస్ తీసిన 'ది డెస్పరేట్ అవర్' సినిమా. ఈ సినిమాని ఈయన 2021లోనే తీశారు. ఈ చిత్రం విడుదల తరువాత భారతదేశంలో చాలా సినిమాలు ఇదే పంథాలో వచ్చినా పెద్దగా గుర్తింపు రాలేదు. ఈ సినిమా నిజానికి ఓ బ్యూటిఫుల్ క్రాఫ్ట్ అని చెప్పవచ్చు. మరీ ముఖ్యంగా కొత్తగా సినిమా తీయాలనుకునే ఔత్సాహికులకు ఇదో చక్కటి పాఠం లాంటిది. ఇక థ్రిల్లింగ్ జోనర్ ఇష్టపడే ప్రేక్షకులకు ఇదో కన్నుల పండగలాంటిది. అంతలా ఏముందీ సినిమాలో ఓసారి చూద్దాం. అమీకార్ తాను రోజూ వెళ్ళే జాగింగ్‌కి రెడీ అవుతుంది. ఇంతలో ఇంట్లో తన కొడుకు నోవా బెడ్ రూమ్‌లోనే బద్ధకంగా పడుకుండడం చూసి ఈ రోజు హెల్త్ బాగా లేకపోతే స్కూల్‌కి వెళ్ళవద్దు అని చెప్పి జాగింగ్‌కు బయలుదేరుతుంది. జాగింగ్‌లో అమీకార్ ఎప్పుడూ హెడ్ ఫోన్స్ పెట్టుకునే వెళుతుంది. కొంత సమయం జాగింగ్‌లో గడిచాక నోవా స్కూల్ నుండి ఓ ఫోన్ వస్తుంది. ఓ ఆగంతకుడు గన్‌తో స్కూల్‌లో చొరబడ్డాడని, పెద్ద ప్రమాదం జరగబోతోందని స్కూల్ ప్రిన్సిపల్ చెబుతుంది. ఇంతలో మరో ఫోన్ కాల్ ద్వారా తన కొడుకు నోవా స్కూల్‌కి వెళ్ళాడని, సరిగ్గా ఆ ఆగంతకుడి చేతికి చిక్కాడని తెలుస్తుంది. అమీకార్ ఆ సమయంలో స్కూల్‌కి చాలా దూరంలో జాగింగ్ చేస్తుండడంతో ఏం చేయాలో తెలియక టాక్సీకి కబురు పెడుతుంది. టాక్సీ రావడానికి చాలా సమయం పడుతుండడంతో కంగారు పడుతుంది. ఇక అక్కడి నుండి అమీ తన దగ్గరున్న ఫోన్‌తో కొడుకును కాపాడుకుంటుందా? లేదా అన్నదే సినిమా. ఇక్కడ విషయం ఏమిటంటే తొంభై శాతం అమీ జాగింగ్‌లోనే సినిమా నడుస్తుంది. సినిమాలో ఇంకెవ్వరూ కనిపించరు. భారీ తారాగణంతో, బీభత్సమైన విజువల్స్‌తో గ్రాండియర్ ఫీస్ట్‌తో తీసిన సినిమాలు కనీసం కాసులు కూడా రాల్చలేని నేటి రోజుల్లో ఒక్కటంటే ఒకే పాత్రతో 84 నిమిషాల నిడివితో సినిమాని తీసిన ఈ దర్శకుడికి నిజంగా హ్యాట్సాఫ్ చెప్పాలి. ప్రైమ్ వీడియోలో స్ట్రీమ్ అవుతున్న ఈ సినిమాని మీరు కూడా చూసేయండి. మస్ట్ వాచ్ ఇట్.

– హరికృష్ణ ఇంటూరు

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 22 వెల: ₹ 6.50
సంపుటి: 18 సంచిక: 206
శుక్రవారం 17-10-2025
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

తయారీ కేంద్రంగా భారత్

ఈ శతాబ్దంలో ప్రపంచం చూపంతా మనపైనే..

21వ శతాబ్దం 140 కోట్ల భారతీయులది..

కర్నూలు సభలో ప్రధాని నరేంద్ర మోదీ

శ్రీశైల మల్లన్న సేవలో ప్రధాని

- వివరాలు 8లో▶





మోదీ మాటిచ్చారు

రష్యా నుంచి చమురు కొనడం ఆపేస్తామంటూ తన మిత్రుడు, భారత ప్రధాని మోదీ హామీ ఇచ్చారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు.

వివరాలు 6లో ▸



ఇకపై రాజ్యాంగ పరిధిలో పోరాటం

ఇకపై తమ పోరాటం రాజ్యాంగానికి లోబడి కొనసాగుతుందని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న తెలిపారు.

వివరాలు 7లో ▸

నకిలీ మద్యం దందా వత్తాసుకే...

'సాక్షి'కి వేధింపులు

ఏపీ ప్రభుత్వ పెద్దల ఆదేశాలతోనే పోలీసు జులుం

- వరుసగా ఐదో రోజు 'సాక్షి' కార్యాలయాల్లో పోలీసుల హల్‌చల్
- వరుసగా మూడో రోజు ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డికి నోటీసులు
- 12 గంటల వ్యవధిలో ఎడిటర్‌కు ఏపీ పోలీసుల నోటీసులు
- పదేపదే నోటీసులు.. విచారణ పేరుతో వేధింపులు
- నిబంధనలకు విరుద్ధంగా బాధితులు, సోర్స్ వివరాలు వెల్లడించాలని ఒత్తిడి
- నకిలీ మద్యంపై వార్తలు ప్రచురించకుండా నిరోధించే కుట్ర

- వివరాలు 14లో▶

50% మించొద్దు

తేల్చిచెప్పిన సుప్రీంకోర్టు.. 42% బీసీ కోటాపై రాష్ట్ర ప్రభుత్వానికి చుక్కెదురు

జీవో 9పై హైకోర్టు విధించిన స్టే ఎత్తివేతకు నిరాకరణ.. రాష్ట్ర ప్రభుత్వం వేసిన పిటిషన్ కొట్టివేత

- షెడ్యూల్డ్ ఏరియాల్లోనే కోటా పెంపు మినహాయింపులు ఉన్నాయన్న సుప్రీం
- రిజర్వేషన్లను నిర్ణయించుకునే పూర్తి అధికారం తమకుందన్న సర్కారు
- డెడికేటెడ్ కమిషన్ సిఫార్సుల మేరకే పెంచామని వెల్లడి.. గవర్నర్, రాష్ట్రపతి వద్ద బిల్లులు పెండింగ్‌లో ఉండటం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని వాదన
- బిల్లును కాకుండా దాని ఆధారంగా జారీ చేసిన జీవోను సవాల్ చేయడం సరికాదని వెల్లడి
- జనరల్ ఏరియాల్లో 50% పరిమితిని దాటడానికి వీల్లేదన్న ప్రతివాదులు
- ప్రభుత్వ వాదనతో విభేదించిన సర్వోన్నత న్యాయస్థానం
- ఈ తీర్పుతో ప్రస్తుతమున్న రిజర్వేషన్ల ప్రకారమే స్థానిక సంస్థల ఎన్నికలు



సాక్షి, న్యూఢిల్లీ: బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి చుక్కెదురైంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ జారీ చేసిన జీవో 9పై హైకోర్టు ఇచ్చిన స్టేను సవాల్ చేస్తూ దాఖలుచేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. గురువారం ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం ప్రభుత్వ వాదనలతో ఏకీభవించలేదు. రిజర్వేషన్ల పెంపునకు మినహాయింపులు కేవలం షెడ్యూల్డ్ ఏరియాల్లోనే ఉన్నాయని గుర్తుచేస్తూ, 50 శాతం పరిమితిని మించరాదని స్పష్టం చేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లయింది.

ప్రభుత్వం వాదన ఇదీ..

తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ, రిజర్వేషన్లను నిర్ణయించుకునే పూర్తి అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. అత్యంత శాస్త్రీయంగా, దేశంలో ఎక్కడా లేనివిధంగా కుల సర్వే నిర్వహించామని తెలిపారు. సుప్రీంకోర్టు నిర్దేశించిన 'ట్రిపుల్ టెస్ట్'నిబంధనలకు అనుగుణంగా, డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసి, ఇంటింటికీ తిరిగి సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై

మిగతా 2వ పేజీలో ▶

ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేత

పంచాయతీ ఎన్నికల్లో పోటీపై రాష్ట్ర కేబినెట్ నిర్ణయం

- వానాకాలంలో 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు ఓకే
- మెట్రోరైల్ టేకోవర్‌పై సీఎస్ అధ్యక్షతన అధికారుల కమిటీ
- నల్సార్ వర్సిటీలో స్థానికులకు ప్రవేశాలు 50 శాతానికి పెంపు
- మన్ననూరు–శ్రీశైలం వరకు ఎలివేటెడ్ కారిడార్‌కు రూ.7,500 కోట్లు
- రెండేళ్ల ప్రజా ప్రభుత్వ పాలన ఉత్సవాల కోసం కేబినెట్ సబ్ కమిటీ
- వికారాబాద్–కృష్ణా రైల్వే లైన్‌కు 448 హెక్టార్ల భూసేకరణకు నిర్ణయం
- 23న మళ్లీ కేబినెట్.. ఆ సమావేశంలో స్థానిక ఎన్నికలపై స్పష్టత

2లో

క్లుప్తంగా...

బీసీ రిజర్వేషన్లపై బీజేపీ నాటకం

సీపీఎం కార్యదర్శి జాన్‌వెస్లీ



సాక్షి, హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం నాటకమాడుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. ఆయన గురువారం పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రంతో కలిసి ఎంబీ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఒకవైపు కేంద్రంలో బీసీ రిజర్వేషన్ల బిల్లును, ఆర్డినెన్స్‌ను అడ్డుకుంటూ.. ఇంకోవైపు రాష్ట్రంలో ఈనెల 18న బీసీ జేఏసీ రాష్ట్ర బంద్‌కు బీజేపీ మద్దతు ఇచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీరుకు వ్యతిరేకంగా పోరాడితేనే ఈనెల 18న బీసీ జేఏసీ తలపెట్టిన రాష్ట్రబంద్‌లో పాల్గొంటామని, లేదంటే స్వతంత్రంగా ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా శుక్రవారం చలో రాజ్‌భవన్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.

17న అన్ని డిపోల ఎదుట నిరసన కార్యక్రమాలు

టీజీఎస్ ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంఘం



పోస్టర్ ఆవిష్కరించిన తిరుపతయ్య

హిమాయత్‌నగర్ (హైదరాబాద్): ఈనెల 18న బీసీల బంద్‌కు మద్దతుగా 17న రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోల ఎదుట మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రకటించింది. గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.తిరుపతయ్య, జోనల్ కార్యదర్శి వెంకటయ్య, గ్రేటర్ హైదరాబాద్ గౌరవ అధ్యక్షుడు గుర్రం వసుకుమార్ గౌడ్ తదితరులు బంద్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు.

18న బంద్‌కు మద్దతు: పీఎస్‌యూ

సాక్షి, హైదరాబాద్: బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న తలపెట్టిన బంద్‌కు మద్దతు తెలుపుతున్నామని ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ యూనియన్ (పీఎస్‌యూ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆవుల నాగరాజు, కోట ఆనందరావు తెలిపారు. దేశవ్యాప్త కులగణన జరిపి.. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు.



ఇంజనీరింగ్ ఫ్యాకల్టీకి ఈ-పాఠాలు



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో పనిచేస్తున్న అధ్యాపకుల బోధన ప్రమాణాలు మెరుగు పర్చాలని అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) సూచించింది. కాలానుగుణంగా వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అప్‌గ్రేడ్ చేసుకోవాలని పేర్కొంది. దేశంలోని అన్ని యూనివర్సిటీలకు ఈ మేరకు లేఖ రాసింది. ముఖ్యంగా కంప్యూటర్ సైన్స్‌లో కొత్తగా వచ్చిన డేటాసైన్స్, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఎమర్జింగ్ కోర్సులపై దృష్టి పెట్టాలని తెలిపింది. దేశంలో ఏటా 12.53 లక్షల మంది ఇంజనీరింగ్‌లో చేరుతున్నారు. ఇందులో కంప్యూటర్ సైన్స్ కోర్సుల్లో చేరేవారే 68 శాతం ఉంటున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డేటాసైన్స్ కోర్సులు చేస్తున్నవారు 3.90 లక్షల మంది ఉండగా, వీరిలో కనీసం 50 వేల మందికి కూడా స్కిల్ ఉద్యోగాలు రావడం లేదు. ఏఐ కోడింగ్, సైబర్ సెక్యూరిటీ మాడ్యూల్స్‌పై పట్టు ఉండటం లేదు. బోధన మెళకువలు లోపించడమే ఈ పరిస్థితి కారణంగా ఏఐసీటీఈ భావిస్తోంది. అధ్యాపకులకు కొత్త కోర్సులపై తాజా టెక్నాలజీని అందిపుచ్చుకునే అవకాశం ఉండటం లేదు. దీంతో విద్యార్థులు నష్టపోతున్నారు.

ఎమర్జింగ్ కోర్సులపై ప్రత్యేక ఫోకస్
- ఐఐటీలు, ఎన్ఐటీల అధ్యాపకులతో అప్‌గ్రేడ్
- కొత్త సాంకేతికత పొందాలంటే ఇదే మార్గం
- యూనివర్సిటీలకు ఏఐసీటీఈ మార్గదర్శకాలు

అప్‌గ్రేడ్‌కు అనేక మార్గాలు

కొత్త ఎమర్జింగ్ కోర్సుల్లో మాస్టర్ డిగ్రీ చేసినవారు ఉండటం లేదు. అయితే, ప్రొఫెషనల్స్‌కు దీనిపై ఎక్కువ పరిజ్ఞానం ఉంటోంది. ఉదాహరణకు ఏఐఎంఎల్ సబ్జెక్టు బోధించే అధ్యాపకులకన్నా, సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేసే వారికి కొత్త టెక్నాలజీ తెలుస్తుంది. కాబట్టి ఇలాంటి వారిని ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ క్లాసుల ద్వారా అధ్యాపకులకు కొత్త టెక్నాలజీపై అవగాహన కల్పించాలని ఏఐసీటీఈ సూచించింది. క్లౌడ్, డేటాపై పట్టు కోసం డేటా సెంటర్స్‌లో పనిచేసే ప్రొఫెషనల్స్ సహకారం తీసుకోవాలి. సైబర్ సెక్యూరిటీ కోర్సు బోధించేవారు కొత్తగా వస్తున్న సైబర్ నేరాలు, సెక్యూరిటీ ఆప్షన్స్‌ను తెలుసుకోవడానికి దర్యాప్తు సంస్థల్లో నిపుణుల సహకారం తీసుకోవాలి. వీటితో పాటు ఐఐటీ, ఎన్ఐటీ సంస్థలు ఎమర్జింగ్ కోర్సులపై అంతర్జాతీయ టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్నాయి. ఆయా సంస్థల్లో పనిచేసే అధ్యాపకుల చేత క్లాసులు తీసుకోవడం ప్రయోజనకరంగా ఉంటుంది.

వీటిపై పట్టు అవసరం

- బోధన టెక్నాలజీ వినియోగంలో డిజిటల్ టూల్స్ వాడకంపై అధ్యాపకులకు అవగాహన అవసరం. గూగుల్ క్లాస్ రూం, ఎల్ఎంఎస్ ప్లాట్‌ఫాం, ఆన్‌లైన్ క్లాస్ నిర్వహణ, ఇంటరాక్టివ్ క్లాసులు తీసుకోవడం వంటి కోర్సులపై స్వయం, కోర్సెరా, ఎన్‌పీటెల్ వంటి సంస్థలు శిక్షణ ఇస్తున్నాయి.
- ఆధునిక బోధన పద్ధతులను అనుసరించే విధానం పెరగాలి. వీడియో లెక్చర్లు, వర్చువల్ ల్యాబ్స్, రిమోట్ ఎక్స్‌పర్మెంట్, ఆన్‌లైన్ అసైన్‌మెంట్ వంటి కోర్సులను ఎన్ఐటీటీఆర్ అనే సంస్థ అందిస్తోంది.
- ఏఐఎంఎల్, డేటాసైన్స్ టూల్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింక్స్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, రోబోటిక్స్, ఆటోమేషన్ వంటి సాంకేతిక స్కిల్స్ అప్‌డేట్ కోర్సులను ఐఐటీలు, ఇస్రో వంటి సంస్థలు అందిస్తున్నాయి.
- స్టాన్‌ఫర్డ్, గూగుల్, ఐబీఎం వంటి సంస్థలు కూడా సర్టిఫికెట్ కోర్సులు అందిస్తున్నాయి. వీటిని పూర్తి చేసేలా యూనివర్సిటీలు అధ్యాపకులను ప్రోత్సహించాలి. దీంతోపాటు పారిశ్రామిక భాగస్వామ్యంతో కొత్త టెక్నాలజీని నేర్చుకునేలా చేయాలని ఏఐసీటీఈ సూచించింది.

ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేత

పంచాయతీ ఎన్నికల్లో పోటీపై రాష్ట్ర కేబినెట్ నిర్ణయం
- వానాకాలంలో 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు ఓకే
- మెట్రోరైల్ టేకోవర్‌పై సీఎస్ అధ్యక్షతన అధికారుల కమిటీ
- మన్ననూరు–శ్రీశైలం వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి రూ.7,500 కోట్లు
- 23న మళ్లీ కేబినెట్.. ఆ సమావేశంలో స్థానిక ఎన్నికలపై స్పష్టత



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి. చిత్రంలో మంత్రి వాకిటి శ్రీహరి

సాక్షి, హైదరాబాద్: స్థానిక ఎన్నికల్లో పోటీ చేయడానికి ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలున్నవారు అనర్హులన్న నిబంధనను ఎత్తివేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. రాష్ట్రంలో జనాభా నియంత్రణ కట్టుదిట్టంగా అమలవుతున్న తరుణంలో ఈ గరిష్ట నిబంధనను అమలు చేయాల్సిన అవసరం లేదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. సీఎం, మంత్రులు జిల్లాల పర్యటనకు వెళ్లినప్పుడు ఈ నిబంధనను తొలగించాలన్న డిమాండ్లు రావడంతో అందుకనుగుణంగా కేబినెట్ సూచనప్రాయంగా అంగీకరించింది. ఈ మేరకు గురువారం సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ సడలింపుతోనే స్థానిక ఎన్నికలను నిర్వహించనున్నారు. మంత్రివర్గ వివరాలను రెవెన్యూ, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. పశు సంవర్థక శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి మీడియాకు వెల్లడించారు.

సుప్రీంకోర్టు తీర్పు దరిమిలా..

స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు ఇచ్చిన స్టేను సవాల్ చేస్తూ దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసిన అంశంపై సుదీర్ఘంగా చర్చ జరిగినట్లు పొంగులేటి చెప్పారు. తీర్పు ప్రతిని పరిశీలించాకే దీనిపై ఒక నిర్ణయం తీసుకోవాలని కేబినెట్ నిర్ణయించిందన్నారు. ఈలోగా న్యాయ నిపుణులు నివేదిక ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. స్థానిక ఎన్నికలకు సంబంధించి ఈనెల 23న మళ్లీ కేబినెట్ సమావేశం కావాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈలోగా బీసీ సంఘాలతో చర్చించి ప్రభుత్వం వచ్చే మంత్రివర్గంలో ఒక నిర్ణయం తీసుకుంటుందని మంత్రి వెల్లడించారు.

మెట్రోపై సీఎస్ అధ్యక్షతన అధికారుల కమిటీ..

మెట్రో రైలు విస్తరణ ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రివర్గం నిర్ణయించిందని పొంగులేటి చెప్పారు. రూ.36 వేల కోట్లతో మెట్రో 2ఏ, 2బీ విస్తరణకు అడ్డంకిగా మారిన మొదటి దశను పీపీపీ విధానంలో నిర్వహిస్తున్న ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకునే విషయంపై మంత్రివర్గం సుదీర్ఘంగా చర్చించిందన్నారు. మెట్రో రైలును ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకునే విషయంలో సాధ్యాసాధ్యాలు, అందులో ముడిపడి ఉన్న అంశాలన్నింటినీ లోతుగా అధ్యయనం చేసేందుకు సీఎస్ అధ్యక్షతన ఉన్నతస్థాయి కమిటీని నియమించాలని నిర్ణయించామన్నారు. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, పురపాలక శాఖ కార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శి, మెట్రో రైలు ఎండీ, పట్టణ రవాణా సలహాదారుతో కమిటీ నియమించాలని మంత్రివర్గం నిర్ణయించిందన్నారు. ఇప్పటికే కేంద్రానికి సవివర నివేదిక అందించినా మొదటి దశకు అడ్డంకిగా కేంద్రం కొర్రీలు వేసిందని చెప్పారు. సీఎస్ అధ్యక్షతన కమిటీ తమ నివేదికను డిప్యూటీ సీఎం నేతృత్వంలోని కేబినెట్ సబ్ కమిటీకి అందిస్తుందన్నారు. కేబినేట్ సబ్ కమిటీ సిఫారసుల ఆధారంగా మెట్రోను ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకునే విషయంలో తుది నిర్ణయం తీసుకోవాలని మంత్రివర్గం తీర్మానించినట్లు చెప్పారు.

ప్రతీ గింజా కొంటాం..

ఈసారి వానాకాలంలో దాదాపు 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడానికి కేబినెట్ నిర్ణయించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కేవలం 50 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రం తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలు ఇచ్చిందని, అయితే అదనంగా మరో 15 నుంచి 20 లక్షల మెట్రిక్ టన్నులు తీసుకోవాలని హైకోర్టు నిర్ణయం తీసుకుందన్నారు. కేంద్రం అంగీకరించినా, అంగీకరించకోయినా ప్రభుత్వం ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తామన్నారు. ఎస్ఎస్‌పీతో పాటు సన్నాలకు అదనంగా క్వింటాల్‌కు రూ. 500 బోనస్ చెల్లిస్తామన్నారు. వ్యవసాయ, రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ సంయుక్తంగా రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరణ చేయాలని నిర్ణయించామన్నారు.

శ్రీశైలం ఎలివేటెడ్ రహదారికి ఓకే..

మన్ననూరు నుంచి శ్రీశైలం వెళ్లడానికి నల్లమల్ల అటవీ ప్రాంతంలో హైలెవల్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 75 కి.మీకు రూ. 7500 కోట్ల వ్యయమవుతుందని, దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్మించడానికి మంత్రివర్గం ఆమోదించింది. ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్ పేట ఓఆర్ఆర్, ప్యారడైజ్ జంక్షన్ నుంచి డెయిరీ ఫాం రోడ్ వరకు నిర్మించే ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి రక్షణ శాఖ భూములు వినియోగించుకుంటున్నందున వారికి ప్రత్యామ్నాయంగా 435.08 ఎకరాల భూములను అప్పగిస్తూ కేబినెట్ తీర్మానం చేసింది.

మూడు కొత్త వ్యవసాయ కళాశాలలు

కొత్తగా మూడు వ్యవసాయ కళాశాలలు ఏర్పాటుకు మంత్రిమండలి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. హుజూర్‌నగర్, కొడంగల్, నిజామాబాద్‌లో వీటిని ఏర్పాటు చేస్తారు. నల్సార్ యూనివర్సిటీకి ఇప్పుడున్న చోట అదనంగా ఏడు ఎకరాల కేటాయించడానికి ఆమోదం తెలిపింది. నల్సార్ ప్రవేశాల్లో ప్రస్తుతం తెలంగాణ స్థానికులకు కేటాయించిన 25 శాతం సీట్ల కోటాను 50 శాతానికి పెంచాలని కేబినెట్ తీర్మానించింది.

రెండేళ్ల ఉత్సవాలకు కేబినెట్ కమిటీ

రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రజా పాలన –ప్రజా విజయోత్సవాలను నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. డిసెంబర్ 1 నుంచి 9 వరకు ఉత్సవాలు నిర్వహిస్తుంది. ఉత్సవాల నిర్వహణ.. సంబంధిత ఏర్పాట్లపై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు.

ఆర్ అండ్ బీ హ్యామ్ రోడ్లకు ఓకే..

మండలం–జిల్లా–రాజధాని వరకు ఆర్ అండ్ డీ ఆధ్వర్యంలో నిర్మించనున్న 5566 కి.మీ. రహదారులకు రూ. 10,547 కోట్లతో నిర్మించడానికి వీలుగా టెండర్లు పిలవడానికి మంత్రివర్గ సమావేశం ఆమోద ముద్ర వేసింది. అలాగే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గం నుంచి వెళ్లేలా వికారాబాద్–కృష్ణా రైలు మార్గానికి అవసరమైన భూ సేకరణ చేయాలని కేబినెట్ ఆదేశించింది. మొత్తం 845 హెక్టార్ల కోసం రూ. 438 కోట్లు మంజూరు చేసింది.

సురేఖ వ్యవహారం టీకప్పులో తుపాను

మంత్రివర్గ సమావేశం అనంతరం మంత్రి పొంగులేటి మీడియాతో చిట్‌చాట్ చేస్తూ.. సురేఖ వ్యవహారంపై స్పందించారు. రాజకీయాల్లో ఇలాంటివి సహజంగా జరుగుతుంటాయని, ఇది టీకప్పులో తుపాను లాంటిదన్నారు. అయితే, మీరు దాన్ని సముద్రంలో తుపానుగా మార్చారని, త్వరలో అన్నీ సర్దుకుంటాయని వ్యాఖ్యానించారు.

పెద్దల వద్దకు 'కొండా' పంచాయితీ

- మీనాక్షి, భట్టి, మహేశ్‌కుమార్‌తో మంత్రి కొండా సురేఖ భేటీ
- మంత్రివర్గంలోనే తనకు వ్యతిరేకంగా కుట్ర చేస్తున్నారని ఆరోపణ
- తనకు చెప్పకుండా ఓఎస్‌డీ తొలగింపు అవమానకరమని వాదన
- పార్టీ పెద్దలే సెట్ చేస్తామన్నారు: సురేఖ



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీలో మంత్రి కొండా సురేఖ కేంద్రంగా చోటు చేసుకున్న పరిణామాలు కలకలం రేపాయి. కొంతకాలంగా నెలకొన్న వివాదం గురువారం రాత్రి వరకు కొనసాగింది. పరిస్థితి మరీ దిగజారి రచ్చకెక్కకుండా పార్టీ పెద్దలు అతికష్టం మీద నియంత్రించగలిగారు. తనను లక్ష్యంగా చేసుకొని పార్టీలో, మంత్రివర్గంలో కుట్రలు జరుగుతున్నాయని భావిస్తున్న మంత్రి సురేఖ గురువారం పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో సమావేశమై తన వాదన వినిపించారు. అనంతరం పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో కూడా చర్చించారు. తనకు మాట మాత్రంగా కూడా చెప్పకుండా తన దగ్గర పనిచేస్తున్న ఓఎస్‌డీని ప్రభుత్వం తొలగించడాన్ని అవమానకరంగా భావించినట్లు ఆమె వారికి తెలిపినట్లు సమాచారం. పార్టీలో తనపై జరుగుతున్న దాడి గురించి మీనాక్షికి వివరించినట్లు సమాచారం. ఈ క్రమంలో ఆమె మంత్రివర్గ సమావేశానికి కూడా హాజరు కాలేదు.

పార్టీ పెద్దల నిర్ణయమే శిరోధార్యం: కొండా

మీనాక్షి నటరాజన్‌తో సమావేశం అనంతరం మంత్రి కొండా సురేఖ మీడియాతో మాట్లాడారు. 'తాజా పరిణామాలపై పార్టీ ఇన్‌చార్జి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌మార్ గౌడ్‌తో సుదీర్ఘంగా చర్చలు జరిపినం. ఈ విషయంలో పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తామని వారు హామీ ఇచ్చారు. సమస్యను పార్టీ పెద్దలు సెటిల్ చేస్తా మని చెప్పారు. ఇక ఈ విషయం వారే చూసుకుంటారని భరోసా ఉంది'అని పేర్కొన్నారు.

నివురుగప్పిన నిప్పులా పరిస్థితి..

వరంగల్‌లో మంత్రి పొంగులేటి దేవాదాయ శాఖకు సంబంధించిన కాంట్రాక్టు వ్యవహారాల్లో తలదూరుస్తున్నారనే ఆరోపణలతో మొదలైన వివాదం చిలికి చిలికి గాలివానగా మారింది. మేడారం జాతర అభివృద్ధి పనుల విషయంలో దేవాదాయ శాఖ మంత్రి సురేఖ లేకుండానే సమావేశం జరగడం, ఆ తరువాత సురేఖ ఓఎస్‌డీ సుమంత్‌ను తొలగించడంతో వివాదం ముదిరింది. మేడారం అభివృద్ధి పనులను దేవా దాయ శాఖ నుంచి రోడ్లు, భవనాల శాఖకు బదలాయించడంతో మంత్రి సురేఖ ప్రమేయం లేకుండానే పనులు జరుగుతున్నాయి. పోలీసులతో వాగ్వాదానికి దిగిన మంత్రి కుమార్తె సుష్మిత.. సీఎం పలువురు మంత్రులపై నేరుగా విమర్శలు చేశారు. బీసీ నాయకురాలైన తన తల్లి పట్ల ఓ వర్గం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని చేసిన వ్యాఖ్యలు పార్టీలో దుమారం సృష్టించాయి.

50 శాతం మించొద్దు

▶ మొదటి పేజీ తరువాయి

సమగ్రంగా, శాస్త్రీయంగా సర్వే జరిపామని తెలిపారు. 94 వేల ఎన్యూమరేషన్ బ్లాక్‌లలో లక్షలాది మంది సమాచారాన్ని సేకరించి, బీసీ జనాభా డేటా ఆధారంగానే కమిషన్ సిఫార్సుల మేరకు రిజర్వేషన్లు పెంచామని వివరించారు. ఈ సందర్భంగా ఇందిరా సహానీ కేసులో తీర్పును సింఘ్వీ ఉటంకించారు. డేటా బేస్ ఆధారంగా, అసాధారణ పరిస్థితుల్లో రిజర్వేషన్లు 50% మించి పెంచుకునే సౌలభ్యం ఉందని 9 మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసిందని గుర్తుచేశారు. వికాస్ కృష్ణారావ్ గవాలి కేసు తీర్పు కూడా ఇదే విషయాన్ని బలపరుస్తోందన్నారు. అంతేగాక ఈ వ్యవహారంలో రాజకీయ ఏకాభిప్రాయం సాధ్యమైందని చెప్పారు. అసెంబ్లీలో అన్ని పార్టీలు ఏకగ్రీవంగా బీసీ రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదం తెలిపాయని, అయితే గవర్నర్, రాష్ట్రపతి వద్ద బిల్లులు పెండింగ్‌లో ఉండటం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని వివరించారు. బిల్లును సవాల్ చేయకుండా, దాని ఆధారంగా జారీ చేసిన జీవోను సవాల్ చేయడం సరికాదని సింఘ్వీ వాదించారు. ఇంతటి విస్తృత కసరత్తు తర్వాత, ఎలాంటి సహేతుక కారణాలు చూపకుండా హైకోర్టు స్టే విధించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.

కోటా 50% పరిమితి దాటరాదు: ప్రతివాదుల వాదన

ప్రతివాది మాధవరెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణ ప్రభుత్వ వాదనలను తీవ్రంగా వ్యతిరేకించారు. రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని సుప్రీంకోర్టు అనేక తీర్పుల్లో స్పష్టం చేసిందన్నారు. కృష్ణమూర్తి కేసు తీర్పును ఉటంకిస్తూ 'షెడ్యూల్డ్ ఏరియాలు, గిరిజన ప్రాంతాల్లో మాత్రమే 50 శాతానికి మించి రిజర్వేషన్లు పెంచుకోవడానికి అనుమతి ఉంది. జనరల్ ఏరియాల్లో ఈ పరిమితిని దాటడానికి వీల్లేదు. తెలంగాణలో అలాంటి షెడ్యూల్ ఏరియాలు లేవు. కృష్ణమూర్తి కేసులో సుప్రీంకోర్టు ఇదే తీర్పును వెల్లడించింది'అని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ట్రిపుల్ టెస్ట్‌లో కూడా మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదనేది ఒక కీలకమైన షరతు అని, దాన్ని ప్రభుత్వం ఉల్లంఘించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇతర రాష్ట్రాల ఉదంతాలను ప్రస్తావిస్తూ.. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌ల్లో కూడా రిజర్వేషన్ల పెంపును సుప్రీంకోర్టు తిరస్కరించి, 50 శాతం పరిమితికి లోబడే ఎన్నికలకు వెళ్లాలని ఆదేశించిందని గుర్తుచేశారు.

ధర్మాసనం కీలక వ్యాఖ్యలు

ఇరుపక్షాల వాదనలను విన్న ధర్మాసనం, రాష్ట్ర ప్రభుత్వ వాదనలతో విభేదించింది. 'ఎస్టీ ప్రాంతాల్లోనే రిజర్వేషన్ల పెంపునకు మినహాయింపులు ఉన్నాయి కదా?'అని పేర్కొంది. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులను, ముఖ్యంగా కృష్ణమూర్తి కేసులో స్థానిక సంస్థల రిజర్వేషన్లపై నిర్దేశించిన 50 శాతం పరిమితిని ధర్మాసనం పునరుద్ఘాటించింది. ఈ అంశం హైకోర్టులో విచారణ దశలో ఉన్నందున హైకోర్టు ఇచ్చిన స్టే ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవడానికి ఎలాంటి కారణాలు కనబడటం లేదంటూ తెలంగాణ ప్రభుత్వ పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. అయితే తమ ఆదేశాలతో సంబంధం లేకుండా కేసు మెరిట్స్ ఆధారంగా తదుపరి విచారణను కొనసాగించాలని హైకోర్టుకు సూచించింది. ఈ తీర్పుతో రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు ప్రస్తుతమున్న రిజర్వేషన్ల విధానం ప్రకారమే జరగనున్నాయి.

బీసీ రిజర్వేషన్లపై వెనకడుగు లేదు

పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్.. 18న బంద్‌కు సంపూర్ణ మద్దతు



ఆర్.కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతున్న మహేశ్ గౌడ్

సాక్షి, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. దేశంలో కుల సర్వేకు ఆద్యుడు రాహుల్ గాంధీ అని, దేశానికి స్వాతంత్య్రం వచ్చిన అనంతరం శాస్త్రీయంగా కుల సర్వే నిర్వహించిన రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. అధికారికంగా జరిగిన సర్వే ఆధారంగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఖరారు చేసి, కేంద్రానికి పంపితే బీజేపీ ప్రభుత్వం తొక్కిపెట్టిందని అన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లతో ఎన్నికలు నిర్వహించకుండా హైకోర్టు స్టే ఇవ్వడాన్ని నిరసిస్తూ ఈనెల 18న తలపెట్టిన బంద్‌కు మద్దతు కోరుతూ బీసీ నేతలు ఆర్.కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్ గౌడ్, నారగోని గురువారం గాంధీభవన్‌లో మహేశ్ గౌడ్‌ను కలిశారు. ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన కామారెడ్డి డిక్లరేషన్‌కు కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. తెలంగాణ బీసీ జేఏసీ ఈనెల 18న తలబెట్టిన బంద్‌కు సంపూర్ణ మద్దతునిస్తున్నట్లు చెప్పారు. అసెంబ్లీలో మద్దతిచ్చి బయట మోకాలడ్డుతున్న పార్టీలకు బీసీలు గుణపాఠం చెపుతారని అన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చే విషయంలో ప్రధాని మోదీని అడిగేందుకు బీజేపీ నేతలు ఎందుకు జంకుతున్నారని ప్రశ్నించారు.

జూబ్లీహిల్స్ ఎన్నికలో మద్దతు ఇవ్వండి

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ కుమార్ యాదవ్‌కు మద్దతివ్వాలని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం జరుగుతున్న పోరా టంలో ప్రభుత్వంతో కలిసిరావాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ సీపీఎంకు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన హైదరాబాద్‌ని సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, ఇతర నాయకులతో భేటీ అయ్యారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై మహేశ్ గౌడ్ మద్దతు కోరగా, ఈ నెల 20న జరిగే తమ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాల్లో నిర్ణయాన్ని ప్రకటిస్తామని జాన్‌వెస్లీ హామీ ఇచ్చారు.

రిజర్వేషన్లపై కాంగ్రెస్ డ్రామా చేయాలని చూసింది

మాజీ మంత్రులు తలసాని, గంగుల, శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న తలసాని. చిత్రంలో కమలాకర్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ డ్రామా చేయాలని చూసిందని మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, గంగుల కమలాకర్, శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. పార్టీల పరంగా ఎన్నికలకు వెళ్లాలని కేబినెట్ సమావేశంలో నిర్ణయిస్తే ఒప్పుకునేది లేదని, సీఎం రేవంత్‌రెడ్డి ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చాకనే ఎన్నికలకి వెళ్లాలని వారు స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల అమలు, 18న బీసీల బంద్ తదితర అంశాలపై తలసాని అధ్యక్షతన గురువారం తెలంగాణ భవన్‌లో చర్చించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ, ఈ నెల 18న బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే బంద్‌లో తెలంగాణ భవన్ నుంచే వెళ్లి పాల్గొంటామన్నారు.'బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ డ్రామా చేయాలని చూసింది. గవర్నర్ వద్దకు తీర్మానం వెళ్లక ముందే ఢిల్లీ లో ధర్నా చేశారు. మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ధర్నాకు రాలేదు'అని విమర్శించారు.

18న పల్లె, పట్నం బంద్ కావాలె..

అఖిలపక్ష బీసీ నేతల పిలుపు



అభివాదం చేస్తున్న బీసీ ప్రజాప్రతినిధులు, సంఘాల నేతలు

సనత్‌నగర్ (హైదరాబాద్): 'ఈ నెల 18న పల్లె, పట్నం అంతా బంద్ కావాలె.. బంద్‌కు ఊరూవాడా కలిసి రావాలి. వార్డు సభ్యుడి నుంచి మంత్రుల వరకు బంద్‌లో పాల్గొనాలి.. బంద్‌తో ఢిల్లీ పెద్దలు దిగి రావాలి'.. అని అఖిలపక్ష బీసీ నేతలు స్పష్టం చేశారు. బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో గురువారం సాయంత్రం తెలంగాణ రాష్ట్ర బంద్‌కు మద్దతుగా సమావేశం నిర్వహించారు. బీసీ ప్రజా ప్రతినిధుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో.. బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ ఎంపీలు మధుయాష్కీ, వి.హనుమంతరావు, బీజేపీ నేత తల్లోజు ఆచారి మాట్లాడారు. ముందస్తు అరెస్టులు చేయకుండా బీసీలు శాంతియుతంగా బంద్ చేసే అవ కాశాన్ని డీజీపీ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ బస్సులు రోడ్ల మీదకు ముందుగానే నిలిపివేయాలని సంస్థ ఎండీ నాగిరెడ్డిని వారు కోరారు. సింగరేణి, అన్ని విద్యా, వ్యాపార సంస్థలను మూసి వేయాలని కోరారు. సమావేశంలో బీసీ జేఏసీ వైస్ చైర్మన్ వీజీఆర్ నారగోని, యాదయ్యగౌడ్, గడిల కుమార్, చంద్రమోహన్, రాజారాంయాదవ్ పాల్గొన్నారు.

సాక్షి

శుక్రవారం, 17 అక్టోబర్ 2025

లొంగుబాట్ల పర్వం!

ఆవిర్భవించి దాదాపు అరవయ్యేళ్లు కావస్తుండగా నక్సలైట్ ఉద్యమం తొలిసారి కనీవినీ ఎరుగని సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. అరెస్టులు, నిర్బంధాలు, ఎన్‌కౌంటర్లు ఆ ఉద్యమానికి కొత్త కాకపోయినా, ఈ స్థాయిలో బీటలు వారటం ఇదే ప్రథమం. మావోయిస్టు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాలరావుతో సహా 61 మంది నక్సలైట్లు గడ్చిరోలిలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ముందు బుధవారం లొంగిపోయారు. అస్త్ర సన్యాసం చేసినవారు అప్పగించిన ఏకే–47లు, ఇతర తుపాకులు స్వీకరించి అందుకు బదులుగా వారికి సీఎం రాజ్యాంగ ప్రతులు అందజేశారు. నక్సల్స్‌కు బలమైన స్థావరంగా భావించే అబూజ్‌మాడ్ పూర్తిగా భద్రతా బలగాల అదుపులోకొచ్చిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించి ఛత్తీస్‌గఢ్‌లో నిన్న, ఈ రోజు 197 మంది లొంగిపోయారని తెలిపారు. మొత్తం ఈ రెండు రోజుల్లో 258 మంది ఉద్యమానికి వీడ్కోలు చెప్పారు. ముఖ్యంగా ఉత్తర బస్తర్ ప్రాంతంలో మావోయిస్టు ప్రభావం పూర్తిగా అంతరించింది. గత కొన్ని నెలలుగా ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మాడ్, జార్ఖండ్‌లోని పలు ప్రాంతాల్లో పదుల సంఖ్యలో ఎన్‌కౌంటర్లు జరిగాయి. బయటినుంచి వెళ్లిన క్యాడర్‌తోపాటు పలువురు ఆదివాసీలు కూడా వీటిల్లో మరణించారు. ఈ పరిణామాలు గమనిస్తే వచ్చే ఏడాది మార్చి 31 కల్లా మావోయిస్టు ఉద్యమాన్ని అంతం చేయాలన్న కేంద్ర సంకల్పం నెరవేరేలా కనబడుతోంది.

పీపుల్స్ వార్‌గా 1980లో ఆవిర్భవించిన పార్టీ ఇరవయ్యేళ్లలో పెనువేగంతో విస్తరించింది. 2000వ సంవత్సరంలో పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ), 2004లో మావోయిస్టు పార్టీగా రూపుదిద్దుకున్న సమయానికి దేశంలోని 92,000 చదరపు కిలోమీటర్ల పరిధిలోని 180 జిల్లాల్లో దాని ప్రభావం ఉన్నదని అప్పట్లో కేంద్రం ప్రకటించింది. నక్సలైట్ ఉద్యమం దేశం ఎదుర్కొంటున్న అతి పెద్ద ముప్పని తెలిపింది. తాజాగా ఆ ఉద్యమ ప్రభావం 11 జిల్లాలకు పరిమితమైంది. వాటిల్లో కూడా ఛత్తీస్‌గఢ్‌లోని మూడు జిల్లాలు – బీజాపూర్, సుక్మా, నారాయణ్‌పూర్‌లలో మాత్రమే నక్సల్ తీవ్రత అధికంగా ఉన్నదని కేంద్ర హోంమంత్రిత్వ వర్గాల కథనం. దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రారంభమయ్యాక మొదట్లో మందకొడిగా ప్రారంభమైన మార్పులు తర్వాత కాలంలో వేగం పుంజుకున్నాయి. పర్యవసానంగా మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి వర్గాల నుంచి ఉద్యమంలోకి రిక్రూట్‌మెంట్ గణనీయంగా తగ్గింది. ఆదివాసీ యువత రాక కొంతమేర పెరిగిన మాట వాస్తవమే అయినా ఏదో సంచలనాత్మక ఘటనల సందర్భంలో తప్ప మావోయిస్టు స్వరం వినబడటం తగ్గింది. సాధారణ ప్రజానీకం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లపై ఆ పార్టీ వైఖరేమిటో తెలియని స్థితి నెలకొంది.

ఇప్పటికీ ఆకలి, దారిద్ర్యం ఉన్నా, గతంలో మాదిరి కాక వాటి నివారణకు ప్రభుత్వాలు ఏదో మేరకు పథకాలు రచించి అమలు చేస్తున్నాయి. తమ డిమాండ్లు అరణ్య రోదనగా మిగిలే గతకాలపు పరిస్థితి మారి, ఎవరో ఒకరు గొంతెత్తటం, వాటివల్ల సానుకూల ఫలితాలు రావటం సామాన్య ప్రజలకు ఊరటనిస్తోంది. అణచివేత, నిషేధాలతో అజ్ఞాత వాసంలో ఉండటం వల్ల కొద్దోగొప్పో బలం ఉన్న ప్రాంతాల్లో కూడా మావోయిస్టులు వెనువెంటనే స్పందించే శక్తి లేకపోయింది. అంతక్రితం మాటేమోగానీ... మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాళ్ల కేశవరావు ఎదురు కాల్పుల్లో మరణించిన తర్వాత పార్టీ శ్రేణుల్లో ఒక రకమైన అంతర్మథనం మొదలైనట్టు కనబడుతోంది. మొన్న ఆగస్టులో సాయుధ పోరుకు తాత్కాలిక విరామం ప్రకటిద్దామంటూ మల్లోజుల పేరిట లేఖ విడుదలైనప్పుడు అది ఆయన వ్యక్తిగత అభిప్రాయం అని అందరూ అనుకున్నా పార్టీలో పలు కమిటీల మద్దతు కూడా ఉన్నదని మీడియా కథనాలు తెలిపాయి. ఇప్పుడేర్పడిన సానుకూల స్థితిని ఆదివాసీ జీవితాల మెరుగుకు వినియోగించటంతో పాటు పర్యావరణానికీ, ఆదివాసీ సంస్కృతికీ విఘాతం కలగని అభివృద్ధి నమూనాల రూపకల్పనకు పాలకులు కృషి చేయాలి. మన రాజ్యాంగంలో ఆదేశిక సూత్రాలను ప్రభుత్వాలు చిత్తశుద్ధితో అమలుచేస్తే సమస్యలు తలెత్తవు. ఆ వెంబడే వచ్చే సామాజిక, రాజకీయ ఉద్యమాలూ ఉండవు. లేకుంటే అసంతృప్తి రూపం మార్చుకుంటుంది తప్ప సమసి పోదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.ఏకాదశి ప.1.09 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** మఖ సా.4.41 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** రా.12.54 నుండి 2.33 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.17 నుండి 9.03 వరకు తదుపరి ప.12.10 నుండి 12.56 వరకు, **అమృత ఘడియలు:** ప.2.16 నుండి 3.53 వరకు, **సర్వ ఏకాదశి.**

సూర్యోదయం : 5.56
సూర్యాస్తమయం: 5.35
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

సోషల్ టాక్

ముఖ్యం కాదు



జీవితంలో సగం వయసు దాటాక మానసికంగా మనం బలం లేనట్లుగా అయిపోతాం. ముఖ్యమైన విషయాల గురించి ఎక్కువగా ఆలోచిస్తాం. విషయాలు ముఖ్యమైనవే కానీ, ఎక్కువగా ఆలోచించటం ముఖ్యం కాదని నేను గ్రహించాను.

– పమేలా ఆండర్సన్, నటి–మోడల్

సన్నటి దుస్తులు



కోరుకోవటం అనేది గొప్ప అనుభూతి. కానీ అది అందుబాటులో లేకపోవటం మరింత ఉత్తేజకరమైనది. నేను సన్నగా కనిపించాలని నా కోరిక. అది సాధ్యం కాదు. అయితే సన్నగా కనిపించేలా దుస్తులు వేసుకోవటం నన్ను ఉల్లాసంగా ఉంచుతుంది.

– శ్రేయా ఘోషల్, గాయని


సొంత ఆలోచన



గతంలో నేను చాలా సలహాలు విని, పాటించి దెబ్బ తిన్నాను. సలహాలు అన్నవి మనకై మనం ఆలోచించే సమయం ఇవ్వవు. మనది కానిది అయిన ఏదో ఒక దాన్ని మనం చేసేసేలా తొందరపెడతాయి. బౌలింగ్ విషయంలో బౌలర్ ఎప్పుడూ సొంత అంచనా ప్రకారమే వెళ్లాలి.

– మోర్నే మోర్కెల్, ఇండియా బౌలింగ్ కోచ్

వడ కట్టాలి



అంతర్జాతీయ ఈవెంట్‌లు మన ఆలోచనా పరిధిని విస్తృతం చేస్తాయి. కానీ నేరుగా ఆ ట్రెండ్‌లను స్వీకరించకూడదు. మన సొంత లెన్స్‌తో వాటిని వడకట్టాలి. ఆపైన మన సృజనాత్మకతను జోడించాలి. ఒక్క ఫ్యాషన్‌కే కాదు, అన్ని కళలకూ ఇది వర్తిస్తుంది.

– అహన్ శెట్టి, ఫ్యాషన్ ఇన్‌ఫ్లుయెన్సర్

దోష రహితం



సానుకూలమైన వ్యక్తిగా ఉండగలగటం మంచిదే. కానీ ఎల్లప్పుడూ మంచిగా, ఎల్లప్పుడూ నవ్వుతూ, ఎల్లప్పుడూ సంతోషంగా ఉండాలనే ఈ మొత్తం భావన ఏదో ముసుగును ధరించినట్లుగా అనిపిస్తుంది. దోష రహితంగా చెక్కిన శిల్పంలా ఉండటం రాళ్లకు మాత్రమే సరిపోతుంది.

– అలీషియా కీస్, క్లాసికల్ పియానిస్ట్

నాలోని 'అమ్మాయి'!



చాలామంది నన్ను 'గే' అనుకుంటారు. నా పెదవులు ఎర్రగా ఉంటాయి. లిప్‌స్టిక్ వేసుకుంటానని వారి అనుమానం. నా డ్యాన్స్‌లో స్త్రీత్వం ఉంటుంది. అందుకని నేను అమ్మాయిలా కనిపిస్తానని అనుకుంటారు. ఏం ఫరవాలేదు. ఈ విమర్శలను నేను నవ్వుతూ తీసుకుంటాను. – టైగర్ ష్రాఫ్, నటుడు

పదే పదే అదే దాడి!



అభిప్రాయం



పి. విజయ బాబు

ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛ అనేది కేవలం జర్నలిస్టుల హక్కు మాత్రమే కాదు, అది ప్రజలకు సమాచారం తెలుసుకునే హక్కు కూడా! ప్రభుత్వ తప్పిదాలు లేదా లోపాలను ఎత్తి చూపినందుకు, ముఖ్యంగా మద్యం మరణాల వంటి సున్నితమైన అంశాలలో, సంపాదకుడిని లేదా విలేకరులను వేధించడం, బీఎన్ఎస్ 179(1) వంటి అసంబద్ధమైన సెక్షన్ల కింద నోటీసులు ఇవ్వడం, 'సోర్స్' వివరాలను అడగటం వంటి చర్యలు చట్టబద్ధమైన పరిధిని దాటి అధికార దుర్వినియోగానికి (అబ్యూజ్ ఆఫ్ అథారిటీ) పాల్పడటం కిందికి వస్తాయి.



పత్రికా స్వేచ్ఛను అణిచివేసే ప్రయత్నాలు జరిగినప్పుడు, వివిధ కేసులలో సుప్రీంకోర్టు తీర్పులు జర్నలిస్టులకు బలమైన రక్షణ కవచంగా నిలిచిన విషయం గమనార్హం. సత్యాన్ని ధైర్యంగా నిలబెట్టే ప్రతీ జర్నలిస్టుకూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) ఎప్పుడూ రక్షణగా నిలుస్తుంది.

ఒక వార్తా దినపత్రిక సంపాదకుడికి, మద్యం మరణాల గురించిన వార్తను ప్రచురించినందుకు గానూ, పోలీసులు భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 179(1) కింద నోటీసులు జారీ చేయడం, ఆ వార్తకు సంబంధించిన విలేకరుల అన్ని డాక్యుమెంట్లు, వివరాలను బీఎన్ఎస్ సెక్షన్ 94 కింద సమర్పించాలని డిమాండ్ చేయడం చట్టబద్ధమేనా? ఇటువంటి పోలీసు చర్యలు, లేదా ఏపీ రాష్ట్ర ప్రభుత్వ చర్యలు జర్నలిస్టులను వేధించడం కాదా?

అవి వేధింపులే!

ఏదైనా దర్యాప్తు, విచారణ లేదా ఇతర ప్రయోజనాల కోసం ఏదైనా పత్రం, ఇతర వస్తువు అవసరమని కోర్టు లేదా పోలీస్ స్టేషన్ అధికారి భావించినప్పుడు, దానిని సమర్పించమని బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 94 (పాత సీఆర్‌పీసీ సెక్షన్ 91) కింద ఎవరికైనా సమన్లు జారీ చేయవచ్చు. కానీ అది పాత్రికేయులకు వర్తిస్తుందా? సాధారణంగా, విచారణ కోసం పత్రాలను అడగడానికి ఈ సెక్షన్ ఉపయోగపడుతుంది. అయితే, జర్నలిస్ట్ వనరు (సోర్స్ ఆఫ్ ఇన్ఫర్మేషన్) లేదా సమాచారాన్ని సమర్పించమని బలవంతం చేయడం, జర్నలిజం ప్రధాన సూత్రమైన 'సోర్స్ గోప్యత'కు విరుద్ధం. విలేకరుల రక్షణ, పత్రికా స్వేచ్ఛ దృష్ట్యా, ఈ సెక్షన్‌ను విచక్షణా రహితంగా ఉపయోగించడం చట్టవిరుద్ధం అవుతుంది. వార్తా ప్రచురణను కేవలం ప్రభుత్వంపై విమర్శగా భావించి, ఈ సెక్షన్లను ఉపయోగించి విలేకరుల వివరాలను, డాక్యుమెంట్లను కోరడం స్పష్టంగా 'చట్టపరమైన వేధింపు' కిందకు వస్తుంది.

భారతదేశంలో జర్నలిస్టులు తమ వార్తా మూలాలను పోలీసులకు బహిర్గతం చేయాలని ఏ చట్టం కూడా ఒత్తిడి చేయదు. సమాచారాన్ని సేకరించే హక్కు, ప్రచురించే హక్కు – ఈ రెండింటినీ ఆర్టికల్ 19(1)(ఎ) కింద భారత రాజ్యాంగం ప్రసాదించింది. కొన్ని ప్రత్యేక సందర్భాలలో సంబంధిత న్యాయస్థానం, అది కూడా అత్యవసరమైతేనే ఆ మూలాలను వెల్లడించమని ఆదేశించగలదు. కానీ పోలీసులకు ఆ హక్కు లేదు. జర్నలిజంలో సమాచారాన్ని అందించిన వనరును రక్షించడం అత్యంత కీలకం. సోర్స్‌ను బహిర్గతం చేయమని బలవంతం చేయడం పత్రికా స్వేచ్ఛను అణిచివేయడమే అవుతుంది.

జర్నలిస్టులకు 'సుప్రీం' బాసట

రోమేష్ థాపర్ (1950) నుంచి ఆర్ణబ్ గోస్వామి (2020), 'న్యూస్‌క్లిక్' (2024) కేసుల వరకు, భారత అత్యున్నత న్యాయస్థానం ఎప్పటికప్పుడు పోలీసుల లేదా రాజకీయ నేతల ఒత్తిడి లేకుండా మీడియా పని చేయాలనే హక్కును కాపాడుతూనే ఉంది. 'ఆర్ణబ్ గోస్వామి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసును జస్టిస్ డి.వై. చంద్రచూడ్, జస్టిస్ ఎం.ఆర్.షా విచారించారు. ముఖ్యంగా టీవీ కార్యక్రమాల మీద పలు ఎఫ్ఐఆర్లు ఫైల్ చేయడం మీద విచారణ జరిగింది. జర్నలిస్టులు ఇబ్బంది పెట్టే ప్రశ్నలు అడగటం, ప్రభుత్వాన్ని విమర్శించడం వారి హక్కుగా కోర్టు పరిగణించింది. రాజకీయ దురుద్దేశంతో ఎఫ్ఐఆర్లు దాఖలు చేయడం భావ ప్రకటనా స్వేచ్ఛ హక్కుకు విరుద్ధం అని వ్యాఖ్యానించింది.

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) ప్రతి పౌరుడికీ వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వేచ్ఛను ప్రాథమిక హక్కుగా కల్పిస్తుంది. ఈ హక్కులోనే పత్రికా స్వేచ్ఛ కూడా అంతర్లీనంగా ఉంది. పోలీసుల వేధింపులను ఎదుర్కొంటున్నప్పుడు, ఒక జర్నలిస్ట్ లేదా ఎడిటర్ తన రక్షణ కోసం హైకోర్టును లేదా సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చు. కోర్టులు తరచూ నాలుగు అంశాలను పరిగణనలోకి తీసుకుంటాయి: ప్రజా ప్రయోజనాల దృష్ట్యా వార్త ప్రచురితమైందా? వార్తలో ఉన్న వివరాలు నిజమని భావించడానికి ప్రాథమిక ఆధారాలు ఉన్నాయా? నేరారోపణ చేయబడిన సెక్షన్ (ఇక్కడ బీఎన్ఎస్ 179(1)) ఈ వార్తకు అసలు వర్తిస్తుందా? లేదా ఇది కేవలం జర్నలిస్టును వేధించడానికి లేదా భయపెట్టడానికి ఉపయోగించారా?

ప్రభుత్వ చర్యలు పత్రికా స్వేచ్ఛను అరికట్టే విధంగా ఉండకూడదు. అంటే భయపెట్టి, ఒత్తిడి చేసి జర్నలిస్టులు సత్యాన్ని రాసేందుకు వెనకాడేలా చేయడాన్ని 'చిల్లింగ్ ఎఫెక్ట్' అంటారు. సుప్రీంకోర్టు ఇటువంటి చర్యలను తీవ్రంగా పరిగణిస్తుంది.

పత్రికా స్వేచ్ఛకు ఊతం

'న్యూస్‌క్లిక్' ఎడిటర్ కేసులో ఢిల్లీ హైకోర్టు, సుప్రీంకోర్టు అద్భుతమైన వ్యాఖ్యానాలు చేశాయి. తమకు ఇష్టం లేని రిపోర్టింగ్ చేసినందుకు జర్నలిస్టులను నిందితులుగా పరిగణించే అధికారం పోలీసులకు లేదని కోర్టులు స్పష్టం చేశాయి. అంతేకాకుండా, సదరు వార్త సాధనాలను స్వాధీనం చేయాలని కోరడాన్ని సుప్రీంకోర్టు తప్పు పట్టింది.

'రోమేష్ థాపర్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మద్రాస్' కేసులో ఆర్టికల్ 19(1)(ఎ) కింద పత్రికా స్వేచ్ఛ ప్రాథమిక హక్కు అని 1950లోనే సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అదే ఏడాది 'బ్రిజ్ భూషణ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ ఢిల్లీ' కేసులో వార్తలను ప్రచురించడానికి ముందు సెన్సార్‌షిప్‌ను కోర్టు కొట్టివేసింది. ఇది పత్రికా స్వేచ్ఛకు తొలి విజయం.

'అభిషేక్ ఉపాధ్యాయ వర్సెస్ స్టేట్ ఆఫ్ యూపీ' (2024) కేసులో జర్నలిస్ట్ రాతలను ప్రభుత్వ విమర్శగా భావించినంత మాత్రాన, ఆ రచయితపై క్రిమినల్ కేసులు నమోదు చేయకూడదని కోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పు ప్రభుత్వ చర్యలను విమర్శించే జర్నలిస్టులకు రక్షణ కల్పిస్తుంది.

'సిద్ధార్థ్ వరదరాజన్, ఇతరులు వర్సెస్ స్టేట్ ఆఫ్ అస్సాం' (2025) కేసులో, ఒక వార్తా పోర్టల్‌కు సంబంధించిన సీనియర్ జర్నలిస్టులపై నిర్బంధ చర్యలు తీసుకోకుండా అస్సాం పోలీసులను సుప్రీంకోర్టు నిలువరించింది. ఈ చర్యలు పత్రికా స్వేచ్ఛపై దాడిగా కోర్టు భావించింది.

పత్రికా స్వేచ్ఛ గురించి న్యాయస్థానాలు అనేక తీర్పులు ఇస్తున్నా, వేధింపులకు సంబంధించి పోలీసులను హెచ్చరిస్తున్నా ప్రభుత్వాల ఆదేశాల మేరకు వారు ఈ పనులు కొనసాగిస్తూనే ఉన్నారు. ఇలాంటి కేసులు నిలవవని వారికీ తెలుసు. అయితే ఈ లోపు తాత్కాలికంగా ఇబ్బంది పెడుతూ 'చిల్లింగ్ ఎఫెక్ట్'తో భయపెట్టడమే వారి ప్రధానోద్దేశం. ఇలాంటి చర్యలకు సైతం వారు కచ్చితంగా న్యాయస్థానం ముందు నిలబడాల్సి వస్తుందనేది వాస్తవం.

వ్యాసకర్త రాజ్యాంగ న్యాయ శాస్త్ర పట్టభద్రులు, సీనియర్ సంపాదకులు

◆ జర్నలిస్టులు తమ వార్తా మూలాలను పోలీసులకు బహిర్గతం చేయాలని ఏ చట్టం కూడా ఒత్తిడి చేయదు. సమాచారాన్ని సేకరించే హక్కు, ప్రచురించే హక్కు – ఈ రెండింటినీ ఆర్టికల్ 19(1)(ఎ) కింద భారత రాజ్యాంగం ప్రసాదించింది.

◆ తమకు ఇష్టం లేని రిపోర్టింగ్ చేసినందుకు జర్నలిస్టులను నిందితులుగా పరిగణించే అధికారం పోలీసులకు లేదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది.

పత్రికా విలువలకు జీవం

'జమీన్ రైతు' పత్రిక అంటే నూరేళ్ల తెలుగు పత్రికాలోక చరిత్ర. 1930లో ప్రారంభమై నేటికి కూడా నిర్విఘ్నంగా నడుస్తోంది. ఈ మధ్యలో ఎన్నో పత్రికలు పుట్టాయి, గిట్టాయి. కానీ ఆ పత్రిక విరామం లేకుండా వెలువడుతూనే ఉంది. ఈ ఘనమైన చరిత్రకు మూల పురుషుడు నెల్లూరు వెంకట్రామానాయుడు. జీవప్రదాత నెల్లూరు శ్రీరామమూర్తి. 'జమీన్ రైతు పత్రిక నా పుట్టిల్లు అయితే, సంపాదకులు శ్రీరామమూర్తి నా మార్గనిర్దేశకులు' అన్నారు రచయిత రావూరి భరద్వాజ.

పత్రికా రచన కోసం శ్రీరామమూర్తి ప్రత్యేక చదువులేమీ చదవలేదు. కానీ కొమ్ములు తిరిగిన పత్రికా రచయితలు సైతం ఆయన వద్దకు వచ్చి పాఠాలు నేర్చేవారు. ఆయన రాసే వార్తలు కుండబద్దలు కొట్టినట్లు, అంకుశంతో పొడిచినట్లు ఉండేవి. చిన్న చిన్న పదాలతో, సామాన్యుల భాషలో రాసేవారు. ఒక పత్రికా సంపాదకుడిగా శ్రీరామమూర్తి విశేషాల గురించి ఆచార్య ఆత్రేయ, గజ్జెల మల్లారెడ్డి, ఉండేల మాల కొండారెడ్డి, రావిపాటి మహానంద, కేవీ రమణా రెడ్డి వంటి ఎంతోమంది ప్రముఖులు వ్యాఖ్యానించారు.

'జై ఆంధ్ర' ఉద్యమ సమయంలోనూ సంపాదకుడిగా శ్రీరామమూర్తి రాజీ పడలేదు. దీనివల్ల ప్రజలు నష్టపోతున్నారన్న తన వాదనను విడవలేదు. పత్రిక పంథా వలన ఉద్యమకారులు దాడులు నిర్వహించారు. కార్యాలయ యంత్రాలు, ప్రింటింగ్ సామగ్రి ధ్వంసం చేశారు. అయినా వెనకడుగు వేయలేదు. మద్రాసు నుంచి ప్రత్యేకంగా యంత్రాలు తెప్పించి పత్రికను యథావిధిగా తీసుకోరావటం అప్పట్లో సంచలనం అయింది. అప్పట్లో తీవ్రంగా ఉన్న నక్సలైట్ ఉద్యమాన్ని సైతం శ్రీరామమూర్తి వ్యతిరేకించారు. దీనితో వారి నివాసం మీద నక్సలైట్లు దాడులు చేశారు. ఆ రాత్రి ఆయన నివాసంలో లేకపోవడంతో బతికి బయటపడ్డారు. అయినప్పటికీ ఆయన భావజాలంలో మార్పు రాలేదు.



నెల్లూరు శ్రీరామమూర్తి
(1925-1993)

ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం అని ఈ రోజులలో గొప్పగా చెప్పుకొంటున్న వారికి, యాభై ఏళ్ల క్రితం జరిగిన కళారాణి, చంద్రికారాణి జంట హత్యల కేసు గురించి తెలిసి ఉండకపోవచ్చు. ఆ దురంతంపై ఆ రోజులలో 'జమీన్ రైతు' పరిశోధనాత్మక కథనాలు సంచలనం సృష్టించాయి. ఆ పత్రిక మీద 'ఇల్లస్ట్రేటెడ్ వీక్లీ ఆఫ్ ఇండియా' ఒక ప్రత్యేక కథనం ప్రచురించింది. ఎన్టీఆర్ రాజకీయాలలోకి రాబోతున్నారని, తెలుగుదేశం పేరిట ఒక రాజకీయ పార్టీ పెట్టబోతున్నారని మొదటగా వార్త ప్రచురించింది కూడా ఈ పత్రికే.

శ్రీరామమూర్తికి వ్యవసాయం అన్నా, రైతులన్నా అమిత ప్రేమ. ఎన్జీ రంగా, గౌతు లచ్చన్న, పెండేకంటి వెంకట సుబ్బయ్య, పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి వంటి జాతీయ, ప్రాంతీయ రైతు నాయకులతో దగ్గరి సంబంధాలు ఉండేవి. జనసంఘ్ నాయకుడు వెంకయ్య, మార్క్సిస్టు నాయకుడు జక్కా వెంకయ్య లాంటి ప్రముఖులతో సిద్ధాంతపరంగా విభేదాలున్నా ఆయన స్నేహ సంబంధం కొనసాగించారు. విధానాలను, వ్యక్తులను వేరు చేసి చూడగల హృదయ వైశాల్యం ఆయన సొంతం. 1925 అక్టోబర్ 17న జన్మించి, 1993 జూలై 19న మరణించిన శ్రీరామమూర్తి సుమారు యాభై ఏళ్లపాటు సంపాదక బాధ్యతలు నిర్వర్తించారు. ఇప్పటితరం పాత్రికేయులకు ఆయన మార్గదర్శకులు. ఆయన పత్రికా జీవితం ఒక పాఠం.

– ఈతకోట సుబ్బారావు । కవి–పాత్రికేయుడు
(నేడు సంపాదకుడు నెల్లూరు శ్రీరామమూర్తి శత జయంతి)

ప్రజల జీవితాలతో చెలగాటమా?

ఇన్ బాక్స్

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట వద్ద ఏర్పాటు చేయ తలపెట్టిన బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా ఆ ప్రాంత ప్రజలు, ముఖ్యంగా మత్స్యకారులు పోరాటం సాగిస్తున్నారు. సెప్టెంబర్ 29న మత్స్యకారులు రాజయ్యపేటలో సాగిస్తున్న నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించిన ఏపీ హోం మంత్రి అనిత ఈ విషయమై స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో ఆమె కాన్వాయ్‌ని అడ్డగించి ఆందోళనకు దిగారు. దాంతో బల్క్ డ్రగ్ పార్క్ పనులను ఆపివేస్తున్నట్లు ప్రకటించి, సమస్య పరిష్కారం కోసం అఖిల పక్ష కమిటీని సీఎం, డిప్యూటీ సీఎం వద్దకు తీసుకువెళ్తానని ఆమె హామీ ఇవ్వాల్సి వచ్చింది. అయినా బల్క్ డ్రగ్ పార్కును పూర్తిగా రద్దు చేసేంతవరకు నిరాహార దీక్షలు కొనసాగిస్తామని బాధిత మత్స్యకారులు చెబుతున్నారు.

ఉపాధికి, ప్రజల ప్రాణాలకు, పర్యావరణానికి భంగం కలిగించే ఈ బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా చాలా రోజులుగా నిరవధిక ఆందోళన సాగుతోంది. రాజయ్యపేట, బోయపాడు, దొండవాక, పెద్ద తీనార్ల, చిన్నతీనార్ల, ఎస్ రాయవరం మండలం గుర్రాజుపేట గ్రామాల్లో దీనికోసం కూటమి ప్రభుత్వం 1,270.80 ఎకరాలకు గానూ, 450 ఎకరాలు సేకరించింది, ఇంకా 820 ఎకరాలు సేకరించే పనిలో ఉంది. ఆగస్టు 6న నక్కపల్లిలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ప్రజలందరూ బల్క్ డ్రగ్ పార్కును వ్యతిరేకించారు. ఇప్పటికీ రాజయ్యపేట చుట్టుపక్కల గ్రామస్థులు సెప్టెంబర్ 14 నుంచి నిరసన దీక్షలు కొనసాగిస్తున్నారు. అయినప్పటికీ గ్రామం చుట్టూ ఫ్యాక్టరీ నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్లు, డ్రెయిన్లు, అడ్మిన్ బిల్డింగ్, వాటర్ పంపుల నిర్మాణం జరుగుతోంది.



ఈ ప్రాంతం మినీ కోనసీమగా పేరుగాంచింది. కొబ్బరి తోటలు, జీడి మామిడి తోటలు, డ్రాగన్ ఫ్రూట్స్ వంటివి పండిస్తున్నారు. రైతులకు ఈ భూములు తప్ప వేరే జీవనోపాధి మార్గం లేదు. వేలమంది కూలీలు ఈ తోటలపై ఆధారపడి జీవిస్తున్నారు. ఎస్ రాయవరంలో కొబ్బరితోటలపై ఆధారపడి 23 కొబ్బరి పీచు కంపెనీలు ఉన్నాయి. వీటిల్లో వందల మంది కార్మికులు పని చేస్తున్నారు. ఈ బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు వల్ల వీరి జీవనోపాధి దెబ్బతింటుంది. రైతులతో పాటు మత్స్యకారులు శాశ్వతంగా గ్రామాలు ఖాళీ చేయాల్సిన పరిస్థితి ఉంది. కాబట్టి ప్రజాభిప్రాయాన్ని గౌరవించి ఈ బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేసే ఆలోచన విరమించుకోవాలి.

– ముప్పాళ్ళ భార్గవ శ్రీ । సీపీఐ ఎంఎల్ నాయకులు

'సమాచారం' ఇవ్వడం లేదు!

డేటా పాయింట్

దేశంలో ఈ ఏడాది జూన్ 30 నాటికి కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ), రాష్ట్ర సమాచార కమిషన్ల వద్ద పెండింగులో ఉన్న మొత్తం కేసులు 4,13,972.



అత్యధిక కేసులతో మహారాష్ట్ర మొదటి స్థానంలో ఉంటే, సీఐసీ 6వ స్థానంలో ఉంది. తెలంగాణలో 18,192, ఏపీలో 13,591 కేసులు పెండింగులో ఉన్నాయి.

కేసులు పెండింగులో ఉన్న టాప్ - 5 రాష్ట్రాలు

రాష్ట్రం	కేసులు
మహారాష్ట్ర	95,340
కర్ణాటక	47,825
తమిళనాడు	41,059
ఛత్తీస్‌గఢ్	34,147
బిహార్	29,919

ఆధారం: సతర్క్ నాగరిక్ సంఘటన్ నివేదిక

పెద్దలు చెబితే వినాలి!

జ్యోతిర్మయం

పరాశర మహర్షి శిష్యుడైన మైత్రేయుడు ఒకనాడు గురువుగారిని సృష్టి ఉద్భవ క్రమాన్ని గురించి అడిగాడు. 'బాగా అడిగావు. తలుచుకున్నప్పుడల్లా పురాణ సంగతులు నాకు స్ఫురణకు రావడానికి గల కారణం నీవు అడిగిన ఈ ప్రశ్న వలన నాకు గుర్తుకు వచ్చింది. ఆ సంగతిని ముందుగా చెబుతాను, విను!' అని పరాశరుడు ఇలా చెప్పసాగాడు:

'విశ్వామిత్రుడికి మా తాత వశిష్ఠుడిపై తగని ద్వేషం ఉండేది. ఆయనను ఏమీ చేయలేక మా తండ్రిపైకి రాక్షసులను పురికొల్పాడు. వారి చేతిలో మా తండ్రి హతుడైనాడు. ఆ శోకం నాలో క్రోధాన్ని రేపగా అసురులను అంతమొందించేందుకు ఒక యజ్ఞాన్ని మొదలుపెట్టాను. అది తెలుసుకున్న వశిష్ఠుడు, మా తండ్రి మరణించడంలో అసురుల తప్పేమీ లేదని నన్ను సమాధానపరిచి ఆ యజ్ఞాన్ని మాన్పించాడు. పులస్త్య బ్రహ్మ నా దగ్గరకు వచ్చి, మా తాత మాట విని యజ్ఞాన్ని ఆపేసినందుకు మెచ్చుకుంటూ ఇలా అన్నాడు' అని అడవి భావనారాయణ రచించిన 'శ్రీవిష్ణు పురాణం'లోని ఈ కింది పద్యం చెబుతోంది:

ఉ. వైరము మిక్కిలయ్యును, నవార్యతపోధన! యివ్వసిష్ఠువా / గ్గౌరవమూది, తాల్మి మదిగైకొని నిల్పితి గాన నీవు, స / ర్వోరుపురాణ వర్గములు యుక్తినెఱింగెదు, మత్కృపారస / స్ఫార కటాక్ష వీక్షణ వశంబున భాసురధీ సమగ్రతన్.

'అసురులతో తీవ్రమైన వైరం ఉన్నప్పటికీ, మీ తాత కోరిన వెంటనే, చేస్తున్న యజ్ఞాన్ని నీవు ఆపేయడం నాకు ఎంతో ఆనందాన్నిచ్చింది. ఆ ఆనందంతో, నీవు తలచుకున్నప్పుడల్లా సకల పురాణములన్నీ నీకు అవగతమై, నీ బుద్ధికి వశమై ఉండే వరం ఇచ్చాను' అని పరాశరుడికి పులస్త్య బ్రహ్మ చెప్పడం పై పద్యం భావం. పెద్దవారు చెప్పిన మాటలను విని, వారి సలహాకు అనుగుణంగా నడుచుకోవడం ఊహించని శుభాలను కలగజేస్తుందని పరాశర మహర్షికి చెందిన ఈ కథ చెబుతుంది.

– భట్టు వెంకటరావు

మోదీ మాటిచ్చారు..!

రష్యా నుంచి ముడిచమురు కొనడం ఆపేస్తామన్నారు

- ఉక్రెయిన్‌పై యుద్ధం ముగించడానికి ఇదొక కీలకమైన ముందడుగు
- చైనా కూడా ఇక భారత్ దారిలో నడవాలి
- మోదీ నా మిత్రుడు, గొప్ప నాయకుడు.. ఆయనకు నేనంటే ప్రేమ
- యుద్ధం ముగిశాక రష్యాతో ఇంధన బంధం పునరుద్ధరించుకోవచ్చు
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టీకరణ
- ట్రంప్ ప్రకటనను ఖండించిన భారత విదేశాంగ శాఖ



వాషింగ్టన్: రష్యా నుంచి భారత్ చౌకగా ముడిచమురు కొనుగోలు చేస్తుండడం పట్ల చాలా రోజులుగా అసహనంతో ఉన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. రష్యా నుంచి చమురు కొనడం ఆపేస్తామంటూ తన మిత్రుడు, భారత ప్రధాని నరేంద్ర మోదీ తనకు హామీ ఇచ్చారని స్పష్టంచేశారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధాన్ని నిలిపివేసే విషయంలో ఇదొక కీలకమైన ముందడుగు అవుతుందని అన్నారు. చమురు కొనడం ఆపేస్తే రష్యాపై ఒత్తిడి పెరుగుతుందని, తద్వారా ఉక్రెయిన్‌పై దండయాత్ర ఆగిపోతుందని ఉద్ఘాటించారు. వైట్‌హౌస్‌లోని ఓవల్ ఆఫీసులో బుధవారం ట్రంప్ మీడియాతో మాట్లాడారు. రష్యా నుంచి భారత్ ముడిచమురు కొనుగోలు చేస్తుండడం తమకు ఎంతమాత్రం సంతోషం కలిగించడం లేదని తేల్చిచెప్పారు. ఇలాంటి కొనుగోళ్ల వల్ల రష్యాకు ఆర్థికంగా మేలు జరుగుతోందని, అంతిమంగా ఆ సొమ్మంతా ఉక్రెయిన్‌పై యుద్ధానికే ఖర్చవుతోందని తెలిపారు. ఎవరైనా సరే రష్యాకు ఆర్థికంగా సాయం అందించడం మానుకోవడం మంచిదని హితవు పలికారు. ఉక్రెయిన్‌పై రష్యా సాగిస్తున్న మతిలేని యుద్ధంలో లక్షల మంది బలైపోయారని ట్రంప్ ఆవేదన వ్యక్తంచేశారు. అందుకే రష్యా నుంచి చమురు కొనడం నిలిపివేస్తామంటూ ఈరోజు తన మిత్రుడు మోదీ మాట ఇచ్చారని పేర్కొన్నారు. ఇక చైనా సైతం అదే దారిలో నడుస్తుందని తాము ఆశిస్తున్నట్లు తెలియజేశారు. చైనా ప్రభుత్వం రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకోవడం ఆపేస్తే మంచిదని సూచించారు.

త్వరలోనే ఆ ప్రక్రియ పూర్తవుతుంది

ప్రధాని మోదీ గొప్ప వ్యక్తి, గొప్ప నాయకుడు అంటూ ట్రంప్ ప్రశంసించారు. తానంటే మోదీకి ఎంతో ప్రేమ అని వ్యాఖ్యానించారు. ఇక్కడ ప్రేమ అనే పదాన్ని మరోలా అర్థం చేసుకోవద్దని మీడియా ప్రతినిధులను కోరారు. మోదీ రాజకీయ జీవితానికి ఇబ్బందులు సృష్టించాలన్న ఉద్దేశం తనకు లేదన్నారు. మోదీతో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని చెప్పారు. ''భారత్‌ను చాలా ఏళ్లుగా గమనిస్తున్నా. అదొక నమ్మశక్యంకాని దేశం. ప్రతి సంవత్సరం ఒక కొత్త నాయకుడు అధికారంలోకి వస్తుంటారు. కొందరైతే కొన్ని నెలలపాటే ఉండొచ్చు కూడా. కానీ, నా స్నేహితుడు మోదీ చాలాఏళ్లుగా వరుసగా అధికారంలో కొనసాగుతున్నారు. రష్యా నుంచి చమురు కొనడం ఆపేస్తామంటూ ఆయన నాకు మాట ఇచ్చారు. నిజంగా నాకు తెలియదు గానీ అదొక బ్రేకింగ్ స్టోరీ కావొచ్చు! మోదీ వెంటనే ఆ పని చేయకపోవచ్చు. నా అంచనా ప్రకారం కొంత సమయం పట్టొచ్చు. కానీ, త్వరలోనే ఆ ప్రక్రియ పూర్తవుతుంది. ఉక్రెయిన్‌పై యుద్ధం ముగిసిన తర్వాత రష్యాతో వాణిజ్య సంబంధాలను భారత్ పునరుద్ధరించుకోవచ్చు'' అని ట్రంప్ పేర్కొన్నారు.

పాక్‌ను అనబోయి..

భారత్‌లో ఏడాదికొక పాలకుడు అధికారంలోకి వస్తాడంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. పాకిస్తాన్ పరిస్థితిని ట్రంప్ పొరపాటున భారత్‌కు అన్వయించి మాట్లాడినట్లు సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. ట్రంప్ మానసిక ఆరోగ్యంపై అనుమానాలు తలెత్తుతున్నాయని జనం పోస్టులు చేస్తున్నారు. నిజానికి భారత్‌లో ఏడాదికొక ప్రధానమంత్రి మారిపోయిన సందర్భాలు లేవు. పాకిస్తాన్‌లోనే అలాంటి పరిస్థితి ఉన్న సంగతి తెలిసిందే.

అంతా అబద్ధం
'మోదీ, ట్రంప్ ఫోన్ సంభాషణ జరగలేదు'

రష్యా చమురు విషయంలో ప్రధాని మోదీ హామీ ఇచ్చారంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనను భారత విదేశాంగ శాఖ గురువారం ఖండించింది. బుధవారం మోదీ, ట్రంప్ మధ్య ఫోన్‌లో ఎలాంటి సంభాషణ జరగలేదని తేల్చిచెప్పింది. ట్రంప్ చెప్పిందంతా అబద్ధమని పరోక్షంగా స్పష్టంచేసింది. దేశ అవసరాలు, ప్రయోజనాల కోణంలోనే రష్యా నుంచి ముడిచమురు కొంటున్నామని, ఇందులో మరో మాటకు తావులేదని ఒక ప్రకటనలో వెల్లడించింది. తమ ఇంధన విధాన నిర్ణయాలకు స్థిరమైన ధరలు, నిరంతరాయమైన సరఫరానే పతిప్రాదిక అని పేర్కొంది. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఇంధన దిగుమతుల్లో మార్పులుచేర్పులు చేసుకుంటున్నామని ఉద్ఘాటించింది. ఇంధన వనరుల్లో వైవిధ్యం కొనసాగిస్తున్నామని విదేశాంగ శాఖ వివరించింది.

ట్రంప్‌ను చూస్తే మోదీకి భయం: రాహుల్

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను చూసి ప్రధాని మోదీ భయపడుతున్నారని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. కీలకమైన ప్రభుత్వ నిర్ణయాలను మోదీ అమెరికాకు ఔట్‌సోర్సింగ్‌కు ఇచ్చినట్లు కనిపిస్తోందని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. మోదీ ప్రభుత్వ పాలనలో విదేశాంగ విధానం పూర్తిగా కుప్పకూలిందని మండిపడ్డారు. రష్యా నుంచి చమురు కొనడం ఆపేస్తామంటూ మిత్రుడు మోదీ మాట ఇచ్చారని ట్రంప్ ప్రకటించడంపై రాహుల్ గురువారం తీవ్రంగా స్పందించారు. రష్యా చమురు విషయంలో భారత ప్రభుత్వం తరఫున నిర్ణయాలు తీసుకొని, ప్రకటనలు చేసే అధికారాన్ని ట్రంప్‌కు మోదీ కట్టబెట్టారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ట్రంప్ వల్ల తరచుగా ఎదురుదెబ్బలు తగులుతున్నప్పటికీ అభినందన సందేశాలు పంపిస్తున్నారని ప్రధానమంత్రిపై ధ్వజమెత్తారు. ఈ మేరకు రాహుల్ 'ఎక్స్'లో పోస్టుచేశారు. మోదీకి పలు ప్రశ్నలు సంధించారు. భారత ఆర్థిక శాఖ మంత్రి అమెరికా పర్యటనను ఎందుకు రద్దు చేశారో చెప్పాలన్నారు. హమాస్-ఇజ్రాయెల్ యుద్ధాన్ని ముగించే విషయంలో ఈజిప్టులోని షెర్మ్ ఎల్-షేక్‌లో జరిగిన భేటీకి ప్రధాని మోదీ ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. అమెరికా ఒత్తిడి కారణంగానే ఆపరేషన్ సిందూర్ ఆగిపోయిందంటూ డొనాల్డ్ ట్రంప్ పదేపదే చెబుతున్నా ప్రధాని మోదీ ఎందుకు ఖండించడం లేదని రాహుల్ గాంధీ నిలదీశారు.

ఇక ఉక్రెయిన్-రష్యాపైనే దృష్టి: ట్రంప్

వాషింగ్టన్: ఇజ్రాయెల్-హమాస్ యుద్ధానికి తెరదించానని, బందీల విడుదల కోసం ఒప్పందం కుదిర్చానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. ఇక తన మొత్తం దృష్టిని ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని ముగించడంపైనే కేంద్రీకరించినట్లు తెలిపారు. రష్యాను చర్చల వేదికపైకి రప్పించడానికి ఉక్రెయిన్‌కు లాంగ్-రేంజ్ ఆయుధాలు అందజేసే అంశాన్ని పరిశీలిస్తానని అన్నారు. రష్యా దాడులను తిప్పికొట్టడానికి దీర్ఘశ్రేణి క్షిపణులు ఇవ్వాలని ఉక్రెయిన్ సైన్యం ఎప్పటినుంచో అమెరికాను కోరుతోంది. ట్రంప్ బుధవారం శ్వేతసౌధంలో మీడియాతో మాట్లాడారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధానికి ముగింపు పలుకుతానన్న విశ్వాసం ఉందన్నారు. శాంతి చర్చల కోసం ముందుకు రావాలని రష్యా అధినేత పుతిన్‌కు సూచించారు. లేకపోతే మరింత ఒత్తిడి పెంచక తప్పదని తేల్చిచెప్పారు. మాట వినకపోతే మరిన్ని కఠిన ఆంక్షలకు సిద్ధంగా ఉండాలని పరోక్షంగా హెచ్చరించారు. తాను అధికారంలోకి వస్తే ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని తక్షణమే ఆపేస్తానని గత ఏడాది ఎన్నికల ప్రచారంలో ట్రంప్ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే, అధికారంలోకి వచ్చి దాదాపు 10 నెలలవుతున్నా ఆయన తన హామీని నిలబెట్టుకోలేకపోయారు. ఉక్రెయిన్, రష్యా అధినేతలతో పలుమార్లు చర్చలు జరిగినప్పటికీ యుద్ధం మాత్రం ఆగడం లేదు.

కులగణనకు రెడీ

- వచ్చేనెల 10 నుంచి ప్రి-టెస్టు ఎక్సర్‌సైజ్
- ఇళ్ల వివరాలు సేకరించనున్న అధికారులు

న్యూఢిల్లీ: దేశంలో జన గణనకు రంగం సిద్ధమవుతోంది. 2027లో జనాభా లెక్కల సేకరణ పూర్తి చేయబోతున్నారు. జన గణనలో మొదటి దశకు సంబంధించిన ప్రి-టెస్టు ఎక్సర్‌సైజ్‌ను ఈ ఏడాది నవంబర్ 10 నుంచి 30వ తేదీ వరకు చేపట్టనున్నట్లు అధికార వర్గాలు తెలియజేశాయి. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎంపిక చేసిన చోట్ల ఈ ప్రక్రియ ప్రారంభించనున్నట్లు వెల్లడించాయి. ఈ మేరకు ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. నవంబర్ 1 నుంచి 7వ తేదీ దాకా సెల్ఫ్-ఎన్యూమరేషన్‌కు కూడా అవకాశం కల్పిస్తున్నట్లు రిజిస్ట్రార్ జనరల్, సెన్సెస్ కమిషనర్ ఆఫ్ ఇండియా మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ చెప్పారు. 2026 ఏప్రిల్ 1 నుంచి 2027 ఫిబ్రవరి 28 దాకా దేశవ్యాప్తంగా జన గణనను చేపట్టబోతున్నారు. ఇది రెండు దశల్లో ఉంటుంది. మొదటి దశలో హౌస్‌లిస్టింగ్ ఆపరేషన్, హౌసింగ్ షెడ్యూల్(హెచ్‌ఎల్‌ఓ) ప్రక్రియ, రెండో దశలో జన గణన చేపడతారు. మొదటి దశకు సంబంధించి ప్రి-టెస్టు ఎక్సర్‌సైజ్‌లో భాగంగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఇళ్ల సంఖ్యను ప్రయోగాత్మకంగా లెక్కిస్తారు. ఆయా ఇళ్ల స్థితిగతులు, వసతుల వివరాలు సేకరిస్తారు. ఈసారి జన గణనతోపాటు కుల గణన కూడా చేపట్టబోతున్నారు. ఇది పూర్తిగా డిజిటల్ సెన్సెస్ కావడం విశేషం. ప్రతి పౌరుడి కులం, సామాజిక-ఆర్థిక పరిస్థితుల వివరాలను నమోదు చేస్తారు. జన గణన, కుల గణన అనేది మహాయజ్ఞమే. 34 లక్షల మంది ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లతోపాటు 1.3 లక్షల మంది సిబ్బందిని నియమిస్తున్నారు. దేశంలో జన గణన ప్రక్రియ మొదలైన తర్వాత ఇది 16వ జన గణన, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎనిమిదో జన గణన.

ఆర్‌ఎస్‌ఎస్‌పై ఆంక్షలు

కర్ణాటక కేబినెట్ సంచలన నిర్ణయం

- బహిరంగ ప్రదేశాలు, ప్రభుత్వ విద్యాలయాలు, సంస్థల ప్రాంగణాల్లో కార్యకలాపాలపై కఠిన సమీక్షలు
- రహదారులపై కవాతులు, కార్యక్రమాలు నిర్వహించాలంటే ముందస్తు అనుమతి తప్పనిసరి


బెంగళూరు: కర్ణాటకలో కాంగ్రెస్ సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్)పై పరోక్షంగా ఆంక్షలు విధిస్తూ రాష్ట్ర కేబినెట్ గురువారం సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం గురువారం ఒక సర్క్యులర్‌ను జారీచేసింది. ఆర్‌ఎస్‌ఎస్ వంటి ప్రైవేట్ సంస్థల కార్యకలాపాలపై కేబినెట్ నిర్ణయాలను రాష్ట్ర సమాచార, సాంకేతికత శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే మీడియాకు వెల్లడించారు. ''మేం ఎలాంటి సంస్థ(ఆర్‌ఎస్‌ఎస్) కార్యకలాపాలను నియంత్రించబోము. కానీ ఏ సంస్థ అయినా రహదారులు, ప్రభుత్వ ఖాళీ స్థలాల వంటి బహిరంగ ప్రదేశాల్లో కవాతులు, కార్యక్రమాలు చేపట్టాలంటే ముందస్తుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాల్సిందే. ఆయా అభ్యర్థనల తర్వాత ఈ కార్యక్రమాలకు అనుమతి మంజూరు చేయాలా వద్దా అనేది ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. ఇకపై స్థానిక పాలనా యంత్రాంగానికి ఊరకే ముందస్తు సమాచారం ఇచ్చేసి రహదారులపై కర్రలు ఊపుతూ కవాతులు, మార్చ్‌లు, పథ సంచలన వంటి కార్యక్రమాలు చేస్తామంటే కుదరదు. బహిరంగ ప్రాంతాలు, ప్రభుత్వ పాఠశాలలు, ఎయిడెడ్ స్కూళ్లు, కళాశాలలు, ప్రభుత్వ స్థలాలు, ప్రభుత్వరంగ సంస్థలు, అనుబంధ సంస్థల ప్రాంగణాల్లో కొత్త నియమ నిబంధనలు అమలు చేయబోతున్నాం'' అని ప్రియాంక్ చెప్పారు.

పాత నిబంధనలే కొత్తగా..

''వాస్తవానికి గతంలో హోం శాఖ, న్యాయ విభాగం, విద్యా శాఖ జారీచేసిన ఉత్తర్వులనే గుదిగుచ్చి ఏకీకృత నిబంధనావళిగా మారుస్తున్నాం. వచ్చే రెండు, మూడ్రోజుల్లో ఈ కొత్త నియమావళి అమల్లోకి రానుంది. ఇది రాజ్యాంగంలోని చట్టాల మేరకే అమలవుతుంది'' అని మంత్రి ప్రియాంగ్ స్పష్టం చేశారు. కర్ణాటక వ్యాప్తంగా ఆరెస్సెస్ కార్యకలాపాలను నిషేధించాలని కోరుతూ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు మంత్రి ప్రియాంక్ లేఖ రాసిన రెండు వారాలకే కొత్త ఆంక్షలు అమల్లోకి వస్తుండటం గమనార్హం. '' బహిరంగ ప్రదేశాల్లో అనుమతి లేకుండా కొన్ని ప్రైవేట్ సంస్థలు కార్యకలాపాలు కొనసాగిస్తున్న అంశం కేబినెట్ భేటీలో చర్చకొచ్చింది. విద్యాసంస్థలు సహా ప్రభుత్వ స్థలాల వినియోగంపై నియంత్రణ కోసం హోంశాఖ ఉత్తర్వులు జారీచేయనుంది. ప్రభుత్వ సంస్థల ప్రాంగణాల సద్వినియోగం, దుర్వినియోగంపై సంబంధిత విభాగాలకు ఆదేశాలు వెళ్లనున్నాయి'' అని కర్ణాటక న్యాయ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి హెచ్‌కే పాటిల్ చెప్పారు.

పరారీ నేరస్థుల కోసం రాష్ట్రానికో ప్రత్యేక సెల్

- అది అంతర్జాతీయ ప్రమాణాలకు తగ్గట్లు ఉండాలి
- అప్పుడే నేరస్థులు మానవ హక్కుల ఉల్లంఘన మాట ఎత్తరు
- రెడ్ నోటీస్ అందుకున్న వాళ్ల పాస్‌పోర్ట్‌లను రద్దుచేయండి
- రాష్ట్రాలకు సూచించిన అమిత్ షా


అమిత్ షా

న్యూఢిల్లీ: బ్యాంక్‌ల నుంచి వేల కోట్ల రూపాయల రుణాలను ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన బడా పారిశ్రామికవేత్తలు సహా ఉగ్రవాదం, డ్రగ్స్, మనీలాండరింగ్‌కు పాల్పడిన వారిని భారత్‌కు రప్పించేందుకు అనువైన వాతావరణాన్ని సృష్టించాల్సిన అవసరం ఏర్పడిందని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. గురువారం ఢిల్లీలో కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) ''పారిపోయిన నేరస్థులను రప్పించడం: సవాళ్లు, వ్యూహాలు''అని అంశంపై ఏర్పాటుచేసిన సమావేశాన్ని అమిత్‌షా ప్రారంభించి ప్రారంభోపన్యాసంచేశారు. ఈ సందర్భంగా రాష్ట్రాలనుద్దేశించి మాట్లాడారు. ''వేల కోట్ల రుణాలు ఎగ్గొట్టిన ఆర్థిక నేరగాళ్లు మొదలు ఉగ్రవాదం, మనీలాండరింగ్, మాదకద్రవ్యాల నేరాలకు పాల్పడిన వాళ్లు భారతీయ కఠిన న్యాయవ్యవస్థకు భయపడి విదేశాలకు పారిపోయారు. వీళ్ల భారత ఆర్థికాభివృద్ధి, సార్వభౌమత్వానికి ప్రతిబంధకాలుగా తయారయ్యారు. భారతీయ చట్టం ముందు వీళ్లను నిలబెట్టేందుకు మనం నిర్దయగా నిర్ణయాలు తీసుకోవాలి. సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వంటి భారతీయ దర్యాప్తు సంస్థల అభ్యర్థనలతో విదేశాల్లో వీళ్లను అక్కడి దర్యాప్తు అధికారులు ఎలాగోలా అరెస్ట్‌చేసినా భారత్‌కు రప్పించడంలో సమస్యలు ఎదురవుతున్నాయి. భారత్‌కు అప్పగిస్తే అధ్వానంగా నెట్టుకొస్తున్న, చీకటి కొట్టాల్లాంటి జైలు గదుల్లోపడేస్తారని, తమ జీవన, మానవ హక్కులకు భంగం వాటిల్లుతుందని నేరస్తులు అక్కడి న్యాయస్థానాల్లో వాదిస్తున్నారు. ఇలాంటి వాదన చేసే అవకాశం మనం వాళ్లకు ఎందుకివ్వాలి? ఇకపై ఇలాంటి ఆరోపణలకు చరమగీతం పాడుదాం. దేశంలోని ప్రతి రాష్ట్రంలో ఇలాంటి నేరస్థుల కోసం ప్రత్యేక జైలు సెల్‌ను నిర్మించండి. ధారాళంగా గాలి, వెలుతురు ఉండేలా అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా కొత్త జైళ్లను కట్టాలి. దాంతో భారతీయ కారాగారాలు దుర్భర స్థితిలో ఉంటాయనే వాదన అక్కడి న్యాయస్థానాల్లో తుడిచిపెట్టుకుపోతుంది. ప్రతి రాష్ట్ర రాజధాని నగరంలో ఇలాంటి అంతర్జాతీయ ప్రమాణాలతో జైలు ఉండాల్సిందే'' అని అమిత్‌షా అన్నారు. మద్యం వ్యాపారి విజయ్ మాల్యా, వజ్రాల వ్యాపారులు నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ సహా ఆర్థిక నేరాలు, ఉగ్రవాదం, డ్రగ్స్, మనీలాండరింగ్ నేరాలకు సంబంధించి భారత్ ఇప్పటికే 338 మంది నేరస్థులను వెనక్కి రప్పించేందుకు శతథా ప్రయత్నిస్తున్న విషయం తెల్సిందే. ''కొత్త సాంకేతికతతో నేరస్థుల ఆట కట్టించవచ్చు. భారత్ నుంచి పారిపోయిన నేరస్థులపై అంతర్జాతీయంగా ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీస్ జారీ అయిన వెంటనే వాళ్ల పాస్‌పోర్ట్‌ను రద్దుచేయాలి. అప్పుడు ఆయా నేరస్తుల అంతర్జాతీయ ప్రయాణాలకు అడ్డుకట్ట పడుతుంది'' అని రాష్ట్రాల పోలీస్ బాస్‌లకు అమిత్ సూచించారు. సదస్సులో సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్, హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, ఇంటెలిజెన్స్‌బ్యూరో డైరెక్టర్ తపన్ కుమార్ డేకా తదితరులు సదస్సులో పాల్గొన్నారు.

గుజరాత్ మంత్రివర్గం రాజీనామా

నేడు కేబినెట్‌ను విస్తరించనున్న సీఎం భూపేంద్ర పటేల్

గాంధీనగర్: గుజరాత్‌లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. సీఎం భూపేంద్ర పటేల్ మినహా ఆయన మంత్రివర్గంలోని మొత్తం 16 మంది మంత్రులూ రాజీనామా చేశారు. సీఎం పటేల్ శుక్రవారం తన మంత్రివర్గాన్ని విస్తరించనుండగా ఈ పరిణామం చోటుచేసుకుంది. రాజకీయ, సంస్థాగతపరమైన సమీకరణాలను దృష్టిలో ఉంచుకునే మంత్రివర్గాన్ని పూర్తి స్థాయిలో పునర్వ్యవస్థీకరించేందుకు బీజేపీ అధిష్టానం రాజీనామాలు చేయించిందని సమాచారం. రానున్న మున్సిపల్ ఎన్నికలు, 2027లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు పార్టీని సమాయత్తం చేయడమే దీని ఉద్దేశమంటున్నారు. పటేల్ కేబినెట్‌లోని మంత్రులంతా గురువారం ఉదయం రాజీనామా పత్రాలను పార్టీ విభాగానికి అందజేసినట్లు బీజేపీ వర్గాలు తెలిపాయి. ప్రస్తుత మంత్రివర్గంలో సీఎం పటేల్ ఒక్కరే యథావిధిగా కొనసాగుతారు.

యువరక్తానికి ప్రాధాన్యం

గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి నివాసంలో సీఎం భూపేంద్ర పటేల్, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి(సంస్థాగత) సునీల్ బన్సల్‌లు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు రాజీనామాలు సమర్పించిన మంత్రులను విడివిడిగా కలుసుకుని, వారి అభిప్రాయం తెలుసుకున్నారు. అధిష్టానం నిర్ణయాన్ని వారికి తెలిపి, రాజీనామా పత్రాలను వారి నుంచి సేకరించారు. ఇప్పటికే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విశ్వకర్మ మంత్రులందరినీ కల్సుకుని అధిష్టానం మనసులో మాట చెప్పినట్లు సమాచారం. రాత్రి 8 గంటలకు సీఎం నివాసంలో జేపీ నడ్డా సమక్షంలో జరిగే సమావేశంలో మంత్రుల పేర్లను ఖరారు చేశారు. అనంతరం సీఎం పటేల్ గవర్నర్ ఆచార్య దేవ్‌వ్రత్‌ను కలుసుకుని మంత్రుల రాజీనామా లేఖలను ఆయనకు అందజేశారు. అదే విధంగా, నూతన మంత్రివర్గం ఏర్పాటుకు అనుమతి కోరారు. ప్రస్తుతం కేబినెట్‌లోని కనీసం ఏడు నుంచి పది మంది వరకు కొనసాగే అవకాశముంది. మిగతా పోస్టుల్లోకి కొత్తవారిని తీసుకుంటారని భావిస్తున్నారు. అందుకే, తిరిగి తీసుకునే వారి రాజీనామా పత్రాలను సీఎం పటేల్ గవర్నర్‌కు ఇవ్వరని చెబుతున్నారు.

అమిత్ షా, జేపీ నడ్డాల సమక్షంలో..

నూతన మంత్రి వర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం శుక్రవారం ఉదయం 11.30 గంటలకు గాంధీనగర్‌లోని మహాత్మాగాంధీ మందిర్‌లో ఉంటుందని బీజేపీ వర్గాలు తెలిపాయి. కార్యక్రమానికి అధిష్టానం నుంచి హోం మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా హాజరవనున్నారు. ప్రస్తుత మంత్రివర్గంలో సీఎం పటేల్ సహా 17 మంది ఉన్నారు. వీరిలో 8 మందిది కేబినెట్ ర్యాంకు కాగా, ఇతరులు సహాయమంత్రులు. నిబంధనల ప్రకారం రాష్ట్ర అసెంబ్లీలో 182 సీట్లకు గాను 15 శాతం మంది లేదా గరిష్టంగా 27 మంది వరకు మంత్రులుండొచ్చు.

బిహార్‌లో ఓటర్ల సవరణ సర్వేలో తప్పుల్లేవు

న్యూఢిల్లీ: బిహార్‌లో నెలలతరబడి కొనసాగిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్వేలో ఎలాంటి తప్పులు దొర్లలేదని సర్వోన్నత న్యాయస్థానానికి కేంద్ర ఎన్నికల సంఘం వివరించింది. ఈ సర్వే విశ్వసనీయతను దెబ్బతీసేందుకే కొన్ని రాజకీయ పార్టీలు, ఎన్జీవోలు సుప్రీంకోర్టులో పిటిషన్లు వేశాయని ఈసీ పేర్కొంది. తుది ఓటర్ల జాబితా ప్రచురించాక తమ పేరు తొలగించాలని కనీసం ఒక్క ఓటరు కూడా ఫిర్యాదు రాలేదని ఈసీ గుర్తుచేసింది. ముస్లింల ఓట్లను అసహజరీతిలో తొలగించారన్న ఆరోపణల్లో నిజం లేదు. ఇలా మతపర ఆరోపణలకు అడ్డుకట్ట పడాలి'' అని ఈసీ వ్యాఖ్యానించింది. అయితే తుది జాబితా లోనూ ఓటర్ల పేర్లలో తప్పులు దొర్లడంపై ఈసీ అసంతృప్తి వ్యక్తంచేసింది. ''టైపింగ్ తప్పులు ఉండకుండా చూసుకుంటే బాగుండేది. ఇలాంటి వాటికి తగు స్వల్ప పరిష్కారాలు చూపిస్తే మంచిది''అని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీల ధర్మాసనం అభిప్రాయపడింది.

నూటొక్క స్థానాల్లో సమరానికి సిద్ధం

101 స్థానాలకూ అభ్యర్థుల్ని ప్రకటించిన జేడీయూ

పట్నా: బిహార్‌లో అధికార ఎన్డీఏ కూటమిలో కీలక భాగస్వామ్య పార్టీ జనతాదళ్(యునైటెడ్) తాము పోటీచేయబోయే మొత్తం 101 స్థానాల్లోనూ అభ్యర్థులను ప్రకటించింది. ఇప్పటికే 57 మందితో తొలిజాబితా విడుదలచేయగా గురువారం మిగతా 44 మంది అభ్యర్థులతో చివరి జాబితాను వెల్లడించింది. చాలా మంది అభ్యర్థులు వెనువెంటనే తమ నామినేషన్లు దాఖలుచేస్తూ బిజీగా కనిపించారు. మొత్తం 101లో ఓబీసీలకు 37, ఈబీసీలకు 22, అగ్రవర్ణాలకు 22 చోట్ల అవకాశం కల్పించింది. జేడీయూ చీఫ్ నితీశ్ కుమార్ తన రాష్ట్ర కేబినెట్ మంత్రుల్లో చాలా మందికి మళ్లీ టికెట్ ఇచ్చారు. విజయ్ చౌదరి, బిజేంద్ర ప్రసాద్ యాదవ్, జామా ఖాన్, షీలా మండల్, లేశీ సింగ్, సుమిత్ సింగ్, విభా దేవి, చేతన్ ఆనంద్, శ్వేతా గుప్తా ఈసారి బరిలో దిగనున్నారు.

కుల గణనలో పాల్గొనబోం

ప్రకటించిన నారాయణ మూర్తి దంపతులు

బెంగళూరు: కర్ణాటక ప్రభుత్వం చేపట్టిన సామాజిక, విద్యా సర్వే, కులగణనలో పాల్గొనబోమని ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణ మూర్తి, ఆయన భార్య సుధామూర్తి ప్రకటించారు. తాము వెనుకబడిన కులాలకు చెందిన వారం కాదన్నారు. ఇటీవల తమ నివాసానికి వచ్చిన ఎన్యుమరేటర్లతో వారు..'మా ఇంట్లో సర్వే చేపట్టవద్దు'అని తెలిపినట్లు సమాచారం. అదేవిధంగా, ఎన్యుమరేటర్లకిచ్చిన ప్రొ ఫార్మాలో సుధా మూర్తి..'మేం వెనుకబడిన కులాలకు చెందిన వారము కాదు. అందుకే, ఆ గ్రూపుల కోసం ప్రభుత్వం చేపట్టిన సర్వేలో మేం పాల్గొనడం లేదు'అని పేర్కొన్నారు. దీనిపై మంత్రి తంగడాడి స్పందిస్తూ.. వెనుకబడిన కులాల సంక్షేమంపై వారికి ఎంత శ్రద్ధ ఉందో దీన్ని బట్టి తెలుస్తోందని విమర్శించారు. ఈ పరిణామంపై సుధామూర్తి దంపతులు, ఇన్ఫోసిస్ అధికారులు స్పందించలేదు.

భావ ప్రకటనా స్వేచ్ఛకు మేం వ్యతిరేకం కాదు

- స్వేచ్ఛ అనేది ఇతరుల గౌరవాన్ని దెబ్బతీసేలా ఉండొద్దు
- సోషల్ మీడియాకు నియంత్రణ లేకపోవడం ప్రమాదకరం
- సుప్రీంకోర్టు ధర్మాసనం ఆందోళన
- లాయర్ రాకేశ్ కిశోర్‌పై అత్యవసరంగా విచారణ చేపట్టలేమని వెల్లడి



న్యూఢిల్లీ: భావ ప్రకటనా స్వేచ్ఛ, మాట్లాడే హక్కు అనేవి ఇతరుల గౌరవాన్ని దెబ్బతీసేలా, నిజాయితీని శంకించేలా ఉండకూడదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. సోషల్ మీడియాకు నియంత్రణ లేకపోవడం ప్రమాదకరంగా మారుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్‌పై లాయర్ రాకేశ్ కిశోర్ బూటు విసిరేందుకు ప్రయత్నించిన ఘటనపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని న్యాయస్థానం తప్పుపట్టింది. డబ్బుల కోసం సోషల్ మీడియాలో దిగజారి పోస్టులు పెడుతున్నారని మండిపడింది. సీజేఐపై ఈ నెల 6న బూటు విసిరేందుకు ప్రయత్నించిన లాయర్ రాకేశ్ కిశోర్(71)పై కఠిన చర్యలు చేపట్టాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, సీనియర్ అడ్వొకేట్ వికాస్ సింగ్ సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేశారు. దీనిపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ ధర్మాసనం గురువారం స్పందించింది. భావ ప్రకటన స్వేచ్ఛకు తాము వ్యతిరేకం కాదని పేర్కొంది. కానీ, అది ఇతరులను అగౌరవపర్చేలా ఉండకూడదని స్పష్టంచేసింది. రాకేశ్ కిశోర్ ఏమాత్రం పశ్చాత్తాపం చెందడం లేదని, పైగా మీడియాకు ఇంటర్వ్యూలు ఇస్తున్నాడని, అవి సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయని వికాస్ సింగ్ చెప్పారు. సుప్రీంకోర్టు సమగ్రతను దెబ్బతీసేలా ప్రచారం సాగుతోందని అన్నారు. రాకేశ్ కిశోర్ ఇంటర్వ్యూలను ప్రసారం చేయకుండా సోషల్ మీడియాను కట్టడి చేయాలని కోరారు. ధర్మాసనం స్పందిస్తూ... రాకేశ్ కిశోర్‌పై అత్యవసరంగా విచారణ చేపట్టలేమని పేర్కొంది. అలా చేస్తే సోషల్ మీడియాకు మరింత మేత అందించినట్లు అవుతుందని స్పష్టంచేశారు. దీపావళి తర్వాత విచారిస్తామని వెల్లడించింది. సహజ మరణంలాగే ఈ కేసు దానంతట అదే ముగిసిపోతుందని ధర్మాసనం వివరించింది.

రాకేశ్ కిశోర్‌పై చర్యలకు అటార్నీ జనరల్ అంగీకారం

లాయర్ రాకేశ్ కిశోర్‌పై క్రిమినల్ నేరం కింద చర్యలు చేపట్టేందుకు అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి గురువారం అంగీకారం తెలియజేశారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్(ఎస్‌సీబీఏ) విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. సదరు లాయర్‌పై కంటెంప్ట్ ఆఫ్ కోర్ట్స్ చట్టం-1971లోని సెక్షన్ 2(సీ) ప్రకారం చర్యలు తీసుకోవచ్చని పేర్కొన్నారు. సీజేఐ జస్టిస్ గవాయ్ పట్ల రాకేశ్ కిశోర్ ప్రవర్తించిన తీరు అత్యంత గర్హనీయమని ఆర్.వెంకటరమణి స్పష్టం చేశారు.

బిహార్‌లో 48 మందితో కాంగ్రెస్ మొదటి జాబితా

న్యూఢిల్లీ: త్వరలో జరిగే బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు గాను కాంగ్రెస్ శుక్రవారం 48 మంది అభ్యర్థులతో కూడిన మొదటి జాబితాను విడుదల చేసింది. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేశ్ రామ్ కుటుంబా స్థానం నుంచి కాంగ్రెస్ శాసనసభా పక్షం నేత షకీల్ అహ్మద్ ఖాన్‌కు కద్వా నుంచి బరిలోకి దిగనున్నారు. రాష్ట్ర యూత్ కాంగ్రెస్ చీఫ్ ప్రకాశ్ గరీబ్ దాస్‌కు బెచ్వాడా సీటును కేటాయించారు. బగాహాలో జయేశ్ మంగళ్ సింగ్, నౌతన్‌లో అమిత్ గిరి, చన్‌పటియాలో అభిషేక్ రంజన్, బెట్టియాలో వాసి అహ్మద్, రక్సౌల్‌లో శ్యామ్ బిహారీ ప్రసాద్ పోటీ చేయనున్నారు. గోవింద్‌గంజ్ స్థానం నుంచి శశి భూషణ్ రాయ్ అలియాస్ గప్పు రాయ్, రిగా నుంచి అమిత్ కుమార్ సింగ్ పోటీకి దిగనున్నారు. కాగా, ఆర్జేడీ సహా మహాఘట్‌బంధన్ పక్షాల మధ్య సీట్ల పంపకాలు ఓ కొలిక్కి రాకముందే కాంగ్రెస్ ఈ జాబితాను ప్రకటించడం గమనార్హం. ప్రస్తుతం ఈ కూటమి పక్షాల మధ్య సీట్ల పంపిణీకి సంబంధించిన చర్చలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో మొదటి దశ పోలింగ్‌కు గాను నామినేషన్ల దాఖలుకు ఈ నెల 17వ తేదీ ఆఖరు. రెండో దశ పోలింగ్‌కు నామినేషన్లను అందజేసేందుకు ఈ నెల 20వ తేదీతో గడువు ముగియనుంది.

జపాన్‌లో భారత రాయబారిగా నగ్మా మహ్మద్ మాలిక్

న్యూఢిల్లీ: సీనియర్ దౌత్యాధికారి నగ్మా మహ్మద్ మాలిక్ గురువారం జపాన్‌లో భారత రాయబారిగా నియమితులయ్యారు. 1991 బ్యాచ్ ఇండియన్ ఫారిన్ సర్వీస్ అధికారి అయిన నగ్మా ప్రస్తుతం పోలండ్‌లో భారత దౌత్యాధికారిగా ఉన్నారు. త్వరలోనే ఈమె కొత్త బాధ్యతల్లో చేరుతారని విదేశాంగ శాఖ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం జపాన్‌లో భారత రాయబారిగా ఉన్న సిబి జార్జి ఢిల్లీలోని విదేశాంగ శాఖ ప్రధాన కార్యాలయంలో కార్యదర్శి(పశ్చిమ)గా ఇటీవల నియమితులయ్యారు. ఈమె స్థానంలో నగ్మా మహ్మద్ మాలిక్‌ను నియమించినట్లు విదేశాంగ శాఖ తెలిపింది.



AI టాయిలెట్!

తక్షణమే మలమూత్రాల పరీక్షలు

సెన్సార్లు, ఏఐ ఉన్న మొబైల్ యాప్

అప్పటికప్పుడు 'గట్ హెల్త్' రిపోర్ట్ సిద్ధం

సాక్షి, సాగుబడి: కృత్రిమ మేధ.. ఇప్పుడు టాయిలెట్‌ని కూడా అత్యాధునిక స్మార్ట్ లేబొరేటరీగా మార్చేసింది! మనకు మున్ముందు రాగల జబ్బుల్ని ముందుగానే పసిగట్టే ఆధారపడదగిన గట్ హెల్త్ డేటాను.. చిటికెలో మొబైల్ యాప్‌లోకే అప్‌లోడ్ చేసేస్తాయట ఈ సూపర్ స్మార్ట్ ఏఐ టాయిలెట్లు!అన్ని రంగాల మాదిరిగానే రోజువారీ వ్యక్తిగత ఆరోగ్య సమాచార సేకరణ వ్యవస్థ కూడా అత్యాధునికతను సంతరించుకుంటోంది. పొద్దున్నే నిద్ర లేవగానే చిటికెలో ఆనాటి తాజా వ్యక్తిగత ఆరోగ్య గణాంకాలను అందించే మొబైల్ యాప్‌లు, డిజిటల్ ఎల్రక్టానిక్ పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. వీటికి సరికొత్త కొనసాగింపుగా వచ్చిందే స్మార్ట్ మరుగుదొడ్డి!

కూర్చుని లేచేలోపే..

మలమూత్ర విసర్జన చేస్తున్నంతటి సేపట్లోనే సెన్సార్లు, కృత్రిమ మేధ విశ్లేషణ పరికరాలు.. మల మూత్రాల రంగు, రూపు, నాణ్యతలను బట్టి ఆరోగ్య స్థితిగతుల్ని ఇట్టే పసిగట్టేస్తాయి. కడుపులో సూక్ష్మజీవరాశి ఎంత ఆరోగ్యంగా ఉందో, ఏదైనా తేడా ఉంటే దాని వల్ల ఏయే వ్యాధులు ముసురుకునే ప్రమాదం పొంచి ఉందో కూడా తేల్చి చెప్పేస్తాయి. కమోడ్ మీద కూర్చొని, లేచే సమయానికే ఈ సమస్త సమాచారం మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేసేస్తాయి ఈ ఏఐ టాయిలెట్లు! ప్రత్యక్ష పరీక్షల మాదిరిగా నూటికి నూరు శాతం కచ్చితత్వంతో ఈ పరీక్షల ఫలితాలు ఉంటాయని అనుకోలేం. కానీ, కొలరెక్టల్ కేన్సర్ వంటి అనేక జబ్బుల్ని అత్యంత తొలి దశలోనే గుర్తించటంలో సూపర్ స్మార్ట్ టాయిలెట్ల పాత్రను తోసిపుచ్చలేమని నిపుణులు చెబుతున్నారు.

జపాన్‌లో తయారీ

స్మార్ట్ టాయిలెట్ల తయారీలో జపాన్‌కు చెందిన టోటో టాయిలెట్స్ సంస్థ ఒక ముందడుగు వేసింది. మరుగుదొడ్డి కమోడ్‌కు అమర్చిన సెన్సార్.. మలం రంగు, ఆకారం, పరిమాణం వంటి వివరాలను అందిస్తుంది. బార్‌కోడ్ స్కానర్ మాదిరిగా క్షణాల్లో రిపోర్టు ఇస్తుంది. మనిషి కూర్చోగానే సెన్సార్ యాక్టివేట్ అవుతుంది. ఎల్ఈడీ లైటు వెలుతురులో మలాన్ని సెన్సార్ పరీక్షిస్తుంది. సేకరించిన సమాచారాన్ని అప్పటికప్పుడే స్మార్ట్‌ఫోన్ యాప్‌కు పంపిస్తుంది. మల విసర్జన చేసిన ప్రతిసారీ సేకరించిన సమాచారంతో కూడిన స్టూల్ కేలండర్‌ను ఈ యాప్ భద్రపరుస్తుంది. ట్రెండ్ ఎలా ఉంది.. ఏమైనా తేడాలున్నాయా.. ఉంటే, వాటిని సరిదిద్దుకోవటానికి జీవన శైలిని ఎలా మార్చుకోవాలో కూడా సూచనలిస్తుంది. సుఖ మల విసర్జనకు అనుసరించాల్సిన పద్ధతులను సూచిస్తుంది కూడా.

ప్రత్యేక స్టార్టప్‌లు

కృత్రిమ మేధతో కూడిన బాత్రూమ్ టెక్నాలజీలను అందించే స్టార్టప్‌లు అందుబాటులోకి వచ్చాయి. అమెరికాలోని ఆస్టిన్ నగరంలోని త్రోన్ అనే స్టార్టప్ మల మూత్రాల బాగోగులను విశ్లేషించేందుకు ఏఐ టాయిలెట్ కెమెరాను రూపొందించింది. టాయిలెట్‌ను ఉపయోగించే వ్యక్తి జీర్ణవ్యవస్థ పనితీరు, మూత్ర విసర్జన తీరు ఎలా ఉంది? ఆ వ్యక్తి సరిపడా నీరు తాగుతు న్నారా లేదా?.. వంటి రియల్ టైమ్ డేటాను కూడా మొబైల్ యాప్‌కు పంపుతుంది. ఎక్కువ మంది వాడే టాయిలెట్లలో కూడా ప్రతి యూజర్ గట్ ప్రొఫైల్‌ను త్రోన్ ఏఐ వ్యవస్థ సిద్ధం చేస్తుంది. టాయిలెట్‌ను వాడుతున్న వ్యక్తి ఎవరో బ్లూటూత్ ద్వారా గుర్తించి కచ్చితమైన వివరాలను ఎవరివి వాళ్లకు అందిస్తుంది. రోజువారీ బాత్రూమ్ అలవాట్ల ఆధారంగా వ్యక్తుల ఆరోగ్య సమాచార వ్యవస్థను సంపన్నం చేసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని వైద్య నిపుణులు అంటున్నారు.

12 మంది గల్ఫ్ కార్మికులు స్వరాష్ట్రానికి..

- జోర్డాన్‌లో చిక్కుకున్న వారికి ఇచ్చిన మాటను నిలుపుకున్న హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: ఏడాది క్రితం ఉపాధి కోసం వెళ్లి జోర్డాన్‌లో చిక్కుకున్న 12 మంది వలస కార్మికులు వారం రోజుల్లో తిరిగి తెలంగాణకు చేరుకోనున్నారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాలతో రంగంలోకి దిగిన మాజీ మంత్రి హరీశ్‌రావు.. ఎంపీ సురేశ్‌రెడ్డి సమ న్వయంతో సంబంధిత కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి, కార్మికులను పంపించేందుకు ఒప్పించారు. పెనాల్టీ చెల్లించి వారిని తీసు కెళ్లవచ్చని కంపెనీ చెప్పింది. దీంతో కార్మికుల ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా చెల్లించాల్సిన మొత్తంతోపాటు, స్వదేశానికి రావడానికి విమాన టికెట్ల ఖర్చు హరీశ్‌రావే భరించి టికెట్ బుకింగ్ ప్రక్రియను సైతం పూర్తి చేయించారు.

మీడియా అకాడమీ కమిటీలో సభ్యుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ మీడియా అకాడమీ పాలక మండలి కమిటీలో సభ్యుల ఎంపిక కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కమిటీలో సభ్యులుగా పనిచేయడానికి అర్హత కలిగిన అభ్యర్థులను జర్నలిస్టు సంఘాలు తమ ప్రతినిధులుగా ప్రతిపాదించాలని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 30 సాయంత్రం వరకు స్వయంగా లేదా అకాడమీ కార్యాలయానికి దరఖాస్తులు పంపాలని సూచించారు. దరఖాస్తులను https://mediaacademy. telangana.gov. in/ నుంచి తీసుకోవాలని తెలిపారు.

బిడ్డల నిర్లక్ష్యంతో వృద్ధుని మృతిపై లోకాయుక్త స్పందన

- సుమోటోగా ఫిర్యాదు స్వీకరణ

సాక్షి ఎఫెక్ట్

సిద్దిపేట రూరల్: 'తండ్రిని ఇంటి నుంచి గెంటేసిన కొడుకు' శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి లోకాయుక్త గురువారం స్పందించింది. సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని పుల్లూరు గ్రామానికి చెందిన కూలీ గొడుగు పోచయ్య (67) అనారోగ్యం బారిన పడినా.. ఇద్దరు కుమారులు పట్టించుకోకుండా బయటికి తరిమేశారు. కుమార్తె జ్యోతి.. ఆటోలో తండ్రిని గ్రామంలోని వడ్ల బీటి వద్దకు తీసుకెళ్లింది. అక్కడ చలి తీవ్రత ఉండటంతో స్థానికులు రైతు వేదికలో వారికి ఆశ్రయం కల్పించగా బుధవారం రాత్రి పోచయ్య మృతి చెందాడు. ఈ ఘటనపై సాక్షిలో ప్రచురించిన కథనానికి స్పందించిన లోకాయుక్త సుమోటోగా ఫిర్యాదును స్వీకరించారు. కలెక్టర్, తహసీల్దార్‌లు వచ్చే నెల 18లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

పురుగుల అన్నం మాకొద్దు

- పాఠశాల ఎదుట విద్యార్థులు, ఏబీవీపీ నాయకుల ధర్నా



ధర్నా చేస్తున్న విద్యార్థులు, ఏబీవీపీ నాయకులు

మక్తల్: ఈ పురుగుల అన్నం మాకొద్దు సార్.. అంటూ విద్యార్థులు పాఠశాల గేటు ఎదుట ధర్నా చేపట్టిన సంఘటన నారాయణపేట జిల్లా మక్తల్‌లో చోటుచేసుకుంది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండగా.. విద్యార్థులు భోజనం చేస్తున్న క్రమంలో పురుగులు కనిపించాయి. బుధవారం పురుగులున్న భోజ నం పెట్టారని.. గురువారం కూడా అదే విధంగా పెడుతున్నారని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఏబీవీపీ నాయకులు పాఠశాలకు చేరుకొని విద్యార్థులతో కలిసి పాఠశాల గేటు ఎదుట ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎస్‌డీసీ రాజేందర్‌గౌడ్, డీఈవో గోవిందరాజులు, డీఎంసీ సైదులు, తహసీల్దార్ సతీశ్‌కుమార్, ఎంఈఓ అనిల్‌గౌడ్ అక్కడికి చేరుకొని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. డీఈవో ఏజెన్సీలతో మాట్లాడి పొరపాటు జరగకుండా చూడాలని ఆదేశించారు.

ఇకపై రాజ్యాంగ పరిధిలో పోరాటం

మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు ఆశన్న

- సాయుధ పోరాటానికి విరమణ.. శాంతియుతంగా పోరాడుతాం
- మూలవాసీ బచావో మంచ్ నేతృత్వంలో పోరాటం చేస్తాం
- మా షరతులకు ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన
- 120 మంది అనుచరులతో కలిసి జగదల్‌పూర్‌కు పయనం



మీడియాతో మాట్లాడుతున్న ఆశన్న

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఇకపై తమ పోరాటం రాజ్యాంగానికి లోబడి కొనసాగుతుందని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న అలియాస్ సతీశ్ తెలిపారు. తాము సాయుధ పోరాటానికి మాత్రమే విరమణ ఇచ్చామని, ఇకపై శాంతి యుగ మార్గంలో పోరాటం చేస్తామని స్పష్టంచేశారు. ఆశన్న నేతృత్వంలో దాదాపు 120 మంది మావోయిస్టులు తమ ఆయుధాలను ప్రభుత్వానికి అప్పగించి జనజీవన స్రవంతిలో కలిసేందుకు గురువారం ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యాన్ని వీడారు. వీరంతా ప్రభుత్వ పెద్దల సమక్షంలో శుక్రవారం లాంఛనంగా సాయుధ పోరాట బాటను వీడనున్నారు. ఈ సందర్భంగా అడవిని వీడి బయటకు వచ్చిన తర్వాత ఆశన్న ఛత్తీస్‌గఢ్ మీడియాతో మాట్లాడారు. 'శాంతి చర్చల కోసం ప్రజా సంఘాలు, మేధావులు చేసిన ప్రయత్నాలు సఫలం కాలేదు. దీంతో సాయుధ పోరాటానికి విరామం ఇవ్వాలని నిర్ణయించుకున్నాను. ఈ సందర్భంగా మేము పెట్టిన ప్రధాన షరతుల విషయంలో ప్రభుత్వ స్పందన సానుకూలంగా ఉంది. గతంలో మా పార్టీ, అనుబంధ సంఘాల్లో పని చేశారనే ఆరోపణలపై పోలీసులు జైళ్లలో పెట్టిన వారిని వెంటనే విడుదల చేయాలి. దీంతోపాటు మూలవాసీ బచావో మంచ్ సంస్థపై నిషేధాన్ని ఎత్తివేయాలి. ఆ సంస్థలో పనిచేస్తున్నారనే ఆరోపణలతో పెట్టిన కేసులు ఎత్తివేయాలి. ఇకపై మూలవాసీ బచావో మంచ్ వంటి సంస్థల ద్వారా చట్టబద్ధంగా మా పోరాటం కొనసాగిస్తాం. మేము కేవలం సాయుధ పోరాటానికే విరమణ ఇచ్చాం తప్పితే లొంగిపోలేదు. మా పోరాటం ఆపేది లేదు. జనజీవన స్రవంతిలో కలిసిన వాళ్లు ప్రభుత్వ పోలీసు విభాగమైన డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్స్ (డీఆర్‌జీ)లో చేరబోమని స్పష్టం చేశాం'అని ఆయన వెల్లడించారు.

అడవిని వీడేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు

అడవిని వీడుతున్న మావోయిస్టులు దట్టమైన అరణ్యంలో ఇంద్రావతి నది దాటేందుకు వీలుగా ప్రభుత్వం ప్రత్యేక బోట్లను ఏర్పాటు చేసింది. ఇందుకోసం చిత్రకూట్ జలపాతం దగ్గర నుంచి మూడు ప్రత్యేక బోట్లను లారీలో తరలించింది. నదిని దాటి బైరాంగఢ్ సమీపంలోకి వచ్చిన 120 మందికి పైగా సభ్యులతో కూడిన ఆశన్న బృందం.. అక్కడ అడవిలో గంటకు పైగా సేద తీరింది. ఈ సమయంలో ఆశన్నతోపాటు ఇతర సభ్యులు మీడియాకు ఇంటర్వ్యూలు ఇచ్చారు. ఆ తర్వాత వారిని బస్సుల్లో జగదల్‌పూర్‌కు తరలించారు. ప్రభుత్వానికి మావోయిస్టులు 10 షరతులు విధించగా, మూడు షరతులకు ప్రభుత్వం పూర్తిగా అంగీకారం తెలిపింది.

- స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల విషయంలో సుప్రీంకోర్టు చేసిన సూచనలను వెంటనే అమలు చేయాలని బీజేపీ నేత, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు డిమాండ్ చేశారు. హైకోర్టులో గడువులోగా అవసరమైన పత్రాలు, నివేదికలు సమర్పించాలన్నారు. పబ్లిక్ డొమైన్‌లో డెడికేటెడ్ కమిషన్, సిపెక్ సర్వే, జస్టిస్ సుదర్శన్‌రెడ్డి కమిషన్ నివేదికలు పొందుపరిచి ప్రజాభిప్రాయ సేకరణ జరిపి పారదర్శకతతో ముందుకు వెళ్లాలని డిమాండ్ చేశారు.

మావోయిస్టుల లొంగుబాటు యాత్ర

- దండకారణ్యం నుంచి రెండు బృందాలుగా బయటకు
- ఆశన్న, రణిత నాయకత్వంలో బైరాంగఢ్‌కు 170 మంది పయనం
- నేడు ప్రభుత్వ పెద్దల సమక్షంలో అధికారికంగా లొంగుబాటు



ఆయుధాలతో అడవిని వీడి బయటకు వస్తున్న మావోయిస్టులు



ఇంద్రావతి నదిని దాటి వస్తున్న మావోయిస్టులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఆపరేషన్ కగార్‌తో తీవ్ర ఒత్తిడిలో ఉన్న మావోయిస్టులు భారీ సంఖ్యలో ఉద్యమాన్ని వదిలి జనజీవన స్రవంతిలో కలుస్తున్నారు. మహారాష్ట్రలోని గడ్చిరోలిలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్‌సహా 61 మంది బుధవారం లొంగిపోగా, ఛత్తీస్‌గఢ్‌లో అంతకు దాదాపు మూడింతల మంది అడవిని వీడి బయటకు రాబోతున్నారు. 170 మందికి పైగా మావోయిస్టులు ప్రభుత్వం ఎదుట లొంగిపోయేందుకు రెండు బృందాలుగా బయలుదేరారు. ఈ విషయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఎక్స్ వేదికగా గురువారం ప్రకటించారు. దండకారణ్యంలోని మడ్ అడవుల నుంచి ఒక భారీ బృందం రణిత నేతృత్వంలో అడవిని వీడి కాంకేర్ జిల్లాలోకి చేరింది. తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న నేతృత్వంలో మరో 140 మంది బృందం ఇంద్రావతి నదిని దాటి బీజాపూర్ జిల్లాలోని ఒకప్పటి మావోయిస్టుల కంచుకోట బైరాంగఢ్‌కు చేరుకోనుంది. ఇక్కడి నుంచి వీరంతా జగదల్‌పూర్‌కు చేరుకునే అవకాశముంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెద్దల సమక్షంలో శుక్రవారం వీరంతా ప్రభుత్వానికి ఆయుధాలు అప్పగించి జనజీవన స్రవంతిలో కలిసే కార్యక్రమం జరగనుంది.

సందేహాలకు తావులేకుండా..

మల్లోజుల వేణుగోపాల్ లొంగుబాటు సమయంలో బుధవారం కనిపించిన దృశ్యాలు అనేక సందేహాలకు తావిచ్చాయి. మల్లోజుల బృందం చాన్నాళ్లుగా పోలీసులకు టచ్‌లో ఉన్నారని, లొంగిపోయినప్పుడు సమర్పించిన ఆయుధాలు సైతం ప్రభుత్వానివే అనే ప్రచారం సాగింది. దీంతో ఇలాంటి సందేహాలు మరోసారి తలెత్తకుండా ఆశన్న లొంగుబాటు విషయంలో పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగానే 50 మందితో కూడిన దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ (డీకేఎస్‌జెడ్‌సీ) సభ్యుడు భాస్కర్, దండకారణ్యం మాడ్ డివిజన్ ఇన్‌చార్జి రణిత బృందం అడవిని వీడి ఆయుధాలతో బయటకు వచ్చే వీడియోలు వెలుగులోకి వచ్చాయి. బుధవారం ఉదయం అబూజ్‌మడ్‌లోని హండావాడా జలపాతం నుంచి ఇంద్రావతి నేషనల్ పార్కు మీదుగా 140 మందికి పైగా సాయుధ మావోయిస్టులతో బయల్దేరిన ఆశన్న బృందం గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ఇంద్రావతి నదిని దాటి ఉస్పారీ ఘాట్ మీదుగా బైరాంగఢ్ వైపుగా సాగుతోంది. ఈ బృందాల ప్రయాణం సాఫీగా సాగేలా పోలీసు శాఖ నుంచి కట్టుదిట్టమైన ఏర్పాట్లు జరిగాయి. వీరిలో ఎక్కువ మంది ఆలివ్ గ్రీన్ దుస్తులకు బదులుగా సాధారణ దుస్తుల్లోనే ఉన్నారు.

హండావాడా జలపాతం కేంద్రంగా

అబూజ్‌మడ్‌లోని దట్టమైన అడవుల్లో ఛత్తీస్‌గఢ్ వైపు హండావాడా జలపాతం ఉంది. ఇక్కడే లొంగుబాటుకు సిద్ధంగా ఉన్న ముఖ్య నేతలు సమావేశమైనట్టు తెలుస్తోంది. ఈ నెల 5వ తేదీ నాటికి ఏ బృందాలు ఎలా వెళ్లాలి, ఎక్కడ లొంగిపోవాలి, వెళ్లే మార్గంలో అడ్డంకులు ఎదురుకాకుండా అవసరమైన శక్తులతో ఎలా సమన్వయం చేసుకోవాలనే అంశంపై స్పష్టత వచ్చినట్టు సమాచారం. 6వ తేదీన కేంద్ర కమిటీ బాధ్యతల నుంచి వైదొలుగుతున్నట్టు, ప్రజలకు క్షమాపణ చెబుతున్నట్టుగా మల్లోజుల నుంచి 22 పేజీల లేఖ జారీ అయింది. ఈ నెల 13న లొంగిపోయే మావోయిస్టులు అడవి నుంచి బయటకు రావడం మొదలైంది. 14న మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాకు మల్లోజుల బృందం చేరుకోగా, 15న ఆయన లొంగుబాటును అధికారికంగా ప్రకటించారు. అదే రోజు ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్, సుక్మా జిల్లాల్లో మరో 78 మంది లొంగిపోయారు.

జనసంద్రమైన సోమగూడెం

- ఘనంగా ముగిసిన కల్వరి 50 రోజుల ఉపవాస ప్రార్థనలు



కల్వరి మినిస్ట్రీస్ దీక్షలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కాసిపేట: మంచిర్యాల జిల్లా సోమగూడెం కల్వరి మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో 50 రోజులుగా నిర్వహిస్తున్న ఉపవాస ప్రార్థన దీక్షలు గురువారం ముగిశాయి. ముగింపు సభకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు దేశం నలుమూలల నుంచి క్రైస్తవులు లక్షలాదిగా తరలి రావడంతో బెల్లంపల్లి, సోమగూడెం ప్రాంతం జనసంద్రంగా మారింది. కల్వరి చర్చ్ ఎదురుగా ఉన్న దాదాపు 100 ఎకరాల స్థలంలో ముగింపు ప్రార్థనలు నిర్వహించారు. రాత్రి జరిగిన సభకు మాజీ కేంద్రమంత్రి సముద్రాల వేణుగోపాలచారి హాజరయ్యారు. ముగింపు సభలో పాస్టర్ ప్రవీణ్ ప్రత్యేక దైవ సందేశాన్ని అందించారు. ముగింపు వేడుకలు ఉదయం నుంచి ప్రారంభమయ్యాయి. లక్షలాదిగా తరలి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కల్వరి మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. షారోన్ ఫౌండేషన్ నిర్వాహకురాలు సిస్టర్ షారోన్ మాట్లాడారు.

'మహిళా జర్నలిస్టు'లకు సుప్రీంకోర్టులో ఊరట

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా, ఆయనను కించపరిచేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు మహిళా జర్నలిస్టులకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. ఈ కేసులో వారిని పోలీస్ కస్టడీకి అప్పగించాలన్న హైకోర్టు ఉత్తర్వుల అమలుపై సర్వోన్నత న్యాయస్థానం స్టే విధిస్తూ గురువారం కీలక ఆదేశాలు జారీ చేసింది. సీఎం రేవంత్‌రెడ్డిపై పరువు నష్టం కలిగించేలా పోస్టులు పెట్టారని ఇద్దరు మహిళా జర్నలిస్టులపై కేసు నమోదైంది. ఈ కేసు విచారణలో భాగంగా వారిని పోలీస్ కస్టడీకి అప్పగించాలని కింది కోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ జర్నలిస్టులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దవే వాదనలు వినిపించారు. 'పిటిషనర్లకు బెయిల్ అమలులో ఉన్నప్పుడు వారిని కస్టడీకి ఎలా అప్పగిస్తారు? ఆ బెయిల్ ఉత్తర్వులను ఎవరూ సవాలు చేయలేదు కదా?'అని ఆయన ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమయంలో జస్టిస్ విక్రమ్‌నాథ్ కలుగజేసుకుని, 'దర్యాప్తు సమయంలో వారిని ఎందుకు పిలవకూడదు?'అని ప్రశ్నించారు. దీనికి దవే స్పష్టంగా బదులిస్తూ, 'వారిని దర్యాప్తునకు పిలవవచ్చు, కానీ పోలీస్ కస్టడీకి మాత్రం ఇవ్వలేరు'అని స్పష్టం చేశారు. వాదనలు విన్న ధర్మాసనం ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. అదే సమయంలో, కింది కోర్టు ఇచ్చిన వివాదాస్పద ఉత్తర్వుల అమలును తదుపరి ఆదేశాలు వెలువడేంత వరకు నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది.

ఆస్తులు పంచినా.. అంత్యక్రియలకు నోచుకోలేదు

- 3 రోజులుగా కన్నతల్లికి దహన సంస్కారం చేయని కూతుళ్లు



నరసమ్మ

ఆత్మకూర్.ఎస్ (సూర్యాపేట): భర్త చనిపోయినా తన ఇద్దరు ఆడ పిల్లలను కష్టపడి పెంచి ఆస్తులు ఇచ్చి పెళ్లిళ్లు చేస్తే... చివరికి మిగిలి ఉన్న బంగారం పంచుకోవడం కోసం గొడవపడి 3 రోజులుగా కన్నతల్లి మృతదేహానికి దహన సంస్కారాలు చేయలేదు ఆ కూతుళ్లు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూరు.ఎస్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఆత్మకూరు.ఎస్ గ్రామానికి చెందిన పాదిల నరసమ్మ (80)కు ఇద్దరు కూతుళ్లు. పిల్లల చిన్న తనంలోనే భర్త చనిపోగా కష్టపడి ఆడపిల్లలను పెంచి పెద్ద వాళ్లని చేసింది. ఇటీవల అనారోగ్యంతో ఉన్న నరసమ్మ తన చిన్న కూతురు కళమ్మ ఇంటికి తనవద్ద ఉన్న ఆరు తులాల బంగారం, కొంత నగదు, వెండి వస్తువులను వెంట తీసుకెళ్లింది. మంగళవారం సాయంత్రం నరసమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. దీంతో అంత్యక్రియలు చేసేందుకు మృతదేహాన్ని ఆత్మకూర్‌కు తీసుకొచ్చారు. అయితే నరసమ్మ వద్ద ఉన్న నగదు, బంగారం, వెండి వస్తువుల గురించి ఇద్దరు కూతుళ్లు వివాదానికి దిగారు. అంత్యక్రియలు చేయకుండానే చిన్న కూతురు కళమ్మ వెళ్లిపోయింది. నరసమ్మ వద్ద ఉన్న నగదు, బంగారం, వెండి తెచ్చే వరకు అంత్యక్రియలు చేసేది లేదని పెద్ద కూతురు వెంకటమ్మ పట్టుపట్టింది. బంధువులు నచ్చజెప్పినా ఫలితం లేకుండా పోవడంతో గురువారం స్థానిక ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని వెంకటమ్మ కుటుంబ సభ్యులకు సర్దిచెప్పడంతో అంత్యక్రియలు నిర్వహించారు.

క్లుప్తంగా...

మంత్రి కుమార్తె ఆరోపణలపై విచారణ జరపాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు డిమాండ్



సాక్షి, హైదరాబాద్: అటవీశాఖ మంత్రి కొండా సురేఖ పేషీ వివాదంలో.. ఆమె కుమార్తె సుస్మిత చేసిన ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. మంత్రి మాజీ ఓఎస్డీ సుమంత్.. సిమెంట్ కంపెనీల యాజమాన్యాలను బెదిరించినట్టు ఆరోపణలు వచ్చాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దోపిడీ సర్కార్‌గా మారిందని, బెదిరింపులు, వసూళ్లే లక్ష్యంగా సాగుతోందని ఆరోపించారు. ఈ వ్యవహారంలో కొందరు మంత్రులు, సీఎం దగ్గరి అనుచరుల పేర్లు కూడా బయటకు వస్తున్నాయన్నారు. ఈ ఉదంతంతో సీఎం రేవంత్ రెడ్డి వ్యవహారాలు బయటపడ్డాయని ధ్వజమెత్తారు. గురువారం ఆయన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో 'వోకల్ ఫర్ లోకల్'బ్యానర్‌ను పార్టీ ఉపాధ్యక్షుడు బూర నర్సయ్య గౌడ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. తమ ఆస్తులు, బినామీలు, అక్రమ ఆస్తుల గురించి కాంగ్రెస్ నాయకులు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ డీఏన్ఏనే అవినీతితో కూడుకుందన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో తుపాకీ పట్టుకుని బెదిరింపులకు పాల్పడే కాంగ్రెస్ నాయకులను తిరస్కరించాలని ప్రజలను కోరారు. గతంలో ఎంఐఎం నుంచి పోటీ చేసి, ఇప్పుడు కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్న నవీన్ యాదవ్‌పై పలు అవినీతి ఆరోపణలు వచ్చాయన్నారు.

కన్నీళ్లతో ఒకరు.. కర్రలతో మరొకరి ప్రచారం

బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు



సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కన్నీళ్లతో ఒకరు, కర్రలతో మరొకరు ప్రచారం చేస్తున్నారని బీజేపీ నేత, ఎంపీ ఎం.రఘునందన్‌రావు వ్యాఖ్యానించారు. కన్నీళ్లకు కరిగినా కట్టెలకు భయపడినా భాగ్యనగరం భవిష్యత్ మూసీలో కలవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. రూ.11 కోట్ల ఖర్చుతో కట్టిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు.. ఈ కర్రలు పట్టుకుని తిరిగే వారు కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. కొందరు గూండాల అనుమతితో నగరంలో బతకాల్సిన పరిస్థితి రావొద్దనుకుంటే.. జూబ్లీహిల్స్ ప్రజలు ఆలోచించి ఓటేయాలని కోరారు. ఉప ఎన్నిక నేపథ్యంలో బీజేపీపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీని డ్యామేజ్ చేయాలనుకుని రాసే తప్పుడు వార్తలు, తప్పుడు సర్వేలను తప్పకుండా గుర్తుపెట్టుకుంటామన్నారు.

యువత తల్చుకుంటే ఏదైనా సాధ్యమే: వాకిటి

సాక్షి, హైదరాబాద్: యువత తల్చుకుంటే ఏదైనా సాధ్యమవుతుందని, తెలంగాణలో ఉన్న సహజ సిద్ధమైన ప్రకృతిని ప్రపంచానికి చూపెట్టేలా వీడియోలు చేయాలని రాష్ట్ర క్రీడలు, యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మన దగ్గర సహజ సిద్ధమైన పర్యాటక ప్రాంతాలు ఉన్నా ప్రపంచానికి చూపించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ప్రపంచంలో ఉన్న పర్యాటక ప్రాంతాలను తలదన్నే పర్యాటక ప్రాంతాలు తెలంగాణలో ఉన్నాయన్నారు. వారంలో 6 రోజులు పనిచేసినా.. ఒక్కరోజైనా ప్రకృతిని మనం ఆస్వాదించాలని మంత్రి సూచించారు.

రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తం

బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్




మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్. చిత్రంలో దూదిమెట్ల బాల్‌రాజ్ యాదవ్

సాక్షి, హైదరాబాద్: కమీషన్ల కోసం మంత్రులు బాహాటంగా కొట్లాడుకుంటున్నారని, రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తమైందని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో పార్టీ నేత దూదిమెట్ల బాల్‌రాజ్ యాదవ్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతూ, మంత్రి కొండా సురేఖ కూతురు మాటల్లో ప్రభుత్వ పెద్దల చీకటి దందాలు బయట పడ్డాయని ధ్వజమెత్తారు. మాఫియా డాన్‌లు మంత్రులు అయ్యారని, ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి నివాసం నుంచి ఓ నిందితుడిని టాస్క్ ఫోర్స్ పోలీసులు బయటకు తీసుకురాలేకపోయారని, సామాన్యుడికో న్యాయం.. మంత్రులకు ఓ న్యాయమా అని ప్రశ్నించారు. డెక్కన్ సిమెంట్ నిర్వాహకులను బెదిరించిన సీఎం సన్నిహితుడు రోహిన్‌రెడ్డి, కొండా సురేఖ ఓఎస్డీ సుమంత్‌పై ఎందుకు కేసులు నమోదు చేయలేదని ప్రశ్నించారు. దూదిమెట్ల బాల్‌రాజ్ యాదవ్ మాట్లాడుతూ బీసీలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం మోసం చేస్తోందని, బీసీలకు రిజర్వేషన్లు రావాలంటే చట్ట ప్రకారం ముందుకెళ్లాలని డిమాండ్ చేశారు.

శ్రీశైల మల్లన్న సేవలో ప్రధాని మోదీ

పూర్ణకుంభంతో స్వాగతం పలికిన ప్రధానార్చకులు

శ్రీశైలం టెంపుల్: ద్వాదశ జ్యోతిర్లింగం, అష్టాదశ శక్తిపీఠమైన శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను ప్రధాని నరేంద్ర మోదీ గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. కర్నూలు నుంచి ఆయన ప్రత్యేక హెలికాప్టర్‌లో ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌తో కలిసి సున్నిపెంట హెలిప్యాడ్‌కు.. అక్కడి నుంచి రోడ్డుమార్గంలో శ్రీశైలానికి చేరుకున్నారు. ఆలయ ప్రధాన ధ్వజస్తంభానికి నమస్కరించారు. రత్నగర్భ గణపతి ఆలయం వద్ద గణపతి పూజనిర్వహించారు. అనంతరం.. జ్యోతిర్లింగ స్వరూపుడైన మల్లికార్జున స్వామివారికి ఏకవార రుద్రాభిషేకం, బిల్వార్చన, పుష్పార్చన, మహామంగళహారతి, నిర్వహించుకున్నారు. అలాగే, నందీశ్వరస్వామి దర్శనం చేసుకున్నారు. అర్చకులు ప్రధానికి స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. ఆ తర్వాత మల్లికాగుండం వద్ద స్వామివారి గర్భాలయ శిఖర దర్శనం చేసుకున్నారు. భ్రమరాంబాదేవి ఆలయ ముఖమండపంలో ఆదిశంకరాచార్యులు ప్రతిష్ఠించిన శ్రీచక్రానికి ఖడ్గమాలతో కుంకుమార్చన నిర్వహించి, షోడశోపచార పూజ ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆశీర్వచన మండపంలో ప్రధాని మోదీకి వేదపండితులు వేదమంత్రోచ్చారణలతో చతుర్వేద ఆశీర్వచనం చేసి అమ్మవారి తీర్థప్రసాదాలను అందించారు. స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని, శేషవస్త్రాలను చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ అందజేసి సత్కరించారు. ఇక ఆలయం నుంచి శివాజీ స్ఫూర్తి కేంద్రానికి చేరుకున్న ప్రధాని శివాజీ దర్బార్‌హాల్‌ను సందర్శించారు. ఈ కేంద్రం నిర్వాహకులు నాగేశ్వరరావు శివాజీ మహారాజ్ జీవిత చరిత్ర విశేషాలు, క్షైత్రయాత్రలు, శివాజీ శ్రీశైలానికి వచ్చిన తీరును, ధ్యానం చేయగా అమ్మవారు ప్రత్యక్షమై ఖడ్గాన్ని బహూకరించిన విషయాన్ని కూలంకషంగా ప్రధానికి వివరించారు. శివాజీ దర్బార్‌హాల్‌లో త్రీడీ ఛాయాచిత్రాల్లో శివాజీ జీవితచరిత్ర విశేషాలను అద్యంతం ఆసక్తిగా తిలకించారు.



శ్రీశైలం ఆలయంలో ధ్యానముద్రలో ప్రధాని మోదీ



శ్రీశైలం ఆలయంలోకి వస్తున్న ప్రధాని మోదీ



ఛత్రపతి శివాజీ కాంస్య విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ప్రధాని మోదీ

తయారీ కేంద్రంగా భారత్

- 21వ శతాబ్దంలో ప్రపంచం చూపు అంతా మనపైనే
- ఈ శతాబ్దం భారత్ ది.. 140 కోట్ల భారతీయులది
- కర్నూలులో 'సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్' సభలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

సాక్షి ప్రతినిధి కర్నూలు: '21వ శతాబ్దం భారత్‌ది.. 140 కోట్ల మంది భారతీయులది.. ఇప్పుడు ప్రపంచం అంతా భారత్‌ను ఓ తయారీ కేంద్రంగా చూస్తోంది.. భారత దేశ సామర్థ్యాన్ని మొత్తం ప్రపంచం గమనిస్తోంది.. దేశాభివృద్ధికి పునాది పడింది ఆత్మ నిర్భర్ భారత్‌తోనే.. 2047కు వికసిత్ భారత్ లక్ష్యంగా ముందడుగు వేస్తున్నాం. ఓకల్ ఫర్ లోకల్ పేరుతో ప్రజలు మన తయారీ రంగాన్ని ప్రోత్సహించాలి. ప్రతీ రంగంలో దేశం కొత్త రికార్డులు నెలకొల్పుతోంది' అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ పేరుతో కర్నూలు సమీపంలోని నన్నూరు వద్ద ఎన్డీఏ ప్రభుత్వం గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి వాహనం 16 నెలలుగా వేగంగా కదులుతోందని, డబుల్ ఇంజన్ సర్కారు వేగంగా నడుస్తోందని చెప్పారు. ఢిల్లీ, అమరావతి రెండూ వేగవంతంగా అభివృద్ధి వైపు పయనిస్తున్నాయని ప్రదాని అన్నారు. రోడ్లు, విద్యుత్, రైల్వే, హైవే, వాణిజ్యం, పరిశ్రమలతో పాటు పలు ప్రాజెక్టులకు సంబంధించి రూ.13,400 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం పరిశ్రమలకు ఊతమిచ్చి ప్రజల అభివృద్ధికి దోహం చేస్తోందని, ఈ ప్రాజెక్టులతో కర్నూలు, పరిసర ప్రాంతాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. 2047కు భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లవుతుందని, అప్పటికి భారత్ 'వికసిత్ భారత్'గా తయారవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సభలో ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సభలో ప్రధాని ఇంకా ఏమన్నారంటే..

ఇంధన రంగంలో విప్లవాత్మక అభివృద్ధి

ఏదేశమైనా, రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే ఇంధన భద్రత కీలకం. రూ.3 వేల కోట్ల విలువైన ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టులు ఈ రోజు ప్రారంభిస్తున్నాం. దీంతో దేశ ఇంధన సామర్థ్యం పెరగబోతోంది. వేగవంతమైన అభివృద్ధి మధ్య గతాన్ని మరవొద్దు. 11 ఏళ్ల కిందట కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు తలసరి విద్యుత్ వినియోగం (ఏటా) వెయ్యి యూనిట్లలోపు ఉండేది. అప్పుడు దేశం తరుచూ విద్యుత్ కోతలు, సవాళ్లు ఎదుర్కొంది. వేల గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు కూడా వేయలేని దుస్థితి. నేడు భారతదేశంలో క్లీన్ ఎనర్జీ నుంచి పూర్తి విద్యుత్ ఉత్పత్తి వరకూ ప్రతి రంగంలో దేశం కొత్త రికార్డులు నెలకొల్పుతోంది. ప్రతి గ్రామంలో విద్యుదీకరణ జరిగింది. తలసరి విద్యుత్ వినియోగం 1,400 యూనిట్లకు పెరిగింది. దేశంలో ఇంధన విప్లవానికి ఆంధ్రప్రదేశ్ ప్రధాన కేంద్రం. శ్రీకాకుళం నుంచి అంగుల్ వరకు సహజ వాయువు పైపు లైన్ ప్రారంభించాం. దీంతో 15 లక్షల ఇళ్లకు గ్యాస్ సరఫరా అవుతోంది. చిత్తూరులో కూడా రోజుకు 20 వేల సిలిండర్లు నింపే సామర్థ్యంతో ఎల్‌పీజీ ప్రాజెక్టు నిర్మించాం. దీనివల్ల ప్రజలకు సేవలతో పాటు కొత్త ఉద్యోగాలు వస్తాయి.

కనెక్టివిటీ హబ్‌గా విశాఖ

ఆంధ్రప్రదేశ్ యువత టెక్నాలజీలో చాలా ముందుంది. డబుల్ ఇంజిన్ సర్కారుతో ఈ సామర్థ్యాన్ని మరింత పెంచనున్నాం. రెండు రోజుల కిందట గూగుల్ సంస్థ పెద్ద పెట్టుబడి ప్రకటించింది. గుగుల్ కంపెనీ యాజమాన్యం వారు నాతో మాట్లాడారు. 'అమెరికా కాకుండా చాలా దేశాల్లో గూగుల్ పెట్టుబడులు ఉన్నాయి కానీ, అన్నింటి కంటే ఎక్కువ పెట్టుబడి ఆంధ్రలో పెడుతున్నామని చెప్పారు. ఈ కొత్త గూగుల్ ఏఐ హబ్‌లో శక్తివంతమైన ఏఐ సాంకేతిక పరిజ్ఞానం, ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్ ఉండబోతున్నాయి. గూగుల్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో కొత్త అంతర్జాతీయ గేట్‌వే తయారవుతోంది. అంతర్జాతీయంగా తూర్పు తీరంలోని విశాఖ నగరం కనెక్టివిటీ హబ్‌గా, ప్రపంచానికే ఏఐ హబ్‌గా మారబోతోంది.

దేశాభివృద్ధికి ఆంధ్ర.. ఆంధ్ర అభివృద్ధికి 'సీమ' కీలకం

దేశాభివృద్ధికి ఆంధ్ర అభివృద్ధి చాలా అవసరం. అలాగే ఆంధ్ర అభివృద్ధికి రాయలసీమ అభివృద్ధి అంతే ముఖ్యం. కర్నూలులో ప్రారంభించి, శంకుస్థాపన చేసిన ఈ ప్రాజెక్టులు రాయలసీమలోని ప్రతి జిల్లాలో ఉద్యోగాలు సృష్టిస్తాయి. రాయలసీమ అభివృద్ధికి సరికొత్త ద్వారాలు తెరుస్తాయి. నిమ్మలూరులో అడ్వాన్స్ నైట్ విజన్ ఫ్యాక్టరీ ప్రారంభించాం. మన దేశ రక్షణ రంగంలో ఆత్మ నిర్భర భారత్ సాధించడానికి ముందడుగు పడింది. ఈ ఫ్యాక్టరీ దేశ నైట్ విజన్ పరికరాలు, క్షిపణుల కోసం సెన్సార్లు, డ్రోన్ గార్డు వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచబోతోంది. ఇక్కడ తయారయ్యే పరికరాలు భారత దేశ రక్షణ ఎగుమతులను కొత్త ఎత్తులకు తీసుకెళ్లేందుకు దోహదపడతాయి. భారత రక్షణ రంగం శక్తి ఏంటో ఆపరేషన్ సింధూర్‌తో ప్రత్యక్షంగా చూశాం.

ఆత్మ గౌరవానికి, గొప్ప సంస్కృతికి ఏపీ నిలయం

అహోబిలం లక్ష్మీ నరసింహస్వామి, మహానందీశ్వరుడు, మంత్రాలయం రాఘవేంద్రుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ప్రార్థిస్తున్నా. ద్వాదశ జ్యోతిర్లింగాల్లో సోమనాథ ఆలయం మొదటిదైతే, రెండోది శ్రీశైలం. సోమనాథుడు కొలువున్న గుజరాత్ భూమిపై జన్మించిన నాకు కాశీ విశ్వనాథుడికి సేవ చేసే అవకాశం లభించింది. ఇప్పుడు శ్రీశైల మల్లికార్జునుడి ఆశీస్సులు కూడా పొందాను. స్వామి దర్శనం తర్వాత ఛత్రపతి శివాజీ కేంద్రాన్ని సందర్శించి నివాళులు అర్పించాను. ఈ వేదికపై నుంచి కూడా మరోసారి శివాజీ మహారాజ్‌కు నివాళులు అర్పిస్తున్నా. మహా శివభక్తులైన అక్క మహాదేవుళ్లను స్మరించుకుంటున్నా. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, హరిసర్వోత్తమరావు లాంటి స్వాతంత్ర్య సమరయోధులకు కూడా నా నివాళులు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆత్మ గౌరవానికి, గొప్ప సంస్కృతికి, సైన్స్, పరిశోధనలకు నిలయం.



మన్నె సత్యనారాయణ రెడ్డికి డాక్టరేట్‌ను ప్రదానం చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, వీసీ శ్రీనివాస్

యువత.. విద్యలోనే దేశ బలం

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ... ఘనంగా పీయూ స్నాతకోత్సవం

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: దేశ యువతలోని సృజనాత్మకతను వెలికితీసే లక్ష్యంతో రూపొందించిన జాతీయ విద్యా విధానం దార్శనికతను అభినందిస్తున్నానని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పినట్లుగా ఒక దేశం యొక్క నిజమైన బలం ఆ దేశ యువత.., విద్యలోనే ఉందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. మహబూబ్‌నగర్‌లోని పాలమూరు యూనివర్సిటీలో గురువారం నిర్వహించిన స్నాతకోత్సవానికి ఆయన అధ్యక్షత వహించారు. సామాజిక సేవా రంగంలో విశిష్ట సేవలందించిన నేపథ్యంలో పీయూ చరిత్రలో మొదటిసారిగా ఎంఎస్ఎన్ గ్రూప్స్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ మన్నె సత్యనారాయణరెడ్డికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. మొత్తం 12 మందికి పీహెచ్‌డీ పట్టాలు, 83 మందికి గోల్డ్ మెడల్స్ అందజేశారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ 21వ శతాబ్దపు ఈ జ్ఞాన యుగంలో విశ్వవిద్యాలయాలు తమ లక్ష్యాన్ని పునర్నిర్వచించు కోవాలన్నారు. కొత్త కొత్త ఆవిష్కరణలతోపాటు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. విశ్వవిద్యాలయాలు ఆధునిక భారతదేశ దేవాలయాలు అని పేర్కొన్నారు. పాలమూరు విశ్వవిద్యాలయం 'ఏక్ పేడ్ మా కే నామ్'అనే జాతీయ ప్రచారాన్ని చురుగ్గా ముందుకు తీసుకెళ్లాలన్నారు. మీ విద్య ఇక్కడితో ముగియదు.. అన్న డాక్టర్ అంబేడ్కర్ మాటలను గవర్నర్ గుర్తుచేశారు. విద్యార్థుల నైతిక శ్రేయస్సుకు విశ్వవిద్యాలయాలు సంరక్షకులుగా పనిచేయాలని గవర్నర్ సూచించారు. పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్‌కు ముప్పుగా పరిణమిస్తోందని.. వాటి వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థుల్లో అవగాహన పెంచేలా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.



టీజీ ఎస్పీసీఏ లోగోను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో జస్టిస్ శివశంకర్‌రావు, మంత్రి కోమటిరెడ్డి, సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డి

టీజీ ఎస్పీసీఏ వెబ్‌సైట్, లోగోను ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ (టీజీ ఎస్పీసీఏ) వెబ్‌సైట్, లోగోను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం సచివాలయంలో ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సీవీ ఆనంద్, సీజీజీ డీజీ రవిగుప్త, ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీ విజయ్ కుమార్, ఎస్పీసీఏ చైర్మన్, రిటైర్డ్ జడ్జి జస్టిస్ శివశంకర్‌రావు, స్టేట్ కమిటీ సభ్యులు ప్రమోద్ కుమార్, వెంకటేశ్వర్లు, ఎస్పీసీఏ మల్టీజోన్–1 కమిటీ చైర్మన్ రిటైర్డ్ డిస్ట్రిక్ట్ జడ్జి అరవిందర్‌రెడ్డి, సభ్యుడు ఎం.నారాయణ, మల్టీజోన్–2 కమిటీ చైర్మన్ రిటైర్డ్ డిస్ట్రిక్ట్ జడ్జి సుదర్శన్, సభ్యుడు రాంనర్సింహారెడ్డి, రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై జోక్యం చేసుకోలేం

బీఆర్ఎస్ పిటిషన్‌పై తేల్చిచెప్పిన హైకోర్టు

- ప్రత్యేక ఉత్తర్వులు ఇవ్వాల్సిన అవసరం లేదని వెల్లడి
- వాదనలు ముగించిన ధర్మాసనం



సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బోగస్ ఓట్లపై బీఆర్ఎస్ అభ్యర్థి సమర్పించిన ఫిర్యాదుపై ఎన్నికల కమిషన్ చర్యలు ప్రారంభించినందున తమ జోక్యం అవసరం లేదని హైకోర్టు అభిప్రాయపడింది. ఓటర్ల నమోదు, తొలగింపు నిరంతర ప్రక్రియ అని, ఈ నెల 21 వరకు సమయం ఉన్నందున సరైన చర్యలు తీసుకోవాలని ఈసీని ఆదేశించింది. ఒకసారి ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత అత్యంత అనివార్యమైతే తప్ప న్యాయస్థానాలు జోక్యం చేసుకోవద్దన్న సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ప్రస్తావించింది. కోర్టు ఉత్తర్వుల కారణంగా ఎన్నికల ప్రక్రియలో జాప్యం జరగకుండా చూసుకోవాలని సుప్రీం హెచ్చరించిందని వ్యాఖ్యానించింది. ఇక ఈ పిటిషన్‌లో ప్రత్యేక ఉత్తర్వులు ఇవ్వాల్సిన అవసరం లేదంటూ విచారణ ముగించింది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బోగస్ ఓట్లతోపాటు బయటి వ్యక్తుల పేర్లు చేర్చారంటూ మాగంటి సునీతతోపాటు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మోహియుద్దీన్ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది.

వాదనలేంటంటే...

పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది దామ శేషాద్రినాయుడు వాదనలు వినిపిస్తూ.. 'బీఆర్ఎస్ అభ్యర్థి ఈసీ అధికారిక వెబ్‌సైట్ నుంచి ఓటర్ల జాబితాను తీసుకున్నారు. నియోజకవర్గంలో 12 వేల బోగస్ ఓట్లతోపాటు బయటి వ్యక్తులు జాబితాలో ఉన్నారు. దీనిపై ఈసీకి ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు చేపట్టకుండా నిష్క్రియాత్మకంగా వ్యవహరిస్తోంది. అధికార పార్టీతో కుమ్మక్కైన ఈసీ ఓటర్ల జాబితా సమగ్రతను దెబ్బతీసేలా ఎన్నికల దుర్వినియోగానికి పాల్పడింది. బోగస్ ఓట్లు తొలగించి.. నవంబర్ 11న ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేలా ఈసీని ఆదేశించాలి'అని చెప్పారు. ఈసీ తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ.. 'ఓటర్ల నమోదు, తొలగింపు ప్రక్రియ నిరంతరం సాగుతుంది. ఈ నెల 21న నామినేషన్లు పూర్తయ్యే వరకు సవరణకు అవకాశం ఉంది. జాబితాపై పరిశీలన చేసి చర్యలు తీసుకుంటాం. సెప్టెంబర్ 2న ఈసీ విడుదల చేసిన ప్రాథమిక జాబితా ప్రకారం 3.92 లక్షల ఓటర్లున్నారు. సవరణల తర్వాత 6,976 మందిని కొత్తగా చేర్చగా, 663 మందిని తొలగించారు. తుది ఓటర్ల జాబితా సెప్టెంబర్ 30న ప్రచురించాం. మొత్తం ఓటర్ల సంఖ్య 3.99 లక్షలు. జాబితాపై ఓటర్ల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదు. 12వేల బోగస్ ఓట్లు చేర్చారన్న వాదన సమర్థనీయం కాదు'అని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఈసీ చర్యలు ప్రారంభించినందున ప్రత్యేక ఉత్తర్వులు అనవసరం లేదని పేర్కొంది. పిటిషనర్లు తమ ఫిర్యాదుపై చర్యలకు వేచిచూడకుండా కోర్టును ఆశ్రయించారని చెప్పింది.

కొత్త వైద్య కళాశాలలు ఇలానా?

- పూర్తిస్థాయి పేషెంట్ ఎక్స్‌పోజర్ లేదు
- తరగతుల నిర్వహణలోనూ లోపాలే
- ప్రొఫెసర్ల కొరత.. కలుషిత వాతావరణం
- బోధన, మౌలిక వసతులు, మానసిక ఆరోగ్యంపై ఆందోళన
- ఫైమా–ఆర్ఎంసీ నిర్వహించిన సర్వేలో వైద్య విద్యార్థుల వెల్లడి
- దేశవ్యాప్తంగా వైద్య విద్యావ్యవస్థలోని లోపాలను వెల్లడించిన ఫైమా



సాక్షి, హైదరాబాద్: దేశంలో కొత్తగా ఏర్పాటైన వైద్య కళాశాలల్లో మౌలిక వసతులు, శిక్షణ ప్రమాణాల్లో తీవ్రమైన లోపాలు ఉన్నాయని తేలింది. వైద్య విద్యార్థులకు బోధించే నిపుణులైన ప్రొఫెసర్లు, ప్రాక్టికల్ శిక్షణ అందించే ప్రొఫెసర్లు పూర్తిస్థాయిలో లేరని ఫెడరేషన్ ఆఫ్ ఆల్‌ఇండియా మెడికల్ అసోసియేషన్ (ఫైమా) నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. దేశవ్యాప్తంగా ఉన్న మెడికల్ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు, ప్రొఫెసర్లతో నిర్వహించిన ఫైమా–రివ్యూ మెడికల్ సిస్టం (ఆర్ఎంఎస్) సర్వేలో వైద్య కళాశాలల్లోని లోపాలు వెలుగుచూశాయి. దేశంలోని 28 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన సుమారు 2 వేల మంది నుంచి అభిప్రాయాలు సేకరించారు. అందులో 90.4 శాతం మంది ప్రభుత్వ కాలేజీలు, 7.8 శాతం మంది ప్రైవేట్ కాలేజీలకు చెందినవారు ఉండగా, ప్రముఖ వైద్య విద్యాసంస్థలైన ఎయిమ్స్, పీజీఐ, జిప్‌మార్ వంటి కళాశాలలకు చెందిన వైద్యులతోపాటు అండమాన్ నికోబార్ దీవులకు చెందిన వైద్యులు కూడా పాల్గొనడం విశేషం.

మౌలిక వసతుల కొరత, బోధనలో నిర్లక్ష్యం

కొత్తగా ఏర్పాటైన వైద్య కళాశాలల్లో పూర్తిస్థాయిలో పేషెంట్ ఎక్స్‌పోజర్ లేదని తేలింది. సర్వేలో పాల్గొన్న వారిలో 89.4 శాతం మంది మౌలిక వసతుల లేమి..వైద్యవిద్య ప్రమాణాలను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వ కాలేజీల్లో పేషెంట్ ఎక్స్‌పోజర్ ఎక్కువగా ఉన్నా, పాలనా భారం అధికంగా ఉందన్నారు. ప్రైవేటు కాలేజీల్లో బోధన క్రమబద్ధంగా ఉన్నా, అక్కడ మౌలిక వసతుల స్థాయి తక్కువగా ఉందని సర్వేలో స్పష్టమైంది. సర్వేలో పాల్గొన్న 71.5 శాతం మంది విద్యార్థులు, ప్రొఫెసర్లు పేషెంట్ ఎక్స్‌పోజర్ ఉందని చెప్పగా, మిగతా 29.5 శాతం మంది లేరని చెప్పారు.

- తరగతుల నిర్వహణలోనూ లోపాలు ఉన్నట్టు వెల్లడైంది. 54.3 శాతం మంది మాత్రమే తరగతులు క్రమం తప్పకుండా జరుగుతున్నట్టు చెప్పగా, 69.2 శాతం ల్యాబ్‌లు, పరికరాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. 44.1 శాతం మంది కళాశాలల్లో స్కిల్ ల్యాబ్స్ పనిచేస్తున్నట్టు తెలిపారు.
- అధ్యాపకుల విషయంలో 68.8 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు స్టైపెండ్ సగం మందికి మాత్రమే అందుతున్నట్టు సర్వేలో వెల్లడైంది. ప్రైవేటు కళాశాలల్లో స్టైఫండ్ ఇవ్వకపోవడం దేశవ్యాప్తంగా ఉన్నట్టు తేలింది.
- 73.9 శాతం మంది అధిక క్లెరికల్ పనిభారం ఉందని చెప్పగా, స్థిరమైన పనిగంటల్లోనే విద్యాబోధన ఉన్నట్టు కేవలం 29.5 శాతం మంది మాత్రమే చెప్పారు.
- సిబ్బంది కొరత ఉన్నట్టు 55.2 శాతం మంది చెప్పగా, 40.8 శాతం మంది తమ కళాశాలల పరిసరాలు కలుషితమైన వాతావరణంలో ఉన్నట్టు పేర్కొన్నారు.

నేషనల్ టాస్క్‌ఫోర్స్ సిఫారసులు అమలు కాలేదు

2024లో నేషనల్ టాస్క్‌ఫోర్స్ జరిపిన సర్వేలో వైద్య కళాశాలల నిర్వహణ ఎలా ఉండాలనే అంశంపై కొన్ని సూచనలు చేసింది. రెసిడెంట్ డాక్టర్లు, ఇంటర్న్‌షిప్‌లకు సంబంధించి స్థిరమైన పనిగంటలు ఉండాలని, ప్రతి మెడికల్ కాలేజీకి మానసిక ఆరోగ్య కౌన్సిలర్‌ను నియమించాలని సూచించింది. ఏటా మానసిక ఆరోగ్య సమీక్షల్లో తల్లిదండ్రులను భాగస్వాములను చేయడం, 10 రోజుల సెలవు వంటి సిఫార్సులు చేసినా, వాటిలో ఒకటి రెండు మాత్రమే కొన్ని చోట్ల అమలైనట్టు సర్వేలో తేలింది.

తక్షణ జోక్యం అవసరం

కొత్తగా ప్రభుత్వ రంగంలో ఏర్పాటయ్యే వైద్య కళాశాలలతో పాటు ప్రైవేటు రంగంలోని ఇతర కళాశాలల నిర్వహణ లోపభూయిష్టంగా ఉండకుండా చూసేందుకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, నేషనల్ మెడికల్ కమిషన్ తక్షణ జోక్యం అవసరమని ఫైమా పేర్కొంది. ఫైమా సర్వేకు సంబంధించిన తుది నివేదికను త్వరలోనే కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ, ఎన్ఎంసీ, నీతి ఆయోగ్‌లకు సమర్పించనుంది. మెడికల్ విద్యార్థుల మానసిక, విద్యా సంక్షేమానికి సమగ్ర సంస్కరణలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతామని ఫైమా తెలిపింది.

పార్టీని కాపాడేందుకు ఆస్తులు అమ్ముకున్నా

- పార్టీ మాత్రం నన్ను మోసం చేసింది
- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు: తాను కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్నానని, పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో తన ఆస్తులు అమ్ముకొని పార్టీని కాపాడానని, కానీ పార్టీ మాత్రం ఇచ్చిన మాట మరిచి తనను మోసం చేసిందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. పార్టీ పేరు చెప్పి తాను ఎక్కడా చేయి చాచలేదని, కార్యకర్తలకు కష్టం వస్తే చేతనైన సహాయం చేస్తున్నానని చెప్పారు. గురువారం మునుగోడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడి ఎంపిక కోసం అభిప్రాయసేకరణ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఏఐసీసీ పరిశీలకుడు బిస్వరంజన్ మహంతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైతే తనకు మంత్రి పదవి ఇస్తామని చెప్పి ఇవ్వకపోగా.. బీఆర్ఎస్ నుంచి వచ్చిన నలుగురికి మంత్రి పదవులు ఇచ్చారని అన్నారు. అంతేకాకుండా తనతో పాటు బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వివేక్‌కు మంత్రి పదవి, ఆయన కుమారుడికి ఎంపీ పదవి ఇచ్చారని పేర్కొన్నారు. తనకు మంత్రి పదవి రాకుండా కొందరు నాయకులు అడ్డుపడుతున్నారని రాజగోపాల్‌రెడ్డి ఆరోపించారు. డీసీసీ పదవి ఎవరికి ఇచ్చినా తనకు అభ్యంతరం లేదని స్పష్టం చేశారు.

సాక్షి హైదరాబాద్

శుక్రవారం | 17 | అక్టోబర్ | 2025



గ్లోబల్ టూరిస్టులను ఆకర్షించేలా ..

గ్లోబల్ టూరిస్టులను ఆకర్షించేలా ప్రత్యేక పాలసీ అమలు చేసి తెలంగాణ టూరిజాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. -10లో



ఆహా ఏమి రుచి..

నోరూరించే వివిధ రకాల వంటకాలకు నగరం వేదికైంది.. పాకశాస్త్రంలో ప్రావీణ్యం పొందిన పలువురు చెఫ్‌లు వివిధ ప్రాంతాల వంటకాలతో ఆకట్టుకున్నారు. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.0/19.0

నగరంలో శుక్రవారం ఉదయం చలిగాలులు వీస్తాయి. పగటిపూట పొడి వాతావరణం ఉంటుంది. గరిష్టంగా 32, కనిష్టంగా 19 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.



తెలంగాణ భవన్ వద్ద బీఆర్‌ఎస్ పార్టీ ప్రచార రథాలు..

గల్లీ గల్లీ మోత మోగాల్సిందే..

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉపఎన్నిక నేపథ్యంలో ఇక గల్లీ గల్లీ ప్రచార హోరు కొనసాగనుంది. ఇందుకోసం ప్రత్యేక రథాలు సిద్ధమయ్యాయి. తెలంగాణ భవన్ వద్ద బీఆర్‌ఎస్ పార్టీ ప్రచార రథాలను ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రారంభించారు. ఇక నియోజకవర్గ వ్యాప్తంగా ప్రచార రథ చక్రాలు కదం తొక్కనున్నాయి. బీఆర్‌ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి, పాలనను కీర్తిస్తూనే, మరోవైపు ప్రత్యర్థి పార్టీ వైఫల్యాలను ఎత్తిచూపుతూ ప్రత్యేకంగా రూపొందించిన పాటలతో ఈ రథాలు ప్రజల్లోకి వెళ్లనున్నాయి. పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గెలుపు కోసం కార్యకర్తలు ప్రచార రథాల్లో తిరుగుతూ జోరుగా ప్రచారం నిర్వహించేలా వ్యూహం రూపొందిస్తున్నారు. అలాగే సీనియర్ నేతలు కూడా ప్రచార రథాలపైనే కదన రంగంలోకి దూకుతారని తెలుస్తోంది.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు బుద్ధి చెప్పాలి

బీజేపీని గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తాం..

- కార్యకర్తల సమావేశంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

శ్రీనగర్‌కాలనీ: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కి ప్రజలను మోసం చేసిందని, ప్రజలను అభివృద్ధికి దూరంగా ఉంచిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు ప్రజలు తగు బుద్ధి చెప్పాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం ఎర్రగడ్డలో బీజేపీ బూత్‌స్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గం ప్రశాంతంగా ఉండాలంటే బీజేపీకి అధికారాన్ని ఇవ్వాలని కోరారు. బీజేపీతోనే దేశం సుభిక్షంగా ఉందని, నియోజకవర్గంలో ప్రజలందరూ బీజేపీకి ఓటు వేయాలని కోరారు. కుటుంబ రాజకీయాలను ప్రోత్సహిస్తూ, అవినీతిని అధికం చేసే కాంగ్రెస్, బీఆర్‌ఎస్, మజ్లిస్ పార్టీలకు ఓటు అడిగే హక్కు లేదన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉంటే కాంగ్రెస్ వాళ్ళు బీఆర్‌ఎస్‌లో చేరుతారని, కాంగ్రెస్ అధికారంలో ఉంటే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరి పార్టీ ఫిరాయింపులతో వారి అవినీతిని కాపాడుకుంటున్నారని కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మజ్లిస్ పార్టీకి అభివృద్ధి, ప్రజా సమస్యలు అవసరం లేదని, కేవలం మత రాజకీయాలు మాత్రమే చేస్తుందని ఆరోపించారు. ఎవరు అధికారంలో ఉంటే వారికి వత్తాసు పలికే పార్టీ మజ్లిస్ అని అన్నారు. జూబ్లీహిల్స్‌లో భారతీయ జనతాపార్టీ అభ్యర్థి దీపక్‌రెడ్డిని గెలిపిస్తే అభివృద్ధి, సంక్షేమం ఎలా ఉంటుందో చూపిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ గరికపాటి మోహన్‌రావు, బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి, స్టేట్ జనరల్ సెక్రటరీ గౌతమ్‌రావు, సారంగపాణి, ఎర్రబల్లి ప్రదీప్‌రావు, డాక్టర్ చేకూరు హనుమంతనాయుడు, విజయ్ కుమార్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో గెలుపే లక్ష్యం



సమావేశంలో ఓట్‌చోర్ పత్రాలను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నేతలు

తెలంగాణకు కేసీఆర్ కుటుంబం ద్రోహం చేసింది

- తెలంగాణ ఇచ్చింది సోనియానే..
- ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్

వెంగళరావునగర్: రాష్ట్రం కోసం ఎంతో మంది బలిదానాలు చేశారని, వాటిని గుర్తించిన సోనియా గాంధీ చివరకు ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చారని ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అన్నారు. యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని మహమ్మద్ ఫంక్షన్‌హాల్, సోమాజిగూడ డివిజన్ పరిధిలోని శాలివాహననగర్ ఫంక్షన్‌హాల్‌లో గురువారం జరిగిన బూత్‌కమిటీ సమావేశాలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. తెలంగాణను అభివృద్ధి చేస్తారని నమ్మి ప్రత్యేక రాష్ట్రం ఇస్తే..కేసీఆర్ కుటుంబం ఏ మాత్రం అభివృద్ధి చేయలేదని విమర్శించారు. సన్నబియ్యం ఇచ్చింది, కేవలం మన రాష్ట్రంలో మాత్రమేనని, ఈ ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. ముఖ్యంగా జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో చివరి ఓటరు ఓటు వేసే వరకు బూత్ కమిటీ ఇన్‌చార్జిలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈవీఎంలకు తాళాలు వేసిన తర్వాతనే రిలాక్స్ కావాలని సూచించారు. జూబ్లీహిల్స్ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని చెప్పారు.

బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధి ఉంది..

పీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ జనాభా నిష్పత్తిని బట్టి తెలంగాణాలో బీసీలకు 42 రిజర్వేషన్లు ఇవ్వడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని అన్నారు. చివరి వరకు కూడా తాము ఇచ్చిన మాటకు నిలబడి ఉంటామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన అభివృద్ధిని చూసి తట్టుకోలేకనే బీఆర్‌ఎస్ తప్పుడు ప్రచారాలు చేస్తుందని అన్నారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు లక్ష మెజార్టీ రావాలంటే కనీసం 70 శాతం ఓటింగ్ జరిగేలా చూడాలని, ప్రతి ఇంటికి వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రచారం చేయాలన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ రెండూ ఒకటేనని ఆయా పార్టీలను నమ్మవద్దన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలు ఓట్లు అడగానికి వస్తే తమకేమి చేశారని, ఎందుకు మీకు ఓటు వేయాలని ప్రశ్నించాలని మంత్రులు సూచించారు. జూబ్లీహిల్స్ అభ్యర్థి నవీన్‌యాదవ్ మాట్లాడుతూ అధిష్ఠానం తనపై నమ్మకం ఉంచి టికెట్ ఇచ్చిందని, అధిష్ఠానం గౌరవం నిలబెట్టాలంటే ఇక్కడ హస్తం గుర్తుకు ఓటేసి గెలిపించుకోవాలని చెప్పారు. గత పదేళ్ళలో జూబ్లీహిల్స్‌లో అభివృద్ధి మాట దేవుడెరుగు నేతలు, కార్యకర్తలకు, ప్రజలకు అన్యాయమే ఎక్కువగా జరిగిందన్నారు. శుక్రవారం జరగనున్న నామినేషన్ కార్యక్రమానికి భారీగా తరలి రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్ యాదవ్, పార్టీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజారుద్దీన్, కార్పొరేటర్లు సి.ఎన్.రెడ్డి, విజయారెడ్డి, మాజీ కార్పొరేటర్ సంజయ్‌గౌడ్, సీనియర్ నాయకులు భవానీశంకర్, నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో ఓట్‌చోర్ సంతకాల సేకరణ పత్రాలను పంపిణీ చేశారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

వెంగళరావునగర్: త్వరలో జరగనున్న ఉప ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే ఓటర్లకు అన్ని సౌకర్యాలను కల్పించనున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి అధికారి ఆర్.వి.కర్ణన్ తెలియజేశారు. యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని యూసుఫ్‌గూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మారుతీనగర్‌లోని మహాత్మాగాంధీ మెమోరియల్ ఉన్నత పాఠశాల, ఇంజనీరింగ్స్ కాలనీలోని దక్ష స్కూల్స్‌లో ఏర్పాటు చేసిన 18 పోలింగ్ స్టేషన్లను ఆయన నిశితంగా పర్యవేక్షించారు. అనంతరం కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. కమిషనర్ వెంట జూబ్లీహిల్స్ అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ రజినీకాంత్ రెడ్డి తదితర సిబ్బంది ఉన్నారు.



పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న కమిషనర్ ఆర్‌వి.కర్ణన్

విశృంఖలానికి ఊచలే!

- మైనర్లతో అభ్యంతరకర వీడియోలు చేస్తున్న కొందరు
- తీవ్రంగా పరిగణించిన నగర పోలీసు కమిషనర్ సజ్జనర్
- పోక్సో యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరిక

సోషల్‌మీడియా ఇంటర్వ్యూలపై సిటీ పోలీసుల కన్ను



సాక్షి, సిటీబ్యూరో: ఇటీవల కాలంలో యూట్యూబ్ చానళ్లు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయాయి. దీంతో పాటు ఇతర సోషల్ మీడియాలోనూ పోటీ పెరిగిపోయింది. ఎవరికి వారు లైకులు, షేర్లు, వ్యూస్ కోసం వివిధ మార్గాలు ఎంచుకుంటున్నారు. కొందరైతే విశృంఖలానికి తెర లేపుతున్నారు. ఇంటర్వ్యూల పేరుతో మైనర్లను ఎంచుకుని అభ్యంతరకర వ్యాఖ్యలు చేయిస్తున్నారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న నగర పోలీసు కమిషనర్ విశ్వనాథ్ చన్నప్ప సజ్జనర్ గురువారం కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇలాంటి వీడియోలు, ఇంటర్వ్యూలను అధ్యయనం చేస్తూ పోక్సోతో పాటు కిడ్నాప్ కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు.

ఆల్గరిథెమ్.. అత్యంత ప్రమాదకరం

ఈ తరహాకు చెందిన అభ్యంతరకరమైన వీడియోలు, ఇంటర్వ్యూలు, రీల్స్ యూట్యూబ్‌తో పాటు ఇన్‌స్టాగామ్ తదితర సోషల్‌మీడియాల్లోనూ అందుబాటులో ఉంటున్నాయి. ఇటీవల కాలంలో సోషల్‌మీడియా ఖాతాలు, ఈ–కామర్స్ వెబ్‌సైట్లు తదితరాలన్నీ ప్రత్యేక ఆల్గరిథెమ్ ఆధారంగా పని చేస్తున్నాయి. ఈ ఆల్గరిథెమ్ సదరు వ్యక్తి ఏ తరహా కంటెంట్‌ను వీక్షిస్తున్నారు? ఎలాంటి వస్తువులు ఖరీదు చేస్తున్నారు? సెర్చ్ చేస్తున్నారు? అనే అంశాలను అధ్యయనం చేస్తుంది. ఐపీ అడ్రస్, మెయిల్ ఐడీ ఆధారంగా జరిగే ఈ ప్రక్రియలో ఆ వ్యక్తికి అదే తరహా కంటెంట్, ఉత్పత్తులకు సంబంధించిన వీడియోలు, యాప్స్ పదేపదే పంపిస్తుంది. ఈ కారణంగా ఇలాంటి వీడియోలు, రీల్స్‌ను పొరపాటున మైనర్లు ఒక్కసారి వీక్షిస్తే చాలు..వారికి పదే పదే అదే తరహావి కనిపిస్తాయి.

పోక్సోతో పాటు కిడ్నాప్ కేసుకు ఆస్కారం...

ప్రేమ, పెళ్లి, భాగస్వామ్యం తదితర అంశాలపై మైనర్లలో సరైన అవగాహన పెరిగేలా, వారు పెడదారి పట్టకుండా వీడియోలు రూపొందిస్తే ఇబ్బంది ఉండదు. అయితే మైనర్ల ప్రేమ వ్యవహారాలు, ముద్దుముచ్చట్లను రీల్స్, వీడియోలు, ఇంటర్వ్యూలుగా చిత్రీకరించి మరింత మందిని పెడదోవ పట్టించడం నేరమే అవుతుంది. ఈ వీడియోలతో పాటు వాటిలో మైనర్లు, యాంకర్లు చేస్తున్న వ్యాఖ్యల నేపథ్యంలో పోక్సో యాక్ట్‌లోని పలు సెక్షన్ల కింద యాంకర్లు, నిర్వాహకులపై కేసులు నమోదు చేయవచ్చు. ఈ ఇంటర్వ్యూల కోసం ఆ మైనర్లను వివిధ ప్రాంతాల నుంచి మరో ప్రాంతానికి తరలించడమూ నేరమే. దీనికి సంబంధించి కిడ్నాప్ కేసు నమోదు చేసే అవకాశమూ ఉంది. ఇవన్నీ పరిశీలించిన కొత్వాల్ సజ్జనర్ ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. దీనిపై గురువారం కొత్వాల్ 'ఎక్స్' ద్వారా ఆదేశాలు జారీ చేశారు. ఇవి చూసిన అనేక మంది తమ వీడియోలు, రీల్స్, ఇంటర్వ్యూలను డిలీట్ చేస్తుండటం గమనార్హం.

వ్యూస్ కోసం విలువలు వదిలేస్తారా?



వ్యూస్, లైక్స్‌తో పాటు సోషల్ మీడియాలో ఫేమస్ కావడానికి చిన్నారుల భవిష్యత్తును ఫణంగా పెట్టడం ఎంత వరకు సమంజసం? ఇది విలువలను వదిలేయడంతో సమానం. మైనర్లతో అసభ్యకరమైన కంటెంట్ చేస్తూ సభ్య సమాజానికి ఏం సందేశం ఇస్తున్నారు? ఇలాంటి వీడియోలు వారితో చేసి పిల్లలను పెడదోవ పట్టించొద్దు. అలా చేయడం బాలల హక్కుల ఉల్లంఘన మాత్రమే కాదు..చట్టరీత్యా నేరం. బాలబాలికల్ని ఇలాంటి కంటెంట్‌లో భాగం చేయడం చైల్డ్ ఎక్స్‌ప్లాయిటేషనే అవుతుంది. ఇప్పటికే ఉన్న కంటెంట్‌ను తొలగించకున్నా, భవిష్యత్తులో అప్‌లోడ్ చేసినా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం. ఎవరైనా ఇలాంటి వీడియోలు, రీల్స్ గమనిస్తే 1930కు ఫోన్ చేసి లేదా (cybercrime.gov.in) ద్వారా ఫిర్యాదు చేయండి. పిల్లల బాల్యాన్ని, మానసిక ఆరోగ్యాన్ని, భవిష్యత్తును కాపాడటం కూడా తల్లిదండ్రుల బాధ్యతే. – వీసీ సజ్జనర్, నగర కొత్వాల్

నామినేషన్లు బేరీజు వేస్తున్న అధికారులు

తొలి ర్యాండమైజేషన్ పూర్తయిన బ్యాలెట్ యూనిట్లు స్ట్రాంగ్ రూముల్లోకి..

సాక్షి, సిటీబ్యూరో: జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికకు సంబంధించి 407 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 569 బ్యాలెట్ యూనిట్లు, 569 కంట్రోల్ యూనిట్లు, 610 వీవీప్యాట్స్‌ను అధికారులు కేటాయించారు. పోటీ చేసే అభ్యర్థుల సంఖ్య పరిమితంగానే ఉంటుందని, గత అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని సాంకేతిక సమస్యలు తలెత్తితే వినియోగించేందుకని కొంత శాతం రిజర్వుతో వీటిని కేటాయించారు. నామినేషన్లు వేస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. వివిధ బాధిత వర్గాలకు చెందిన వారు ఇండిపెండెంట్లుగా నామి నేషన్లు దాఖలు చేసేందుకు సిద్ధమైన నేపథ్యంలో అధికారులు పరిస్థితులను బేరీజు వేస్తున్నారు. ఉపసంహరణలు ముగిశాక భారీ సంఖ్యలో అభ్యర్థు లు బరిలో ఉంటే ఏంచేయాలా అనే యోచనలో పడ్డారు. కేటాయించిన బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్ల మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తయినట్లు పేర్కొన్నారు. వీటిని స్ట్రాంగ్‌రూముల్లో భద్రరిచారు.

నాలుగవ రోజు 21 నామినేషన్లు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో నాల్గో రోజైన గురువారం 21 నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తం 16 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, ఐదుగురు అభ్యర్థులు రెండో సెట్ దాఖలు చేశారు. ఇప్పటివరకు నామినేషన్లు వేసిన వారి సంఖ్య 56కు చేరింది. నామినేషన్ల కోసం దరఖాస్తులు స్వీకరించిన వారి సంఖ్య 148కు చేరింది. ఇదిలా ఉండగా గురువారం నామినేషన్లు దాఖలు చేసిన వారిలో స్వతంత్ర అభ్యర్థి సుధాకర్ రావు, తెలంగాణ ప్రజా జీవన రైతు పార్టీ అభ్యర్థి శోభన్‌బాబు, స్వతంత్ర అభ్యర్థి బుషిపాక వెంకటయ్య, దేవినేని కన్నాచౌదరి పసుపులేటి, టీఎంఓబీసీ రాజ్యం పార్టీ అభ్యర్థిగా జహీర్‌ఖాన్, స్వతంత్ర అభ్యర్థిగా మారం వెంకట్‌రెడ్డి, రేఖల సైదులు, బండారు నాగరాజు, మూడో సెట్ దాఖలు చేసిన వేముల విక్రంరెడ్డి తదితరులు ఉన్నారు.

పోలీసు అమరవీరుల స్థూపం పనుల పరిశీలన

గన్‌ఫౌండ్రీ: గోషామహల్ పోలీస్ స్టేడియంలో నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ అమరవీరుల స్థూపం నిర్మాణ పనులను గురువారం తెలంగాణ రాష్ట్ర డీజీపీ బి.శివధర్‌రెడ్డి పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన పోలీస్ అమరవీరుల దినం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అమరవీరుల స్థూపం నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. డీజీపీ వెంట అదనపు డీజీ పీ మహేష్ భగవత్, నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ ఎం.రమేష్, నగర జాయింట్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ సీపీ (ట్రాఫిక్) జోయల్ డేవిస్ తదితరులు ఉన్నారు.



పనులు పరిశీలిస్తున్న డీజీపీ శివధర్‌రెడ్డి

అమీర్‌పేటలో ముంపు సమస్యకు చెక్

నాలాల్లోని పూడిక తొలగించడంతో తీరిన ఇబ్బంది

- ఊపిరి పీల్చుకున్న మైత్రీవనం, గాయత్రి నగర్...



పనులు పర్యవేక్షిస్తున్న రంగనాథ్

సాక్షి, సిటీబ్యూరో: రాజధానిలో ఏమాత్రం వర్షం కురిసినా రహదారులన్నీ జలమయం అవుతాయి. అమీర్‌పేట చుట్టుపక్కల ప్రాంతాల విషయం విడిగా చెప్పక్కర్లేదు. ఇక్కడి సమస్యల్ని అధ్యయనం చేసిన హైడ్రా నాలాల పూడిక తీతే తొలి పరిష్కారంగా గుర్తించింది. జీహెచ్‌ఎంసీ, జలమండలి, ఇరిగేషన్ అధికారులతో కలిసి ముందుకు వెళ్లింది. ఫలితంగా మైత్రీవనంతో పాటు గాయత్రి నగర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ముంపు సమస్య తప్పింది. కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం ఆయా ప్రాంతాల్లో పర్యటించి పనులను పర్యవేక్షించారు. జూబ్లీహిల్స్, గాయత్రీ హిల్స్, యూసుఫ్‌గూడ, కృష్ణానగర్, మధురానగర్, శ్రీనివాసనగర్ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు అమీర్‌పేట నుంచి ముందుకు వెళ్లడానికి అనేక అడ్డంకులు ఉండేవి. దీంతో ఆ ప్రాంతంతో పాటు చుట్టుపక్కల రహదారిపై భారీగా నిలిచిపోయేవి.

అమీర్‌పేట జంక్షన్‌లో సారథీ స్టూడియోస్, మధురానగర్ వైపు నుంచి వచ్చే పైపులైన్లు కలుస్తాయి. దీంతో ఎగువ నుంచి వరదతో పాటు భారీ మొత్తంలో చెత్త కూడా వాటి ద్వారా అక్కడకు చేరుతోంది. అలా దశాబ్దాలుగా చేరిన చెత్తతో అమీర్‌పేట జంక్షన్‌లో ఆరు పైపులైన్లు పూడుకుపోయాయి. దీంతో కొంత మొత్తంలోనే వరద నీరు ముందుకు సాగేది. శ్రీనివాస నగర్ వైపు వరద కాలువ పైన కాంక్రీట్‌తో వేసిన పైకప్పు తెరచి పూడిక తీత పనులను హైడ్రా చేపట్టింది. పరుపులు, దిండ్లు ఇలా చెత్తతో మూసుకుపోయిన పైపులైన్లను తెరచింది. ఇప్పటి వరకూ దాదాపు 45 ట్రక్కుల మట్టిని తొలగించింది. దీంతో ఇటీవల అక్కడ 10 సెంటీమీటర్ల వర్షం పడినా ఇబ్బంది కలగలేదు. మరో మూడు పైపు లైన్లలో కూడా పూడికను తొలగిస్తే 15 సెంటీమీటర్ల వర్షం పడినా అమీర్‌పేటలో వరద ముంచెత్తదని అధికారులు చెప్తున్నారు. ఇదే మాదిరి నగరంలోని ముంపు సమస్యను ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో కల్వర్టులు, అండర్‌గ్రౌండ్ పైపు లైన్లలో పూడికను తొలగించి పరిష్కారం చూపాలని రంగనాథ్ సూచించారు. అమీర్‌పేటలో వరద ముప్పు తప్పించేందుకు అనుసరించిన విధానం నగరంలోని అనేక ప్రాంతాలకు అనుసరణీయమని తెలిపారు. పూడుకుపోయిన నాలాలను ఇదే మాదిరి తెరిస్తే చాలావరకు వరద సమస్యకు పరిష్కారం అవుతుందని అన్నారు.

రోడ్ సేఫ్టీపై స్పెషల్ డ్రైవ్

16 వేల పాట్‌హోల్స్‌కు మరమ్మతులు

- రాత్రింబవళ్లు కొనసాగుతున్న పనులు

సాక్షి, సిటీబ్యూరో: ఇటీవలి వర్షాలకు దారుణంగా దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులపై జీహెచ్‌ఎంసీ సీరియస్‌గా దృష్టిసారించింది. రోడ్ల భద్రతను దృష్టిలో పెట్టుకుని రాత్రింబవళ్లు మరమ్మతు పనులు ముమ్మరంగా చేస్తోంది. వర్షాలు తెరిపినివ్వడంతో పగలూ రేయీ పనులు చేస్తున్నట్లు, మిషన్‌మోడ్‌లో పనులు జరుగుతున్నాయని ఇంజినీర్లు చెబుతున్నారు. ఈ నెల 15వ తేదీ వరకు 18 వేలకు పైగా పాట్‌హోల్స్ గుర్తించగా, ఇప్పటి వరకు దాదాపు 16 వేల పాట్‌హోల్స్ పనులు పూర్తయినట్లు చీఫ్ ఇంజినీర్ రత్నాకర్ సహదేవ్ (మెయింటనెన్స్) తెలిపారు. నగర ప్రజల ప్రయాణం సాఫీగా సాగేందుకు, ట్రాఫిక్ జామ్‌లు లేకుండా ఉండేందుకు రోడ్ సేఫ్టీ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పగలూ రేయీ పనులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ ఆదేశాలకనుగుణంగా, తిరిగి వర్షాలు రాకముందే వందశాతం పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పాట్‌హోల్స్ పూడ్చివేతల పనులతోపాటు క్యాచ్ పిట్స్ రిపేర్లు, దెబ్బతిన్న మూతల మార్పిడి, సెంట్రల్ మీడియన్ల మరమ్మతులు సైతం జరిగేలా చీఫ్ ఇంజినీర్ వరకు క్షేత్రస్థాయిలో పనులు పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటి వరకు 805 క్యాచ్ పిట్స్ రిపేర్లు, 388 మూతల మార్పిడితో పాటు పలు ప్రాంతాల్లో సెంట్రల్ మీడియన్ పనులు కూడా జరిగినట్లు ఇంజినీర్లు పేర్కొన్నారు.



జోన్ల వారీగా వివరాలు..

ఎల్బీనగర్ జోన్‌లో 3042 పాట్ హోల్స్, చార్మినార్ జోన్‌లో 2415, ఖైరతాబాద్ జోన్‌లో 24539, శేరిలింగంపల్లి జోన్‌లో 1763, కూకట్‌పల్లి జోన్‌లో 2508, సికింద్రాబాద్ జోన్‌లో పాట్‌హోల్స్ మరమ్మతులు పూర్తయినట్లు కమిషనర్ కర్ణన్ పేర్కొన్నారు. ప్రజలకు ఇళ్ల నుంచి పని ప్రదేశాలకు రాకపోకల్లో ఇబ్బందులు తలెత్తకుండా , ట్రాఫిక్ జామ్‌లు కాకుండా రోడ్ల మరమ్మతు పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ జర్నలిస్టు కాలనీలోని ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న కాంట్రాక్టర్‌పై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే... భవానీ శంకర్ అనే వ్యక్తి జర్నలిస్టు కాలనీలో 371 గజాల స్థలంలోకి అక్రమంగా ప్రవేశించడమే కాకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని షేక్‌పేట్ మండల తహసీల్దార్ అనితారెడ్డి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 403లో ఉన్న 371 గజాల ప్రభుత్వ స్థలంలో ప్రహరీ నిర్మించడంతో పాటు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

గ్లోబల్ టూరిస్టులను ఆకర్షించేలా ప్రత్యేక పాలసీ

పర్యాటక శాఖ మంత్రి జూపల్లి

- పర్యాటకరంగం అభివృద్ధితో ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కల్పన
- ఓయూ విద్యార్థులు టూరిజాన్ని ప్రమోట్ చేయాలి


సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి,ఓయూ వీసీ ప్రొ కుమార్

లాలాపేట: గ్లోబల్ టూరిస్టులను ఆకర్షించేలా ప్రత్యేక పాలసీ అమలు చేసి తెలంగాణ టూరిజాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం ఉస్మానియా యూనివర్సిటీలోని కామర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ' గ్లోబల్ టూరిజం ఏ న్యూ అవెన్యూస్ అండ్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ ' అంశంపై చేపట్టిన మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ సాధన ఉద్యమంలో విద్యార్థులు, అధ్యాపకుల పాత్ర ఎనలేనిదన్నారు. ఉద్యోగాల కల్పనలో భాగంగా ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్‌లో పెద్ద ఎత్తున ఉద్యోగాలను కల్పిస్తున్నామన్నారు. ఉద్యోగాల కల్పనలో టూరిజం పాత్ర ఎంతో ముఖ్యమైందన్నారు. టూరిజంలో దేశం, తెలంగాణ వెనుకబడి ఉన్నాయన్నారు. సింగపూర్, దుబాయ్‌తో పోటీ పడి టూరిజాన్ని ప్రమోట్ చేయడం ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు దక్కుతాయన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని వి. ధంగా ఎన్నో చారిత్రక కట్టడాలు, సుందరమైన ప్రదేశాలు, నదీ జలాలు, అటవీ ప్రాంతాలు ఉన్నాయి. టూరిజంలో మౌలిక వసతులు లేక అభివృద్ధికి నోచుకోలేదన్నారు. హైదరాబాద్ నగరంలో ఇటీవల నిర్వహించిన మిస్ వరల్డ్ పోటీలతో రాష్ట్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా పరిచయం చేడానికి కొంత ఉపయోగపడిందన్నారు.

పదేళ్లుగా టూరిజం పాలసీ లేదు.

గత 64 ఏళ్ల కాలంలో 22 మంది ముఖ్యమంత్రులు పాలనలో రాష్ట్రంలో ఉన్న రూ. 70 వేల కోట్లు అప్పులు ఉంటే, గత ప్రభుత్వ హయాంలో రూ. 8 లక్షల కోట్లు అప్పులు చేశారని ఆరోపించారు. గడచిన పదేళ్ల కాలంలో రాష్ట్రంలో టూరిజం పాలసీ లేదని సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో ప్రత్యేక టూరిజం పాలసీని రూపొందించామన్నారు. ప్రస్తుతం టూరిజం ద్వారా వస్తున్న ఆదాయం రూ.12 కోట్లు మాత్రమే అన్నారు. టూరిజాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రైవేట్ ఇన్వెస్టర్లను ఆహ్వానిస్తున్నామన్నారు. తద్వారా పర్యాటక రంగాన్ని, తెలంగాణ సంస్కృతి, కళలను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో ప్రముఖ ప్రాత పోషించిన ఉస్మానియా యూనివర్సిటీ తెలంగాణ పర్యాటక రంగాన్ని ప్రమోట్ చేసేలా నూతన విధానలను ఆవిష్కరించాలని కోరారు. వారంలో రెండు రోజుల పాటు పర్యాటక ప్రాంతాలను సందర్శించి అక్కడ రీల్స్ చేసి సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. అనంతరం తెలంగాణ టూరిజంపై రూపొందించిన హిందీ పాటను స్వయంగా తన సెల్‌ఫోన్ ద్వారా విద్యార్థులకు వినిపించారు.

- మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ తెలంగాణలో ప్రకృతి ప్రసాదించిన ఆకుపచ్చ తెలంగాణ, సస్యశ్యామలమైన తెలంగాణగా పేర్కొన్నారు. తెలంగాణ పర్యాటక రంగాన్ని అగ్రగామిగా నిలబెట్టడానికి ఓయూ విద్యార్థులు భాగస్వాములు కావాలన్నారు. పర్యాటక ప్రాంతాలపై సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసేలా ఓ ప్రత్యేకమైన ఆధునిక విధానాన్ని రూపొందించాలని కోరారు. ఎమ్మెల్సీ డా. అద్దంకి దయాకర్ మాట్లాడుతూ ఓయూ ఆర్ట్స్ కళాశాలను టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేయాలన్నారు. అనంతరం సదస్సు సావనీర్‌ను ఆవిష్కరించారు. ఓయూ వైస్ చాన్సలర్ ప్రొ కుమార్ అధ్యక్షతన జరిగిన ఐపీఈ డైరెక్టర్ ప్రొ శ్రీనివాసమూర్తి, సదస్సు చైర్మన్ ప్రొ గంగాధర్, కాన్ఫరెన్స్ డైరెక్టర్ ప్రొ. డి. చెన్నప్ప, కన్వీనర్లు కృష్ణచైతన్య, ఇంద్రకాంతి శేకర్, ప్యాట్రిక్, వివిధ దేశాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.

డెక్కన్ కిచెన్ కేసుపై విచారణ వాయిదా

వచ్చే వాయిదాకు దగ్గుబాటి కుటుంబ సభ్యులు తప్పకుండా హాజరు కావాలని నాంపల్లి కోర్టు ఆదేశాలు

సిటీ కోర్టులు: వచ్చే విచారణకు దగ్గుబాటి ఫ్యామిలీ కుటుంబ సభ్యులైన హీరో వెంకటేశ్, రానా, సురేశ్ కోర్టులో హాజరుకావాల్సిందేనని నాంపల్లిలోని 17వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా గత విచారణలో సూచించిన పూచీకత్తులు దాఖలు చేయలేదని, తదుపరి విచారణలోపు ఒక్కొక్కరూ రూ.10 వేలతో రెండు పూచీకత్తులను దాఖలు చేయాలని వారి తరుపు న్యాయవాదికి సూచించారు. అనంతరం తదుపరి విచారణను నవంబర్ 14కు వాయిదా వేసింది. ఫిల్మ్‌నగర్ భూ వివాదంపై నాంపల్లి కోర్టులో విచారణ జరిగింది. ఫిల్మ్‌నగర్‌లోని తన డెక్కన్ కిచెన్ హోటల్‌ను అక్రమంగా కూల్చివేశారని నందకుమార్ అనే వ్యక్తి హీరోలు దగ్గుబాటి రానా, వెంకటేశ్, సురేశ్‌లపై కేసు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసుపై గురువారం నాంపల్లిలోని 17వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్‌లో విచారణ జరిగింది. గైర్హాజరైన వారి తరుపు న్యాయవాది పిటిషన్లను దాఖలు చేశారు. ఫిర్యాదుదారుడు నందకుమార్ విచారణకు హాజరయ్యారు. దగ్గుబాటి కుటుంబం దురుద్దేశపూర్వకంగా తన డెక్కన్ కిచెన్ హోటల్‌ను కూల్చివేయించి ఇబ్బందులకు గురిచేస్తున్నదని, వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని నందకుమార్ కోర్టుకు విన్నవించుకున్నారు. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు గత విచారణలో నిందితులు అందరూ వచ్చే విచారణకు హాజరు కావాలని తెలిపినా ఈ విచారణకు హాజరుకాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఆస్తితగాదాలో కత్తిపోట్లకు గురైన వ్యక్తి మృతి

మొయినాబాద్‌రూరల్: ఆస్తి తగాదాల కారణంగా కత్తిపోట్లకు గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. ఈ నెల 11న సురంగల్ గ్రామం కొత్రాస్‌లలో ఇంటి స్థలం విషయంలో జరిగిన గొడవలో రామగళ్ల శ్యామ్(45)తో సోదరుడు నందు, సావిత్రి దంపతులతో పాటు వీరి కుమారుడు ప్రసాద్ గొడవపడ్డారు. ఈ క్రమంలో ప్రసాద్ కత్తితో దాడి చేయడంతో గాయపడిన శ్యామ్‌ను నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు ప్రసాద్‌తో పాటు అతని తల్లిదండ్రులను 12వ తేదీన రిమాండ్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న క్షతగాత్రుడుగురువారం మృతి చెందాడు.

డీసీసీలో యువతకు పెద్దపీట


మాట్లాడుతున్న ఏఐసీసీ సభ్యుడు, తిరునెల్వేలి ఎంపీ రాబర్ట్ బ్రూస్

చందానగర్: నిబద్ధత, క్రమశిక్షణ, సమర్థత ఉన్న నాయకుడినే డీసీసీ అధ్యక్షుడిగా ఎంపిక చేస్తామని ఏఐసీసీ సభ్యుడు తిరునెల్వేలి పార్లమెంట్ సభ్యుడు రాబర్ట్ బ్రూస్ అన్నారు. గురువారం శేరిలింగపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అధ్యక్షతన హఫీజ్‌పేట్ డివిజన్ పరిధి హుడా కాలనీ ఎంఎస్‌పీ కన్వెన్షన్ సెంటర్‌లో అభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ సభ్యుడు, తిరునెల్వేలి ఎంపీ రాబర్ట్ బ్రూస్, పీసీసీ ఉపాధ్యక్షుడు కోటంరెడ్డి వినయ్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రతీ కార్యకర్త అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకుని పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కాంగ్రెస్ శక్తిని పునరుద్ధరించేందుకు సమన్వయంగా పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ యువతకు ప్రాధాన్యత ఇస్తుందని.. డీసీసీ కమిటీలోనూ వారికి పెద్దపీట వేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, ఉప్పలపాటి శ్రీకాంత్, నార్నె శ్రీనివాసరావు, దొడ్ల వెంకటేశ్ గౌడ్, నియోజకవర్గ కోఆర్డినేటర్ రఘునందన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ అశోక్‌గౌడ్, నియోజకవర్గ సీనియర్ నాయకులు, కంటెస్టెడ్ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

భర్త మృతిని తట్టుకోలేక..

దశదినకర్మలోపే భార్య మృతి


బాబ్జీ, జయప్రద దంపతులు (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: భర్త దశదిన కర్మ రోజే భార్య అంత్యక్రియలు నిర్వహించిన విషాద ఘటన అబ్దుల్లాపూర్‌మెట్‌లో గురువారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. అబ్దుల్లాపూర్‌మెట్‌లో నివాసముంటున్న సీనియర్ జర్నలిస్ట్ మేడపాటి బాబ్జీ(62) ఈనెల 5న గుండెపోటుతో చనిపోయారు. భర్త మరణాన్ని తట్టుకోలేకపోయిన జయప్రద(58) మనోవేదనతో అస్వస్థతకు గురైంది. ఈక్రమంలో ఆమెను ఆస్పత్రిలో చేర్పించగా 14న చనిపోయింది. తెల్లవారితే తండ్రి దశదినకర్మ చేయాల్సిన పిల్లలు తల్లి అంత్యక్రియలు నిర్వహించారు. సీనియర్ జర్నలిస్ట్ మామిడి సోమయ్య తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

అద్దెకు తీసుకుని అమ్మేస్తారు..

- ఇద్దరు నిందితుల రిమాండ్
- పరారీలో మరొకరు
- ఏడు వాహనాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి, స్వాధీనం చేసుకున్న వాహనాలు

చిలకలగూడ : ఎక్కువ అద్దె చెల్లిస్తామని నమ్మించి కార్లను అద్దెకు తీసుకుంటారు. రెండు నెలలు సక్రమంగా అద్దె చెల్లించి, ఆపై వాటిని అక్రమంగా తక్కువ ధరకు విక్రయించడమేగాక వాహన యజమానులపై బెదిరింపులకు పాల్పడుతున్న ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రూ.80 లక్షల విలువైన ఏడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. చిలకలగూడ ఠాణాలో గురువారం అడిషనల్ డీసీపీ నర్సయ్య, చిలకలగూడ ఏసీపీ శశాంక్‌రెడ్డి, ఎస్‌హెచ్‌ఓ అనుదీప్‌లతో కలిసి ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి వివరాలు వెల్లడించారు. సికింద్రాబాద్ నామాలగుండు ఉప్పరి బస్తీకి చెందిన సంగిశెట్టి ప్రవీణ్‌కుమార్ డ్రైవర్‌గా పని చేసేవాడు. జల్సాలకు అలవాటు పడిన అతను సులువుగా డబ్బులు సంపాదించేందుకు తార్నాకకు చెందిన అమరేందర్, మహ్మద్ రిజ్వాన్‌తో జత కట్టాడు. శ్రీలక్ష్మి లాజిస్టిక్ పేరుతో సంస్థను ఏర్పాటు చేశారు. కార్ల యజమానులను సంప్రదించి తమకు వాహనాలు అద్దెకు ఇస్తే సెవెన్ సీటర్‌కు నెలకు రూ.25వేలు, ఫైవ్ సీటర్‌కు రూ. 20 వేలు అద్దె చెల్లిస్తామని ప్రచారం చేసుకున్నారు. రెండు నెలల పాటు సక్రమంగా అద్దె చెల్లించి ఆ తర్వాత మొహం చాటేస్తారు. సదరు వాహనాలను తక్కువ ధరకు విక్రయించి వచ్చిన సొమ్ముతో జల్సాలు చేసేవారు. నెల అద్దె లేదా వాహనం ఇవ్వాలని అడిగిన యజమానులపై బెదిరింపులకు దిగేవారు. అంబర్‌పేటకు చెందిన జ్ఞానేశ్వర్ తన ఎర్టిగా కారును మూడు నెలల క్రితం వారికి అద్దెకు ఇచ్చాడు. అద్దె డబ్బులు, వాహనం తిరిగి ఇవ్వకపోవడంతో మోసయినట్లు గుర్తించిన బాధితుడు పోలీసులకు ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టిన పోలీసులు నిందితులు ఇదే తరహాలో పలువురి నుంచి అద్దెకు తీసుకున్న వాహనాలను తక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు గుర్తించారు. ప్రధాన నిందితుడు సంగిశెట్టి ప్రవీణ్‌కుమార్, అమరేందర్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాలు అంగీకరించారు. వారి నుంచి సుమారు రూ.80 లక్షల విలువైన ఏడు కార్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న మరో నిందితుడు మహ్మద్ రిజ్వాన్ కోసం గాలిస్తున్నారు. కేసును చేధించిన చిలకలగూడ ఎస్‌హెచ్‌ఓ అనుదీప్, ఎస్‌ఐలు రవికుమార్, ఆంజనేయులు, సిబ్బందిని డీసీపీ అభినందించి రివార్డులు అందించారు.

ప్రైవేట్ బస్సు బీభత్సం

- టైర్ పేలడంతో ఘటన
- డివైడర్ అవతలి వైపు ఉన్న బొలెరోను ఢీకొట్టిన వైనం



రాజేంద్రనగర్: హిమాయత్‌సాగర్ ఔటర్ రింగ్ రోడ్డుపై గురువారం ఉదయం ఓ ప్రైవేటు బస్సు బీభత్సం సృష్టించింది. 100 కిలో మీటర్ల వేగంతో వెళుతున్న బస్సు టైర్ పేలిపోవడంతో బస్సు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి అవతలిపై వైపు రోడ్డుపైకి దూసుకెళ్లింది. అటుగా వస్తున్న బొలేరో వాహనాన్ని ఢీకొట్టి 10 మీటర్ల దూరం లాక్కెళ్లింది. ఈ ఘటనలో 10 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఆ సమయంలో అటుగా వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నాగపూర్ నుంచి నగరానికి వస్తున్న ప్రైవేట్ బస్సు గచ్చిబౌలి ప్రాంతంలో ప్రయాణికులను దింపి ఔటర్ మీదుగా ఎగ్జిట్ 17 నుంచి రాజేంద్రనగర్ ఆరాంఘర్ చౌరస్తాకు వెళ్లాల్సి ఉంది. ఉదయం అప్పా నుంచి హిమాయత్‌సాగర్‌కు వస్తుండగా బస్సు టైర్లు ఒక్కసారిగా పేలిపోవడంతో వాహనం అదుపుతప్పింది. డ్రైవర్ వాహనాన్ని నియంత్రించే క్రమంలో ఫుట్‌పాత్‌ను ఢీకొట్టి విద్యుత్ స్తంభంతో పాటు చెట్లను ఢీకొని రోడ్డు అవతలివైపు దూసుకెళ్లింది. అదే సమయంలో శంషాబాద్ కూరగాయల మార్కెట్‌లో కూరగాయలు అన్‌లోడ్ చేసి వెళుతున్న బొలెరోను ఢీకొట్టి రోడ్డుపై నుంచి ఈడ్చుకెళ్లింది. రోడ్డు పక్కనే ఉన్న బారికేడ్లను ఢీకొని ఆగిపోయింది. ఈ ఘటనలో బొలెరో డ్రైవర్‌తో పాటు బస్సు డ్రైవర్ అందులోని 8 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఆ సమయంలో అటుగా వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సంఘటన జరిగిన వెంటనే గాయాలతో ఉన్న డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలి పారిపోయాడు. బొలెరో డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

45 రోజుల్లో 1061 ఫోన్లు రికవరీ


రికవరీ చేసిన ఫోన్లతో సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి, సీసీఎస్ పోలీసులు

గచ్చిబౌలి: చోరీకి గురైన, అనుకోకుండా పోగొట్టుకున్న ఫోన్ల రికవరీలో తెలంగాణ పోలీసులు ముందంజలో ఉన్నారని క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి అన్నారు. 45 రోజుల్లో 1061 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగిస్తున్నట్లు తెలిపారు. గురువారం సైబరాబాద్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రికవరీ సెల్ ఫోన్లను బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ఎవరైనా మొబైల్ ఫోన్ పోగొట్టుకుంటే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సమాచారం పోర్టల్‌లో పొందుపరిచి ఫోన్‌ను రికవరీ చేసేందుకు వీలుంటుందన్నారు. వ్యక్తిగత, ఆర్థిక సమాచారం ఫోన్లలోనే ఉంటుందని, ఆలస్యం చేస్తే నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. త్వరగా ఫిర్యాదు చేయకపోతే ఆ ఫోన్‌ను తప్పుడు పనులకు వాడితే మీరు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. సైబర్ క్రైమ్ బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలంటే 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. 2023 నుంచి ఇప్పటి వరకు 13,423 ఫోన్లను రికవరీ చేసినట్లు తెలిపారు. 45 రోజుల్లో రూ.3.20 కోట్ల విలువైన 1061 ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసినట్లు తెలిపారు. మాదాపూర్ సీసీఎస్ 240, బాలానగర్ సీసీఎస్ 188, మెడ్చెల్ సీసీఎస్ 195, రాజేంద్రనగర్ సీసీఎస్ 233, శంషాబాద్ సీసీఎస్ పోలీసులు 205 ఫోన్లను రికవరీ చేసినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో క్రైమ్స్ ఏడీసీపీ రాంకుమార్, సీసీఎస్ ఏసీపీ నాగేశ్వర్ రావు, ఇన్‌స్పెక్టర్లు సంజీవ్, రవి కుమార్, రాజేష్, సీసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.


బాధితుడికి ఫోన్ అందజేస్తున్న డీసీపీ

డేటింగ్... లూటింగ్!

సాక్షి, సిటీబ్యూరో: వివాహం లేదా సహజీవనం చేయడానికి భాగస్వామి కోసం డేటింగ్ సైట్స్‌లో సెర్చ్ చేసిన మలక్‌పేట యువకుడు (32) సైబర్ నేరగాళ్ల వల్లో చిక్కాడు. వారి మాటలు నమ్మి రూ.6.49 లక్షలు కోల్పోయాడు. ఆన్‌లైన్‌లో సెర్చ్ చేయగా... గత నెల 7న సదరు యువకుడికి తాన్య శర్మ అని చెప్పుకున్న మహిళ నుంచి వాట్సాప్ కాల్ వచ్చింది. రూ.1,950 చెల్లించి తమ ఫ్రెండ్‌షిప్ గ్రూపులో చేరాలని పేర్కొంది. అలా చేసిన తర్వాత ప్రీతి, రితికా పేర్లతో మరో ఇద్దరు సంప్రదించారు. వారు హోటల్ బుకింగ్, మీటింగ్ కన్ఫర్మేషన్, సర్వీస్ టాక్స్, రీఫండ్ ప్రాసెస్, ఖాతా ధ్రువీకరణ, గోప్యత భద్రత తదితరాల కింద రీఫండబుల్ కేటగిరీ అంటూ మరికొంత గుంజారు. మొత్తమ్మీద రూ.6,49,840 కోల్పోయిన బాధితుడు గురువారం సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడం కేసు నమోదైంది.

తల్లిదండ్రులపై కత్తితో తనయుడి దాడి

మణికొండ: మానసిక సమస్యలతో బాధపడుతున్న ఓ యువకుడు తల్లి తండ్రులపై కత్తితో దాడి చేసిన సంఘటన గండిపేటలోని ఈపీఎల్ అపిల గేటెడ్ కమ్యూనిటీలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. నార్సింగి ఎస్సై గోపి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. భారతి, రవీందర్‌రెడ్డి దంపతుల కుమారుడు రఘుపాల్‌రెడ్డి ఓ ప్రైవేటు కళాశాలలో ఎల్ఎల్‌బీ చదువుతున్నాడు. గత కొంత కాలంగా మానసిక సమస్యలతో బాధ పడుతున్నాడు. దీనిని గుర్తించిన అతడి తల్లితండ్రులు మానసిక వైద్యుడికి చూపించాలని భావించారు. ఈ విషయం తెలుసుకున్న అతను తనకు ఏమి కాలేదని, అనవసరంగా మానసిక రోగిగా ముద్ర వేస్తున్నారనే కోపంతో బుధవారం రాత్రి ఇంట్లో కూరగాయాలు కోసే కత్తితో వారిపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టగా గత కొంత కాలంగా తమ కుమారుడు మతి స్థిమితం కోల్పోయాడని, అతడి డాక్టర్‌కు చూపిస్తామని చెప్పినందుకు తమపై దాడి చేశాడని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నీవు లేక నేనుండలేనని..

- నాలుగు రోజుల క్రితం భార్య మృతి
- మనస్తాపంతో భర్త ఆత్మహత్య


రాజశేఖర్ మృతదేహం

సికింద్రాబాద్:భార్య మృతిని జీర్ణించుకోలేక ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం సికింద్రాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ డేవిడ్‌రాజు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. సంజీవయ్యపార్కు రైల్వేస్టేషన్ సమీపంలోని అప్‌లైన్ వద్ద మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు మృతుడు బేగంపేట డివిజన్ పాటిగడ్డకు చెందిన కావలి రాజశేఖర్ (32) గుర్తించారు. నాలుగు రోజుల క్రితం రాజశేఖర్ భార్య మృతి చెందింది. అప్పటి నుంచి అతను మద్యం తాగుతూనే ఉన్నాడు. మద్యం మత్తులో అతను బుధవారం అర్ధరాత్రి సంజీవయ్య పార్కు సమీపంలోని రైలుపట్టాలపైకి చేరుకున్నాడు. అదే సమయంలో వేగంగా వచ్చిన రైలు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు గాంధీ మార్చురీలో రాజశేఖర్ మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఫాంహౌస్‌లో రేవ్ పార్టీ

మంచాల: మండలం లింగంపల్లిలో ఏర్పాటు చేసిన రేవ్ పార్టీపై బుధవారం అర్ధరాత్రి పోలీసులు దాడి చేశారు. ఇందులో పాల్గొన్న 33 మందిని అరెస్టు చేశారు. మంచాల సీఐ మధు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. స్థానిక సప్తగిరి ఫాంహౌస్‌లో నిబంధనలకు విరుద్ధంగా రేవ్ పార్టీ నిర్వహించారు. ఇందులో 25 మంది పురుషులు, 8మంది మహిళలు పాల్గొన్నారు. మద్యం సేవించి అశ్లీల నృత్యాలు చేస్తున్నానే సమాచారం సమాచారం అందడంతో మంచాల పోలీసులు దాడి చేశారు. వీరి నుంచి రూ.2,40,000 నగదు 11 వాహనాలు, 15 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిని రిమాండ్‌కు తరలించారు.

పార్టీలో పాల్గొన్నది వీరే..

రుద్రశెట్టి సప్తగిరి, అనీల సురేష్‌కుమార్, పోరండ్ల మధుకర్, రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, రాంపూరం రాజేశ్‌గౌడ్, కుండేటి విజయ్ శేఖర్ నాయకుడు, ఇమ్మిడిశెట్టి హరికృష్ణ, వల్లము రవీంద్రసాయి కుమార్, పురం సాయి కృష్ణ, పాపేర్తి రాజ్‌కుమార్, మూల మధుగౌడ్ (మాజీ కార్పొరేటర్ ముఖేష్‌గౌడ్ తమ్ముడు), కొమ్మన సతీష్ కృష్ణ, నుగురు ప్రశాంత్, గట్టివార్ సునిల్, బండారు రమేష్, ప్రతాప్ గోపాల్, గడబోయిన బ్రహ్మ, జనంపేట్ బెక్కం గోపాలకృష్ణ, రంగు శ్యాం, వెలమ్మకన్ని లక్ష్మీ నర్సింహ, భరత్ ద్వాజ్, పోలుగుల కొండల ప్రవీణగౌడ్, శ్రీశైలం, డినావాయి శ్రీనివాస్, శ్రీనివాస్ సుబ్రహ్మణ్య తేజ, విజయ్ దిలికర్, చందంపేట్ ఆనంద్‌కుమార్ తదితరులు ఉన్నారు.

దేశ చరిత్రలోనే మిగిలిపోయేలా రాష్ట్ర బంద్

పంజగుట్ట: రాష్ట్రంలో బీసీ ఉద్యమం అగ్గిలా రగులుకుందని, దేశ చరిత్రలోనే మిగిలిపోయేలా 18న రాష్ట్ర బంద్ ఉంటుందని బీసీ జేఏసీ కో చైర్మన్, బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడారు. ఇప్పటికే బీసీ ఉద్యమానికి పలు పార్టీలు, న్యాయవాద, ఉద్యోగ, ప్రజా సంఘాలు మద్దతు ఇస్తుండగా ఇప్పుడు జర్నలిస్టుల సంఘాలు కూడా మద్దతు పలకడం సంతోషమని అన్నారు. బీసీ ఉద్యమానికి తెలంగాణ జర్నలిస్టులు వారి కలాన్ని, గళాన్ని ఆయుధంగా అందించాలని కోరారు.

కాంగ్రెస్‌కు జూబ్లీహిల్స్ ప్రజలు బుద్ధి చెబుతారు



ఎర్రగడ్డలో ఇంటింటి పాదయాత్రలో పద్మా దేవేందర్‌రెడ్డి

బంజారాహిల్స్: ఇచ్చిన హామీలను అమలుచేయకుండా ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ద్వారా చెంపపెట్టు లాంటి తీర్పును ప్రజలు ఇస్తారని మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి అన్నారు. బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరితో కలిసి గురువారం జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతను గెలిపించాలంటూ ఆమె ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఫిర్యాదు చేసినా పట్టదా?



నిరసన తెలుపుతున్న సాలిటేర్ హైట్స్ వాసులు

శ్రీనగర్‌కాలనీ: అపార్ట్‌మెంట్ చుట్టూ కొందరు వ్యక్తులు మట్టి, ఇసుక, రాళ్లను వేసి వ్యాపారం చేస్తున్నారని, వీటిపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని సోలిటేర్ హైట్స్ నివాసులు ఆరోపించారు. హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశామని, గురువారం అధికారులు వచ్చి మొత్తం వ్యవహారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు. మా అపార్ట్‌మెంట్స్ స్థలంలో ఇలా అనధికార వ్యాపారాలు సరి కాదన్నారు. అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు.

పాలనలో కాంగ్రెస్ విఫలం

రహమత్‌నగర్: తమ ప్రభుత్వ హయంలో నిర్మాణం చేపట్టిన సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ భవనాన్ని ప్రారంభించకుండా దళితుల అభ్యున్నతిని ప్రభుత్వం అడ్డుకుంటోందని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ ఆరోపించారు. ఎస్పీఆర్‌హిల్స్‌లోని సీడీఎస్ భవనం వద్ద గురువారం ఆయన మాట్లాడుతూ పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. వడ్డెర సంఘం జాతీయ నాయకురాలు రాజ్యలక్ష్మి, సయ్యద్ బషీర్, కంకట సురేందర్, వేముల జగన్, బొటిక మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బీసీ మహిళా జేఏసీ ఆవిర్భావం

– జేఏసీ చైర్మన్‌గా భాగ్యలక్ష్మి



అభివాదం చేస్తున్న భాగ్యలక్ష్మి తదితరులు

హిమాయత్‌నగర్: బీసీ మహిళల అభివృద్ధి, సంక్షేమం కోసం 'జాతీయ బీసీ మహిళా జేఏసీ' ఆవిర్భావ కార్యక్రమం గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో జరిగింది. జేఏసీకి చైర్మన్‌గా నియమితులైన ఎం.భాగ్యలక్ష్మి 18న బీసీ బంద్‌కు మద్దతు తెలుపుతూ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. జేఏసీ నేతలు నిర్మల, సాజిరా, జయశ్రీ, మాధవి, అర్చన, లుక్సానా బేగం, జానకి, రేణుక, శ్రీనిధి, లలిత, అంబిక, ఉష, మీరాకుమారి, లక్ష్మి, సౌజన్య పాల్గొన్నారు.

భార్యపై దాడి చేసిన భర్త

వెంగళరావునగర్: భార్యపై భర్త, మరిది, బంధువులు దాడి చేసిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం రంగారెడ్డి జిల్లాకు చెందిన రోజారాణి అనే మహిళ గురువారం స్టేట్‌హోంలోని రాష్ట్ర బాలల రక్షణ హక్కుల కమిషన్ కార్యాలయంలో సమావేశానికి హాజరైంది. ఈ క్రమంలో ఆమె భర్త బత్తుల రవికుమార్, అతడి సోదరుడు సంపత్‌కుమార ఇతర బంధువులు ఆమెపై దాడి చేసి బెదిరించారు. ఇప్పటికే వారిపై రెండు ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయని, ఆమెకు రక్షణ కల్పించాలని ఉత్తర్వులు ఉన్నప్పటికీ వారు దాడులు చేశారని, దాడులకు పాల్పడుతున్న భర్త, మరిది బంధువులపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శంకుస్థాపనలు ఘనం.. పనులు శూన్యం..

- 55 పనుల్లో మొదలైనవి నాలుగే..
- ఇంతవరకూ రాని పైపులు
- ఎక్కడి డ్రైనేజీ అక్కడే..



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్(ఫైల్)

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నిక ఏ క్షణంలోనైనా రావొచ్చనే ఉద్దేశ్యంతో నియోజకవర్గ ప్రజలను ఆకర్షించేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కోడ్ రాకముందే రెండు నెలలుగా అభివృద్ధి పనులకు ఎడాపెడా శంకుస్థాపనలు చేసింది. గల్లీగల్లీలో శిలాఫలకాలు స్థానికులను ఎంతో ఆనందానికి గురిచేశాయి. ఈ పనులన్నీ జరిగితే రాష్ట్రంలోనే జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధిలో నెంబర్-1గా నిలుస్తుందని స్థానికులతో పాటు శంకుస్థాపనలు చేసిన మంత్రులు కూడా ఆశించారు. నిధులు కూడా దండి విడుదల చేశారు. ఎవరూ అడగని ప్రాంతాల్లో కూడా పెద్ద ఎత్తున శంకుస్థాపనలు జరిగాయి. ఈ నియోజకవర్గం పరిధి కిందికి వచ్చే ఎర్రగడ్డ, బోరబండ, వెంగళరావునగర్, రహమత్‌నగర్, యూసుఫ్‌గూడ, సోమాజీగూడ డివిజన్ల పరిధిలో తాగునీటి, డ్రైనేజీ పైప్‌లైన్ల నిర్మాణం కోసం 55 చోట్ల శంకుస్థాపనలు జరిగాయి. మొత్తం 55 వర్క్స్‌కు గాను రూ.11 కోట్లు మంజూరయ్యాయి. మంత్రులు పొన్నం ప్రభాకర్‌రావు, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి నియోజకవర్గంలో సుడిగాలి పర్యటనలు చేసి కనీవినీ ఎరుగని రీతిలో శంకుస్థాపనలు చేశారు. రెండు నెలల పాటు ఊపిరి పీల్చుకోలేని విధంగా పనులకు శిలాఫలకాలు వేశారు. తీరా చూస్తే 55 వర్క్స్‌లో ప్రస్తుతం నాలుగు చోట్ల మాత్రమే పనులు ప్రారంభమయ్యాయి. మిగతా 51 చోట్ల ఇంతవరకు పనులు ముట్టుకోలేదు. తాగునీటి, డ్రైనేజీ పైపులు ప్రభుత్వమే అందజేస్తోంది. ఇంతవరకు ఆ పైపులు కూడా రాలేదని, శిలాఫలకాలు వెక్కిరిస్తున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. ఏ డివిజన్‌లో చూసినా శిలాఫలకాలు తప్పితే పనులు ముందుకు సాగడం లేదు. ఇదేమిటని జలమండలి అధికారులను ప్రశ్నిస్తే పైపులు రాలేదనే సమాధానం ఇస్తున్నారు. మరి శంకుస్థాపనలు ఎందుకు చేశారని అడిగితే సమాధానం చెప్పడం లేదు. చాలాచోట్ల దెబ్బతిన్న, చిన్నగా ఉన్న తాగునీటి, డ్రైనేజీ పైప్‌లైన్లు మార్చి కొత్తవి వేయాలని హడావుడిగా ప్రతిపాదనలు తయారు చేయించి అప్పటికప్పుడు హడావిడిగా పనులు ప్రారంభించారు. తీరా చూస్తే అవి ముందుకుసాగడం లేదు. ఇప్పుడేమో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ప్రతిపక్షాలకు అస్త్రం అందించామేమోనని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఆందోళన చెందుతున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే ఏమి సమాధానం చెప్పాలో తెలియని పరిస్థితి నెలకొంది.

ముచ్చుకు ఉదాహరణ..

ఈ నెల 4వ తేదీన యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణానగర్-ఏ బ్లాక్‌లో 600 ఎంఎం డయా మురుగునీటి ప్రధాన లైన్ దెబ్బతినగా మ్యాన్‌హోళ్ల పునర్నిర్మాణం, శ్రీకృష్ణానగర్ బీ అండ్ సీ బ్లాక్‌లలో దెబ్బతిన్న 200 ఎంఎం డయా మురుగునీటి పైప్‌లైన్లను వేయడం, మాధురి హాస్పిటల్ లైన్ శాలివాహననగర్ వద్ద దెబ్బతిన్న 200 ఎంఎం డయా మురుగునీటి లైన్ భర్తీ చేయడం, చర్చి లేన్ నీటి సరఫరా లైన్‌తో భర్తీ చేయడానికి మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపనలు చేశారు. తీరా ఈ పనులు మొదలే కాలేదు. మురుగునీటి, తాగునీటి పైప్‌లైన్ల నిర్మాణం పూర్తి చేసి ఉంటే అధికార పార్టీకి ఎంతగానో ఉపయోగకరంగా ఉండేది. కానీ 55 పనుల్లో 4 మాత్రమే ప్రారంభం కావడంతో స్థానికంగా కొంత ఆందోళనకర వాతావరణం నెలకొంది.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అక్కినేని నాగేశ్వరరావు కళాశాల పూర్వ విద్యార్థులు

బంజారాహిల్స్: అక్కినేని నాగేశ్వరరావు కళాశాల పూర్వ విద్యార్థుల హైదరాబాద్ చాప్టర్ సమ్మేళనం గురువారం జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో నిర్వహించారు. కావూరి సాంబశివరావు, పద్మనాభయ్య, ఫణికుమార్ తదితర ప్రముఖులతో పాటు పెద్ద సంఖ్యలో పూర్వ విద్యార్థులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. 1950లో గుడివాడలో ఈ కళాశాల ఏర్పాటు కాగా 75 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా వజ్రోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని తలపెట్టారు. ఇందుకోసం కమిటీని ఏర్పాటు చేశారు. చైర్మన్‌గా కొల్లి శ్రీనివాస్‌రావు, సెక్రటరీగా డాక్టర్ సూరపనేని శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఈ వేడుకలు హైదరాబాద్‌తో పాటు చెన్నై, బెంగళూరు, వైజాగ్, ఢిల్లీ, విజయవాడ తదితర నగరాల్లో నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో కళాశాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై కూడా చర్చిస్తున్నామన్నారు.

బిగ్‌బాస్ షో వెంటనే నిలిపివేయాలి

జూబ్లీహిల్స్ పీఎస్‌లో ఫిర్యాదు

బంజారాహిల్స్: బిగ్‌బాస్ షో నిలిపివేయాలంటూ జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కే.శ్రీనివాస్, బి.రవీందర్‌రెడ్డి గురువారం ఫిర్యాదు చేశారు. బిగ్‌బాస్ షో సమాజానికి ముఖ్యంగా యువతకు తప్పుడు సందేశం ఇస్తూ పెడదారిన పట్టేలా చేస్తోందని వీరు ఫిర్యాదులో పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్-7లోని అన్నపూర్ణ స్టూడియోస్ ఏడెకరాల్లో జరుగుతున్న బిగ్‌బాస్ షో నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సమాజం సిగ్గుపడే విధంగా అభ్యంతరకరమైన కంటెంట్లతో బిగ్‌బాస్ నిర్వాహకులు ఈ షో నిర్వహిస్తున్నారని, సమాజంలో విలువలు లేని వారిని ఎంపిక చేస్తున్నారన్నారు. కర్ణాటక తరహాలో ఇక్కడ కూడా ఆ షోని వెంటనే నిలిపివేయాలని, లేదంటే బిగ్‌బాస్ హౌస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. జూబ్లీహిల్స్ పోలీసులు ఫిర్యాదును స్వీకరించి దర్యాప్తు చేపట్టారు.

ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీకి ప్రజల ఆశీస్సులు



నాదెండ్ల సుధాకర్‌కు బీఫారంను అందిస్తున్న కేబీ శ్రీధర్, డాక్టర్ గూడూరి చెన్నారెడ్డి

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నాదెండ్ల సుధాకర్‌ను అభ్యర్థిగా నిలబెడుతున్నట్లు జాతీయ అధ్యక్షుడు కేబీ శ్రీధర్, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గూడూరి చెన్నారెడ్డి ప్రకటించారు. ఈ మేరకు గురువారం బీఫారాన్ని అభ్యర్థి నాదెండ్ల సుధాకర్‌కు అందజేశారు. ప్రజా సమస్యలపై పోరాడే ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీకి ప్రజల ఆశీస్సులు ఉన్నాయని, మా మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రధాన రాజకీయ పార్టీలు ప్రజలకు చేస్తున్న మోసాలను వివరిస్తామని రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గూడూరి చెన్నారెడ్డి పేర్కొన్నారు. నేషనల్ జనరల్ సెక్రటరీ కేహెచ్ఎస్ శర్మ, ట్రెజరర్ గూడూరి విజయలక్ష్మి, మహిళా విభాగ చైర్మన్ శోభారెడ్డి, ఉపాధ్యక్షులు దశరథం, సెల్వరాజ్, అంజనీదేవి, వెంకటేష్‌గుప్తా పాల్గొన్నారు.

శస్త్రచికిత్సలో అనస్థీషియాలజిస్టుల పాత్ర కీలకం



ప్రారంభోత్సవంలో నిమ్స్ డైరెక్టర్ బీరప్ప

లక్డీకాపూల్: నిమ్స్ ఆస్పత్రిలోని స్పెషాలిటీ విభాగం గ్రౌండ్ ఫ్లోర్‌లో ప్రీ-అనస్థీషియా అసెస్‌మెంట్ క్లినిక్ (పీఏసీ), నొప్పి నిర్వహణ సేవలకు సంబంధించిన అవుట్ పేషెంట్ విభాగాలను నిమ్స్ డైరెక్టర్ బీరప్ప గురువారం ప్రారంభించారు. డీన్ ప్రొఫెసర్ లిజా రాజశేఖర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. మత్తుమందులు ఇవ్వడంతో పాటు శస్త్రచికిత్సకు ముందు మూల్యాంకనం, ఇంట్రా ఆపరేటివ్ కేర్, శస్త్రచికిత్స అనంతర సంరక్షణకు అనస్థీషియాలజిస్టులు బాధ్యత వహిస్తారన్నారు. ముఖ్యంగా శస్త్రచికిత్స సమయంలో రోగులను గమనించడానికి, అసౌకర్యం తలెత్తకుండా ఉండేందుకు సర్జన్లు, ఇతర వైద్య నిపుణుల సమన్వయంతో సహకరిస్తారన్నారు. శస్త్రచికిత్స సమయంలో అనస్థీషియాలజిస్టుల పాత్ర కీలకం అన్నారు. నొప్పి నిర్వహణ క్రిటికల్ కేర్‌లో ప్రత్యేకత కలిగిన వైద్యులుగా పేర్కొన్నారు. 'మీకు తెలియనప్పుడు మేము జాగ్రత్త తీసుకుంటామంటూ నిమ్స్ అనస్థీషియా విభాగాధిపతి ప్రొఫెసర్ ఎం.శ్రీలత అనస్థీషియాలజిస్టులు భరోసా కల్పించారు. డాక్టర్ బ్రయాన్ జె.మారస్కల్చి, డాక్టర్ శ్రావణి దుర్భాకుల, డాక్టర్ సాయిరామ్ అట్లూరి, డాక్టర్ అక్షయ్ కుమార్ పలు అంశాలపై అవగాహన కల్పించారు.

బీఆర్ఎస్ హయాంలోనే జూబ్లీహిల్స్ అభివృద్ధి

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్‌లో అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ మహేష్‌యాదవ్ అన్నారు. సోమాజిగూడ డివిజన్‌లోని ఎల్లారెడ్డిగూడ, శ్రీనగర్‌కాలనీలో గురువారం ప్రచారం నిర్వహించారు. చిరువ్యాపారుల వద్దకు వెళ్లి బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ, కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల మోసాలను వివరించారు.



సెల్‌ఫోన్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు గురువారం రోడ్డు నంబర్-36లో సెల్‌ఫోన్ డ్రైవింగ్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు డ్రైవింగ్ చేసిన వారిని పట్టుకున్నారు. జూబ్లీహిల్స్ ట్రాఫిక్ అడిషనల్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ పట్టుబడ్డ వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ వల్ల ప్రాణాలు పోతాయని, ఇతర వాహనదారులకు కూడా ఇబ్బందులు ఎదురవుతాయని వెల్లడించారు. ట్రాఫిక్ ఎస్ఐలు గోపీ, అశోక్ పాల్గొన్నారు.

వృద్ధుడు అదృశ్యం



మహమద్ సుల్తాన్(ఫైల్)

ఖైరతాబాద్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు కనిపించకుండా పోయిన ఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. చింతలబస్తీలో నివాసముండే మహమూద్ ఆయూబ్ తండ్రి మహమద్ సుల్తాన్(76) బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో ఖైరతాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు పిల్లల రూల్స్ ఎత్తివేయాలి



మాట్లాడుతున్న జున్ను రాజు

పంజగుట్ట: క్యాబినెట్ సమావేశంలోనే స్థానిక సంస్థల ఎన్నికల్లో ముగ్గురు పిల్లల రూల్స్ ఎత్తివేయాలని, లేనిపక్షంలో జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ముగ్గురు పిల్లల తల్లిదండ్రులు 100 మంది నామినేషన్ వేస్తామని ముగ్గురు పిల్లల తల్లిదండ్రుల రాజకీయ హక్కుల వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు జున్ను రాజు అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేదిక గౌరవాధ్యక్షుడు వశపాక నర్సింహతో కలిసి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మొత్తం 12,777 గ్రామపంచాయతీలు ఉన్నాయని, ఇందులో ముగ్గురు పిల్లలు ఉన్న తల్లిదండ్రులు సుమారు రెండున్నర లక్షల మంది ఉన్నారని తెలిపారు. ఇంతపెద్ద ఓటు బ్యాంకు ఉన్న తమకు లోకల్‌బాడీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో తుమ్మ కృష్ణ, కుంట సత్యం, కె.నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

గాజుల తయారీపై వర్క్‌షాప్



భారతీయ విద్యాభవన్ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో సంప్రదాయ గాజుల తయారీపై వర్క్‌షాప్

ఫిలింనగర్: భారతీయ విద్యాభవన్ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో ఇన్ఫోసిస్ కల్చరల్ అవుట్‌రీచ్ కార్యక్రమంలో భాగంగా సంప్రదాయ గాజుల తయారీపై గురువారం ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. భారతీయ సంప్రదాయ కళలను విద్యార్థులకు పరిచయం చేయడం ద్వారా దేశ సంస్కృతిని సంరక్షించేందుకు ప్రోత్సహించే లక్ష్యంతో ఈ వర్క్‌షాప్ నిర్వహించారు. లాడ్‌బజార్, చార్మినార్ నుంచి కళాకారులు ఇమ్రాన్, భఖ్యార్, షేక్ అరిఫుద్దీన్ ఈ వర్క్‌షాప్ నిర్వహించారు. వారు తరతరాలుగా వస్తున్న లాక్ గాజుల తయారీ ప్రక్రియను విద్యార్థులకు వివరించారు. సాధారణ పరికరాలు, ముడిలాక్‌తో అందమైన రంగుల గాజులను ఎలా తయారు చేస్తారో ప్రత్యక్షంగా చూపించారు. కార్యక్రమం విద్యార్థుల్లో భారతీయ వారసత్వ కళల పట్ల గౌరవాన్ని పెంపొందిస్తూ.. వాటిని కాపాడాలనే ప్రేరణనిచ్చింది.

బాత్‌రూంలో కెమెరా బిగించిన వారిపై కేసు

వెంగళరావునగర్: కిరాయి ఉన్న వారి ఇంటి బాత్‌రూమ్‌లో కెమెరా బిగించిన వారిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం యూసుఫ్‌గూడలో నివసించే ఉమేష్ దంపతులు ప్రైవేట్ జాబ్ చేస్తుంటారు. ఈ నెల 4వ తేదీ బాత్రూంలో విద్యుత్ బల్బు పనిచేయడం లేదని ఇంటి యజమాని అశోక్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఎలక్ట్రిషియన్ చింటును తీసుకువచ్చి బల్బును బిగించాడు. ఈ నెల 13వ తేదీన బల్బు హోల్డర్‌లో కెమెరా ఉన్నట్లు ఉమేష్ గుర్తించాడు. దాంతో అతను ఈ విషయాన్ని యజమానికి తెలియజేయగా ఎలక్ట్రిషియన్‌తో మాట్లాడుకోవాలని చెప్పాడు. ఎలక్ట్రిషియన్ కనిపించకపోవడంతో ఉమేష్ దంపతులు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆలోచింపజేసిన సైబర్ సెక్యూరిటీపై వర్క్‌షాప్

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు మూడు రోజుల పాటు కేపీఎంజీ సహకారంతో విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీ వర్క్‌షాప్ నిర్వహించారు. డిజిటల్ ప్రపంచాన్ని సురక్షితంగా, బాధ్యతాయుతంగా నావిగేట్ చేయడానికి అవసరమైన జ్ఞానం, ఆచరణాత్మక వ్యూహాలతో విద్యార్థులను సన్నద్ధం చేయడమే లక్ష్యంగా వర్క్‌షాప్ కొనసాగింది. కేపీఎంజీ నుంచి పరిశ్రమ నిపుణులు ఇంటరాక్టివ్ సెషన్లను నిర్వహించారు. ఆన్‌లైన్ బెదిరింపులు, వ్యక్తిగత డేటా దుర్వినియోగం గురించి పెరుగుతున్న ఆందోళనలను ప్రస్తావించారు. రిసోర్స్‌పర్సన్ పాస్‌వర్డ్ రక్షణ, ఫిషింగ్ స్కామ్‌లు, సైబర్ బెదిరింపు, డేటా గోప్యత, సోషల్ మీడియా ప్రమాదాలు, సురక్షిత బ్రౌజింగ్ అలవాట్లతో సహా కీలకాంశాలపై చర్చించారు. వర్క్‌షాప్‌లో పాస్‌వర్డ్‌లను ఎలా నిర్వహించాలి, సైబర్ దాడులను ఎలా ఎదుర్కోవాలి? ఆన్‌లైన్‌లో వ్యక్తిగత డేటాను ఎలా రక్షించాలి వంటి ముఖ్యమైన సైబర్ భద్రతా చిట్కాలను అందించారు. విద్యార్థులకు మెరుగైన సమాచారం అందించి, సైబర్ స్పేస్ సవాళ్లను నమ్మకంగా, సురక్షితంగా ఎదుర్కోవడానికి కావాల్సిన శక్తి అందించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.



జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో సైబర్ సెక్యూరిటీపై వర్క్‌షాప్

రోడ్డు విస్తరణ పనులపై సమీక్ష



జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్-51లో పర్యటిస్తున్న జీహెచ్ఎంసీ ఇంజనీర్లు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్-51లో సీసీ రోడ్డు పనులకు నిధులు మంజూరు కాగా ఈ రోడ్డు పనుల సమయంలో ట్రాఫిక్ మళ్లింపులు, రోడ్డు తవ్వకాలపై జీహెచ్ఎంసీ ఇంజనీర్లు గురువారం ట్రాఫిక్ డీసీపీ రాహుల్‌హెగ్డె.. వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్‌తో కలిసి ఇక్కడ పర్యటించారు. పనులు ప్రారంభమైతే తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. రోడ్డుకు ఒకవైపు పెద్ద పెద్ద చెట్లు ఉండటం వల్ల రోడ్డు ఇరుగ్గా మారిందని, కొత్త రోడ్డు వేసినా ఉపయోగం ఉండదని, వాటిని రీలొకేట్ చేయాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. ఒకవైపు ఫుట్‌పాత్‌ను కూడా తొలగించి రోడ్డును విస్తరించాలని సూచించారు.

'మీ సోదరిని గెలిపించండి'



ప్రచారంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

వెంగళరావునగర్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మీ సోదరి మాగంటి సునీతను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కోరారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్‌కాలనీలో గురువారం స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్‌తో కలిసి ఆయన ప్రచారం చేశారు.

జర్నలిజం భవిష్యత్తుపై సెమినార్ నేడు, రేపు

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీలో ఈ నెల 17, 18వ తేదీల్లో ఏఐ యుగంలో జర్నలిజం భవిష్యత్తు-సవాళ్లు-అవకాశాలు' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నట్లు వర్సిటీ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. ఈ సెమినార్‌లో సాంకేతికత పెరుగుతున్న కొద్దీ జర్నలిజం రంగంలో వస్తున్న మార్పులు, ఎదుర్కొంటున్న సవాళ్లను చర్చిస్తారని పేర్కొన్నాయి. శుక్రవారం మొదటి రోజు సెమినార్‌ను తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, అదనపు డీజీ, పీఐబీ శృతిపాటిల్ తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. అలాగే శనివారం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, విశిష్ట అతిథిగా తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు.

ఎన్నికలంటే అంతే కదా..!

– అభివృద్ధి పేరిట కొండలైనా పిండి కావాల్సిందే..



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్‌నగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ ఫేజ్-2 హనుమాన్‌నగర్ స్టోన్ కట్టర్స్ బస్తీలో గత నెల రూ.1.30 కోట్లతో కమ్యూనిటీ హాల్ పనులకు శంకుస్థాపన చేశారు. ఎన్నో ఏళ్ల బస్తీవాసుల కలను నిజం చేసేందుకు అధికార పార్టీ ఆదేశాలతో అధికారులు పనులు మొదలుపెట్టారు. ఈ స్థలంలోని ఓ భారీ బండలను జేసీబీతో పగులగొడుతున్నారు. గతంలో అధికారుల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా పట్టించుకోలేదు. ఎన్నికలు వచ్చేసరికి కొండనైనా పిండి చేస్తున్నారంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి సిటీ ప్లస్
12
హైదరాబాద్ । శుక్రవారం । 17 । అక్టోబర్ । 2025



ఆయుష్మాన్ భవ..

నగరాల్లో పెరుగుతున్న ఆయుఃప్రమాణాలు

ఓ వైపు పెరుగుతున్న కాలుష్యం.. కల్తీ ఆహారం.. అనారోగ్య కారకాలు వంటివి మనిషి సగటు జీవన ప్రమాణాలను ఆయుర్దాయాన్ని దెబ్బతీస్తున్నాయి.. మరోవైపు ఆశ్చర్యకరమైన ఫలితాలను అధ్యయనాలు తేటతెల్లం చేస్తున్నాయి. అయితే దీనికీ ఓ లెక్కుందండోయ్..? అదే ఆరోగ్యకరమైన జీవన విధానం .. అందుకు కావాల్సిన సౌకర్యాలు.. ప్రామాణికాలు.. గతంతో పోలిస్తే మెట్రో నగరాల్లో పలు వనరులు కాలుష్యానికి గురైనా.. మరోవైపు ప్రజల్లో పెరిగిన అవగాహన, విజ్ఞానం, వైద్య సౌకర్యాలు వాటిని అధిగమిస్తూ కొత్త అడుగులు వేయిస్తున్నాయి. ఫలితంగా మానవుని ఆయుఃప్రమాణాలు క్రమంగా పెరుగుతూ వస్తున్నాయని పలు అధ్యయనాలు చెబుతున్నాయి..

– సాక్షి, సిటీబ్యూరో

హైదరాబద్‌లో కాలుష్యాన్ని జయిస్తున్న జీవన విధానం	క్రమంగా పెరుగుతున్న నగటు మనిషి ఆయుర్దాయం	ఆరోగ్య అవగాహన, విజ్ఞానం, వైద్యసౌకర్యాలే కారణాలు
అంతే రీతిలో కాలుష్యంతో పెరుగుతున్న మృతి రేటు	ప్రస్తుత నగటు జీవన కాలం 70 నుంచి 75 ఏళ్లు..	పలు అధ్యయనాలు, పరిశోధనల్లో వెల్లడైన అంశాలు

హైదరాబాద్‌తోపాటు దేశంలోని పదికి పైగా ప్రధాన నగరాల్లో వాయు కాలుష్యం, నీటి కాలుష్యం, కల్తీ ఆహారం వంటివి పెరుగుతూనే ఉన్నాయి. ఇది 3 నుంచి 4 శాతం సగటును నమోదు చేసుకుంటున్నాయి. అయితే అదే సమయంలో ఆరోగ్యంపై పెరుగుతున్న అవగాహన సగటున ఆయుర్దాయాన్ని పెంచడానికి దోహదం చేస్తున్నాయని, దీని వల్ల నగరాల్లో జీవన కాలాన్ని సగటున 70 నుంచి 75 సంవత్సరాలకు పెంచిందని లాన్‌సెట్ ప్లానెటరీ హెల్త్ వంటి అధ్యయనాలు చెబుతున్నాయి. ఇది వాస్తవానికి పూర్తి భిన్నంగా ఉన్నప్పటికీ అధ్యయన ఫలితాలు మాత్రం ఇది వాస్తవమని చెబుతున్నాయి.





పూర్తి భిన్నంగా..

మహానగరాలు గాలి, నీరు, ఆహారం, శబ్ద కాలుష్యంతో నిండిపోయాయి. అయినప్పటికీ, గ్రామీణ ప్రాంత ప్రజలతో పోలిస్తే నగర ప్రజల ఆయుః ప్రమాణాలు మెరుగ్గా ఉన్నాయని పరిశోధనలే చెప్పడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. తాజా అధ్యయనాలు పరిశోధకులను, ఆరోగ్య నిపుణులను విస్తుపోయేలా చేస్తున్నాయి. పట్టణాల కంటే మెరుగైన వాతావరణ పరిస్థితులు పల్లెల్లో ఉంటాయనేది అందరికీ తెలిసిన వాస్తవం.. కానీ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. అలాంటి ప్రతికూల పరిస్థితులను అధిగమిస్తూ.. ఈ ఫలితాలు ఉండడం నిజంగా ఆశ్చర్యకరమే.. అయితే ఫలితాలు చెప్పే వాస్తవాలను ఓ సారి పరిశీలించాలని నిపుణులు చెబుతున్నారు. దీనికి జీవన ప్రమాణాల్లో పెరుగుతున్న నాణ్యత అవగాహనే కారణమని తెలుస్తోంది.

సర్వే చెబుతోన్నదేంటి!?

గతేడాది ప్రచురితమైన బీఎమ్‌సీ పబ్లిక్ హెల్త్ నివేదిక ప్రకారం.. దేశంలో అధిక ఆదాయం ఉన్న నగర ప్రాంతాల ప్రజలు గ్రామీణ ప్రజలకంటే సగటున 7.5 సంవత్సరాలు ఎక్కువ జీవిస్తున్నారని తేల్చింది. మెరుగైన ఆర్థిక స్థిరత్వం, ఆరోగ్యపై పెరుగుతున్న చైతన్యం, ఆరోగ్య బీమా, మెరుగైన ఆహారం, వ్యాయామం వంటి అంశాలే కారణాలు ఇందుకు కారణాలుగా పరిశోధనలు చెబుతున్నాయి. హైదరాబాద్‌లో ఐటీ, ఫార్మా, వంటి ఇతర సర్వీస్ రంగాల ఉద్యోగాలు మధ్యతరగతి ప్రజల జీవన విధానం, ఆలోచనా ధోరణిలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. వీటితోపాటు నగరంలో ప్రభుత్వాలు చేపట్టే 'క్లీన్ ఎయిర్ ప్లాన్', 'హరిత హైదరాబాద్' వంటి ప్రాజెక్టులు కూడా ఓ ముఖ్య భూమికను పోషిస్తున్నాయని, దీంతో పాటు ప్రజల్లోనూ ఆరోగ్యంపై వ్యక్తిగత శ్రద్ధ పెరిగిందని, వ్యాయామం, నిద్ర, ఆహార నియమాలు మెరుగైన ఫలితాలకు దోహదం చేస్తున్నాయని తెలుస్తోంది.



అవగాహన లేమి..

నగరాలతో పోలిస్తే గామీణ ప్రాంతాలు వెనుకబడడానికి అసలు కారణం అవగాహనా లేమి.. మెరుగైన సౌకర్యాలు లేకపోవడం, ఆదాయ వనరులు, వ్యక్తి శుభ్రత ప్రభావం చూపుతున్నాయని తెలిసింది. ఏదైనా అనారోగ్య సమస్య వస్తే.. సరైన అవగాహన లేక, సదుపాయాలు లేక, ఆయా సమస్యలను, ఆరోగ్య పరిస్థితులను సరైన సమయంలో గుర్తించక ప్రాణాపాయ స్థితికి చేరుతున్నారని, పల్లెతో పోలిస్తే వైద్య సేవలు, డిజిటల్ కన్సల్టేషన్, టెక్నాలజీ, టెలీమెడిసిన్, ఫిట్నెస్ సెంటర్లు, యోగా వంటివి ప్రభావవంతంగా పనిచేస్తున్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి.



ప్రజలకు తెలియని ప్రమాదకరం..

పర్యావరణ, కాలుష్య నియంత్రణ బోర్డు తాజా గణాంకాల ప్రకారం హైదరాబద్ నగర గాలిలో నాణ్యత 'మోస్తరు నుంచి హానికర స్థాయికి' మధ్యలో ఊగిసలాడిందని తెలిపింది. జలాశయాలైన హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్, మూసీ నది కాలుష్యానికి గురవుతున్నాయని ఎమ్ఏఎన్‌యూయూ పరిశోధకులు వెల్లడించారు. పారిశ్రామిక వ్యర్థాలు, డ్రైనేజ్ నీరు, రసాయన అవశేషాల వల్ల భూగర్భజలాలు కూడా కలుషితమౌతున్న విషయం తెలిసిందే. ఆహార విషయంలోనూ హానికర రసాయనాలు నగర మార్కెట్లో మితిమీరిన స్థాయిలో ఉన్నాయని ఫుడ్ సేఫ్టీ విభాగం తెలిపింది.



వ్యక్తిగత భద్రత ముఖ్యం..

విజ్ఞానం, సాంకేతికత ద్వారా అందే ఫలాలను అందరూ అందుకోగలగాలి. అప్పుడే జీవిత కాలం పెరగడంతో పాటు, ఒక మెరుగైన జీవితాన్ని అనుభవించగలరు. ఇందుకు విద్య, ఆరోగ్యం పట్ల అవగాహన, పరిసరాల–వ్యక్తిగత పరిశుభ్రత వంటివి చాలా ముఖ్యం.! అందుకే కాలుష్యం అధికంగా ఉన్న పట్టణాల కంటే గ్రామాల్లో ఆయుఃప్రమాణాలు తక్కువ.! పట్టణాల్లో కాలుష్యం తగ్గించే ప్రయత్నాలతో పాటు, గ్రామాల్లో కూడా మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చూసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటే, గ్రామ ప్రజల ఆయుర్దాయం ఎక్కువగా పెరిగే అవకాశం ఉంది.

– డా.ప్రతిభా లక్ష్మి, జనరల్ మెడిసిన్ – ప్రొఫెసర్

స్థానిక హస్తకళతో స్వదేశీ బ్రాండ్



సినీ నటుడు మంచు మనోజ్

సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచస్థాయి టెక్స్‌టైల్ వ్యాపారానికి నగరం వేదికగా మారుతోంది. ఫ్యాషనబుల్ కలెక్షన్, బ్రాండ్ లుక్, సౌకర్యవంతమైన మెన్స్‌వేర్‌కు హాట్‌స్పాట్‌గా మారుతోందని ప్రముఖ సినీ నటుడు మంచు మనోజ్ అన్నారు. మణికొండ అల్కాపూర్ టౌన్‌షిప్ 'నెక్ట్స్ హెరిటేజ్ సూపర్ మార్కెట్'లో నూతనంగా ఏర్పాటు చేసిన మెన్స్‌వేర్ బ్రాండ్ 'స్విచ్ రా' 5వ బ్రాంచ్‌ను మంత్రి డి.శ్రీధర్ బాబు, మాజీ ఎంపీ మధు యాస్కి గౌడ్‌లతో కలిసి మనోజ్ గురువారం ప్రారంభించారు. స్విచ్ రా భారతీయ పురుషుల ఫ్యాషన్‌లో రిఫ్రెషింగ్, బోల్డ్‌గా నిలుస్తుందని, స్థానిక హస్తకళ అనుసంధానంతో అంతర్జాతీయ ప్రమాణాలతో పోటీపడే స్వదేశీ బ్రాండ్‌గా నిలుస్తుందని పేర్కొన్నారు. నాణ్యమైన టెక్స్‌టైల్ ఉత్పత్తులు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ ప్రీమియం రీటైల్ షోరూం అన్ని ఆదాయ వర్గాల వారికీ అందుబాటులో ఉండటం అభినందనీయమన్నారు. యువత ఇలాంటి ఫ్యాషన్ రంగంలో రాణించడం మంచి విషయమని అన్నారు. వియత్నాం, టర్కీ నుంచి అత్యున్నత నాణ్యత గల ఉత్పత్తులను వినియోగించి ప్రపంచ స్థాయి డిజైన్లను సృష్టిస్తున్నామని నిర్వాహకులు వివరించారు. ఈ ప్రారంభోత్సవంలో స్విచ్ రా వ్యవస్థాపకులు కల్లెం రాఘవేందర్ రెడ్డి, నంబూరి రాఘవేందర్, నీలా కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

నాట్యం సుమనోహరం..

అలరించిన స్నిగ్ధ హంస భరతనాట్య అరంగేట్రం



గన్‌ఫౌండ్రీ : ప్రముఖ నృత్య శిక్షణాలయం శ్రీవారి పాదాలు సంస్థ ఆధ్వర్యంలో నాట్య గురువు డాక్టర్ ఎస్. రమాదేవి శిష్యురాలు స్నిగ్ధ హంస భరతనాట్య అరంగేట్రం వీంద్రభారతిలో గురువారం కన్నుల పండువగా జరిగింది. నటరాజ స్వామి ప్రార్థన, పుష్పాంజలి, అలరింపు, జతిస్వరం, భో శంభో కీర్తనం, థిల్లానా వంటి పలు అంశాలపై చక్కటి హావభావాలతో సాగిన నృత్య ప్రదర్శనలు అహూతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సినీ దర్శకుడు రామ్ అబ్బరాజు మాట్లాడుతూ ఆరో ఏట నుంచి నృత్య శిక్షణ ప్రారంభించడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో మంచి ప్రదర్శనలు ఇచ్చి ఖ్యాతిని గడించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యూరో స్కూల్ ప్రిన్సిపాల్ విష్ణు వందన, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నోరూరించే వివిధ రకాల వంటకాలకు నగరం వేదికైంది.. పాకశాస్త్రంలో ప్రావీణ్యం పొందిన పలువురు చెఫ్‌లు వివిధ ప్రాంతాల వంటకాలతో ఆకట్టుకున్నారు. అంతర్జాతీయ చెఫ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని సనత్‌నగర్‌లో అగ్రోమెచ్ స్టూడియో తెలంగాణ, ఆంధ్ర చెఫ్‌ల వంటకాలకు గురువారం వేదికైంది. అత్యంత ఘనంగా నిర్వహించిన కార్యక్రమం చెఫ్‌ల ఐక్యత, వారసత్వ కళ, పాకశాస్త్రానికి వేదికగా నిలిచింది.

– సాక్షి, సిటీబ్యూరో

ఆహా ఏమి రుచి..

నగరంలో పలువురు చెఫ్‌ల సందడి | నోరూరించిన వివిధ రకాల వంటకాలు





తెలుగు రాష్ట్రాల నుండి వచ్చిన చెఫ్‌లు కేవలం వేడుక జరుపుకోవడానికి మాత్రమే కాకుండా, ఒకరికొకరు కనెక్ట్ అవ్వడానికి, మెరుగైన భవిష్యత్తుకు తమ అనుభవాలను పంచుకున్నారు. పాకశాస్త్రంలో పేరెన్నికగన్న చెఫ్స్ కాశీ విశ్వనాథన్, శేఖర్, సంజయ్ తుమ్మ, సుధాకర్ ఎస్.రావు, మిస్టర్ పాల్గుణి నాయుడు, సుధా కుమార్, మిస్టర్ అన్మోల్ ప్రభు, మిస్టర్ కళ్యాణ్ చక్రవర్తి, రవీందర్ రెడ్డి వంటి ప్రఖ్యాత చెఫ్‌లు, ముఖ్య అతిథులు కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరంతా పాక శాస్త్రం, ఆరోగ్యం, ఆవిష్కరణల పరిణామంపై ప్రభావవంతమైన సూచనలను అందించారు. ఆహారం అంటే పోషకాహారం మాత్రమే కాదు, సంరక్షణ, సృజనాత్మకత, స్థానిక భాష.. అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ప్రొఫెషనల్ చెఫ్‌లతో పోటీ పడుతూ తమ పాక శాస్త్ర ప్రావీణ్యాన్ని ప్రదర్శించారు. అనుభవజ్ఞులైన చెఫ్‌ల నేతృత్వంలోని ఇంటరాక్టివ్ షేరింగ్ సెషన్స్, మనదైన వారసత్వ వంటకాలను పంచుకున్నారు. బెస్ట్ వంటకాల ప్రదర్శన చేసిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించారు. చెఫ్‌ల మధ్య సోదరభావాన్ని ఏర్పరిచింది. ఈ సందర్భంగా సీఏటీఏ వ్యవస్థాపకుడు, ప్రధాన కార్యదర్శి చెఫ్ యాదగిరి మాట్లాడుతూ 'అంతర్జాతీయ చెఫ్ దినోత్సవం కేవలం ఒక వేడుక కాదు.. ఇది ఓ కుటుంబం, ఆహారానికీ జీవం పోసే ప్రతి కళాకారుడినీ వృద్ధిలోకి తీసుకురావడమే ప్రధాన ఉద్దేశం' అన్నారు. చెఫ్స్ ఐక్యత, సేవా సందేశంతో తెలంగాణ, ఆంధ్ర అంతర్జాతీయ చెఫ్ దినోత్సవం – 2025 వేడుకను ముగింపుగా కాకుండా ఒక ప్రారంభ సూచికగా నిలిచింది..





టోక్యో డెఫ్లింపిక్స్‌లో భవాని..

- భారత మహిళల టెన్నిస్ జట్టులో తెలంగాణ అమ్మాయి
- అంతర్జాతీయ బధిరుల అథ్లెట్ భవాని కేడియా ప్రతిభ
- ఈసారి దేశానికి పతకం సాధించడమే లక్ష్యం : భవాని



సాక్షి, సిటీబ్యూరో: జపాన్‌లోని టోక్యో వేదికగా జరుగనున్న 25వ సమ్మర్ డెఫ్లింపిక్స్‌లో తెలంగాణకు చెందిన టెన్నిస్ క్రీడాకారిణి భవానీ కేడియా భారత మహిళల టెన్నిస్ జట్టులో ప్రాతినిధ్యం వహించనుంది. నవంబర్ 15 నుంచి 26 వరకూ జరుగనున్న ఈ పోటీలకు భవాని కేడియా ఎంపికైంది. బధిరుల అథ్లెట్స్ కోసం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన బహుళ–క్రీడా కార్యక్రమం అయిన సమ్మర్ డెఫ్లింపిక్స్.., ప్రపంచ వేదికపై వారి నైపుణ్యం, దృఢ సంకల్పాన్ని ప్రోత్సహించే అత్యంత ప్రతిష్టాత్మక వేదిక.. వీటితోపాటు ప్రస్తుతం భవానీ 'ఎం/ఎస్ వాల్యూ ల్యాబ్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ ప్రాజెక్ట్'లో మాజీ డేవిస్ కప్ క్రీడాకారులు, ప్రఖ్యాత అంతర్జాతీయ టెన్నిస్ ప్రొఫెషనల్ ఎం. వాసుదేవ రెడ్డి మార్గదర్శకత్వం కారణంగా నిలుస్తున్నాయి. డెఫ్లింపిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించడం తన కలని, ఈ ఏడాది దేశానికి పతకం తీసుకురావడమే తన లక్ష్యమని భవానీ తెలిపింది. డెఫ్లింపిక్స్‌లో టెన్నిస్ ఈవెంట్‌కు అర్హత సాధించిన తొలి తెలంగాణ మహిళ భవాని కావడం విశేషం. బ్రెజిల్‌లో జరిగిన 2022 డెఫ్లింపిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించిన భవాని.. తన అసాధారణ ప్రతిభను ప్రదర్శించింది. 23వ జాతీయ బధిరుల క్రీడలలో (2019–చెన్నై) సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో రెండు రజిత పతకాలను గెలుచుకుంది. అంటాల్యా (2018), టర్కీ (2019)లో జరిగిన ప్రపంచ డెఫ్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో రెండుసార్లు దేశానికి ప్రాతినిధ్యం వహించింది.

చిత్రం భళా..

అబ్బురపరుస్తున్న విశ్రాంత ఆర్ట్ టీచర్ చిత్రాలు





రాయదుర్గం: ఓ విశ్రాంత ఆర్ట్ టీచర్ వేసిన చిత్రాలు సందర్శకులను అబ్బురపరుస్తున్నాయి. అద్భుతమైన ల్యాండ్ స్కేప్, సుందరమైన సీనరీస్ గీయడంలో తన ప్రతిభను చాటుతున్నా శివకుమార్. గచ్చిబౌలి కేంద్రీయ విద్యాలయ విశ్రాంత ఆర్ట్ టీచర్ శివకుమార్ తనకు తెలిసిన విద్యను ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులకు, ఔత్సాహికులకు పంచుతుంటారు. అందమైన ప్రదేశాల బొమ్మలను గీయడమే కాకుండా చిత్రలేఖనంలో రాణించేలా పలువురిని ప్రోత్సహిస్తున్నాడు. ఇందుకోసం ప్రతి రోజూ విద్యార్థులకు చిత్రలేఖనంలో శిక్షణ ఇస్తూ.. వారిలోని నైపుణ్యాలను ప్రోత్సహిస్తున్నాడు. ఈ క్రమంలో గత వారం రోజులుగా శిక్షణలో భాగంగా ఆయన గీసిన చిత్రాలను ప్రదర్శించారు. ఆకర్షణీయమైన పోస్టర్ కలర్ పెయింటింగ్ వేయడానికి ఒక్కోదానికి కనీసం గంట సమయం పడుతుందని శివకుమార్ చెబుతున్నారు.





నీటి కాలుష్యానికి రోబోలతో చెక్

వాటర్ పైప్‌లైన్లలోకి వెళ్లి కాలుష్యాన్ని గుర్తించే రోబోలు

- పైలట్ ప్రాజెక్టుగా నాలుగు డివిజన్లలో అమలు
- సత్ఫలితాలు ఉంటే నగరమంతా విస్తరణ
- జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: భూగర్భ తాగు నీటి జల మార్గాలలో కాలుష్య మూలాలు, లీకేజీలను త్వరితగతిన గుర్తించి సత్వరమే సమస్యను పరిష్కరించేందుకు జలమండలి అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారంగా పనిచేసే అత్యాధునిక రోబోలను రంగంలోకి దించింది. ఇవి నేరుగా పైపుల్లోకి వెళ్లి లీకేజీలను, కలుషితాలను గుర్తిస్తాయి. చెన్నైకి చెందిన సోలినాస్ ఇంటిగ్రిటీ డీప్‌టెక్ సంస్థ ఎండోబోట్.. స్వాస్థ్ సాంకేతికతతో వీటిని రూపొందించింది. సుమారు 70 ఎంఎం నుంచి 250 ఎంఎం డయా పైప్‌లైన్లలో ఈ రోబోలు సాఫీగా పనిచేస్తాయి. పైప్‌లైన్‌లో కాలుష్య కారకాలు కలిసే ప్రాంతం, పైప్‌లైన్ జీవితకాలం, అక్రమ ట్యాపింగ్ తదితర కీలక సవాళ్లను ఈ రోబోలు గుర్తిస్తున్నాయి. ప్రస్తుతం పైలట్ ప్రాజెక్టుగా నాలుగు డివిజన్లలో మూడు రోబోలను ప్రవేశపెట్టారు. 132 ప్రాంతాల్లో నీటి కాలుష్యంపై వచ్చిన ఫిర్యాదులను నెలరోజుల్లోనే ఈ రోబోలతో పరిష్కరించినట్లు జలమండలి వర్గాలు తెలిపాయి.

అక్రమ కనెక్షన్ల గుర్తింపు

హైదరాబాద్‌లో భూగర్భ నీటి సరఫరా వ్యవస్థలో సమస్యలు తలెత్తి తరచూ నీరు కాలుష్యమవుతోంది. పైప్‌లైన్లలో లీకేజీలతో ఈ సమస్య వస్తోంది. అయితే, భూగర్భంలో ఈ కలుషిత మూలాలను గుర్తించడం జలమండలికి తలకు మించిన భారంగా మారింది. తరచూ రోడ్లపై గుంతలు తవ్వాల్సి వస్తోంది. రెండేళ్ల క్రితం ట్రెంచ్‌లెస్ టెక్నాలజీ కెమెరాతో కూడిన అధునాతన 'క్విక్ ఇన్‌స్పెక్షన్ వాటర్ పొల్యూషన్ సిస్టం (క్యూఐడబ్ల్యూపీఎస్) యంత్రాలను పలు ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా వినియోగించారు. కానీ, ఆ యంత్రానికి ఉండే కెమెరా చెడిపోవటం, కేబుల్ సమస్య, పాడైన పరికరాలు అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలతో ఆర్థికంగా భారంగా మారింది. దీంతో వాటి స్థానంలో రోబోలను ప్రవేశపెడుతున్నారు. ఇవి పైప్‌లైన్ లోపల తిరుగుతూ సమస్యను కనుగొంటాయి. జీఐఎస్ మ్యాపింగ్‌తో ఆ పైప్‌లైన్ మార్గంలో ఉన్న వాటర్ కనెక్షన్ల సమగ్ర సమాచారాన్ని అందిస్తాయి. దీంతో అక్రమ, సక్రమ కనెక్షన్ల సమాచారం కూడా రికార్డు అవుతోంది. ఈ రోబోలకు లైట్‌తో కూడిన 'హై రిజల్యూషన్ కెమెరా'ఉంటుంది. దానిని పైపులైన్‌లోకి పంపించి భూ ఉపరితలంపై ఉండే మానిటర్‌లో పరిస్థితిని ప్రత్యక్షంగా చూడవచ్చు. రోబో గుర్తించే దృశ్యాలతో వీడియో సైతం రికార్డు అవుతోంది. దీంతో కాలుష్యమూలాలు ఎక్కడ ఉన్నాయో గుర్తించి అక్కడ మాత్రమే రోడ్డును తక్షణం రిపేర్లు చేసేందుకు వీలవుతోంది.



వాటర్ పైప్‌లైన్ మార్గంలో కాలుష్య మూలాలు, లీకేజీలను గుర్తించే రోబో

సత్ఫలితాలు ఇస్తే రోబోటిక్స్ సేవలు విస్తరిస్తాం



పైప్‌లైన్లలో కాలుష్య మూలాలను గుర్తించేందుకు ఏఐ రోబోలను ప్రయోగిస్తున్నాం. సమస్య ఎక్కడ ఉందో గుర్తించి అక్కడే రోడ్డు, పైప్‌లైన్ కట్‌చేసి మరమ్మతులు చేస్తున్నాం. ప్రస్తుతం పైలట్ ప్రాజెక్టుగా నాలుగు డివిజన్లలో అమలు చేస్తున్నాం. సత్ఫలితాలు వస్తే అన్ని డివిజన్లలో వీటి సేవలను అందుబాటులోకి తీసుకొస్తాం.

– మాయంక్ మిట్టల్, ఈడీ, జలమండలి

హైదరాబాద్‌లో నీటి కాలుష్యంపై ఫిర్యాదులు ఇలా..

నెల	ఫిర్యాదులు
జూన్	1,417
జూలై	1,254
ఆగస్టు	1,237
సెప్టెంబర్	1,270



పైప్‌లైన్‌లోకి రోబోను పంపుతున్న దృశ్యం

నాగ్‌పూర్ విమానానికి బాంబు బెదిరింపు

- బాంబు ఉందని రాసిన పేపర్ లభ్యం
- సీటు కింద గుర్తించిన అధికారులు
- తనిఖీల అనంతరం 8 గంటలు ఆలస్యంగా బయల్దేరిన విమానం

శంషాబాద్ (హైదరాబాద్): ఎర్ర ఇంకుతో రాసిన బాంబు బెదిరింపు టిష్యూ పేపర్ ఎయిర్‌పోర్టులో కలకలం రేపింది. దీంతో విమానం ఎనిమిది గంటలు ఆలస్యంగా బయల్దేరింది. ఎయిర్‌పోర్టు భద్రతాధికారులు, పోలీసులు తెలిపిన వివరాలివి. శంషాబాద్ విమానాశ్రయం నుంచి 6ఈ–7452 విమానం గురువారం ఉదయం 6.30 గంటలకు నాగ్‌పూర్ బయల్దేరేందుకు మొత్తం 73 మంది ప్రయాణికులతో సిద్ధమైంది. విమానంలోని 16డీ నంబర్ సీటు కింద.. ఎర్ర ఇంకుతో ఆంగ్లంలో బాంబు ఉందని రాసిన టిష్యూ పేపర్‌ను అధికారులు గుర్తించారు. వెంటనే విమానాన్ని ట్యాక్సీవేకు తీసుకొచ్చి ప్రయాణికులు, సిబ్బందిని దించివేశారు. అనంతరం విమానాన్ని వెంటనే ఐసోలేషన్‌కు పంపారు. ప్రయాణికులు, వారి లగేజీలను కూడా క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ మేరకు అధికారుల ఫిర్యాదుపై ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు పోలీస్‌స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేశారు. అదే విమానం మధ్యాహ్నం 3 గంటలకు ఇక్కడి నుంచి బయలుదేరింది.

ఎయిర్‌పోర్టులో రూ. 2.37 కోట్ల బంగారం పట్టివేత



శంషాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఓ ప్రయాణికుడు అక్రమంగా తీసుకొచ్చిన బంగారాన్ని డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జీ9–467 విమానంలో కువైట్ నుంచి షార్జా మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ప్రయాణికుడిని ముందస్తు సమాచారం మేరకు డీఆర్ఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద ఉన్న లగేజీని పరిశీలించగా మెటలిక్ లాక్‌లో రెండు బంగారు బిస్కెట్లు, సన్‌ఫ్లవర్ విత్తనాలతో ఉన్న మరో ప్లాస్టిక్ పౌజ్‌లో బంగారు ముక్కలు బయటపడ్డాయి. మొత్తం 1,798 గ్రాముల బరువు కలిగిన బంగారం విలువ రూ. 2.37 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నెల రోజులు.. ఆరు బ్యాచ్‌లుగా వ్రతాలు

- యాదగిరి క్షేత్రంలో శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలు
- ఈనెల 22 నుంచి వచ్చే నెల 20 వరకు కార్తీక మాసోత్సవాలు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 22వ తేదీ నుంచి నవంబర్ 20వ తేదీ వరకు కార్తీక మాసోత్సవాలను నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు యాదగిరి క్షేత్రంలో కార్తీక మాసంలో శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలు చేసేందుకు ఎక్కువగా ఆసక్తి చూపిస్తుంటారు. ఈ నేపథ్యంలో యాదగిరి కొండకు దిగువన ఉన్న శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపంలోని రెండు హాల్స్‌లో పూజా సామగ్రి, వ్రత పీటలను సిద్ధం చేస్తున్నారు. యాదగిరి గుట్ట ఆలయంతో పాటు అనుబంధ ఆలయమైన పాతగుట్టలో సైతం వ్రతాలను జరిపించేందుకు అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. నెల రోజుల పాటు ఆరు బ్యాచ్‌లుగా, పాతగుట్ట ఆలయంలో నాలుగు బ్యాచ్‌లుగా వ్రతాలను జరిపించనున్నారు. రోజూ ప్రతి గంటకు ఒక బ్యాచ్ చొప్పున ఈ పూజలు ఉంటాయి. ఇందులో మొదటి బ్యాచ్ పూజ ఉదయం 7 గంటల నుంచి ప్రారంభం అవుతుంది. చివరి బ్యాచ్ పూజ సాయంత్రం ఐదు నుంచి ఆరు గంటల వరకు జరుగుతుంది. ఇక వచ్చే నెల 5వ తేదీన కార్తీక శుద్ధ పూర్ణిమ నేపథ్యంలో ఉదయం 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు 8 బ్యాచ్‌లుగా వ్రతాలను నిర్వహిస్తారు. పాతగుట్ట ఆలయంలో మొదటి బ్యాచ్ పూజ ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుంది. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని నవంబర్ 5వ తేదీన 6 బ్యాచ్‌లుగా వ్రతాలను జరిపిస్తారు.

క్లుప్తంగా...

3న ఓటుకు కోట్లు కేసులో తీర్పు

సాక్షి, న్యూఢిల్లీ: ఓటుకు కోట్లు కేసులో రెండు రోజులు వరుసగా వాదనలను విన్న సుప్రీం కోర్టు కేసును వాయిదా వేసింది. బుధవారం నాటి విచారణ సందర్భంగా.. గురువారం తీర్పు వెలువరిస్తామని జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ప్రకటించింది. అయితే, వేరే ముఖ్యమైన కేసుల్లో ఉన్న కారణంగా గురువారం విచారణ వాయిదా వేస్తున్నట్లు చెప్పింది. నవంబర్ 3న దీనికి సంబంధించిన రెండు కేసుల్లో తీర్పు వెలువరిస్తామని పేర్కొంది. ఓటుకు నోటు కేసును అవినీతి నిరోధక చట్టం కింద కాకుండా ఎన్నికల చట్టాల నియమావళి కింద విచారణ చేపట్టాలని కోరుతూ 2021, జూలై 22న రేవంత్‌రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అలాగే ఈ కేసులో తన పేరును తొలగించాలని కోరుతూ 2021, ఏప్రిల్ 13న సండ్ర వెంకట వీరయ్య వేర్వేరుగా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

నేడు క్షేత్ర స్థాయి విధుల్లోకి యువ ఐపీఎస్‌లు

సాక్షి, హైదరాబాద్: విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న 77 ఆర్ఆర్ (రెగ్యులర్ రిక్రూటీస్–2024) బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్‌ల పాసింగ్ అవుట్ పరేడ్ శుక్రవారం జరగనుంది. శివరాంపల్లిలోని నేషనల్ పోలీస్ అకాడమీలో ఉదయం జరగనున్న ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీఎస్ఎఫ్ డైరెక్టర్ దల్జీత్‌సింగ్ చౌదరి హాజరుకానున్నారు. ఈ బ్యాచ్‌లో మొత్తం 174 మంది ట్రైనీ ఐపీఎస్ (ఇండియన్ పోలీస్ సర్వీస్)లు, 16 మంది నేపాల్, రాయల్ భూటాన్, మాల్దీవ్‌లకు చెందిన విదేశీ పోలీస్ అధికారులు ఉన్నారు. ఈ బ్యాచ్‌లో అత్యధికంగా 65 మంది మహిళా అధికారులు ఉండటం గమనార్హం. శిక్షణలో భాగంగా వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన వారికి ముఖ్యఅతిథి దల్జీత్ సింగ్ చౌదరి ట్రోఫీలను బహూకరించనున్నారు.

బీడీ ఆకుల ఏజెంట్‌గా అటవీ అభివృద్ధి సంస్థ

సాక్షి, హైదరాబాద్: 2026 బీడీ ఆకుల సీజన్‌కు.. రాష్ట్ర ప్రభుత్వ ఏజెంట్‌గా తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ (టీఎఫ్‌డీ సీఎల్)ను నియమించారు. ఈ మేరకు గురువారం అటవీశాఖ ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీమ్ ఆదేశాలు జారీ చేశారు. బీడీ ఆకుల కొనుగోలుకు టెండర్లను పిలవడం, వ్యాపారం చేయడం, 2026 బీడీ ఆకుల స్కీం అమలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏజెంట్‌గా ఈ సంస్థ వ్యవహరించనుంది. దీనికి సంబంధించి పీసీసీఎఫ్ పంపించిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

అంగన్‌వాడీలకు రూ.156 కోట్లు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.156 కోట్లు విడుదల చేసింది. ఈమేరకు గురువారం రాష్ట్ర ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులతో అంగన్‌వాడీ కేంద్రాలకు పోషకా హార పథకం కోసం.. సరఫరా చేసిన వస్తువుల బిల్లుల చెల్లింపులు, కూరగాయలు, గ్యాస్ సి లిండర్, అద్దె బిల్లులు చెల్లించుకోవాలని ఆదేశించింది. ఇందుకు సంబంధించిన అన్ని బిల్లు లను వెంటనే మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించాలని రాష్ట్ర కార్యాలయం ఆదేశించింది. రానున్న రెండు రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేసింది.

దీపావళి సందర్భంగా ప్రత్యేక రైళ్లు



సాక్షి, హైదరాబాద్: దీపావళి, ఛట్ పండుగల సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని వివిధ మార్గాల్లో ప్రత్యేక రైళ్లు నడవ నున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు తిరుపతి–సికింద్రాబాద్ (07497/ 07498), విజయవాడ–సికింద్రాబాద్ (07213/07214) మధ్య ఈ నెల 17, 18 తేదీల్లో రాకపోకలు సాగించనున్నాయి. అలాగే హైదరాబాద్–భువనేశ్వర్ (07165/07166) ఎక్స్‌ప్రెస్ నవంబర్ 4వ తేదీ నుంచి 26వ తేదీ వరకు రాకపోకలు సాగించనుంది.

రూ.20 వేల వేతనం ఇవ్వండి

తెలంగాణ ఐకేపీ వీవోఏల జేఏసీ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) పరిధిలో పనిచేస్తున్న సిబ్బందికి కనీస వేతనం రూ.20 వేలు, ఎమ్మెసీసీ హెచ్ఆర్ లేదా సెర్ప్‌హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని సెర్ప్ సీఈవోకు తెలంగాణ ఐకేపీ వీవోఏల జేఏసీ విజ్ఞప్తి చేసింది. ఈ సంస్థలో 18 వేల మంది వీవోఏలు ఇరవయ్యేళ్లుగా పనిచేస్తున్నా.. నెలకు ఇస్తున్న రూ.5 వేల వేతనం ఏ అవసరానికి సరిపోవడం లేదని తెలిపింది. ఈ మేరకు సెర్ప్ కార్యాలయం ఎదుట గురువారం పలువురు ఉద్యోగులు, సిబ్బంది ధర్నాకు దిగారు. పోలీసులు వచ్చి వారిని అదుపులోకి తీసుకున్నారు. తమ సమస్యలపై జేఏసీ నేతలు వినతిపత్రం సమర్పించారు.

నగర వార్తలు

నగరంలో నేడు

- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో చిత్రకారులు మద్దిలేటి, తేజ వేసిన చిత్రాల ప్రదర్శన ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో శివోహం పేరిట కళాకారిణి శిల్పా కాసు వేసిన చిత్రాల ప్రదర్శన ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ విజయం ఖాయం

– మంత్రి పొన్నం ప్రభాకర్

గోల్కొండ: జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం షేక్‌పేట్ డివిజన్ టోలిచౌకీ ఎస్ఆర్ కన్వెన్షన్‌లో జరిగిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కు దీటుగా ఇతర పార్టీలకు అభ్యర్థులే లేరని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో తెలంగాణ వేగంగా అభివృద్ధిపథంలో పయనిస్తోందని అన్నారు. ఎన్నికల్లో తమ ఉనికి చాటుకోవడానికి బీజేపీ, బీఆర్ఎస్‌లు హడావుడి చేస్తున్నాయని ఎద్దేవా చేశారు. ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేసి ముఖ్యమంత్రికి జూబ్లీహిల్స్ గెలుపును కానుకగా ఇవ్వాలన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ బూత్ ఇన్‌చార్జీలు ఓటరు లిస్టుపై గట్టి పట్టు కలిగి ఉండాలని, గరిష్టంగా ఓటింగ్ జరిగేలా చూడాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యకర్తలు పార్టీకి పట్టుగొమ్మలు లాంటి వారని, బూత్ ఇన్‌చార్జీలు వారితో సమన్వయంగా ఉంటూ ప్రతి ఒక్కరినీ పోలింగ్ బూత్ వరకు రప్పించే విధంగా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. జూబ్లీహిల్స్ గెలుపుతో కాంగ్రెస్‌లో ఒక నూతనోత్తేజం వస్తుందని అన్నారు. కార్యక్రమంలో జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్, రాష్ట్ర మంత్రి జి.వివేక్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి విశ్వనాథం, అజహరుద్దీన్, వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మత్ ఉల్లా హుస్సేనీ, పౌర సరఫరాల సంస్థ చైర్మన్ ఫహీమ్, షేక్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు డి.సత్యనారాయణ, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కంటోన్మెంట్ బోర్డు సమావేశం రసాభాస

- వాకౌట్ చేసిన ఎంపీ ఈటల, ఎమ్మెల్యే శ్రీగణేశ్
- అధికారుల తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సమావేశం రసాభాసగా ముగిసింది. ప్రజాప్రతినిధులను అధికారులు అగౌరవపరుస్తున్నారంటూ ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే శ్రీగణేశ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎంపీ, ఎమ్మెల్యే బోర్డు సమావేశాల్లో ప్రత్యేక ఆహ్వానితులు మాత్రమేనని, వారికి తీర్మానాల్లో ఓటింగ్ హక్కు లేదని సీఈఓ మధుకర్ నాయక్ ఇచ్చిన వివరణతో ఎంపీ తీవ్రస్థాయిలో స్పందించారు. అలాంటప్పుడు తమను సమావేశానికి పిలవాల్సిన అవసరమేముందంటూ ప్రశ్నించారు. అధికారుల తీరుపై తాను స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తానని అన్నారు. ఎమ్మెల్యే శ్రీగణేశ్ సైతం అధికారుల సమాధానం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రజాప్రతినిధులు ఉత్సవ విగ్రహాలు కాదని అనఅన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే తమ సీట్ల నుంచి లేచి బయటకు వెళ్లే క్రమంలోనూ అధికారులు వారిని వారించలేదు. ఎంపీ బయటకు వెళ్లిపోగా, ఎమ్మెల్యే శ్రీగణేశ్ బోర్డు సమావేశంలో తాను చర్చించాలనుకున్న అంశాలకు సంబంధించిన పత్రాలను అధికారులకు అందజేశారు. బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద సైతం ఎంపీని అనుసరిస్తూ బయటకు వెళ్తుండగా, బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ ఎస్.రాజీవ్ వారించారు. ఎంపీని తీసుకొస్తానని ఆమె చెప్పగా, బలవంతంగా తిరిగి రప్పించాల్సిన అవసరం లేదని ఆయన అన్నారు. ఎమ్మెల్యే శ్రీగణేశ్ కూడా సమావేశం నుంచి వాకౌట్ చేయడంతో బోర్డు అధికారులు సమావేశాన్ని అర్ధంతరంగానే ముగించారు.



కంటోన్మెంట్ బోర్డు సమావేశంలో ఎంపీ ఈటల, ఎమ్మెల్యే శ్రీగణేశ్ తదితరులు

రాష్ట్ర బంద్‌తో ఢిల్లీకి సెగ తగలాలి



– బీసీ జేఏసీ చైర్మన్ ఆర్.కృష్ణయ్య

పంజగుట్ట: తెలంగాణ మలిదశ ఉద్యమానికి కేంద్రంతోపాటు వ్యవస్థలన్నీ కదిలిన విధంగా బీసీ ప్రజా ఉద్యమం చేయాలని, అప్పుడే ఢిల్లీకి సెగ తగులుతుందని, బీసీలకు న్యాయం జరుగుతుందని బీసీ జేఏసీ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఈ నెల 18న జరిగే బీసీ బంద్‌లో ప్రతీ బీసీ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ జర్నలిస్టుల అసోసియేషన్స్ ఆధ్వర్యంలో బీసీ జేఏసీ నాయకులతో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్ర బంద్‌కు బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం మద్దతు ఇచ్చాయని, కాంగ్రెస్ కూడా సంఘీభావం తెలపాలన్నారు. ఉద్యమంలో స్వచ్ఛందంగా పాల్గొని ఢిల్లీకి సెగ తగిలేలా చేయాలన్నారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చేలా రాజ్యాంగంలో సవరణ జరిగే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. జేఏసీ వర్కింగ్ చైర్మన్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బీసీల నోటికాడి ముద్దను లాక్కునేందుకు రెడ్డి జాగృతి నాయకులు చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో బీసీ జేఏసీ కో చైర్మన్ రాజారాం యాదవ్, సీనియర్ పాత్రికేయుడు వెంకటరమణ, జేఏసీ కో చైర్మన్ వీజీఆర్ నారగోని, దాసు సురేష్, గుజ్జ కృష్ణ, కనకాల శ్యామ్, సుంకరి రామ్మూర్తి, కొండా దేవన్న తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో వాగ్వాదం ..

సమావేశానికి హాజరైన ఇద్దరు బీసీ నాయకులు తమకు కూడా మాట్లాడే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సమయం లేదని నిర్వాహకులు అనడంతో ఆర్.కృష్ణయ్య కూడా మాట్లాడకూడదంటూ వాగ్వాదానికి దిగారు. తమను మాట్లాడనివ్వకుండా అవమానిస్తున్నారని, తొక్కేస్తున్నారని గొడవకు దిగడంతో అక్కడే ఉన్న జర్నలిస్టులు వారిని సముదాయించారు.

సదర్ ఉత్సవాలకు రండి..

– సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించిన నిర్వాహకులు

ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లో ఘనంగా నిర్వహించే సదర్ ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ నిర్వాహకులు గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేశారు. దశాబ్దాలుగా ఖైరతాబాద్‌లో మంగళవారపు చౌదరి యాదయ్య యాదవ్ అండ్ బ్రదర్స్ ఆధ్వర్యంలో దీపావళి మరుసటి రోజు సదర్ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రిని కలిసినవారిలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, కార్పొరేటర్ విజయారెడ్డి, మంగళారపు మహేష్‌యాదవ్, రాజుయాదవ్, మంగళారపు మధుకర్ యాదవ్, మల్లికార్జున్ యాదవ్, దుర్గాప్రసాద్



సదర్ ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న నిర్వాహకులు

మహిళలను కించపర్చే విధానాలపై ఉద్యమం

ఐద్వా జాతీయ ప్రధానకార్యదర్శి మరియం ధావలే



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మహిళల వ్యక్తిత్వాన్ని దిగజార్చే విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడదామని ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే పిలుపునిచ్చారు. 'మనువాదం– మహిళల హక్కుల ప్రభావం'అనే అంశంపై గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఐద్వా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మరియం ధావలే మాట్లాడుతూ మనువాదం మనిషి పుట్టుకను కులాలవారీగా విభజించి అశాస్త్రీయంగా చూపిస్తోందని విమర్శించారు. మహిళలను వంటింటికే పరిమితం చేసేందుకు మనసుల్లో విషబీజం నాటుతున్నారని అన్నారు. మహిళల అస్తిత్వంపై దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ మనువాదానికి వ్యతిరేకంగా సావిత్రీబాయిపూలేను స్ఫూర్తిగా తీసుకొని పోరాడాలని పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ పోరాట యోధులైన ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం, వీరనారి ఐలమ్మ స్ఫూర్తితో మహిళలు తమ హక్కుల కోసం ముందుకు సాగాలన్నారు. ఐద్వా సహాయ కార్యదర్శి ఉగ్గవీటి సరళ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి, ఉపాధ్యక్షులు జ్యోతి, కేఎన్ ఆశాలత, పి.శశికళ, ఎం.వినోద, బండి పద్మ, షబానా బేగం, బి.అనురాధ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ లేదు.. అంతా జీరో!

– టపాసుల బిల్లు రూ.లక్షల్లో అయినా తెల్ల కాగితంపైనే..

సాక్షి,సిటీబ్యూరో: 'మేలుకో వినియోగదారుడా.. మేలుకో', 'సకాలంలో పన్నులు చెల్లించండి.. దేశాభివృద్ధిలో పాలుపంచుకోండి'అంటూ వాణిజ్య పన్నుల శాఖ చేస్తున్న ప్రచారం కేవలం ప్రకటనలకే పరిమితం అవుతోంది. దీనికి నగరంలోని టపాసుల వ్యాపారమే తాజా నిదర్శనం. వే బిల్లులు లేకుండా ట్యాక్స్ చెల్లించకుండానే రూ.లక్షల్లో జీరో వ్యాపారం సాగుతోంది. ప్రభుత్వానికి పన్ను ఎగ్గొట్టి దాదాపు రూ. 500 కోట్ల టపాసులు నగరానికి దిగుమతి అయినట్లు విశ్వసనీయ సమాచారం. వారం రోజుల నుంచి హోల్‌సేల్ వ్యాపారుల నుంచి రూ.లక్షల్లో రిటైల్ వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. టపాసుల క్రయ విక్రయాలపై 18 శాతం జీఎస్టీ ఉంది. ఈ లెక్క ప్రకారం ప్రభుత్వం ఖజానాకు సుమారు రూ.128 కోట్ల ఆదాయం రావాలి. ఎంత పెద్ద మొత్తంలో బిల్లు అయి నా తెల్ల కాగితంపై రాసిస్తారు. దీనిపై తీసుకున్న వస్తువుల పేర్లు, దుకాణం పేరు, రిజిస్టర్ నెంబర్ కనిపించవు. ఎవరైనా టపాసుల వ్యాపారం చేయాలనుకుంటే, తాత్కాలిక జీఎస్టీ తీసుకోవాలి. కానీ, అధికారుల అండదండలతో జీఎస్టీ లేకుండానే, ట్యాక్స్ కట్టకుండానే వ్యాపారులు టపాసులు విక్రయిస్తున్నారు. మరోవైపు టపాసులపై ఉన్న ధర కంటే నాలుగు రెట్లు ఎక్కువకు అమ్ముతున్నారు. కిందిస్థాయి అధికారులు, సిబ్బంది పకడ్బందీగా విధులు నిర్వహిస్తే ప్రభుత్వ ఆదాయం పెరుగుతుందని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

మత్తుమందు చట్ట విరుద్ధం

– మేడ్చల్ డ్రగ్స్ కంట్రోల్ అధికారులు

సాక్షి,సిటీబ్యూరో: 'మత్తుమందు చట్టవిరుద్ధం.. ప్రజల విలువైన ప్రాణాలను కాపాడటంలో సహాయపడండి'అని మేడ్చల్ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మీ సమాచారం ప్రజల విలువైన ప్రాణాలను కాపాడుతుందని పేర్కొన్నారు. ప్రజలకు హాని కలిగించే మందులు, ఇతర ఔషధాల అక్రమ కార్యకలాపాలను అరికట్టడంలో ప్రజల సహకారం అవసరమని విజ్ఞప్తి చేసింది. అక్రమ మందులు, ఇతర ఔషధాల తయారీ, విక్రయాలు ఎక్కడైనా గమనిస్తే వెంటనే తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. నివాస, వాణిజ్య లేదా పరిశ్రమల ప్రాంతాల్లో మందుల అక్రమ తయారీ, ప్రిస్క్రిప్షన్ లేకుండా మందుల విక్రయం, అబార్షన్ కిట్లు లేదా ఇతర నిషేధిత ఔషధాల అక్రమ అమ్మకం, మందులకు సంబంధించిన ఇతర ఏవైనా అక్రమ కార్యకలాపాల సమాచారం టోల్ ఫ్రీ నెంబర్ 18005996969లో తెలియజేయాలని పేర్కొన్నారు.

రేపు నిర్మలానంద 90వ జయంతి

సాక్షి, సిటీబ్యూరో: ప్రజాసాహితీ సంపాదకుడు, తెలుగు సాహిత్యంలో అనువాదాలకు పెట్టింది పేరైన 'నిర్మలానంద'(ముప్పన మల్లేశ్వరరావు) 90వ జయంతి సందర్భంగా ఈ నెల 18వ తేదీన సాయంత్రం ఆరుగంటలకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సాహితీసభ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 24 విదేశీ అనువాద కథల సంకలనం 'నది మూడవ ఒడ్డు' తోపాటు నిర్మలానందం మిత్రుల స్మృతులు, 'సరిహద్దు కథలు', 'ఏడు పైసలు'పుస్తకాలను ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.

సామాన్యులకు అండగా స.హ. చట్టం

– కమిషనర్ పీవీ శ్రీనివాసరావు



బంజారాహిల్స్: సామాన్యులకు అన్యాయం జరగకుండా చూడటం, ఒకవేళ అన్యాయం జరిగినా న్యాయం చేసే సదుద్దేశంతో రూపొందించినదే సమాచార హక్కు చట్టం అని తెలంగాణ సమాచార చట్టం కమిషనర్ పీవీ శ్రీనివాసరావు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో గురువారం జరిగిన సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అవినీతి జరగకుండా, పాలన పారదర్శకంగా ఉండేవిధంగా ఈ చట్టాన్ని సరైన మార్గంలో ఉపయోగించుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరిస్తున్నామని వెల్లడించారు. రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్.విజయ కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల డైరెక్టర్లు, డీన్లు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ మద్యం దందా వత్తాసుకే 'సాక్షి'కి వేధింపులు

వరుసగా ఐదో రోజు 'సాక్షి'కార్యాలయాల్లో పోలీసుల హల్‌చల్

వరుసగా మూడో రోజూ ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డికి నోటీసులు

సాక్షి, అమరావతి: ప్రజల గొంతుకగా నిలుస్తున్న 'సాక్షి'మీడియాపై చంద్రబాబు ప్రభుత్వం మరింతగా కక్ష సాధింపు చర్యలకు బరితెగిస్తోంది. రాజ్యాంగ హక్కులు, పత్రికా స్వేచ్ఛను కాలరాస్తూ కుట్రలకు పదును పెడుతోంది. వరుసగా ఐదో రోజు 'సాక్షి'కార్యాలయాల్లో పోలీసులు వేధింపులకు దిగడం విభ్రాంతి కలిగిస్తోంది. వరుసగా మూడో రోజు ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డికి నోటీసుల పేరుతో వేధింపులు కొనసాగిస్తున్నారు. నోటీసులు తీసుకుంటున్నా.. పోలీసులకు ఎప్పటికప్పుడు సహకరిస్తున్నా వేధింపులు మాత్రం ఆగడం లేదు. తద్వారా కూటమి సర్కారు ప్రజావ్యతిరేక విధానాలను వెలుగులోకి తేకుండా, నకిలీ మద్యంపై వార్తలు ప్రచురించకుండా 'సాక్షి'పత్రికను నిరోధించాలన్నదే ప్రభుత్వ పెద్దల పన్నాగమన్నది స్పష్టమవుతోంది. అందుకోసం ఏకంగా సుప్రీంకోర్టు తీర్పులను కాలరాస్తూ పోలీసు జులుంతో విరుచుకుపడుతుండటం జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది.

నకిలీ మద్యం దందా వత్తాసుకే...

ఏపీలో వెలుగు చూసిన నకిలీ మద్యం మాఫియా దందా యావత్ దేశాన్ని కుదిపివేసింది. అనకాపల్లి, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, అన్నమయ్య జిల్లాల్లో బయటపడిన నకిలీ మద్యం రాకెట్ సంచలనం రేకెత్తించింది. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో మద్యం తాగిన కొందరు సందేహాస్పద రీతిలో మరణించడం కలకలం రేపింది. బాధ్యతాయుతమైన మీడియా సంస్థగా ప్రజలను చైతన్యం చేస్తూ సాక్షి దినపత్రిక ఈ నకిలీ మద్యం వ్యవహారంలో వాస్తవాలను ప్రచురించింది. నకిలీ మద్యం బారిన పడకుండా అమాయకులను కాపాడాలన్న సదుద్దేశంతో వ్యవహరించింది. మరోవైపు నకిలీ మద్యం దందాపై కఠిన చర్యలు తీసుకునేలా అధికార యంత్రాంగానికి ప్రేరణ కల్పించాలని భావించింది. కానీ 'సాక్షి' ప్రచురించిన వాస్తవాలు ప్రభుత్వ పెద్దలకు కంటగింపుగా మారాయి. తమ దోపిడీ వ్యవహారం బట్టబయలు కావడంతో వారు బెంబేలెత్తారు. దాంతో నకిలీ మద్యం దందాపై కథనాలు ప్రచురించకుండా 'సాక్షి'మీడియాను నిరోధించాలని ఎత్తుగడ వేశారు. అందుకే 'సాక్షి'పై అక్రమ కేసులు నమోదు చేశారు. అనంతరం పోలీసులు నోటీసులు, విచారణ పేరుతో పేరుతో వేధింపులు తీవ్రతరం చేశారు.

బుధవారం వెళ్లిపోయి.. గురువారం మళ్లీ వచ్చి..

సాక్షి దినపత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు బ్యూరో ఇన్‌చార్జ్ మస్తాన్‌రెడ్డిలకు పోలీసులు నోటీసుల మీద నోటీసులు ఇచ్చి వేధిస్తున్న విషయం తెలిసిందే. ఈ నెల 11 నుంచి వరుసగా విజయవాడ ఆటోనగర్, నెల్లూరులలోని సాక్షి కార్యాలయాలతోపాటు హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయాలకు పోలీసులు చేరుకుని రాద్ధాంతం చేస్తూనే ఉన్నారు. నోటీసులు, విచారణ పేరుతో పదే పదే వేధిస్తున్నారు. వార్తకు సంబంధించిన సోర్స్, బాధితుల వివరాలు వెల్లడించాలని అడగటం, పత్రికలో ఉద్యోగుల వివరాలు వెల్లడించాలనడం సుప్రీంకోర్టు ఉత్తర్వులకు విరుద్ధం. కానీ ప్రభుత్వ పెద్దల కుట్రకు వత్తాసు పలకడమే ఏకైక కర్తవ్యంగా వ్యవహరిస్తున్న పోలీసులు దీన్ని లెక్క చేయడం లేదు. ఈ క్రమంలో బుధవారం హైదరాబాద్‌లోని సాక్షి ప్రధాన కార్యాలయంలో ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డికి నోటీసులంటూ నెల్లూరు రూరల్, కలిగిరి పోలీసులు దాదాపు 10 గంటలకుపైగా వేధించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7వరకు సాక్షి ప్రధాన కార్యాలయంలో పోలీసులు హల్‌చల్ చేశారు. పత్రికలో ప్రచురించిన కథనాలకు సంబంధించి ఆధారాలు (సోర్స్) చూపించాలంటూ ఒత్తిడి చేశారు. ఓపికగా పోలీసులు అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ పూర్తి సహకారం అందించినప్పటికీ మరుసటి రోజే పోలీసు స్టేషన్‌లో ఆయన తమ ఎదుట విచారణకు హాజరుకావాల్సిందేనని చెప్పారు. దీంతో ఎడిటర్ తనకు ఈ నెల 29 వరకు గడువు కావాలని కోరారు. అందుకు సమ్మతించిన పోలీసులు సాక్షి ప్రధాన కార్యాలయం నుంచి బుధవారం రాత్రి 7 గంటలకు వెళ్లిపోయారు.

ఒక్క రోజులోనే మాట మార్చి..

కానీ పోలీసులు ఒక్క రోజులోనే మాట మార్చారు. తమ ప్రశ్నలకు సమాధానం చెప్పేందుకు ఈ నెల 29 వరకు గడువు ఇచ్చిన పోలీసులు.. గురువారం మళ్లీ హైదరాబాద్‌లోని సాక్షి ప్రధాన కార్యాలయంలో ప్రత్యక్ష మయ్యారు. అన్ని రోజులు గడువు ఇవ్వలేమన్నారు. తమ ప్రశ్నావళికి శుక్రవారమే సమాధానాలు చెప్పాలని నోటీసులు ఇచ్చారు. అంటే అమరావతి నుంచి ప్రభుత్వ పెద్దలు, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఒత్తిడితోనే పోలీసులు వేధింపులకు పాల్పడుతున్నారన్నది స్పష్టమవుతోంది.

హైదరాబాద్ కార్యాలయంలో మూడు రోజులుగా పోలీసుల హల్‌చల్

ఏపీలో నకిలీ మద్యం ఘటనపై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. సీబీఐ విచారణకు పెద్ద ఎత్తున డిమాండ్లు వచ్చాయి. అయితే అధికార పార్టీకి చెందిన వ్యక్తులు, సన్నిహితులు కీలక నిందితులు ఉండటంతో కూటమి ప్రభుత్వం కేసును నీరుగార్చేందుకు 'సిట్'విచారణకు ఆదేశించింది. ఈ క్రమంలో నకిలీ మద్యం కుంభకోణంలో వాస్తవాలను వెలుగులోకి తీసుకొస్తుండటంతో 'సాక్షి'ని అడ్డుకునేందుకు కుయుక్తులు పన్నింది. శనివారం నెల్లూరు రూరల్, కలిగిరి పోలీసు స్టేషన్‌లో అక్రమ కేసులు నమోదు చేయించింది. ఆ మరుక్షణం పోలీసు యంత్రాంగాన్ని సాక్షిపై దాడులకు ఉసిగొల్పింది. శనివారం ఇంటికి వెళ్లి మరీ నెల్లూరు జిల్లా బ్యూరో ఇన్‌చార్జికి నోటీసులు జారీ చేసిన పోలీసులు ఆ మరుసటి రోజు ఆదివారం తెల్లవారుజామున సోదాల పేరుతో వీరంగం వేశారు. విచారణకు రావాలని ఒత్తిడి చేశారు. మళ్లీ ఆదివారం అర్ధరాత్రి మరోసారి నెల్లూరు రూరల్, కలిగిరి పోలీసులు నోటీసుల పేరుతో వేధింపులకు పాల్పడ్డారు. ఇదే రీతిన ఆదివారం తెల్లవారక ముందే కనీసం కార్యాలయం తాళాలు తెరవక ముందే విజయవాడ ఆటోనగర్‌లోని సాక్షి కార్యాలయంపైకి దండెత్తారు. ఎడిటర్‌కు నోటీసులు ఇవ్వాలంటూ సిబ్బందిని, జర్నలిస్టులను వేధించారు. ఎడిటర్ హైదరాబాద్‌లోని కార్యాలయం నుంచి విధులు నిర్వహిస్తున్నారని చెప్పినప్పటికీ వరుసగా సోమవారం, మంగళవారం కూడా విజయవాడ సాక్షి కార్యాలయంపై పోలీసుల దండయాత్రలు ఆగలేదు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం పలు కార్యక్రమాలకు హాజరు కావాల్సి ఉన్నందున వారం తరువాత విచారణకు వస్తానని ఎడిటర్ సోమవారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే మంగళవారం సాయంత్రం వాట్సాప్ ద్వారా ఎడిటర్‌కు నోటీసులు పంపించిన పోలీసులు.. బుధవారం హైదరాబాద్‌లోని కార్యాలయంలో అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. వాస్తవానికి ఇది సుప్రీం కోర్టు తీర్పులకు విరుద్ధమైనప్పటికీ, పోలీసులు టీడీపీ పెద్దలకు జీహుజూర్ అంటూ చట్టాలను తుంగలో తొక్కేశారు. అయితే ప్రజాస్వామ్య విలువలు, చట్టాలను గౌరవిస్తూ పోలీసులు సూచించినట్లుగా సాక్షి ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి కార్యాలయంలో బుధవారం అందుబాటులో ఉండగా ఏకంగా 10 గంటల పాటు విచారించారు. ఇక గురువారం కూడా అదే రీతిన పోలీసులు అసంబద్ధ ప్రశ్నలు అడుగుతూ వేధింపులకు దిగారు. ఈ స్థాయిలో మీడియాపై చంద్రబాబు సర్కారు అణచివేత చర్యలను ప్రజా సంఘాలతో పాటు జర్నలిస్టు యూనియన్లు ముక్తకంఠంతో ఖండిస్తున్నాయి.


గురువారం హైదరాబాద్‌లోని సాక్షి కార్యాలయంలో ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిని ప్రశ్నిస్తున్న పోలీసులు

'సాక్షి'ఒక్కటే కూటమి టార్గెట్..

రాజ్యాంగం ప్రసాదించిన ఆర్టికల్ 19(1)(ఏ) ప్రకారం పౌరులకు దక్కిన భావ ప్రకటనా స్వేచ్ఛను హరించడమే కాకుండా పత్రికా స్వేచ్ఛపై కూటమి ప్రభుత్వం యథేచ్ఛగా దాడి చేస్తోంది. అక్రమ కేసులపై పోలీసులను న్యాయస్థానాలు పదేపదే హెచ్చరిస్తూ తప్పుబడుతున్నా వారి వైఖరిలో మార్పు రావడం లేదు. పత్రికలు, మీడియా, సోషల్ మీడియాలో భావ ప్రకటన స్వేచ్ఛ విషయంలో అందే ఫిర్యాదులపై కేసుల నమోదు విషయంలో పాటించాల్సిన ప్రమాణాలపై పోలీసు శాఖతోపాటు జిల్లా మేజిస్ట్రేట్లకు హైకోర్టు ఇటీవల స్పష్టమైన మార్గదర్శకాలు నిర్దేశించింది. అయితే రాజ్యాంగానికి కట్టుబడి పని చేయాల్సిన పోలీసులు అధికార పార్టీకి కొమ్ముకాస్తూ వ్యవస్థల ప్రతిష్టను దిగజారుస్తున్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించడమే పాపమన్నట్లు చంద్రబాబు సర్కారు అక్రమ కేసులతో విరుచుకుపడుతోంది.

• సాక్షి ఎడిటర్‌కు వేధింపులు ఇలా..

ఆదివారం తెల్లవారుజామునే..


విజయవాడ సాక్షి ప్రధాన కార్యాలయంలో పోలీసుల హల్‌చల్..

బుధవారమూ కొనసాగిన కక్షసాధింపు..


హైదరాబాద్‌లోని సాక్షి ప్రధాన కార్యాలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు వేధింపులు

గురువారమూ వదల్లేదు..


హైదరాబాద్‌లోని సాక్షి ప్రధాన కార్యాలయంలో విచారణ పేరుతో కక్ష సాధింపు

నిగ్గదీస్తున్న సాక్షిని నిలువరించే కుట్ర

మళ్లీ ఎడిటర్ చాంబర్‌కు ఏపీ పోలీసులు.. 17వ తేదీన విచారణకు సిద్ధం కావాలని మళ్లీ నోటీసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ మద్యం వ్యవహారం తీవ్ర చర్చనీయాంశమైన నేపథ్యంలో, ప్రజలే సాక్షిగా నిజాలను వెలుగులోకి తీసుకునివస్తున్న 'సాక్షి'పై ప్రభుత్వ కక్ష సాధింపులు తీవ్రతరమయ్యాయి. నిజం గొంతునొక్కే ప్రయత్నంలో భాగంగా బాబు సర్కార్ పోలీసు యంత్రాంగాన్ని ఒక పావుగా వినియోగించుకుంటోంది. కేవలం 12 గంటల వ్యవధిలో రెండవసారి గురువారం నెల్లూరు పోలీసులు ఎడిటర్ చాంబర్‌కు రావడమే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. బుధవారం కోరిన విధంగా 29 వరకు సమయం ఇవ్వలేమని, 17న విచారణ ఉంటుందని మళ్లీ ఎడిటర్‌కు నోటీసులు ఇచ్చారు. తద్వారా తమ అసమంజస డిమాండ్లపై సమాధానాలు ఇవ్వడానికి కేవలం మరో 12 గంటల సమయం ఇచ్చారు. నోటీసులు స్వీకరించిన సాక్షి ఎడిటర్ ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ కారణంగా పోలీసుల సూచనలకు స్పందించేందుకు అక్టోబర్ 29 వరకు తనకు సమయం కావాలని కోరారు. ఈ మేరకు నోటీసుల్లో ఎండార్స్‌మెంట్ చేశారు. అయినప్పటికీ పోలీసులు ఎటువంటి స్పందన లేకుండా వెళ్లిపోయారు. ఈ పరిణామం వెనుక ఎడిటర్‌ను అనిశ్చితిలో ఉంచి ఒత్తిడి తేవాలనే ఉద్దేశం ఉన్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

నోటీసుల్లో అసమంజస డిమాండ్లు

- వార్తకు సంబంధించి ఎడిటోరియల్ ఫైల్.. ఒరిజనల్ డ్రాఫ్ట్ కాపీ (ప్రింట్ అండ్ డిజిటల్) అందించాలి
- వార్త కథనానికి సంబంధించి ప్రిపరేషన్, ఎడిటింగ్, పబ్లికేషన్‌లతో సంబంధమున్న రిపోర్టర్లు, కరస్పాండెంట్లు, ఎడిటోరియల్ సిబ్బంది పేర్లు, హోదాలు, ఫోన్ నంబర్లు ఇవ్వాలి
- వార్త కథనానికి ఆధారాలకు సంబంధించిన మెటీరియల్, నోట్స్, ఫొటోలు, వీడియో ఫుటేజ్, స్టేట్‌మెంట్లు, ఈమెయిల్, మెసేజ్‌లు వంటి ఇతర ఆధారాలు ఏమున్నా సమర్పించాలి
- పబ్లికేషన్ ఆథరైజేషన్ ఆమోదాలకు సంబంధించిన సమాచారాన్ని కూడా అందించాలి
- వీటికి సమాధానం ఇవ్వాలని నిర్దేశిస్తూ కేవలం 12 గంటల సమయం ఇచ్చారు.

అడుగడుగునా ఉల్లంఘనలే...

- బీఎన్ఎస్ఎస్ 179(1), 94 సెక్షన్ల కింద జారీ చేసిన నోటీసులు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఏ) ప్రకారం కల్పించిన పత్రికా స్వేచ్ఛకు వ్యతిరేకం కాదా?
- జర్నలిస్టు లేదా ఎడిటర్‌ను వార్త సోర్స్ (సమాచార మూలం) వెల్లడించాలని బలవంతం చేయడం, భావప్రకటన స్వేచ్ఛా హక్కును ఉల్లంఘించడం కాదా?
- ప్రజా ప్రయోజనాల పరిరక్షణే ధ్యేయంగా వార్త సోర్స్ గోప్యతను కాపాడే సుప్రీం కోర్టు తీర్పులు... ఆర్నాబ్ రంజన్ గోస్వామి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (2020).. రొమేశ్ థాపర్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మద్రాస్ (1950).. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ న్యూస్‌పేపర్స్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (1985)..లను పట్టించుకోకుండా పోలీసులు జరిపిన చర్యలు చట్టపరంగా తప్పు, రాజ్యాంగ విరుద్ధం కాదా?
- వార్త ప్రిపరేషన్, ఎడిటింగ్, పబ్లికేషన్‌కు సంబంధించిన ఫైళ్లను, రిపోర్టర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, ఈమెయిల్‌లు ఇవ్వమని డిమాండ్ చేయడం వంటి పోలీసుల చర్యలు మీడియా స్వతంత్రతను దెబ్బతీసే ప్రయత్నం కాదా?
- ఈ విధమైన డిమాండ్లు రాజ్యాంగపరంగా, చట్టపరంగా సమంజసమేనా?
- నోటీసులకు స్పందించేందుకు కేవలం 12 గంటల గడువు మాత్రమే ఇవ్వడం సహజ న్యాయ సూత్రాలను ఉల్లంఘించడం కాదా?
- ఎడిటర్ సమయం కావాలని లిఖితపూర్వకంగా అభ్యర్థించినా పోలీసులు స్పందించకుండా వెళ్లిపోవడం దురుద్దేశ పూరిత చర్య కాదా?
- ఒకే అంశంపై వరుసగా నోటీసులు ఇవ్వడం, పోలీసులు మళ్లీ మళ్లీ పత్రికా కార్యాలయానికి రావడం ద్వారా ఎడిటర్‌ను భయపెట్టి లొంగదీసుకోవాలనుకోవడం ప్రభుత్వ వ్యూహం కాదా?
- ఈ చర్యలు అధికార దుర్వినియోగం పరిధిలోకి రావా?
- ప్రభుత్వ లేదా పోలీసు యంత్రాంగం మీడియా స్వేచ్ఛను అణచివేసేందుకు ప్రయత్నించడం ప్రజాస్వామ్య విధానానికి వ్యతిరేకం కాదా?
- ''సాక్షి''వంటి పత్రికలను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా 'నాణానికి మరొకవైపు ఉన్న అంశాలు'ప్రజలకు తెలియనీయకుండా, వారికి నిజమైన సమాచారం అందనీయకుండా నిలువరించడం కాదా?
- వార్తా కథనానికి సంబంధించి రెండు వేర్వేరు పోలీస్ స్టేషన్లు (నెల్లూరు రూరల్, కలిగిరి) ఒకే రోజున వేర్వేరు నోటీసులు జారీ చేయడం ద్వంద్వ విచారణ లేదా అధికార దుర్వినియోగం కిందకు రాదా?
- సాక్షి పత్రికలో ప్రచురితమైన వార్త ప్రజాప్రయోజనాలతో ముడిపడి, ప్రజా అవగాహన కోసం ప్రచురితమైనది కాబట్టి, దానిని ఆధారంగా తీసుకుని కేసులు నమోదు చేయడం ప్రజా ప్రయోజన జర్నలిజాన్ని అణిచివేయడం కదా?
- ఈ చర్య మొత్తం జర్నలిస్టుల స్వేచ్ఛను భయపెట్టి, లొంగదీసుకునే చర్యగా ఎందుకు పరిగణించకూడదు?


'సాక్షి'పై తప్పుడు కేసులు పరిపాటయ్యాయి..



ఏపీలో సాక్షి టీవీ ప్రసారాలను నిలిపివేయడం విషయంలో సుప్రీంకోర్టు చివాట్లు పెట్టిన కొద్ది గంటల్లోనే సాక్షి దినపత్రిక సంపాదకులు ధనంజయరెడ్డికి 'సిట్' పోలీసులు ఎనభై ప్రశ్నలతో ప్రశ్నావళిని అందజేసి అప్పటికప్పుడు సమాధానం కావాలని ఒత్తిడి చేయడం ఎక్కడా జరిగి ఉండదు. 2024లో కూటమి అధికారంలో వచ్చిన దగ్గర నుండి సాక్షి మీడియా గ్రూప్‌ను కట్టడి చేసేందుకు తప్పుడు కేసులు బనాయించడం పరిపాటిగా మారింది. తాజాగా.. నకిలీ మద్యం కథనాలపై సంపాదకుడిని, రిపోర్టర్లను వేధించడం పత్రికా స్వేచ్ఛకు కచ్చితంగా భంగం కలిగించినట్లే. ఈ ప్రయత్నాల్ని విరమించుకోవాలని పోలీసులను, ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. అలాగే, పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలి.

– దేవులపల్లి అమర్, ఐజేయూ స్టీరింగ్ కమిటీ సభ్యుడు

బాబు మూల్యం చెల్లించుకుంటారు..



చంద్రబాబుది ప్రజాస్వామ్య వ్యతిరేక స్వభావం. ఇప్పటికే పలు సందర్భాల్లో ఆ విషయం బయటపడింది. ఇప్పుడు ఏపీలో ఆయన పాలన తీరు, ప్రతిపక్ష పార్టీపట్ల ఆయన వైఖరి, మీడియాపట్ల వ్యవహరిస్తున్న తీరును చూస్తే మళ్లీ ఆయన స్వభావం స్పష్టమవుతోంది. ఈ బలం శాశ్వతమని చంద్రబాబు విర్రవీగుతున్నారు. నేను చాలామంది ఏపీ ప్రజలతో మాట్లాడితే కూటమి ప్రభుత్వంపట్ల వ్యతిరేకత స్పష్టంగా చెబుతున్నారు. ఇప్పుడు ప్రజా సమస్యలను ప్రస్తావిస్తున్న మీడియాను అణిచివేయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. సాక్షిపట్ల వరుసగా చేస్తున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నా. ఇలాంటి అరాచక పాలనకు బాబు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది.

– టంకశాల అశోక్, సీనియర్ సంపాదకులు

సమాధానం ఇచ్చినా.. పదేపదే నోటీసులా?


- అరాచక పాలన, ఏపీ ప్రభుత్వ దమనకాండకు ఇది నిదర్శనం
- అక్రమ కేసులతో జర్నలిస్టుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరు
- సాక్షి ప్రధాన కార్యాలయంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ..
- తప్పుడు కేసులను తక్షణమే ఎత్తివేయాలని జర్నలిస్టుల డిమాండ్


సాక్షి ప్రధాన కార్యాలయం వద్ద కొవ్వొత్తులతో నిరసన

సాక్షి, రంగారెడ్డి జిల్లా: 'సమాధానం ఇచ్చినా.. పదేపదే నోటీసులు ఇవ్వడం అంటే మీడియా గొంతు నొక్కడమే' అని సాక్షి ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి విమర్శించారు. ఏపీ ప్రభుత్వ అరాచక పాలన, దమనకాండకు ఇదే నిదర్శన మన్నారు. నకిలీ మద్యంపై వార్తలు ప్రచురించిన సాక్షి మీడియాపై కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను నిర సిస్తూ గురువారం రాత్రి హైదరాబాద్ లోని సాక్షి ప్రధాన కార్యాలయం వద్ద జర్నలిస్టులు కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. 'మీడియాపై కేసులా? సిగ్గు..సిగ్గు, రెడ్‌బుక్ పాలన మాకొద్దు..చంద్రబాబు నిరంకుశ విధానం నశించాలి'అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎడిటర్ ధనంజయరెడ్డి మాట్లాడుతూ పత్రికాస్వేచ్ఛపై దాడి.. రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనేనని స్పష్టం చేశారు. అక్రమ కేసులు, పదే పదే నోటీసుల జారీతో జర్నలిస్టుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరని ఆయన హెచ్చరించారు. ఐదు రోజుల నుంచి కేవలం ఒక్క కేసులోనే నాలుగైదు నోటీసులు జారీ చేయడం ప్రజాస్వామ్య దేశాల్లో ఇప్పటి వరకు ఎక్కడా చూడలేదన్నారు. కూటమి ప్రభుత్వానికి వ్యక్తిగత స్వేచ్ఛ అన్నా, పత్రికా స్వేచ్ఛ అన్నా, జర్నలిస్టుల హక్కులన్నా గౌరవం లేదని విమర్శించారు. 16 నెలలుగా కూటమి ప్రభుత్వం సాక్షి మీడియా హౌస్‌పై తీవ్రమైన దమనకాండను కొనసాగిస్తోందని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన చెప్పారు. నకిలీ మద్యంపై రాసిన కథనాలకు ఆధారాలు చూపాలంటూ, సమాచారం ఇచ్చిన సోర్స్ సహా రాసిన విలేకరుల పేర్లు చెప్పాలని తీసుకొస్తున్న ఒత్తిళ్లకు సాక్షి మీడియా హౌస్ భయపడబోదని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వ కుట్రలను న్యాయస్థానాల ద్వారా తిప్పికొట్టనున్నట్లు స్పష్టం చేశారు. ఏపీ ప్రభుత్వం కొనసాగిస్తున్న దమనకాండను ఎదుర్కొనేందుకు ప్రజా సంఘాలు, జర్నలిస్టులంతా ఏకం కావాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. సాక్షి మీడియాపై పెట్టిన తప్పుడు కేసులను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

'సాక్షి' ఎడిటర్‌పై అక్రమ కేసులు సరికాదు

మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగించేలా.. 'సాక్షి' దినపత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టడం అప్రజాస్వామికమని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. అన్యాయంగా, అక్రమంగా కేసులు నమోదు చేసి, విచారణ పేరిట చేపడు తున్న నిర్బంధ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వ చర్యలు పత్రికా స్వేచ్ఛపై నేరుగా దాడి చేయడమే కాకుండా, ప్రజాస్వామ్య విలు వలను పాతరేస్తున్నట్లు స్పష్టంగా తెలు స్తోందన్నారు. చంద్రబాబు ప్రభు త్వం ఇంత నీచంగా, దారుణంగా వ్యవహరించడం సరి కాదన్నారు. పత్రికా స్వేచ్ఛను అణగదొక్కేందుకు ఏపీ ప్రభుత్వం పాల్పడు తున్న విధానా లను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నానన్నారు. ఏపీ ప్రభుత్వ చర్య లకు వ్యతిరేకంగా శుక్రవారం నిజామాబాద్‌లో జర్నలిస్టులు చేపడుతున్న నిరసన కార్య క్రమానికి సంఘీభావం, సంపూర్ణ మద్దతును ప్రశాంత్ రెడ్డి ప్రకటించారు.

ఏపీలా చేస్తే రాష్ట్రం సర్వ నాశనం

గూగుల్‌కు రాయితీలపై కర్ణాటక ఐటీ మంత్రి ప్రియాంక్



సాక్షి, అమరావతి: పరిశ్రమలకు ఏపీ స్థాయిలో ప్రోత్సహకాలు ఇవ్వ లేమని, అలా చేస్తే రాష్ట్రం ఆర్థికంగా సర్వ నాశనం అయిపోతుందని కర్ణాటక ఐటీ శాఖ మంత్రి ప్రియాంక్ మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. బెంగళూరులో ఆయన విలేకరులతో మాట్లా డుతూ గూగుల్ డేటా సెంటర్‌ను ఆకర్షించడా నికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం భారీ ప్రోత్సాహకా లను ఇచ్చిందన్నారు. విశాఖకు గూగుల్ డేటా సెంటర్ వచ్చిందని చెబుతున్నారే కానీ... అక్కడ అది ఏర్పాటు కావడానికి ఆ రాష్ట్ర ప్రభుత్వం ఎంత ఇచ్చిందనే విషయాన్ని ఎవరూ చెప్పటం లేదన్నారు. గూగుల్ డేటా సెంటర్ కోసం ఏపీ ప్రభుత్వం ఏకంగా రూ.22,000 కోట్ల ప్రోత్సాహకాలను ఇచ్చిందని చెప్పారు. ఇవికాకుండా వాళ్లకు 25 శాతం తక్కువ ధరకు భూమిని కేటాయించిందని, స్టేట్ జీఎస్టీలో 100 శాతం మినహాయింపు, 100 శాతం ఉచితంగా ట్రాన్స్‌మిషన్, నీళ్ల టారిఫ్‌లో 25 శాతం డిస్కౌంట్ ఇచ్చింద న్నారు. ఈ స్థాయిలో ప్రోత్సాహకాలు ఇచ్చే పరిస్థితి తమకు లేదని, ఒక వేళ ప్రకటిస్తే ఒక కంపెనీ కోసం రాష్ట్రాన్ని ఆర్థికంగా సర్వ నాశనం చేస్తారా అంటూ అందరూ నిలదీస్తారన్నారు. గూగుల్ డేటా సెంటర్ ఎక్కడైనా పెట్టుకోవ చ్చని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో బెంగళూరు నగరం ఐదవ స్థానంలో ఉండటంతో ఆంధ్రప్రదేశ్‌తో నుంచి కూడా ఇక్కడికి ఉద్యోగాల కోసం వస్తున్నారని చెప్పారు. అందుకే బెంగళూరు నగరం ఓవర్ క్రౌడ్ అవుతోందని లోకేశ్‌ను ఉద్దేశించి పరోక్ష వ్యాఖ్యలు చేశారు. విశాఖకు గూగుల్ డేటా సెంటర్ వచ్చినా, ఏపీ ప్రజలు ఇక్కడికే వస్తారని.. ఎందుకంటే ఏఐలో నైపుణ్యం ఇక్కడే ఉందని చెప్పుకొచ్చారు. కాగా, ఖర్గే వ్యాఖ్యలపై మంత్రి లోకేశ్ 'ఎక్స్' వేదికగా పరోక్షంగా స్పందించారు. 'వారు ఆంధ్ర ఫుడ్ చాలా స్పైసీగా ఉందంటున్నారు. ఇప్పుడు పెట్టుబడులు కూడా అదే విధంగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే మా పక్క వాళ్లు కొంత మంది ఆ మంటను ఫీల్ అవుతున్నారు' అని పోస్ట్ చేశారు.

బీసీలకెంతో.. ఈబీసీలకూ అంతే!

- విదేశీ విద్యానిధి పథకం కోటా పెంచిన రాష్ట్ర ప్రభుత్వం
- బీసీలకు, ఈబీసీలకు చెరో 200 యూనిట్లు పెంపు
- ఉత్తర్వులు జారీ చేసిన బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి



సాక్షి, హైదరాబాద్: విదేశాల్లో ఉన్నత విద్య చదువుకునే ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20 లక్షల ఆర్థిక సాయం అందించే విదేశీ విద్యానిధి పథకం కోటాను పెంచింది. ఇప్పటికే ఎస్సీ, ఎస్టీలకు అమలు చేస్తున్న అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కోటాను భారీగా పెంచగా... తాజాగా బీసీ, ఈబీసీ కోటాను పెంచింది. బీసీ, ఈబీసీలకు చెరో 200 యూనిట్లు చొప్పున మంజూరు చేస్తూ గత నెల 27న బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ జ్యోతి బుద్ధప్రకాశ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్ణయంపై బీసీ వర్గాల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. జనాభా ప్రాతిపదికన బీసీలకు వాటా ఇవ్వాలంటూ ఒకవైపు రాష్ట్రమంతటా ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం, బీసీలకు, ఈబీసీలకు ఒకే విధమైన కోటా ఇవ్వడం పట్ల బీసీ సంఘాలు నిరసన వ్యక్తం చేస్తున్నాయి. కాగా, ఈ ఉత్తర్వుల కాపీ మాత్రం ఇప్పటివరకు బీసీ సంక్షేమ శాఖ కమిషనరేట్‌కు అందలేదని అధికారులు చెబుతున్నారు.

భారీ డిమాండ్... పెంపు అంతంతే

- బీసీ సంక్షేమ శాఖ ద్వారా మహాత్మా జ్యోతిబాపూలే ఓవర్సీస్ విద్యానిధి పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ పథకం కింద ఏటా 6 వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటుండగా... 300 మందికి అవకాశం కల్పిస్తున్నారు. ఇందులో బీసీ విద్యార్థులు 285 మంది ఉండగా... 15 మంది ఈబీసీలుంటున్నారు. దీనిపై మెజార్టీ విద్యార్థులు తీవ్ర నిరాశకు గురవుతుండటంతో బీసీ కోటా పెంచాలంటూ కొంత కాలంగా బీసీ సంక్షేమ శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపుతున్నారు. కనీసం వెయ్యి యూనిట్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ క్రమంలో బీసీలకు 200, ఈబీసీలకు 200 యూనిట్లు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పెరిగిన యూనిట్లతో బీసీ సంక్షేమ శాఖ ద్వారా 700 మందికి అవకాశం కల్పిస్తారు. తాజా పెంపుతో బీసీలకు 500 యూనిట్లు, ఈబీసీలకు 200 యూనిట్లు మంజూరు చేస్తారు. ఈ కోటా పెంపుపై అటు బీసీ సంక్షేమ శాఖ అధికారులు... ఇటు బీసీ విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం వెయ్యి మందికి అవకాశం కల్పించాలని ప్రతిపాదనలు పంపితే కేవలం 200 యూనిట్లు పెంచడంపై మండిపడుతున్నారు. మరోవైపు ఈబీసీల కోటా పెంపునకు ఎలాంటి ప్రతిపాదనలు లేకున్నా వారికి 200 యూనిట్లు కేటాయించడాన్ని తప్పుబడుతున్నారు. పలువురు బీసీ సంఘాల ప్రతినిధులు ఈ అంశంపై బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి అసంతృప్తి వ్యక్తం చేశారు. బీసీ కోటా మరింత పెంచాలనే డిమాండ్ వినిపించారు. ఒకట్రెండు రోజుల్లో సీఎంను కలిసి బీసీ కోటా పెంచాలని కోరతామని మంత్రి చెప్పినట్లు బీసీ సంఘాల నేతలు పేర్కొన్నారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
17-10-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
862	262
83,468	25,585

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	22,658	▽	5
డోజోన్స్	46,144	▽	109
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,430	△	5
డాక్స్	24,272	▽	91
షాంఘై	3,916	△	4
నికాయ్	48,278	△	605

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	87.40	88.42
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	116.63	119.59
€	యూరో	ఎస్‌బీఐ	101.15	103.93
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	57.56	59.01
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.93	58.18
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	65.44	69.16
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.54	24.03
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.03	24.27
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.45	13.27

ఇన్ఫీ లాభం అప్

క్యూ2లో రూ. 7,364 కోట్లు
- ఆదాయం రూ. 44,490 కోట్లు
- ఆదాయ వృద్ధి అంచనాలు ప్లస్



న్యూఢిల్లీ: ఐటీ సేవల దేశీ దిగ్గజం ఇన్ఫోసిస్ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 13 శాతంపైగా ఎగసి రూ. 7,364 కోట్లను తాకింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 6,506 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 9 శాతం పుంజుకుని రూ. 44,490 కోట్లకు చేరింది. గత క్యూ2లో రూ. 40,986 కోట్ల టర్నోవర్ అందుకుంది. పూర్తి ఏడాదికి ఆదాయంలో 1–3 శాతం వృద్ధి(జూన్‌లో ప్రకటించిన) అంచనాలను తాజాగా 2–3 శాతానికి సవరించింది. నిర్వహణ మార్జిన్లు నామమాత్ర క్షీణతతో 21%గా నమోదయ్యాయి.

షేరుకి రూ. 23 డివిడెండ్

వాటాదారులకు ఇన్ఫోసిస్ బోర్డు షేరుకి రూ. 23 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ఇందుకు ఈనెల 27 రికార్డు డేట్ కాగా నవంబర్ 7 కల్లా చెల్లించనుంది. దీనికితోడు రూ. 18,000 కోట్ల విలువైన సొంత ఈక్విటీ షేర్ల కొనుగోలు(బైబ్యాక్) కోసం వాటాదారుల అనుమతి తీసుకోనున్నట్లు కంపెనీ సీఎఫ్‌వో జయేష్ సంగ్రాజ్‌కా తెలిపారు.

ఇతర విశేషాలు

- క్యూ2లో 8,203 మంది ఉద్యోగులు జత కలిశారు. దీంతో సిబ్బంది సంఖ్య 3,31,991ను తాకింది. 2025 జూన్ చివరికల్లా 3,23,788 మంది ఉద్యోగులున్నారు.
- ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు గత క్యూ2లో నమోదైన 12.9 శాతం నుంచి 14.3 శాతానికి పెరిగింది.
- ఈ కాలంలో 3.1 బిలియన్ డాలర్ల(రూ. 27,525 కోట్లు) విలువైన కాంట్రాక్టులను సాధించింది.
- ఆదాయంలో ఫైనాన్షియల్ సర్వీసుల విభాగం 5.6 శాతం వృద్ధితో 27.7 శాతం వాటాను ఆక్రమించింది.
- తయారీ విభాగం 9.3 శాతం, హైటెక్ బిజినెస్ 8.3 శాతం, కమ్యూనికేషన్స్ 5.7 శాతం చొప్పున సమకూర్చాయి.
- రిటైల్ నామమాత్రంగా నీరసించగా.. లైఫ్ సైన్సెస్ 9 శాతం క్షీణించింది.
- ఉత్తర అమెరికా వాటా 1.7 శాతం పుంజుకుని ఆదాయంలో 56.3 శాతానికి చేరింది.
- యూరప్ బిజినెస్ 10.6 శాతం ఎగసి 31.7 శాతం వాటాను ఆక్రమించింది. భారత్ వాటా 2.9 శాతమే.

పటిష్ట ఫలితాలు

క్యూ2లో పటిష్ట పనితీరు ప్రదర్శించాం. 21 శాతం నిర్వహణ మార్జిన్లు సాధించాం. త్రైమాసికం ముగిసిన వెంటనే 1.6 బిలియన్ డాలర్ల విలువైన మెగా డీల్ సాధించ గలిగాం. హెచ్1బీ వీసా ఫీజు పెంపు నేపథ్యంలో స్థానికులను అధికంగా నియమించుకోనున్నాం. ఈ అంశంలో కంపెనీ స్పాన్సర్‌షిప్ స్వల్పమే.
– సలీల్ పరేఖ్, ఎండీ, సీఈవో, ఇన్ఫోసిస్

ఫలితాల నేపథ్యంలో ఇన్ఫోసిస్ షేరు బీఎస్‌ఈలో దాదాపు యథాతథంగా రూ. 1473 వద్ద ముగిసింది.

విప్రో లాభం ఫ్లాట్

క్యూ2లో రూ. 3,246 కోట్లు
- ఆదాయం రూ. 22,697 కోట్లు
- క్యూ3 అంచనా –0.5 నుండి +1.5%



న్యూఢిల్లీ: ఐటీ సేవల దేశీ దిగ్గజం విప్రో లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం నామమాత్ర వృద్ధితో రూ. 3,246 కోట్లను దాటింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 3,209 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 2 శాతం పుంజుకుని రూ. 22,697 కోట్లను తాకింది. అయితే త్రైమాసికవారీగా నికర లాభం 2.5 శాతం నీరసించగా.. ఆదాయం ఇదే స్థాయిలో బలపడింది. కాగా.. మూడో త్రైమాసికం(అక్టోబర్–డిసెంబర్)లో ఐటీ సర్వీసుల ఆదాయం –0.5–+1.5 శాతం స్థాయిలో నమోదుకాగలదని కంపెనీ తాజాగా అంచనా వేసింది. వెరసి 259.1–264.4 కోట్ల డాలర్ల మధ్య ఆదాయ గైడెన్స్ ప్రకటించింది. అయితే ఇటీవల సొంతం చేసుకున్న హర్మన్ డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సొల్యూషన్స్ ఆదాయ అంచనాలను దీనిలో కలపకపోవడం గమనార్హం! ప్రస్తుతం డిమాండ్ వాతావరణం పటిష్టంగా కనిపిస్తున్నట్లు కంపెనీ సీఈవో, ఎండీ శ్రీని పల్లియా పేర్కొన్నారు. విచక్షణా వ్యయాలు ఏఐ ఆధారిత ప్రాజెక్టులవైపు మరలుతున్నట్లు వెల్లడించారు.

హెచ్1బీ వీసా ఫీజు ప్రభావం అంతంతే..

యూఎస్ ఉద్యోగులలో 80% స్థానికులే కావడంతో హెచ్1బీ వీసా ఫీజు పెంపు ప్రభావం నామమాత్రమేనని కంపెనీ సీహెచ్ఆర్‌వో సౌరభ్ గోవిల్ పేర్కొన్నారు. డిమాండ్ ఆధారంగా క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ చేపట్టనున్నట్లు తెలియజేశారు.

క్యూ2లో ఇతర విశేషాలు..

- 2,260 మంది ఉద్యోగులు జతకావడంతో. సిబ్బంది సంఖ్య 2,35,492ను తాకింది.
- 2 మెగా రెన్యువల్స్, 13 భారీ డీల్స్ ద్వారా మొత్తం ఆర్డర్లు 31 శాతం జంప్‌చేసి 4.7 బిలియన్ డాలర్లకు చేరాయి.
- ఐటీ సర్వీసుల మార్జిన్లు 16.7%గా ఉన్నాయి.

ఫలితాల నేపథ్యంలో విప్రో షేరు బీఎస్‌ఈలో 1.4 శాతం బలపడి రూ. 254 వద్ద ముగిసింది.

గ్లోబుల్ ర్యాలీ!



బుల్ జోరుతో ఇన్వెస్టర్ల సంపద కళకళలాడింది. రెండు రోజుల్లో బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ.6 లక్షల కోట్లకు పైగా ఎగబాకి, రూ.466.96 లక్షల కోట్లకు చేరింది.

అమెరికాలో వడ్డీరేట్ల కోత సంకేతాలు • మన మార్కెట్లు రెండో రోజూ ముందుకే..

సెన్సెక్స్ 862 పాయింట్లు జూమ్ • నిఫ్టీ 262 పాయింట్లు జంప్

ముంబై: అమెరికా సెంట్రల్ బ్యాంక్ ఫెడ్ వడ్డీ రేట్ల కోత ఆశలు ఇన్వెస్టర్లలో జోష్ నింపింది. ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు చెంగుచెంగున దూసుకెళ్తున్నాయి. దీంతో దేశీయంగానూ బుల్ మళ్లీ రంకెలేస్తోంది. వరుసగా రెండోరోజూ మన మార్కెట్లు భారీ లాభాలను మూటగట్టుకున్నాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 862 పాయింట్లు జంప్ చేసి 83,468 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 1,010 పాయింట్లు ఎగబాకి 83,615 గరిష్టాన్ని తాకింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ కూడా 262 పాయింట్లు ఎగసి 25,585 వద్ద క్లోజైంది. ఇది నాలుగు నెలల గరిష్ట స్థాయి కావడం గమనార్హం. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా ఇండెక్స్ కాస్పీ 2.5 శాతం బలపడగా.. జపాన్ నికాయ్ 1.27 శాతం పుంజుకుంది. చైనా షాంఘై స్వల్పంగా పెరిగింది. యూరప్ మార్కెట్లు సైతం లాభాల్లో నిలిచాయి.

'ప్రపంచ మార్కెట్ల సానుకూల ప్రభావం, యూఎస్ ఫెడ్ రేట్ల కోత ఆశలకు తోడు భారత్ జీడీపీ వృద్ధి అంచనాలను ఐఎంఎఫ్ 6.6 శాతానికి పెంచడం వంటి పలు అంశాలు మన మార్కెట్లో సెంటిమెంట్‌కు బూస్ట్ ఇచ్చింది. వరుసగా రెండో రోజూ సూచీలు పెరిగాయి, నిఫ్టీ 4 నెలల గరిష్టాన్ని తాకింది. ప్రధానంగా బ్యాంకింగ్ షేర్లతో పాటు రిలయన్స్ వంటి బ్లూచిప్ స్టాక్స్ తాజా ర్యాలీకి దన్నుగా నిలుస్తున్నాయి' అని లెమన్ మార్కెట్ డెస్క్ రీసెర్చ్ ఎనలిస్ట్ గౌరవ్ గార్గ్ వ్యాఖ్యానించారు. వాణిజ్య ఒప్పందంపై చర్చల కోసం భారత్ బృందం ఇప్పటికే అమెరికా చేరుకోగా, డీల్ విషయంలో సానుకూల వాతావరణం నెలకొంది. మరోపక్క, విదేశీ ఇన్వెస్టర్లు మళ్లీ మన మార్కెట్ వైపు చూస్తుండటం కూడా తాజా జోరుకు అద్దం పడుతోంది.

ఇతర ముఖ్యాంశాలివీ..

- బీఎస్‌ఈలో రంగాల వారీగా రియల్టీ 1.87 శాతం లాభపడింది. ఎఫ్ఎంసీజీ 1.74%, కన్జూమర్ డ్యూరబుల్స్ 1.51%, బ్యాంకెక్స్ 1.27%, ఆటో 1.15% చొప్పున పెరిగాయి. స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు కూడా లాభాల్లోనే నిలిచాయి.
- కోటక్ మహీంద్రా బ్యాంక్ 2.67% పెరగ్గా.. టైటాన్(2.6%), యాక్సిస్ బ్యాంక్(2.3%), అదానీ పోర్ట్స్(2%), ఎంఅండ్ఎం(1.82%), రిలయన్స్(1.7%), టాటా మోటార్స్(1.6%), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్(1.5%) లాభపడ్డాయి.

రూపాయి రయ్..

వరుసగా రెండో రోజూ రూపాయి భారీగా పుంజుకుంది. విదేశీ ఇన్వెస్టర్ల పునరాగమనం, ఎగుమతుల జోరు, స్టాక్ మార్కెట్ ర్యాలీ నేపథ్యంలో గురువారం డాలరు మారకంలో దేశీ కరెన్సీ మరో 12 పైసలు ఎగబాకి, 87.96 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 87.68ని కూడా తాకింది. కాగా, గత రెండు రోజుల్లో ఏకంగా 85 పైసలు జంప్ చేయడం విశేషం.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
రూ.6,500 కోట్లతో జీహెచ్‌సీఎల్ విస్తరణ | రూ.3,900 కోట్లు సమీకరించిన జెప్టో

లిస్టింగ్ జోష్..

స్టాక్ మార్కెట్ల జోరు నేపథ్యంలో గురువారం లిస్టయిన రెండు కంపెనీలూ ఇన్వెస్టర్లను మెప్పించాయి. ఫార్మా కంపెనీ రూబికాన్ రీసెర్చ్ షేరు ఇష్యూ ధర (రూ.485)తో పోలిస్తే బీఎస్‌ఈలో 28% ప్రీమియంతో రూ. 620 వద్ద అరంగేట్రం చేసింది. ఒకదశలో 32% ఎగసి రూ.639 గరిష్టాన్ని తాకింది. చివరకు 29% లాభపడి రూ.627 వద్ద క్లోజయ్యింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.10,337 కోట్లుగా నమోదైంది. ఇక, కెనరా రోబెకో ఏఎంసీ షేర్లు కూడా మెరుగ్గానే లిస్టయ్యాయి. ఇష్యూ ధర రూ.266తో పోలిస్తే 5% ప్రీమియంతో రూ.280 వద్ద ట్రేడింగ్ ప్రారంభమైంది. ఇంట్రాడేలో 20% జంప్ చేసి రూ.318కి చేరింది, చివరకు 13% లాభంతో రూ.300 వద్ద క్లోజైంది.

బీ న్యూ మొబైల్స్ దీపావళి ఆఫర్లు

హైదరాబాద్: దీపావళి పండుగ నేపథ్యంలో మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్స్ పరికరాలపై ప్రత్యేక ఆఫర్లు ఇస్తున్నట్లు న్యూ మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ సీఎండీ వై.డీ. బాలాజీ చౌదరి, సీఈఓ వై.సాయి నిఖిలేశ్ తెలిపారు. మొబైల్‌తో పాటు స్మార్ట్ టీవీని రూ.14,911కే, అలాగే మొబైల్, కూలర్ కలిపి కేవలం రూ.12,911కు అందిస్తుంది. టీవీలపై రూ.10,000 వరకు, బజాజ్ కార్డుతో కొనుగోలుపై రూ.5,000 వరకు, ఎస్‌బీఐ కార్డుపై 10% క్యాష్‌బ్యాక్ ఇస్తుంది. యాక్సెసరీస్‌పై 85% వరకు డిస్కౌంటు లభిస్తుంది. నోకాస్ట్ ఈఎంఐ, జీరో డౌన్ పేమెంట్ సదుపాయం ఉంది. అలాగే మొబైల్ కొనుగోలుపై 11 ఉచిత బహుమతులు, మొబైల్ మార్పిడిపై 15% అధిక విలువ పొందవచ్చు. తెలుగు రాష్ట్రాల్లోని 150 స్టోర్లలో ఆఫర్లు అందుబాటులో ఉంటాయని, కస్టమర్లు వినియోగించుకోవాలని నిఖిలేశ్, బాలాజీలు కోరారు.



సాక్షి స్పోర్ట్స్



క్వార్టర్ ఫైనల్లో సహజ జోడీ

ఎబిర్టో టాంపికో డబ్ల్యూటీఏ–125 టోర్నమెంట్‌లో భారత మహిళల టెన్నిస్ నంబర్‌వన్, తెలంగాణ క్రీడాకారిణి సహజ యామలపల్లికి మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. మెక్సికోలో జరుగుతున్న ఈ టోర్నీలో ప్రపంచ 347వ ర్యాంకర్ సహజ సింగిల్స్ విభాగం నుంచి నిష్క్రమించగా... డబుల్స్‌లో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. సింగిల్స్ రెండో రౌండ్‌లో సహజ 5-7, 7-6 (7/5), 1-6తో ప్రపంచ 125వ ర్యాంకర్ పెట్రా మర్సింకో (క్రొయేషియా) చేతిలో పోరాడి ఓడిపోయింది. తొలి రౌండ్‌లో 2017 యూఎస్ ఓపెన్ చాంపియన్ స్లోన్ స్టీఫెన్స్ (అమెరికా)పై నెగ్గిన సహజ రెండో రౌండ్‌లోనూ ఆకట్టుకునే ప్రదర్శన చేసింది. 2 గంటల 48 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ తన సర్వీస్‌ను ఆరుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది. డబుల్స్ తొలి రౌండ్‌లో సహజ-జెస్సికా (మెక్సికో) ద్వయం 7-5, 6-2తో అర్కోనాడా-కత్రీనా స్కాట్ (అమెరికా) జోడీపై విజయం సాధించింది.



సనత్, ఆయుశ్ డబుల్ సెంచరీలు

తొలి ఇన్నింగ్స్‌లో ఢిల్లీ 529/4 డిక్లేర్డ్

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ బ్యాటర్లు సనత్ సాంగ్వాన్ (470 బంతుల్లో 211 నాటౌట్; 21 ఫోర్లు, 3 సిక్స్‌లు), ఆయుశ్ దొసెజా (279 బంతుల్లో 209; 25 ఫోర్లు, 5 సిక్స్‌లు) పరుగుల పండగ చేసుకున్నారు. హైదరాబాద్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ గ్రూప్ 'డి' మ్యాచ్‌లో... వీరిద్దరి డబుల్ సెంచరీలతో ఢిల్లీ జట్టు మ్యాచ్ రెండో రోజు తొలి ఇన్నింగ్స్‌ను 4 వికెట్ల నష్టానికి 529 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 256/3తో ఆట కొనసాగించిన జట్టు గురువారం మరో 68 ఓవర్లు ఆడి 273 పరుగులు జోడించింది. సీవీ మిలింద్ 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం హైదరాబాద్ ఆట ముగిసే సమయానికి 17 ఓవర్లలో వికెట్ నష్టానికి 77 పరుగులు సాధించింది. రాహుల్ సింగ్ (35) అవుట్ కాగా... తన్మయ్ అగర్వాల్ (27 బ్యాటింగ్), అనికేత్ రెడ్డి (11 బ్యాటింగ్) క్రీజ్‌లో ఉన్నారు.

ఆంధ్ర 470 ఆలౌట్

షేక్ రషీద్ సెంచరీ



కాన్పూర్: ఉత్తర ప్రదేశ్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు తమ తొలి ఇన్నింగ్స్‌లో 143 ఓవర్లలో 470 పరుగులకు ఆలౌటైంది. షేక్ రషీద్ (284 బంతుల్లో 136; 11 ఫోర్లు) ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో తన మూడో సెంచరీని సాధించాడు. ఓవర్‌నైట్ స్కోరు 289/3తో ఆట కొనసాగించిన ఆంధ్ర మరో 57.1 ఓవర్లు ఆడి మరో 181 పరుగులు జత చేసింది. అనంతరం ఆట ముగిసే సమయానికి ఉత్తరప్రదేశ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 29 ఓవర్లలో వికెట్ నష్టానికి 73 పరుగులు సాధించింది.

సెమీఫైనల్లో ఆస్ట్రేలియా

అలీసా హీలీ మరో సెంచరీ • బంగ్లాదేశ్‌పై 10 వికెట్లతో నెగ్గిన డిఫెండింగ్ చాంపియన్



అలీసా హీలీ

సాక్షి, విశాఖపట్నం: నాలుగు రోజుల క్రితం భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో అద్భుత సెంచరీతో చెలరేగిన ఆస్ట్రేలియా మహిళల జట్టు కెప్టెన్ అలీసా హీలీ ఇదే మైదానంలో మరో శతకంతో అదరగొట్టింది. ఆసీస్ బౌలర్ల ప్రదర్శనతో తోడు హీలీ, ఫోబీ లిచ్‌ఫీల్డ్ మెరుపు భాగస్వామ్యం డిఫెండింగ్ చాంపియన్‌కు ఘన విజయంతోపాటు సెమీఫైనల్ బెర్త్‌ను కూడా అందించింది. వన్డే వరల్డ్ కప్‌లో భాగంగా గురువారం ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 10 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను చిత్తుగా ఓడించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న బంగ్లాదేశ్ 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 198 పరుగులు చేసింది. శోభన మొస్త్రరి (80 బంతుల్లో 66 నాటౌట్; 9 ఫోర్లు) అర్ధ సెంచరీ సాధించగా, రుబియా హైదర్ (59 బంతుల్లో 44; 8 ఫోర్లు) రాణించింది. ఆసీస్ ఆటగాళ్లు నాలుగు క్యాచ్‌లు వదిలిపెట్టడంతో బంగ్లా ఈమాత్రం స్కోరు చేయగలిగింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అలానా కింగ్ (2/18) ప్రత్యర్థిని కట్టడి చేయగా... వేర్‌హామ్, అనాబెల్ సదర్లాండ్, యాష్లే గార్డ్‌నర్ కూడా తలా 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం ఆస్ట్రేలియా 24.5 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 202 పరుగులు సాధించి గెలిచింది. అలీసా హీలీ (77 బంతుల్లో 113 నాటౌట్; 20 ఫోర్లు) కెరీర్‌లో ఏడో సెంచరీ సాధించగా... లిచ్‌ఫీల్డ్ (72 బంతుల్లో 84 నాటౌట్; 12 ఫోర్లు, 1 సిక్స్) అండగా నిలిచింది. బంగ్లాదేశ్ ఎంత ప్రయత్నించినా ఒక్క వికెట్ కూడా తీయలేకపోయింది. తాజా విజయంతో 5 మ్యాచ్‌ల తర్వాత 9 పాయింట్లతో ఆసీస్ తమ అగ్రస్థానాన్ని మరింత పటిష్టపర్చుకొని సెమీఫైనల్ చేరిన తొలి జట్టుగా నిలిచింది. బంగ్లాదేశ్‌కు ఇది నాలుగో పరాజయం. నేడు కొలంబోలో జరిగే మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాతో శ్రీలంక తలపడుతుంది.

జోరుగా టీమిండియా సాధన

నెట్స్‌లో శ్రమించిన కోహ్లి, రోహిత్



కోహ్లి



గంభీర్, రోహిత్

పెర్త్: దాదాపు ఏడాది క్రితం పెర్త్‌లోని ఆప్టస్ మైదానంలో ఆస్ట్రేలియాతో జరిగిన తొలి టెస్టులో విరాట్ కోహ్లి అజేయ సెంచరీ సాధించాడు. అదే అతని టెస్టు కెరీర్‌లో చివరి సెంచరీ అయింది. ఇప్పుడు మళ్లీ అదే మైదానానికి వచ్చిన కోహ్లి కొత్త ఉత్సాహంతో కనిపించాడు. ఆసీస్‌తో వన్డే సిరీస్ కోసం సన్నద్ధతలో భాగంగా అతను గురువారం సుదీర్ఘ సమయం పాటు నెట్స్‌లో ప్రాక్టీస్ చేశాడు. ఐపీఎల్ తర్వాత మొదటిసారి బరిలోకి దిగుతున్న కోహ్లి సాధనలో బాగా చురుగ్గా పాల్గొన్నాడు. ముందుగా 20 నిమిషాల పాటు ఫీల్డింగ్ డ్రిల్స్ చేసిన అతను ఆ తర్వాత 40 నిమిషాలు బ్యాటింగ్‌పై దృష్టి పెట్టాడు. హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్‌లతో పాటు స్థానిక ఆటగాళ్లు బౌలింగ్ చేయగా... ఎలాంటి తడబాటు లేకుండా చక్కటి షాట్లు ఆడాడు. అతని పక్క నెట్స్‌లోనే మరో స్టార్ రోహిత్ శర్మ కూడా సుదీర్ఘ సమయం పాటు ప్రాక్టీస్‌లో పాల్గొన్నాడు. ఆరంభంలోనే కొద్దిసేపు రోహిత్ తన ఫుట్‌వర్క్, టైమింగ్ విషయంలో కాస్త ఇబ్బంది పడ్డాడు. అయితే కుదురుకున్న తర్వాత అతనూ సాధికారికంగా బ్యాటింగ్ చేశాడు. సెషన్ ముగిసిన తర్వాత హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో రోహిత్ చాలాసేపు చర్చించడం కనిపించింది. గతంతో పోలిస్తే ఈసారి కోహ్లి, రోహిత్‌ల వ్యవహార శైలి చాలా ఆసక్తికరంగా కనిపించింది. నెట్స్ వద్దకు అనుమతించిన అభిమానులతో సరదాగా మాట్లాడుతూ వీరిద్దరు ఆటోగ్రాఫ్‌లు ఇస్తూ, సెల్ఫీలు దిగుతూ సమయం గడపడం విశేషం. ఈ ఇద్దరితో పాటు కేఎల్ రాహుల్ కూడా కొద్దిసేపు ప్రాక్టీస్ చేశాడు. గురువారం ఆప్షనల్ ప్రాక్టీస్ డే కాగా... భారత్ నుంచి రెండో బృందంలో వచ్చిన సిరాజ్, కుల్దీప్, అక్షర్ తదితరులు సాధనకు దూరంగా ఉన్నారు. పూర్తి స్థాయి జట్టుకు నేడు ప్రాక్టీస్ సెషన్ ఉంటుంది. అంతకుముందు ఆస్ట్రేలియా బౌలర్లు మిచెల్ స్టార్క్, జాయ్ రిచర్డ్సన్ కూడా నెట్స్‌లో సాధన చేశారు.

మరిన్ని క్రీడా వార్తలు
సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ గెలుపుబాట



సాక్షి, హైదరాబాద్: వరుసగా మూడు పరాజయాల తర్వాత హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ జట్టు మళ్లీ విజయం రుచి చూసింది. ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) నాలుగో సీజన్‌లో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ ఖాతాలో రెండో విజయం చేరింది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో గురువారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ 15-13, 20-18, 15-17, 15-9తో గోవా గార్డియన్స్ జట్టును ఓడించింది. ఈ గెలుపుతో బ్లాక్‌హాక్స్ ఏడు పాయింట్లతో ఆరో స్థానానికి చేరింది. యుదీ యామమోటో, సాహిల్, విటోర్, శిఖర్ సింగ్ స్మాష్‌లతో చెలరేగి బ్లాక్‌హాక్స్‌కు నిలకడగా పాయింట్లు అందించారు. సమష్టిగా రాణించి బ్లాక్‌హాక్స్ జట్టు మళ్లీ గెలుపు బాట పట్టినందుకు ఆనందంగా ఉందని యజమాని కంకణాల అభిషేక్ రెడ్డి వ్యాఖ్యానించారు. మ్యాచ్ మొత్తంలో బ్లాక్‌హాక్స్ 65 పాయింట్లు నెగ్గగా... ఇందులో సొంత సర్వీస్‌లో 20 పాయింట్లు, స్మాష్‌లతో 27 పాయింట్లు వచ్చాయి.



ప్రపంచ రెండో ర్యాంకర్‌పై లక్ష్య సేన్ విజయం

ఒడెన్స్: డెన్మార్క్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత నంబర్‌వన్ లక్ష్య సేన్ సంచలనం సృష్టించాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో ప్రపంచ 21వ ర్యాంకర్ లక్ష్య సేన్ 21-13, 21-14తో ప్రపంచ రెండో ర్యాంకర్ ఆండెర్స్ ఆంటోన్సెన్ (డెన్మార్క్)ను ఓడించి క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాడు. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) జోడీ 21-19, 21-17తో లీ జె హుయె–యాంగ్ పో సువాన్ (చైనీస్ తైపీ) జంటపై నెగ్గి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది.

పతకానికి విజయం దూరంలో...

క్వార్టర్ ఫైనల్లో జ్ఞానదత్తు, తన్వీ శర్మ, ఉన్నతి



జ్ఞానదత్తు

గువాహటి: సొంతగడ్డపై జరుగుతున్న ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారులు ఐదు పతకాలకు విజయం దూరంలో నిలిచారు. పురుషుల సింగిల్స్‌లో హైదరాబాద్ ప్లేయర్ టంకర తలశిల జ్ఞానదత్తు... మహిళల సింగిల్స్‌లో తన్వీ శర్మ, ఉన్నతి హుడా క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. పురుషుల డబుల్స్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గొబ్బూరు విశ్వతేజ్–అరిగెల భార్గవ్ రామ్ జోడీ... మిక్స్‌డ్ డబుల్స్‌లో భవ్య ఛాబ్రా–విశాఖ టొప్పో జంట క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాయి. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్స్‌లో గెలిస్తే కనీసం కాంస్య పతకాలు ఖాయమవుతాయి. గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో జ్ఞానదత్తు 15-12, 15-13తో ఎనిమిదో సీడ్ గారెట్ టాన్ (అమెరికా)పై, తన్వీ శర్మ 15-8, 15-5తో సన్ లి యువాన్ (చైనా)పై, ఉన్నతి 15-10, 15-7తో కరిన్ టీ (మలేసియా)పై గెలిచారు. భవ్య–విశాఖ టొప్పో ద్వయం 12-15, 15-11, 15-12తో థిబాల్ట్ గార్డన్–అగాథె క్యువాస్ (ఫ్రాన్స్) జంటపై... విశ్వతేజ్–భార్గవ్ రామ్ జోడీ 13-15, 15-9, 15-13తో యి సువాన్ చెన్–చున్ యెన్ చు (చైనీస్ తైపీ) ద్వయంపై విజయం సాధించాయి.



మనకు నాసి... పొరుగుకు వాసి

- రాష్ట్ర విద్యుత్ సంస్థలకు నాసిరకం బొగ్గు సరఫరా
- తమిళనాడు, ఏపీకి మాత్రం నాణ్యమైన బొగ్గు
- నాణ్యతలేమి బొగ్గుతో సరిగా పనిచేయని థర్మల్ కేంద్రాలు
- ఆర్థిక భారమవుతోందంటూ సింగరేణికి జెన్‌కో సీఎండీ లేఖ



సాక్షి, హైదరాబాద్: అవి రెండూ రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలే. కానీ ఒక సంస్థ మరో సంస్థపై వివక్ష చూపుతోంది. వాటిలో ఒకటి సింగరేణి.. మరొకటి టీజీజెన్‌కో. నాసిరకం బొగ్గుతో ఒక సంస్థ పూర్తి సామర్థ్యం మేరకు పనిచేయలేక.. ఉత్పత్తి కేంద్రాలను బలవంతంగా మూసుకోవాల్సిన దుస్థితి. తెలంగాణ విద్యుదుత్పాదనకు నాసిరకం బొగ్గు సరఫరా చేస్తూ.. పొరుగు రాష్ట్రాలకు సింగరేణి మేలు రకం బొగ్గు అందిస్తోంది. దీనిపై జెన్‌కో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ స్వయంగా సింగరేణి సీఎండీకి రెండు రోజుల క్రితం సుదీర్ఘ లేఖ రాశారు. నాణ్యత లేని బొగ్గుతో రాష్ట్ర విద్యుత్ సంస్థలు సామర్థ్యం మేరకు ఉత్పత్తి చేయలేకపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. వాటిని బ్యాక్‌డౌన్ చేయడం లేదా సామర్థ్యం తగ్గించుకుని ఉత్పత్తి చేయడం వల్ల బొగ్గు వినియోగం పెరుగుతోందని, తద్వారా తమపై భారం పడుతోందని చెప్పారు. జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు ఉపయోగించే బొగ్గు మొత్తం (ఏటా 28.872 మిలియన్ టన్నులు) సింగరేణి నుంచే కొనుగోలు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు.

తక్కువ గ్రేడ్ రకంతో ఇబ్బందులు

కేటీపీఎస్–6 (500 మెగావాట్లు), కేటీపీఎస్–7 (800 మెగావాట్లు), కేటీపీపీ–1 (500 మెగావాట్లు), బీటీపీఎస్ (4,270 మెగావాట్లు), వైటీపీఎస్ (800 మెగావాట్లు) తదితర థర్మల్ విద్యుత్ కేంద్రాలు ఉన్నత శ్రేణి బొగ్గు వినియోగించేలా రూపొందించినవని జెన్‌కో సీఎండీ లేఖలో చెప్పారు. ఒప్పందం ప్రకారం కాకుండా తక్కువ గ్రేడ్ బొగ్గు సరఫరా వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నట్లు పేర్కొన్నారు. దీంతో సామర్థ్యాన్ని తగ్గించుకొని ఉత్పత్తి చేయడం, బాయిలర్స్ దెబ్బతినడం, త్వరగా యంత్రాలు వేడెక్కడం, అధికంగా బూడిద రావడం లాంటివి జరుగుతున్నాయన్నారు. ఫలితంగా విద్యుత్ ఉత్పత్తిలో నష్టం వాటిల్లుతోందని చెప్పారు. అదే ఏపీలోని రాయలసీమ థర్మల్ పవర్ స్టేషన్‌కు, అలాగే తమిళనాడులోని థర్మల్ కేంద్రాలకు మాత్రం నాణ్యమైన బొగ్గు సరఫరా చేస్తున్నారని ఆక్షేపించారు.

85% పీఎల్‌ఎఫ్ తగ్గితే..

రాష్ట్ర విద్యుత్ నియంత్రణ జెన్‌కో థర్మల్ కేంద్రాలకు 85 % పీఎల్‌ఎఫ్ (ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్) సాధారణంగా నిర్ధారించిన దానికంటే తగ్గితే ఆ మేరకు ఫిక్స్‌డ్ చార్జీలు తగ్గుతాయని సంస్థ సీఎండీ పేర్కొన్నారు. బయటి రాష్ట్రాలకు మేలైన బొగ్గు సరఫరా చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, రాష్ట్రంలో సింగరేణి గనులు ఉన్నందున జెన్‌కోకు నాణ్యమైన బొగ్గు సరఫరా చేయాలని జెన్‌కో సీఎండీ కోరారు. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి చేయాలంటే.. ఉన్నతశ్రేణి బొగ్గు సరఫరా చేయాలన్నారు.

నేటి నుంచి ఉచిత చేప పిల్లల పంపిణీ

- మంత్రి వాకిటి శ్రీహరి వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం ఉచితంగా చేప పిల్లల పంపిణీకి శ్రీకారం చుట్టనున్నారు. మక్తల్‌లో అధికారికంగా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి మంత్రి వాకిటి శ్రీహరి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. రూ.123 కోట్ల బడ్జెట్‌తో 88 కోట్ల చేప పిల్లలు, 10 కోట్ల రొయ్య పిల్లలు పంపిణీ చేయనున్నారు. మంత్రి వాకిటి శ్రీహరి గురువారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా విడతల వారీగా 46,000 చెరువుల్లో చేపల పంపిణీ కార్యక్రమం చేపడతామన్నారు. వికారాబాద్ నుంచి మక్తల్ నియోజకవర్గం కృష్ణా మండలం వరకు రైల్వే లైన్ భూ సేకరణకు కేబినెట్ ఆమోదం తెలపడం సంతోషకరమన్నారు.

25 వేలు దాటిన మద్యం దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: మద్యం దుకాణాలు దక్కించుకోవడానికి దరఖాస్తు చేసుకునే గడువు దగ్గర పడుతున్న కొద్దీ ఆశావహులు పెద్దఎత్తున దరఖాస్తులు సమర్పిస్తున్నారు. గురువారం ఒక్కరోజునే ఏకంగా 10 వేల దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ శాఖ వర్గాలు తెలిపాయి. ఇప్పటివరకు మొత్తం 25 వేలు దాటి దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు.

'బీహెచ్‌ఈఎల్' చెల్లింపుల్లో అవకతవకలపై సీబీఐ కేసు

రామగుండం బీహెచ్‌ఈఎల్, ఎన్‌టీపీసీ అధికారుల ప్రమేయం

సాక్షి, హైదరాబాద్: బాయిలర్ కాంట్రాక్టుల్లో జరిగిన అవకతవకల కారణంగా బీహెచ్‌ఈఎల్‌కు రూ.35.03 కోట్ల నష్టం వాటిల్లిందని ఆ సంస్థ అడిషనల్ జనరల్ మేనేజర్ (విజిలెన్స్) హరీశ్‌కుమార్ గుప్తా ఫిర్యాదు మేరకు పెద్దపల్లి జిల్లా రామగుండం సైట్ బీహెచ్‌ఈఎల్, ఎన్‌టీపీసీ అధికారులపై సీబీఐ కేసు నమోదు చేసింది. అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కొడపె సునీల్‌కుమార్ సహా మొత్తం 9 మందిపై ఎఫ్‌ఐఆర్ రిజిస్టర్ చేసింది. ఎఫ్‌ఐఆర్ ప్రకారం.. 2017–22 మధ్య రామగుండం సైట్‌లోని ఎమ్‌డబ్ల్యూఎన్‌టీపీసీ బాయిలర్ కోసం ఎరక్షన్, కమీషనింగ్ పనులను కోల్‌కతాకు చెందిన బ్రిడ్జ్ అండ్ రూఫ్ కంపెనీ దాని కాంట్రాక్టర్ సంస్థ పవర్ ఇన్‌ఫ్రామెచ్ చేపట్టాయి. బ్రిడ్జ్ అండ్ రూఫ్ కంపెనీ పలు వేతన బిల్లులను బీహెచ్‌ఈఎల్‌కు సమర్పించింది. బిల్లుల జారీ, మంజూరు విషయంలో ఏజీఎం సునీల్‌కుమార్ సహా ఎన్‌టీపీసీ సిబ్బంది, పలువురు వ్యక్తులు అవకతవకలకు పాల్పడ్డారు. ఫోర్జరీ, నకిలీ బిల్లులతో రూ.35.03 కోట్ల అదనపు చెల్లింపులు జరిపారు. ప్రధాన నిందితుడిగా కొడపె సునీల్‌కుమార్‌ను రెండో నిందితుడిగా మేనేజర్ సంజన్‌కుమార్ సోని తదితరులను చేర్చారు.





Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



ఇటాలియన్ ఫుల్ ఎల్ఈడీ సోఫా సెట్ : 3+2+1 పూర్తిగా డబుల్ మోటరైజ్డ్ ఎలక్ట్రికల్ రిక్లైనర్
• 6 సీటర్ • కప్ హోల్డర్ • బాటమ్ లైట్ (7 రంగులలో లభించును) • హ్యాండ్ రెస్ట్ స్టోరేజ్
• కన్సోల్ టేబుల్ • యుఎస్‌బి ఛార్జర్ : 2 రీడింగ్ లైట్స్ • బైక్ ఉచితం
ZERO GRAVITY RECLINERS
10 YEARS WARRANTY FOR WOODEN STRUCTURE
MRP ₹5,09,999
Sale ₹ 2,49,999
PER DAY EMI ₹269
బైక్ ఉచితం
MOTORIZED RECLINER
హైడ్రాలిక్ స్టోరేజ్‌తో కింగ్ సైజ్ బెడ్ : కుషన్‌తో హై గ్లోస్ పెయింటింగ్ బెడ్ మరియు
2 బెడ్ సైడ్ టేబుల్స్ + బెడ్ షీట్ సెట్ (4 పీసులు)
రూ. 7000 విలువగలవి ఉచితం
MRP ₹99,499
Sale ₹ 39,999
PER DAY EMI ₹43
సఫారీ సోఫా సెట్ :
3+2+ దివాన్ (8 సీటర్)
+ ఉచితం సెంటర్ టేబుల్
మరియు కార్నర్ స్టాండ్
Same Day DELIVERY
MRP ₹62,999
Sale ₹ 24,444
PER DAY EMI ₹26
మార్బుల్
డైనింగ్ టేబుల్ :
6 సీటర్
+ ఉచితం 30 పీసుల
క్రాకరీ సెట్
విలువ రూ. 30,000
MRP ₹71,999
Sale ₹ 33,333
PER DAY EMI ₹36
మసాజర్ రిక్లైనర్ సోఫా సెట్ : 3+2+1 2 రిక్లైనర్స్‌తో 3 సీటర్
కప్ హోల్డర్ మరియు 2 రిక్లైనర్స్‌తో 2 సీటర్ రిక్లైనర్‌తో 1 సీటర్
MRP ₹2,09,999
Sale ₹ 79,999
PER DAY EMI ₹86
సింగిల్
రిక్లైనర్
సోఫా
మరింత సమాచారానికి స్కాన్ చేయండి
MRP ₹32,999
Sale ₹ 8,999
PER DAY EMI ₹10
స్టోరేజ్‌తో బెడ్ + 10" యూరో టాప్
స్ప్రింగ్ మ్యాట్రెస్ విలువ
రూ. 20,000 గలది ఉచితం
MRP ₹42,999
Sale ₹ 23,333
PER DAY EMI ₹25
యాంటిమాక్ : సాలిడ్ ఉడెన్ డైనింగ్ టేబుల్
6 సీటర్
(4 ఛైర్స్
+ 1 బెంచ్)
MRP ₹55,999
Sale ₹ 23,333
PER DAY EMI ₹25
ఎల్ టైప్/కార్నర్ సోఫా సెట్ (7 సీటర్) + రూ. 12,000
విలువ గల కర్టెన్ మరియు పెయింటింగ్ ఉచితం
MRP ₹52,999
Sale ₹ 24,999
PER DAY EMI 24
హాయ్ : టేక్‌వుడ్
క్వీన్ సైజ్ బెడ్
రూ. 15,000 విలువ గల మ్యాట్రెస్ ఉచితం
కొనుగోలు చేయుటకు స్కాన్ చేయండి
MRP ₹46,999
Sale ₹ 24,444
PER DAY EMI ₹26
హై బ్యాక్
ఛైర్
MRP ₹9,499
Sale ₹ 7,999
PER DAY EMI ₹ 9
50 ఎంఎం
టేబుల్ టాప్
మందంతో
ఆఫీస్ టేబుల్
1.4 m
MRP ₹79,499
Sale ₹ 16,999
PER DAY EMI ₹18
1.6m - ₹ 19,999 | 1.8m - ₹ 22,999
రివాల్వింగ్
ఛైర్
MRP ₹14,297 Sale ₹ 2,999


ఆసియాలో అతిపెద్ద
దీపావళి ప్రత్యేక
ఫర్నిచర్
అమ్మకం
63%
తగ్గింపు
₹1
36
నెలల
ఉచితం
ఎలక్ట్రిక్ బైక్
₹49,999
ఫర్నిచర్ కొనుగోలుతో
లక్కీ డ్రాలు లేవు | స్క్రాచ్ కార్డులు లేవు | గ్యారంటీగా బహుమతులు
బైక్ ప్యాకేజీ : సోఫా 3 సీటర్ + డ్రెస్సింగ్ యూనిట్ + క్రాకరీ యూనిట్ + కార్నర్ స్టాండ్ + డైనింగ్ టేబుల్ 1+2 + క్వీన్ సైజ్ మెటల్ బెడ్ + సెంటర్ టేబుల్ + ఉచితం ఎలక్ట్రిక్ బైక్
ఎలక్ట్రిక్ బైక్ ఉచితం
MRP ₹1,24,999
Sale ₹49,999
PER DAY EMI ₹54
ఒక కస్టమర్‌కు ఒక బైక్ పరిమితం
గ్లాస్ డైనింగ్ టేబుల్ 1+4
+ ఉచితం షోకేస్
MRP ₹38,999
Sale ₹17,999
PER DAY EMI ₹19
1+6+ ఉచితం 30 పీసుల
క్రాకరీ సెట్ విలువ రూ. 12,000
MRP ₹55,999
Sale ₹26,999
PER DAY EMI ₹29
ప్రీమియం బెడ్ రూమ్ సెట్: హైగ్లాస్ డ్యూకో పెయింటెడ్ హైడ్రాలిక్ కింగ్ సైజ్ బెడ్, 2 బెడ్ సైడ్ టేబుల్స్‌తో + 5 డోర్ వార్డ్‌రోబ్ + డ్రెస్సింగ్ టేబుల్, స్టూల్‌తో + ఉచితం బైక్
బైక్ ఉచితం
MRP ₹2,69,999
PER DAY EMI ₹140
Sale ₹1,29,999
కింగ్ సైజ్ కాట్, 2 బెడ్‌సైడ్ టేబుల్స్‌తో & హై గ్లోస్ ఫినిష్, కుషన్‌తో & హైడ్రాలిక్ స్టోరేజ్+ బైక్ ఉచితం
బైక్ ఉచితం
MRP ₹1,39,999
Sale ₹59,999
PER DAY EMI ₹65
బైక్ ఉచితం
రిక్లైనర్ సోఫా సెట్: 3+2+1
+ ఉచితం ఎలక్ట్రిక్ బైక్
MRP ₹2,14,999
Sale ₹99,999
PER DAY EMI ₹108
బ్రెజిల్ సోఫా సెట్: 3+2+1+ డివైడర్ + ఉచితం షోకేస్
+ కార్పెట్ + బైక్
MRP ₹ 1,09,999
Sale ₹49,999
PER DAY EMI ₹54
ఉచితం ♦ బైక్
♦ బుక్ కేస్ ♦ కార్పెట్
ప్రీమియం క్వాలిటీ వార్డ్‌రోబ్
మిర్రర్‌తో 3 డోర్
MRP ₹ 39,990
₹14,999
PER DAY EMI ₹16
2 మిర్రర్స్‌తో 4 డోర్
MRP ₹ 54,990
₹16,999
An ISO-9001:2015 Certified Company
BANTIA
Furnitures
Affordable Lifestyles Since 1955
బాంటియా ఎస్టేట్, సిఖ్ రోడ్, సికింద్రాబాద్
ఏదైనా డైనింగ్ టేబుల్ కొనండి మరియు పొందండి 30 పీసుల క్రాకరీ సెట్ ఉచితం
ఏదైనా కాట్ కొనండి మరియు పొందండి 4 పీసుల బెడ్‌షీట్ సెట్ మరియు పెయింటింగ్ ఉచితం
ఏదైనా సోఫా కొనండి మరియు పొందండి కార్పెట్ మరియు సెంటర్ టేబుల్ ఉచితం
మ.1 గం.కు ముందు కొనుగోలు చేయండి మరియు పొందండి కర్టెన్ మరియు సర్‌ప్రైజ్ గిఫ్ట్ ఉచితం
79933 33351, 79950 00930
ఎ.ఎస్. రావ్ నగర్ ◆ అత్తాపూర్ ◆ బోడుప్పల్ ◆ దిల్‌సుఖ్‌నగర్ ◆ హైటెక్ సిటీ ◆ కరీంనగర్ ◆ కర్మన్‌ఘాట్
◆ కొంపల్లి ◆ కూకట్‌పల్లి ◆ నాగోల్ ◆ సికింద్రాబాద్ ◆ వరంగల్ ◆ విజయవాడ ◆ www.bantia.in



జల విద్యుత్ కేంద్రంలో జరుగుతున్న ఐదు, ఆరు యూనిట్ల నిర్మాణ పనులు

ఆరు నెలల్లో.. 460 టు 690 మెగా వాట్లు

పెరగనున్న పొల్లూరు జలవిద్యుత్ కేంద్ర ఉత్పత్తి సామర్థ్యం

రాష్ట్రంలో జలవిద్యుత్ ఉత్పాదనలో ప్రత్యేకత సంతరించుకున్న పొల్లూరు జలవిద్యుత్ కేంద్రం మరో మైలురాయిని అధిగమించనుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.530 కోట్లతో చేపట్టిన 5,6 యూనిట్లు ఏర్పాటు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వీటిని ఏప్రిల్ నాటికి పూర్తి చేసి వినియోగంలోకి తేవాలన్న లక్ష్యంతో ఏపీ జెన్‌కో అధికారులు పనిచేస్తున్నారు.

- చురుగ్గా ఐదు, ఆరు యూనిట్ల నిర్మాణ పనులు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు
- రూ.530 కోట్లతో చేపట్టిన గత ప్రభుత్వం
- సివిల్ పనులు 80 శాతం, పెన్ స్టాక్ పనులు 60 శాతం పూర్తి
- ఏప్రిల్ నాటికి ఉత్పత్తి ప్రారంభిస్తామంటున్న జెన్‌కో అధికారులు

మోతుగూడెం: అల్లూరి జిల్లాలోని పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఐదు, ఆరు యూనిట్ల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వీటికి సంబంధించి పెన్ స్టాక్ పనులు 60 శాతం, సివిల్ పనుల్లో ఫ్లోర్ శ్లాబ్‌కు సంబంధించి 80శాతం పూర్తయినట్టు జెన్‌కో అధికారవర్గాలు తెలిపాయి.

- ఐదవ యూనిట్‌కు సంబంధించి కీలకమైన స్పైరల్ కేసింగ్ పనులు పూర్తయ్యాయి. దీంతోపాటు వికెట్ గేటు ద్వారా నీటిని విడుదల చేసే రన్నర్ మీద స్పైరల్ కేసింగ్ పనులు దాదాపు పూర్తికావొచ్చాయి. వాల్వుహౌస్ నుంచి టెర్మినల్ యాంకర్ వరకు పూర్తిస్థాయిలో పెన్‌స్టాక్ పైపులైను నిర్మాణం పూర్తయింది.
- ఆరో యూనిట్‌కు సంబంధించి జనరేటర్ నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. యూనిట్లకు సంబంధించి కీలకమైన విడిభాగాలు సకాలంలో బీహెచ్ఎల్ , ఇతర కంపెనీ నుంచి పవర్ హౌస్‌కు వచ్చేలా జెన్‌కో అధికారులు చర్యలు చేపట్టారు. ఎస్ఎస్‌సీ పీఈసీ కంపెనీ ప్రతినిధుల అధికారుల ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను బీహెచ్ఎల్, ప్రాజెక్ట్ అధికారుల బృందం అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.
- ప్రస్తుతం ఈ జలవిద్యుత్ కేంద్రంలో నాలుగు యూనిట్ల ద్వారా 460 మెగావాట్లు ఉత్పాదన జరుగుతోంది. 5,6 యూనిట్లు అందుబాటులోకి వస్తే ఉత్పత్తి సామర్థ్యం 690 మెగావాట్లకు పెరుగుతుందని ప్రాజెక్ట్ అధికారవర్గాలు పేర్కొన్నాయి.



టెర్మినల్ యాంకర్ నుంచి వాల్వ్ హౌస్ వరకు పూర్తయిన పెన్‌స్టాక్ పైపులైన్



అండర్ గ్రౌండ్‌లో పెన్‌స్టాక్ పైపునకు వెల్డింగ్ చేస్తున్న కార్మికులు

వేగవంతం చేశాం



వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్ నాటికి ఐదు, అరు యూనిట్ల నిర్మాణ పనులు పూర్తయ్యేలా వేగవంతం చేశాం. ఇవి పూర్తయితే 460 నుంచి 690 మెగావాట్లకు ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతుంది. సిబ్బంది, అధికారులు శ్రమిస్తున్నారు.

– బాలకృష్ణ, డీఈ, ఏపీ జెన్‌కో

లక్ష్యం మేరకు పూర్తిచేస్తాం



నిర్దేశించిన లక్ష్యం మేరకు ఆదనపు యూనిట్ల నిర్మాణ పనులు పూర్తిచేస్తాం. ఇందుకు జెన్‌కో యాజమాన్యం, డైరక్టర్ల ఆదేశాలకు అనుగుణంగా చర్యలు చేపట్టాం. నిర్మాణ పనులను ఎప్పటి కప్పుడు పర్యవేక్షించి, సూచనలు ఇస్తున్నాం.

– సీహెచ్‌వీ రాజారావు, చీఫ్ ఇంజినీరు, పొల్లూరు

ఖనిజ సంపద.. కొట్టేసేందుకు భారీ స్కెచ్

రాయల్టీ బాధ్యత ప్రైవేటుకు అప్పగింత

- గనుల శాఖకు ఇకపై ఎటువంటి సంబంధం ఉండదు
- రాయల్టీ వసూళ్ల కోసం గూడూరులో అనధికారిక చెక్‌పోస్టులు
- ప్రైవేటు సైన్యం గుప్పెట్లో సిలికా, గ్రావెల్, ఇసుక సంపద



చిల్లకూరు మండలం నల్లాయగారిపాళెం వద్ద ఏర్పాటు చేసిన గనులు, ఖనిజాల తనిఖీ కేంద్రం

సాక్షి టాస్క్‌ఫోర్స్: 'దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి' అనే సామెతలా అధికారంలో ఉండగానే అడ్డగోలుగా సంపాదించేందుకు కూటమి పెద్ద రకరకాల స్కెచ్‌లు వేస్తున్నారు. దీన్లో భాగంగా ప్రభుత్వ గనుల శాఖ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన రాయల్టీ బాధ్యతను 'ప్రైవేటు'పరం చేశారు. తిరుపతి జిల్లా గూడూరు నియోజకవర్గం కోట, చిల్లకూరు, చిట్టమూరు, వాకాడు పరిధిలో సిలికా, గ్రావెల్, బ్లూమెటల్, ఇసుక సంపద పుష్కలంగా దొరుకుతాయి. దీనిపై కన్నేసిన కూటమి పెద్దలు ప్రైవేటు సైన్యాన్ని రంగంలోకి దింపారు. అక్రమాలను అరికట్టేందుకు రాయల్టీ వసూళ్లను ప్రైవేటు సంస్థలకు అప్పగించామని సాకు చెబుతూ దొడ్డి దారిలో కోట్లాది రూపాయలను కొల్లగొట్టేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ సంపదంతా ఎక్కువ శాతం ప్రభుత్వ భూముల్లో ఉండడంతో చిన్నపాటి అనుమతి తీసుకుంటే చాలు. ఆ అనుమతులను చూపించి పక్కనే ఉన్న ప్రభుత్వ భూమి నుంచి తవ్వకాలు చేపట్టి కోట్లు కొట్టేయవచ్చు. దీన్లో భాగంగా ఏడాది కాలంగా కూటమి బ్యాచ్ గూడూరులో తిష్టవేసి ఖనిజ సంపద గురించి అన్వేషించారు. అయితే తెల్లరాయి, సిలికా తరలింపులు వివాదాస్పదంగా మారడంతో దీనిపై కూటమి ప్రభుత్వం తమకు అనుకూలంగా ఎవరైతే ఉంటారో వారికే సిలికా, ఇసుక, గ్రావెల్ (మైనర్ మినరల్) తరలించేలా అనుమతిచ్చింది.

గనుల శాఖ నిర్వీర్యం!

ప్రభుత్వం ఎప్పటికప్పుడు గనుల శాఖ ఆధ్వర్యంలో మైనర్ మినరల్ తవ్వకాలు, తరలింపులకు సంబంధించి అన్ని అనుమతులు ఇచ్చేది. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత గనుల శాఖను నిర్వీర్యం చేస్తూ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా రాయిల్టీ వసూళ్లకు అనుమతులను ఇచ్చింది. రెండేళ్లలో ప్రభుత్వానికి రూ.340 కోట్లు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకుంది. ఇక దొరికిందే తడవు నిబంధనలకు విరుద్ధంగా ఆ ఏజెన్సీ అంతకు రెండింతలు వసూళ్లు చేయడం మొదలు పెట్టింది. అనుచరుల ద్వారా ప్రభుత్వ భూముల్లో అక్రమంగా తవ్వకాలు జరిపి తరలించేలా పక్కా ప్రణాళికలు రూపొందించుకున్నారు. సాధారణంగా సిలికా టన్ను రూ.307 వసూలు చేసేవారు. ఇదే టన్ను సిలికా బయటి మార్కెట్‌లో రూ.3వేలకుపైనే ఉంటుంది. మిగిలిన గ్రావెల్, ఇసుక, బ్లూమెటల్ పరిస్థితి కూడా దాదాపు అంతే. బయటి మార్కెట్‌ని దృష్టిలో ఉంచుకుని ఒక రాయల్టీ రసీదును చూపించి ఖనిజాన్ని అక్రమంగా తరలించి సొమ్ముచేసుకోవడం ప్రారంభించారు.

అనధికారిక చెక్ పోస్టులు

ప్రైవేటు సైన్యం కన్నుగప్పి ఒక్క టన్ను కూడా బయటకు వెళ్లకుండా గూడూరు నియోజకవర్గ పరిధిలోని గొల్లపల్లి, తిప్పవరప్పాడు, చిల్లకూరు మండలంలోని నల్లయగారిపాళెం, చేడిమాల, అంకులపాటూరు, చింతవరం, వరగలి, కోట క్రాస్ రోడ్డు, బూదనం రోడ్డు, కోట మండలం గూడలి, మెట్టు, కర్లపూడి, కేసవరం, రాఘవాపురం, కోట క్రాస్ రోడ్డు, వాకాడు మండలంలో బాలిరెడ్డిపాళెం , వాకాడు బ్యారేజ్, చిట్టమూరు మండలంలో మెట్టు, చిట్టమూరులో అనధికారిక చెక్ పోస్టులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రైవేటు ఏజెన్సీ ద్వారా పొందిన రాయల్టీ రసీదు చూపిస్తే వాహనాలకు అనుమతి ఉంటుంది. లేదంటే ఫైన్, కేసులు ఇతరత్రా వేధింపులు తప్పవు.

చిల్లకూరులో పోటీ కార్యాలయం

గనులకు సంబంధించి అధికారిక కార్యాలయాలు, చెక్‌పోస్టులు ఉంటాయి. ప్రైవేటు ఏజెన్సీల పుణ్యమా అని వారే చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. గూడూరు... నెల్లూరు జిల్లాలో ఉన్న సమయంలో గనుల శాఖ కార్యాలయం పూర్తిగా నెల్లూరులో ఉండేది. జిల్లాల మార్పుతో గూడూరు నియోజకవర్గంలో ఎక్కువగా మైనర్, మేజర్ మినరల్ దొరుకుతుండడంతో చిల్లకూరులో గనుల శాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మైనర్ మినరల్ రాయల్టీ వసూళ్లను ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించడంతో వారు చిల్లకూరులో అనధికారికంగా గనుల శాఖ కార్యాలయం ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇకపై ఎవరైనా సిలికా, ఇసుక, గ్రావెల్, నల్ల, బ్లూ కంకరను తరలించాలంటే ఇక్కడ రాయిల్టీ చెల్లించి అనుమతులు తీసుకున్న తరువాతనే తరలించాల్సి ఉంటుంది.

ఏజెన్సీలే చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలి

మైనర్ మినరల్ తవ్వకాలు, తరలింపులకు సంబంధించి ఇటీవల ప్రభుత్వం ఏఎంఆర్ అనే ఏజెన్సీతో ప్రతి టన్నుకు రాయిల్టీ చెల్లించేలా ఒప్పందం చేసుకుంది. దీంతో ఏజెన్సీకి చెందిన వారు పలు ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసుకుని తనిఖీలు చేస్తూ అనుమతులు ఉన్న వాహనాలకు మాత్రమే పంపేలా చేస్తున్నారు. ఇది మొత్తంగా ప్రైవేట్ ఏజెన్సీకి చెందిన విషయం.

– శ్రీనివాసరావు, గనులశాఖ ఏడీ

టమాట రైతు చిత్తవుతున్నాడు. ధరలు నేలచూపు చూస్తుండటంతో నష్టాల బాట పడుతున్నాడు. గత నెలన్నర రోజులుగా మార్కెట్ పరిస్థితి దారుణంగా ఉండటంతో కనీసం పెట్టుబడులు కూడా దక్కడం లేదని రైతులు వాపోతున్నారు.



ఆత్మకూరు సమీపంలో పశువులకు వదిలేసిన టమాట పంట

టమాట... నష్టాల బాట

నెలన్నర రోజులుగా రైతులకు దక్కని గిట్టుబాటు ధరలు

- కిలో రూ.15 లోపు పలుకుతుండటంతో దక్కని పెట్టుబడి
- ఉమ్మడి జిల్లాలో 19 వేల హెక్టార్ల భారీ విస్తీర్ణంలో టమాట సాగు
- 7 లక్షల టన్నుల దిగుబడితో అన్నమయ్య తర్వాత స్థానంలో 'అనంత'



అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో 19 వేల హెక్టార్లలో రైతులు టమాట పండిస్తున్నారు. ఇందులో అనంతపురం జిల్లాలో 12 వేల హెక్టార్లు, శ్రీసత్యసాయి జిల్లాలో 7 వేల హెక్టార్లు ఉన్నాయి. 7 లక్షల టన్నుల దిగుబడితో అన్నమయ్య తర్వాతి స్థానంలో అనంత జిల్లా ఉండడం గమనార్హం. ఎకరాకు 14 నుంచి 18 టన్నుల వరకు దిగుబడి వస్తోంది. కట్టెలు, తీగలు కట్టిన టమాట పంటలో ఎకరాకు రూ.1.20 లక్షల వరకు పెట్టుబడి వస్తుండగా... మామూలు పద్ధతిలో ఎకరాకు రూ.60 వేల వరకు పెట్టుబడి అవుతోందని రైతులు చెబుతున్నారు. కిలో రూ.22 నుంచి రూ.25 పలికితే పెట్టుబడి పోయి కొంత వరకు మిగులుతుందని అంటున్నారు. ప్రస్తుత మార్కెట్ ధరలతో కూలీలు, రవాణా ఖర్చులు, మార్కెట్‌లో కమీషన్లకు కూడా రాబడి సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఆరంభంలో ఊరించి..

సీజన్ ఆరంభం జూన్, జూలై, ఆగస్టులో మార్కెట్‌లో టమాట ధరలు ఆశాజనకంగా ఉండటంతో సాగు విస్తీర్ణం పెరిగింది. అయితే సెప్టెంబర్, అక్టోబర్‌లో మార్కెట్ పరిస్థితి తారుమారు అయింది. ధర గిట్టుబాటు కావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అనంతపురంలోని కక్కలపల్లి మార్కెట్‌లో 15 కిలోల బాక్సు ధర గరిష్టంగా రూ.270 ఉండగా కనిష్టం రూ.130 ప్రకారం పలుకుతోంది. సగటున రూ.200తో క్రయ విక్రయాలు సాగుతున్నాయి. గరిష్ఠ ధర కూడా నాణ్యమైన కొన్ని లాట్లకు మాత్రమే లభిస్తోంది. మిగతావన్నీ రూ.100 నుంచి రూ.200 మధ్య పలుకుతుండడంతో పెట్టుబడులు కూడా రావడం లేదని వాపోతున్నారు. ప్రస్తుతం రోజూ మార్కెట్‌కు 2 వేల నుంచి 3 వేల టన్నుల వరకు సరుకు వస్తోంది.

అంతటా ఇదే పరిస్థితి!

మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేకపోవడంతో చాలా మంది రైతులు.. కూలీలు, రవాణా ఖర్చు మిగులుతుందనే ఉద్దేశంతో టమాట కోతలకు స్వస్తి పలికారు. దీంతో పొలాల్లోనే పంటను పశువులకు వదిలేశారు. ఇప్పటికే 60 శాతం పంట పూర్తి కాగా, మరో 40 శాతం మేర ఉంటుందని అధికారులు చెబుతున్నారు. వర్షాలకు తడిసినవి, మచ్చ ఉన్న కాయలను కొనడానికి వ్యాపారులు ముందుకు రాకపోవడంతో రైతుల పరిస్థితి మరింత దారుణంగా మారింది. టమాట సాగులో అన్నమయ్య తర్వాత రెండో స్థానంలో 'అనంత' ఉండగా ఆ తర్వాత చిత్తూరు, శ్రీసత్యసాయి, కర్నూలు జిల్లాలు ఉన్నాయి. కాగా, అనంతపురం, చిత్తూరు, అన్నమయ్య, కర్నూలు జిల్లా పరిధిలోని టమాట మార్కెట్లలో ధరల పరిస్థితి కూడా ఇలాగే ఉందని రాప్తాడు మార్కెట్ కమిటీ సెక్రటరీ రూప్‌కుమార్ తెలిపారు.

ఒక్క కిలో కూడా అమ్ముడుపోలేదు



ఈ ఏడాది 3 ఎకరాల్లో టమాట సాగు చేశా. 3 ఎకరాలకు రూ.2.70 లక్షల వరకు పెట్టుబడులు అయ్యాయి. తీరా పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు కురవడంతో మచ్చలు, ఇతర తెగుళ్ల వ్యాపించి పరిస్థితి తారుమారయింది. ధరలు తగ్గుముఖం పట్టి మార్కెట్‌లో అమ్ముడుపోలేదు. చేసేదేమీ లేక తోటను పశువులకు వదిలేసి వేరే పంట సాగు కోసం ప్రయత్నిస్తున్నా. ఒక్క కిలో కూడా అమ్ముకోలేక పోయా.

– రైతు రుక్మాంగధరెడ్డి, బొమ్మగానిపల్లి, బ్రహ్మసముద్రం మండలం

ధరలు దారుణంగా ఉన్నాయి



ఎకరాకు రూ.50 వేల పెట్టుబడితో దశల వారీగా 10 ఎకరాల్లో టమాట సాగు చేశాను. ఇప్పటికే ఐదు ఎకరాల పంట పూర్తయింది. ధరలు చూస్తే దారుణంగా ఉన్నాయి. పెట్టుబడులు కూడా చేతికి అందడం లేదు. ఏడాది పొడవునా గిట్టుబాటు ధరలు స్థిరంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. లేదంటే 80 శాతం మంది టమాట రైతులకు నష్టాలే మిగులుతాయి.

– కందుల పుల్లారెడ్డి, రైతు, ఆత్మకూరు

'బ్లాక్‌రైస్' బంగారమే!

మాపిళ్లైసాంబ పేరిట పురాతన వరి రకం సాగు



పలమనేరు: కుర్మాయి వద్ద సాగవుతున్న బ్లాక్‌రైస్

- పంట నల్లగా.. బియ్యం ఎరుపు రంగు
- పలమనేరు డివిజన్‌లో 30 ఎకరాల్లో సాగు
- ఆన్‌లైన్ మార్కెట్‌లో కిలో రూ.200 పైమాటే

పలమనేరు: సాధారణంగా మనం తినే బియ్యం తెలుపు రంగులో ఉంటుంది. వరి పంట కాలం నాలుగు నెలలు మాత్రమే. అద్భుతమైన ఔషధ గుణాలున్న బ్లాక్ రైస్ రకం ఇప్పుడు రైతులకు వరంగా మారింది. గతంలో తమిళనాడు రాష్ట్రం కన్యాకుమారి ప్రాంతంలో అక్కడి పూర్వీకులు సహజ పద్ధతిలో సాగు చేస్తూ వరి విత్తనాలను కాపాడుకుంటూ వచ్చారు. అవే నేటి తరాలకు అందుబాటులోకి వస్తున్నాయి. తమిళనాడు ప్రాంతం నుంచి మాపిళ్లైసాంబ(బ్లాక్‌రైస్) విత్తనాలను తెచ్చి చిత్తూరు జిల్లా పలమనేరు మండలంలోని కూర్మాయి వద్ద ఓ ప్రకృతి రైతు చందూల్ కుమార్ ప్రయోగాత్మకంగా ఈ వంగడాన్ని కొన్నేళ్లుగా సాగు చేస్తున్నారు.

ఊపందుకున్న సాగు

పలమనేరు మండలంలోని కూర్మాయి గ్రామం వద్ద చందూల్ కుమార్ అనే ప్రకృతి రైతు మూడేళ్లుగా బ్లాక్ రైస్‌ను సాగు చేస్తున్నాడు. ఈ విడత సైతం తన ఎకరా పొలంలో ఈ వంగడాన్ని నాటాడు. ప్రస్తుతం వరి పంట ఆరు అడుగులకు పైగా పెరిగి ఎన్ను పట్టింది. రైతు పూర్తిగా సేంద్రియ, సహజ పద్ధతిలో పంట సాగు చేశాడు. సాధారణంగా వరి పంట కాలం నాలుగు నెలలుగా ఉంటే దీనికి ఏడు నెలలుగా ఉంటుంది. రైతు పండించిన ఈ రకాన్ని చుట్టు పక్కల ప్రాంతాలే కాదు కర్ణాటక నుంచి సైతం రైతులు సందర్శిస్తున్నారు. ఈ విడత పలమనేరు వ్యవసాయశాఖ డివిజన్‌లో 30 ఎకరాల్లో బ్లాక్‌రైస్ సాగు అవుతోంది.

దేశవాళి వరి వంగడాల్లో అగ్రస్థానం

హరితవిప్లవం తర్వాత పలు రకాల హైబ్రిడ్ వరి వంగడాలు సృష్టించబడి రెండు వేల దాకా వంగడాలు సాగులో ఉన్నాయి. అనాదిగా కొన్ని రాష్ట్రాల్లో మాత్రం దేశవాళి రకాలు వంశపారం పర్యంగా సాగులో ఉంటూ ఆ విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. ఇలాంటివి 26 కాగా వీటిలో అత్యంత పోషకాలు కలిగిన ఔషధ గుణాలున్న వరుసలో తొలిస్థానం మాత్రం బ్లాక్‌రైస్‌దే, అందుకే మార్కెట్‌లో దీనికి మంచి డిమాండ్ ఉంది.

కిలో ధర రూ.200 పైమాటే...

దుకాణాల్లో బ్లాక్ రైస్ పెద్దగా అందుబాటులో లేదు. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ లాంటి పలు కంపెనీలు కిలో నుంచి మూడు, ఐదు కిలోల బ్యాగుల్లో వీటిని ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నారు. డీమార్ట్, బిగ్ బాస్కెట్ లాంటి మాల్స్‌లోనూ అందుబాటులో ఉన్నాయి. కిలో రూ.160 నుంచి రూ.250 దాకా కంపెనీలను బట్టి ధరలున్నాయి.

ఫార్మసీ.. ఏదీ అజమాయిషీ?

మెడికల్ షాపులపై కొరవడిన నిఘా.. నిబంధనలకు నీళ్లొదులుతున్న వ్యాపారులు

- నిషేధిత, గడువు పూర్తయిన మందుల విక్రయాలు
- జీఎస్టీ తగ్గినా పాత స్టాకు పేరిట పాత ధరలకే అమ్మకాలు



సాక్షి, భీమవరం: మందుల షాపులపై అధికారుల అజమాయిషీ కొరవడింది. మత్తు మందులతో పాటు కాలం చెల్లిన వాటిని అమ్ముతూ ప్రజారోగ్యంతో ఆటలాడుతున్న వైనం కొద్దినెలల క్రితం విజిలెన్స్ తనిఖీల్లో వెలుగు చూసింది. తాజాగా మందులపై కేంద్రం జీఎస్టీ తగ్గించినా పలుచోట్ల పాత స్టాకు పేరిట పాత ధరలకే అమ్మకాలు చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో 1600 వరకు రిటైల్, 400 హోల్‌సేల్ మెడికల్ షాపులు ఉన్నాయి. వీటిద్వారా రోజుకు రూ.10 కోట్ల వ్యాపారం జరుగుతున్నట్టు అంచనా. చాలా షాపుల్లో ఫార్మాసిస్టులు లేకుండానే అమ్మకాలు జరిగిపోతున్నాయి. కొందరు బీఫార్మసీ, ఎంఫార్మసీ చేసిన వారితో ఒప్పందం చేసుకుని వారి సర్టిఫికెట్లతో షాపులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గుండె, సుగర్, క్యాన్సర్, న్యూరాలజీ తదితర కొన్ని రకాల వ్యాధులకు సంబంధించిన మందులు, ఫ్లూయిడ్స్, ఇంజక్షన్లు నిర్ణీత ఉష్ణోగ్రతల్లో మాత్రమే నిల్వ చేయాలి. కాగా ఎన్ని షాపుల్లో అందుకు అవసరమైన ఏర్పాట్లు ఉన్నాయనేది ప్రశ్నార్థకమే.

కాలం చెల్లిన, నిషేధిత మందుల విక్రయాలు: పలుషాపుల్లో మత్తు కలిగించేవి, లైంగిక సామర్థ్యం పెంచేవి, గర్భస్రావానికి సంబంధించిన నిషేధిత మందులతో పాటు కాలం చెల్లిన మందుల విక్రయాలు అమ్మకాలు చేస్తున్నారు. కొద్దినెలల క్రితం విజిలెన్స్ అధికారులు తాడేపల్లిగూడెం, తణుకు, అత్తిలి తదితర చోట్ల తనిఖీల్లో ఈ తరహా నిషేధిత, కాలం చెల్లిన మందుల అమ్మకాలు చేస్తున్న విషయం వెలుగుచూసింది. వీటిపై పెద్ద మొత్తంలో లావాదేవీలు జరుగుతున్నట్టు తెలుస్తోంది గడువు పూర్తయిన మందులకు స్టిక్కర్లు అతికించి అమ్మకాలు చేస్తున్నారు. పలు షాపులకు నిషేధిత మందులు సరఫరాపై అధికారులు వివరాలు సేకరించినట్టు అప్పట్లో ప్రచారం జరిగింది. జిల్లాలో ఔషధ నియంత్రణశాఖ అధికారులు ఉన్నా విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగితే తప్ప అక్రమాలు బయటపడకపోవడం గమనార్హం. లైంగిక సామర్థ్యాన్ని పెంచే మందుల వల్ల గుండె, ఊపిరితిత్తులపై ప్రభావం పడుతుందని వైద్యులు చెబుతున్నారు. గర్భస్రావం మందులు ఒక్కోసారి ప్రాణాల మీదుకు తెస్తాయని, మత్తు కలిగించే మందులతో నిద్రలేమి, నరాలకు సంబంధించిన సమస్యలు వస్తాయంటున్నారు.

జీఎస్టీ తగ్గినా..

మార్కెట్‌లో ఉన్న వస్తువుల ధరలు పెరగ్గానే తమ వద్ద ఉన్న పాత స్టాకుపై పెరిగిన ధరల స్టిక్కర్లు అతికించి ఆ మేరకు అమ్మకాలు చేసి లాభాలు ఆర్జిస్తుంటారు. ధరలు తగ్గినప్పుడు తమ వద్ద ఉన్న ఓల్డ్ స్టాక్ అయిపోయేవరకు వాటిపై ఉన్న ఎమ్మార్పీ ధరలకే విక్రయిస్తుంటారు. ప్రస్తుతం పలుచోట్ల ఇదే పరిస్థితి కనిపిస్తోంది. వివిధ రకాల మందులు, మెడికల్ గ్రేడ్ ఆక్సిజన్, కళ్లజోళ్లు, వ్యాధి నిర్ధారణ కిట్లుపై 12 శాతం ఉన్న జీఎస్టీని ఏడు శాతం మేర, మెడికల్ థర్మోమీటర్లు, మెడికల్ అనాలసిస్ పరికరాలపై 18 శాతం ఉన్న జీఎస్టీని 13 శాతం వరకు తగ్గించగా, 36 రకాల ప్రాణరక్షక, అరుదైన వ్యాధుల మందులపై 12 శాతం నుంచి 5 శాతం వరకు ఉన్న జీఎస్టీలను పూర్తిగా మినహాయింపునిచ్చారు. మందులపై భారీ తగ్గుదల అంటూ ఊరువాడా ప్రభుత్వం ప్రచారం చేస్తుండగా పాత స్టాకులు ఉండిపోయాయంటూ పలుచోట్ల పాత ధరలకే అమ్మకాలు చేస్తున్నారని వినియోగదారులు అంటున్నారు. ఆరెడీ ఎమ్మార్పీపై పది నుంచి 15 శాతం వరకు తగ్గించి ఇవ్వడం ద్వారా జీఎస్టీ కంటే ఎక్కువే తగ్గిస్తున్నామని వ్యాపారులు చెబుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యాలు సొంతంగా ఏర్పాటుచేసుకున్న మందుల షాపులతో పాటు కార్పొరేట్ సంస్థలకు చెందిన మెడికల్ షాపుల్లో చాలాచోట్ల ఇంకా ధరలు దిగిరావడం లేదని తెలుస్తోంది.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



జీఎస్టీ తగ్గిన మేరకు మందులు విక్రయించాలి. ప్రజలకు అవగాహన కల్పిస్తూ జిల్లా వ్యాప్తంగా 30 స్టాళ్లు ఏర్పాటుచేశాం. నిబంధనలు అమలయ్యేలా జిల్లా అంతటా తనిఖీలు చేస్తున్నాం. ఎక్కడైనా అధిక ధరలకు మందులు అమ్మకాలు చేస్తున్నా, నిషేధిత మందులు విక్రయిస్తున్నా ఫిర్యాదులు వస్తే వెంటనే తనిఖీలు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం.

– అబిద్ ఆలీషేక్, జిల్లా డ్రగ్ కంట్రోల్ అధికారి, భీమవరం

వెండితెరపై సినీ జీవితం

● బాలీవుడ్‌లో జోరుగా సినిమా తారల బయోపిక్స్


● ఆమిర్ ఖాన్


● ఎన్టీఆర్


● ధనుష్


● విక్కీ కౌశల్


● రణ్‌బీర్ కపూర్


● చంద్రిక రవి


● కియారా


● త్రిప్తి దిమ్రి

సైన్స్, స్పోర్ట్స్, పాలిటిక్స్... ఇలా వివిధ రంగాల్లోని ప్రముఖుల జీవితాల ఆధారంగా రూపొందే బయోపిక్స్‌లో సినీ తారలు నటించడం చూస్తూనే ఉన్నాం. ఈ కోవలో ఇప్పటి వరకు చాలా బయోపిక్స్ వచ్చాయి. మరికొన్ని బయోపిక్స్ రానున్నాయి. అయితే వీటిలో సినీ తారల బయోపిక్స్ చాలా తక్కువగా వస్తుంటాయి. కానీ సడన్‌గా ఇప్పుడు బాలీవుడ్‌లో సినీ తారల జీవితం ఆధారంగా రూపొందే బయోపిక్స్ సంఖ్య ఎక్కువైంది. మరి... ఏ స్టార్స్ బయోపిక్స్ వెండితెర పైకి రానున్నాయి? ఈ తారల బయోపిక్స్‌లో ఎవరు నటించనున్నారు? అన్న వివరాలపై ఓ లుక్ వేయండి.

ఫాదర్ ఆఫ్ ఇండియన్ సినిమా

దాదా సాహెబ్ ఫాల్కేను ఫాదర్ ఆఫ్ ఇండియన్ సినిమాగా చెప్పుకుంటాం. పూర్తి నిడివితో తొలి భారతీయ సినిమా తీసిన వ్యక్తిగా దాదా సాహెబ్ ఫాల్కే ఘనత గొప్పది. అందుకే కేంద్ర ప్రభుత్వం కూడా ప్రతి ఏటా దాదా సాహెబ్ ఫాల్కే పేరిట అవార్డును ప్రదానం చేస్తుంది. ఇలాంటి ప్రముఖ వ్యక్తి జీవితం ఆధారంగా సినిమా అంటే ప్రేక్షకుల్లోనే కాదు... ఇండస్ట్రీ వర్గాల్లోనూ క్రేజ్ ఉంటుంది. దాదా సాహెబ్ ఫాల్కే జీవితం ఆధారంగా తెరకెక్కనున్న బయోపిక్‌లో ఆమిర్ ఖాన్ నటించనున్నారు. దాదా సాహెబ్ ఫాల్కేగా ఆయన కనిపిస్తారు. ఆమిర్ ఖాన్‌తో గతంలో 'పీకే, 3 ఇడియట్స్' వంటి సూపర్ డూపర్ హిట్ ఫిల్మ్స్ తీసిన రాజ్‌కుమార్ హిరాణీ ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. దాదా సాహెబ్ ఫాల్కే బయోపిక్‌లో నటించనున్నట్లుగా ఆమిర్ ఖాన్ కూడా వెల్లడించారు. రాజ్‌కుమార్ హిరాణీ, అభిజీత్ జోషి, హిందుకుష్ భరద్వాజ్, ఆవిష్కర్ భరద్వాజ్ ఈ సినిమా స్క్రిప్ట్‌పై నాలుగు సంవత్సరాలుగా పని చేస్తున్నారు. ఈ బయోపిక్‌కు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు ఇటీవలి కాలంలో మరింత ఊపందుకున్నాయట. వచ్చే ఏడాది రెగ్యులర్ షూటింగ్ ఆరంభం కానుందని సమాచారం. ఈ సినిమాకు దాదా సాహెబ్ మనవడు చంద్రశేఖర్ శ్రీకృష్ణ సపోర్ట్ చేస్తున్నారు.

మేడ్ ఇన్ ఇండియా: 'మేడ్ ఇన్ ఇండియా' సినిమాకు సమర్పకుడిగా వ్యవహరించనున్నట్లుగా ప్రముఖ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి 2023 సెప్టెంబరులో ప్రకటించిన సంగతి తెలిసిందే. హిందీ చిత్రం 'నోట్ బుక్' ఫేమ్ నితిన్ కక్కర్ ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నట్లుగా, కార్తికేయ, వరుణ్ గుప్తా నిర్మించనున్నట్లుగా ఈ 'మేడ్ ఇన్ ఇండియా' అనౌన్స్‌మెంట్‌లో ఉంది. అయితే దాదా సాహెబ్ ఫాల్కే జీవితం ఆధారంగా ఈ సినిమా తీస్తున్నారని, అందుకే రాజమౌళి ఈ సినిమాలో భాగమయ్యారని, ఇందులో దాదా సాహెబ్ ఫాల్కేగా ఎన్టీఆర్ నటిస్తారనే ప్రచారం సాగుతోంది. ఇక ఈ సినిమాను 2023 సెప్టెంబరులో ప్రకటించినప్పటికీ ఇంకా సెట్స్‌పైకి వెళ్లలేదు. సో... ఈ చిత్రంపై స్పష్టత రావాల్సి ఉంది.

మ్యూజిక్ మేస్ట్రో

ప్రముఖ సంగీత దర్శకులు ఇళయరాజా బయోపిక్ వెండితెరపైకి రానున్న సంగతి తెలిసిందే. ఈ బయోపిక్‌లో ఇళయరాజాగా ధనుష్ నటిస్తారు. గత ఏడాది మార్చిలో ఇళయరాజా బయోపిక్‌ను అధికారికంగా ప్రకటించారు. ధనుష్‌తో 'కెప్టెన్ మిల్లర్' సినిమా తీసిన అరుణ్ మాథేశ్వరన్ ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈపాటికే పూర్తి స్థాయిలో ప్రారంభం కావాల్సి ఉంది. కొన్ని కారణాల వల్ల ఈ సినిమా చిత్రీకరణ అనుకున్న సమయానికన్నా కాస్త ఆలస్యంగా ప్రారంభం కానుందట. ప్రస్తుతం ధనుష్ రెండు, మూడు సినిమాలతో బిజీగా ఉన్నారు. మరో వైపు దర్శకుడు లోకేశ్ కనగరాజ్‌ను హీరోగా పరిచయం చేసే సినిమా పనుల్లో అరుణ్ బిజీగా ఉన్నారు. ఇలా ధనుష్, అరుణ్‌ల ప్రస్తుత కమిట్‌మెంట్స్ పూర్తయిన తర్వాత 'ఇళయరాజా' బయోపిక్ సెట్స్‌కు వెళ్లే అవకాశాలు ఉన్నాయని కోలీవుడ్ సమాచారం. అంతేకాదు... ఇళయరాజా బయోపిక్‌లో రజనీకాంత్, కమల్ హాసన్‌లు గెస్ట్ రోల్స్‌లో నటిస్తారనే ప్రచారం కూడా జరుగుతోంది. అయితే ఈ అంశాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. కనెక్ట్ మీడియా, పీకే ప్రైమ్ ప్రొడక్షన్, మెర్క్యూరీ మూవీస్ సంస్థలు ఈ బయోపిక్‌ను నిర్మించనున్నట్లు అనౌన్స్‌మెంట్ పోస్టర్‌పై ఉంది.

ఆమిర్ లేదా రణ్‌బీర్

ప్రఖ్యాత గాయకులు కిశోర్ కుమార్ బయోపిక్ వెండితెర పైకి రానుంది. ఈ బయోపిక్‌పై దర్శకుడు అనురాగ్ బసు ఎప్పట్నుంచో వర్క్ చేస్తున్నారు. ఈ బయోపిక్‌లో రణ్‌బీర్ కపూర్ నటించాల్సింది. కానీ కొన్ని కారణాల వల్ల ఆయన నటించలేక పోయారు. ''కిశోర్ కుమార్‌గారి బయోపిక్‌లో రణ్‌బీర్ కపూర్‌ను అనుకున్న మాట వాస్తవమే. కాకపోతే ఈ బయోపిక్‌కు బదులు 'రామాయణ' సినిమాను రణ్‌బీర్ కపూర్ ఎంపిక చేసుకున్నాడు. అప్పటి పరిస్థితుల్లో అతను మంచి నిర్ణయమే తీసుకున్నాడని నేను అనుకుంటున్నాను'' అని చెప్పుకొచ్చారు అనురాగ్ బసు. కాగా కిశోర్ కుమార్ బయోపిక్‌లో ఆమిర్ ఖాన్ నటించనున్నారనే వార్తలు ప్రస్తుతం బాలీవుడ్‌లో తెరపైకి వచ్చాయి. ఇటీవల ఓ సందర్భంలో కిశోర్ కుమార్‌గారి బయోపిక్‌లో నటించే చాన్స్ వస్తే తప్పుకుండా చేస్తానన్నట్లుగా ఆమిర్ ఖాన్ కూడా చెప్పారు. ఈ నేపథ్యంలో ఈ బయోపిక్‌లో ఆమిర్ ఖాన్ నటించే అవకాశం ఉందని ఊహించవచ్చు. కానీ కిశోర్ కుమార్ బయోపిక్‌కు అనురాగ్ బసు తొలుత రణ్‌బీర్ కపూర్‌ను అనుకున్నారు. అప్పట్లో కుదర్లేదు. అయితే ఇప్పుడు 'రామాయణ' సినిమా పూర్తి కావొచ్చింది. రణ్‌బీర్ కపూర్ చేస్తున్న మరో సినిమా 'లవ్ అండ్ వార్' చిత్రీకరణ కూడా తుది దశకు చేరుకుంటోంది. ఈ నేపథ్యంలో కిశోర్ కుమార్ బయోపిక్‌లో రణ్‌బీర్ కపూర్ నటించే అవకాశం లేకపోలేదు. పైగా దాదా సాహెబ్ ఫాల్కే బయోపిక్‌తో ఆమిర్ ఖాన్ బిజీ కానున్నారు. ఒకేసారి రెండు బయోపిక్స్‌లో ఆమిర్ ఖాన్ నటించడం సాధ్యం కాకపోవచ్చు కనుక కిశోర్ కుమార్‌గా వెండితెరపై రణ్‌బీర్ కపూర్ కనిపించే అవకాశం లేకపోలేదు. ఫైనల్‌గా కిశోర్ కుమార్ బయోపిక్‌లో ఎవరు నటిస్తారు? అనేది తెలియాలంటే మరి కొన్ని రోజులు వెయిట్ చేయక తప్పదు. మరోవైపు కిశోర్ కుమార్ బయోపిక్ చేయాలని బాలీవుడ్ దర్శకుడు సూజిత్ సర్కార్ ఓ కథ రెడీ చేశారు. ఈ చిత్రంలో అభిషేక్ బచ్చన్‌ను హీరోగా అనుకున్నారు. కానీ అనురాగ్ బసు చేస్తున్న ప్రాజెక్ట్ గురించి తెలుసుకున్న సూజిత్ సర్కార్ తన ప్రయత్నాలను ఆపేశారు. ఈ విషయాలను సుజిత్ సర్కార్ ఇటీవల ఓ సందర్భంలో వెల్లడించారు.

గురుదత్ బయోపిక్‌లో విక్కీ?

'సైలాబ్, కాగజ్ కె ఫూల్, ప్యాసా' వంటి ఎన్నో క్లాసిక్ హిట్ ఫిల్మ్స్ తీసిన లెజెండరీ దర్శకుడు గురుదత్ జీవితం వెండితెర పైకి రానుందని బాలీవుడ్ సమాచారం. అల్ట్రా మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఇందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ బయోపిక్‌కు భావనా తల్వార్ దర్శకత్వం వహిస్తారని, 'ప్యాసా' అనే టైటిల్‌ను అనుకుంటున్నారనే ప్రచారం బాలీవుడ్‌లో జరుగుతోంది. అంతే కాదు... ఈ సినిమాలో గురుదత్‌గా విక్కీ కౌశల్ నటిస్తారని, ఇందుకోసం మేకర్స్ ఆల్రెడీ ఈ హీరోతో సంప్రదింపులు జరుపుతున్నారని బాలీవుడ్ భోగట్టా. మరి... వెండితెరపై గురుదత్‌గా విక్కీ కౌశల్ నటిస్తారా? లెట్స్ వెయిట్ అండ్ సీ.

మధుబాల బయోపిక్

'ప్యార్ కియాతో డర్నా క్యా...' అంటూ వెండితెరపై అనార్కలిగా మధుబాల నటన అద్భుతం. 1960లో విడుదలైన 'మొఘల్ ఏ అజం' సినిమా మధుబాలకు అప్పట్లో దేశవ్యాప్తంగా గుర్తింపు తీసుకొచ్చింది. ఈ సినిమాయే కాదు... పలు సూపర్ హిట్ సినిమాల్లో నటించారు మధుబాల. దాదాపు 60 సినిమాల్లో నటించిన మధుబాల 36 సంవత్సరాల చిన్న వయసులో తుది శ్వాస విడిచారు. కాగా, మధుబాల బయోపిక్ రానుంది. గత ఏడాది మార్చిలో ఈ బయోపిక్‌ను అధికారికంగా ప్రకటించారు. ఆలియా భట్ హీరోయిన్‌గా నటించిన 'డార్లింగ్స్' సినిమాతో దర్శకురాలిగా పరిచయం అయిన జస్మీత్ కె. రీన్ ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. సోనీ పిక్చర్స్ ఇంటర్‌నేషనల్ ప్రొడక్షన్స్ సంస్థతో బ్రిజ్ భూషణ్ (మధుబాల సోదరి) మధుబాల బయోపిక్‌ను నిర్మించనున్నారు. ఈ చిత్రంలో మధుబాలగా ఆలియా భట్ లేదా 'యానిమల్' ఫేమ్ త్రిప్తి దిమ్రీ నటించనున్నారని టాక్. వచ్చే ఏడాది ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు మనీష్ మల్హోత్రా కూడా మధుబాల బయోపిక్‌ను నిర్మించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, ఇందులో మధుబాలగా కృతీ సనన్ నటిస్తారనే ప్రచారం సాగుతోంది. కానీ మనీష్ మల్హోత్రా నిర్మించే మధుబాల బయోపిక్‌పై తమకు సమాచారం లేదన్నట్లుగా బ్రిజ్ భూషణ్ ఓ సందర్భంలో వెల్లడించారనే వార్తలు బాలీవుడ్ ఉన్నాయి.

ట్రాజెడీ క్వీన్

దివంగత ప్రముఖ నటి, ట్రాజెడీ క్వీన్‌గా ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్న మీనా కుమారి జీవితం ఆధారంగా హిందీలో 'కమల్ ఔర్ మీనా' అనే సినిమా రానుంది. ఆల్రెడీ ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన వెల్లడైంది. కానీ ఇంకా పూర్తి స్థాయిలో ఈ సినిమా ప్రారంభం కాలేదు. తొలుత 'కమల్ ఔర్ మీనా' చిత్రానికి మనీష్ మల్హోత్రా దర్శకత్వం వహిస్తారనే టాక్ వినిపించింది. ప్రస్తుతం ఈ మూవీకి దర్శకుడిగా సిద్ధార్థ్. పి మల్హోత్రా ఉన్నారు. అలాగే ఈ 'కమల్ ఔర్ మీనా'లో మీనా కుమారిగా తొలుత కృతీ సనన్ పేరు వినిపించింది. కానీ ఆ తర్వాత కియారా అద్వానీ పేరు తెరపైకి వచ్చింది. అలాగే ఈ చిత్రంలోని దర్శకుడు కమల్ అమ్రోహిగా ఆయుష్మాన్ ఖురానా, రాజ్‌కుమార్ రావు వంటి హీరోల పేర్లు బాలీవుడ్‌లో వినిపిస్తున్నాయట. అయితే ఈ అంశాలపై ఎటువంటి అధికారిక ప్రకటన లేదు. ఇక ఈ ఏడాది జూలైలో కియారా అద్వానీ ఓ పాపకు జన్మనిచ్చారు. దీంతో కియారాకు సెట్స్‌కు వచ్చేందుకు వీలుపడదు. ఇలా ఈ సినిమా చిత్రీకరణ ఆలస్యం అవుతోందట. వచ్చే ఏడాదిలో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కావొచ్చని బాలీవుడ్ సమాచారం. అమ్రోహీ ఫ్యామిలీతో కలిసి సిద్ధార్థ్. పి. మల్హోత్రా, సరిగమా సంస్థలు ఈ సినిమాను నిర్మించనున్నాయి.


ది అన్‌టోల్డ్ స్టోరీ

గ్లామరస్ క్వీన్‌గా వెండితెరపై ఓ వెలుగు వెలిగారు సిల్క్ స్మిత. ఆ తరం స్టార్ హీరోల సినిమాల్లో ఎన్నో స్పెషల్ సాంగ్స్ చేశారు. అయితే సిల్క్ స్మిత జీవితంలో ఎన్నో ఒడిదొడుకులు ఉన్నాయి. జీవితంలో ఎన్నో చేదు అనుభవాలను కూడా ఎదుర్కొన్నారామె. ఎవరూ ఊహించని రీతిలో 1996 సెప్టెంబరు 23న సిల్క్ స్మిత ఆత్మహత్య చేసుకున్నారు. ఆమె జీవితం ఆధారంగా హిందీలో 'డర్టీ పిక్చర్' అనే సినిమా వచ్చింది. విద్యా బాలన్ టైటిల్ రోల్ చేసిన ఈ సినిమా సూపర్ హిట్‌గా నిలిచింది. తాజాగా సిల్క్ స్మిత జీవితం ఆధారంగానే మరో సినిమా రానుంది. 'సిల్క్ స్మిత: ది అన్‌టోల్డ్ స్టోరీ'గా వస్తున్న ఈ పాన్ ఇండియా సినిమాలో సిల్క్ స్మితగా చంద్రికా రవి నటిస్తున్నారు. ఈ మూవీతో జయరామ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ జరుగుతోంది.

ఇలా సినిమా తారల జీవితాల ఆధారంగా రూపొందనున్న మరి కొన్ని బయోపిక్స్ చర్చల దశల్లో ఉన్నాయి.

- ముసిమి శివాంజనేయులు

నీకోసం మారి తీరతాను...


● శ్రద్ధా శ్రీనాథ్, విష్ణు విశాల్

విష్ణు విశాల్ హీరోగా నటించిన ఇన్వెస్టిగేటివ్ క్రైమ్ థ్రిల్లర్ సినిమా 'ఆర్యన్'. శ్రద్ధా శ్రీనాథ్, మానసా చౌదరి, సెల్వ రాఘవన్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. ప్రవీణ్ .కె దర్శకత్వం వహించారు. శుభ్ర, ఆర్యన్ రమేశ్‌లతో కలిసి విష్ణు విశాల్ స్టూడియోస్ పతాకంపై విష్ణు విశాల్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31న విడుదల కానుంది. శ్రేష్ఠ్ మూవీస్ పతాకంపై హీరో నితిన్ తండ్రి, నిర్మాత సుధాకర్ రెడ్డి తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ సినిమా నుంచి 'ఐయామ్ ది గై... ఐయామ్ ది గై ఫర్ యు...' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను ఇటీవల రిలీజ్ చేశారు మేకర్స్. 'ఆవేశం అస్సలాపుకోను... నీ కోసం మారి తీరతాను... సన్యాసం స్వర్గమయ్యే నేడు... నీకేం తెలుసులే..' అన్న లిరిక్స్‌తో ఈ పాట సాగుతుంది. స్వామాట్ ఈ సినిమాకు సాహిత్యం అందించగా, ఈ చిత్రసంగీతదర్శకుడు జిబ్రాన్‌తో కలిసి శ్రీకాంత్ హరిహరన్ పాడారు. సాయి రోనక్, తారక్ పొన్నప్ప, మాల పార్వతి, అవినాష్ ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటించారు.

చిరంజీవి సినిమాలో...


● మాళవిక


● రాశీ ఖన్నా

చిరంజీవి సరసన మాళవికా మోహనన్ నటించనున్నారా? అంటే అవుననే టాక్ వినిపిస్తోంది. 'వాల్తేరు వీరయ్య' (2023) వంటి బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ తర్వాత హీరో చిరంజీవి, దర్శకుడు బాబీ (కేఎస్ రవీంద్ర)ల కాంబినేషన్‌లో ఓ సినిమా రానుంది. కెవిన్ ప్రొడక్షన్ సంస్థ ఈ సినిమాను నిర్మించనుంది. చిరంజీవి కెరీర్‌లోని 158వ సినిమా ఇది. కాగా ఈ చిత్రంలో ఇద్దరు హీరోయిన్స్‌కు చాన్స్ ఉందని, ఒక హీరోయిన్‌గా మాళవికా మోహనన్, మరో హీరోయిన్‌గా రాశీ ఖన్నా నటించనున్నారనే ప్రచారం జరుగుతోంది. గ్యాంగ్‌స్టర్ డ్రామాగా ఈ సినిమా కథనం ఉంటుందని, అతి త్వరలోనే ఈ సినిమా నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలపై ఓ స్పష్టత రానుందని సమాచారం. మరి... చిరంజీవి సరసన రాశీ ఖన్నా, మాళవికాలకు హీరోయిన్లుగా నటించే చాన్స్ లభిస్తుందా? లెట్స్ వెయిట్ అండ్ సీ. మరోవైపు ప్రభాస్ హీరోగా నటిస్తున్న 'ది రాజాసాబ్' సినిమాతో తెలుగు పరిశ్రమకు పరిచయం అవుతున్నారు మాళవికా మోహనన్. ఈ చిత్రంలో నిధీ అగర్వాల్, రిద్ధి కుమార్ కూడా హీరోయిన్లుగా నటిస్తున్నారు. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా జనవరి 9న విడుదల కానుంది.

రూ.6,500 కోట్లతో జీహెచ్‌సీఎల్ విస్తరణ

కచ్‌లో సోడాయాష్ కొత్త ప్లాంట్
- మంజూరైన పర్యావరణ అనుమతులు
- 2030 నాటికి రెట్టింపు కానున్న సామర్థ్యం



న్యూఢిల్లీ: దేశీయంగా సోడాయాష్ తయారీలో రెండో అతిపెద్ద సంస్థగా ఉన్న జీహెచ్‌సీఎల్ రూ.6,500 కోట్లతో గుజరాత్‌లోని కచ్ జిల్లాలో సోడాయాష్ ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. వచ్చే ఆరు నెలల్లో ప్లాంట్ నిర్మాణ కార్యకలాపాలు ప్రారంభమవుతాయని కంపెనీ ఎండీ ఆర్ఎస్ జలాన్ ప్రకటించారు. ఇది పూర్తయితే సోడాయాష్ తయారీ సామర్థ్యం రెట్టింపై 2.3 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తికి చేరుకుంటుందని తెలిపారు. 2030 నాటికి 300 గిగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని సాధించాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి, ఈ ప్లాంట్ ఏర్పాటు కీలక మద్దతుగా నిలవనుంది. సోలార్ గ్లాస్ తయారీలో సోడాయాష్‌ను కీలక ముడి పదార్థంగా వినియోగిస్తుంటారు. ఈ రంగానికి జీహెచ్‌సీఎల్ ముఖ్య సరఫరాదారుగా ఉండడం గమనార్హం. కొత్త ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన భూమిలో అధిక భాగాన్ని కొనుగోలు చేసినట్టు, పర్యావరణ అనుమతులు సహా అన్ని రకాల ప్రక్రియలు పూర్తి చేసినట్టు జలాన్ తెలిపారు. ప్రస్తుతం కంపెనీ సోడాయాష్ తయారీ సామర్థ్యం 1.2 మిలియన్ టన్నులుగా ఉండగా, కొత్తగా ఏర్పాటు చేయనున్న ప్లాంట్‌లో రెండు దశల్లో కలిపి 1.1 మిలియన్ టన్నుల కొత్త సామర్థ్యం తోడుకానుంది.

సోలార్ గ్లాస్ పరిశ్రమ అవసరాలకు..

ముఖ్యంగా సోలార్ గ్లాస్ తయారీ కోసమే రూపొందించిన లార్జ్‌డెన్స్ సోడాయాష్‌ను కొత్త ప్లాంట్‌లో తయారు చేయనున్నట్టు జలాన్ తెలిపారు. ''119 గిగావాట్ల నుంచి 300 గిగావాట్లకు సోలార్ విద్యుదుత్పాదన పెంచుకోవడం అన్నది మాకు పెద్ద మార్కెట్‌ను కల్పించనుంది. గణనీయమైన సామర్థ్యంతో డెన్స్‌ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నాం. కనుక మాకు పెద్ద ఎత్తున అవకాశాలు రానున్నాయి''అని వివరించారు. పర్యావరణ అనుకూలమైన, అధిక ఇంధన సామర్థ్యంతో, అత్యాధునిక సాంకేతికతను ఈ ప్లాంట్ నిర్మాణంలో వినియోగిస్తున్నట్టు తెలిపారు. కంపెనీ వద్ద రూ.1,000 కోట్ల నగదు నిల్వలు ఉన్నాయని.. రుణం, ఈక్విటీ జారీ రూపంలో మిగిలిన నిధులను సమకూర్చుకోనున్నట్టు చెప్పారు. మొత్తం మీద రుణ భారం ఈక్విటీలో 0.6–0.7 రెట్లు మించదన్నారు. ప్రస్తుతం కంపెనీకి ఎలాంటి రుణ భారం లేకపోవడం గమనార్హం. ప్రస్తుతం దేశ అవసరాల్లో 20 శాతం మేర సోడాయాష్‌ను దిగుమతి చేసుకుంటున్న పరిస్థితి నెలకొంది. అంతర్జాతీయంగా సోడాయాష్ తయారీలో చైనా వాటా 45 శాతంగా ఉంది. భారత్‌లోకి చౌకగా సోడాయాష్‌ను పంపిస్తుండడంతో ఇక్కడి పరిశ్రమల మార్జిన్లపై ప్రభావం పడుతోంది. ఈ తరుణంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని జీహెచ్‌సీఎల్ కొత్త ప్లాంట్‌తో ముందుకు వెళుతోంది.

బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్‌లోకి ఓలా ఎలక్ట్రిక్

ఓలా శక్తి ఆవిష్కరణ



న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ తాజాగా బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ విభాగంలోకి ప్రవేశించింది. గృహావసరాల కోసం ఓలా శక్తి పేరుతో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం (బీఈఎస్ఎస్) సొల్యూషన్‌ను ఆవిష్కరించింది. దేశీయంగా విద్యుత్ కొరత లేదని, కాకపోతే నిల్వ చేసుకోవడానికి సంబంధించి సవాళ్లు ఉంటున్నాయని సంస్థ సీఎండీ భవీష్ అగర్వాల్ తెలిపారు. దీన్ని ఒక అవకాశంగా మల్చుకోవచ్చని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ మొబిలిటీ కోసం ప్రపంచ స్థాయి బ్యాటరీ, సెల్ టెక్నాలజీని రూపొందించామని, ఓలా శక్తి దానికి కొనసాగింపని అగర్వాల్ చెప్పారు. అధునాతన 4680 భారత్ సెల్‌ని ఉపయోగించి దీన్ని పూర్తిగా దేశీయంగా తయారు చేసినట్లు వివరించారు. ప్రస్తుతం బీఈఎస్ఎస్ మార్కెట్ రూ. 1 లక్ష కోట్లుగా ఉండగా, 2030 నాటికి రూ. 3 లక్షల కోట్లకు చేరుతుందనే అంచనాలు ఉన్నాయి.

వాహన టోకు విక్రయాలు పెరిగాయ్

కలిసిసొచ్చిన జీఎస్‌టీ సంస్కరణలు
- పండగ సీజన్ కొనుగోళ్ల దన్ను
- సియామ్ గణాంకాల వెల్లడి



న్యూఢిల్లీ: జీఎస్‌టీ సంస్కరణ, పండుగ సీజన్ కలిసిరావడంతో తయారీదార్ల నుంచి డీలర్లకు ప్యాసింజర్ వాహనాలు, ద్విచక్రవాహనాల సరఫరా గణనీయంగా పెరిగాయి. పెరిగిన టోకు విక్రయాలతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరాన్ని సానుకూలంగా ముగించవచ్చనే ఆశాభావంతో వాహన పరిశ్రమ ఉన్నట్లు సియామ్ పేర్కొంది. ''కొత్త జీఎస్‌టీ ధరలు సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి వచ్చినప్పటికీ.., కేవలం తొమ్మిది రోజుల్లోనే ప్యాసింజర్ వాహనాలు, టూ వీలర్స్, త్రీ వీలర్స్ విభాగాలు గతంలో ఎన్నడూ లేనంతగా సెప్టెంబర్‌లో అత్యధిక అమ్మకాలు నమోదు చేశాయి. ప్రభుత్వం జీఎస్‌టీ 2.0 అమల్లోకి తీసుకురావడమనేది ఒక చారిత్రాత్మక నిర్ణయం. ఇది ఆటో పరిశ్రమలో కాకుండా, మొత్తం ఆర్థికవ్యవస్థలో చైతన్యం తీసుకొస్తుంది'' అని సియామ్ అధ్యక్షుడు శైలేష్ చంద్ర తెలిపారు.

- కంపెనీలు సెప్టెంబర్‌లో డీలర్లకు 3,72,458 ప్యాసింజర్ వాహనాలను పంపిణీ చేశాయి. గతేడాది ఇదే నెలలో పంపిణీ 3,56,752 యూనిట్లతో పోలిస్తే ఇవి 4% అధికం.
- ద్విచక్రవాహన విక్రయాలు 7% వృద్ధి చెంది 21,60,889 యూనిట్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇదే నెలలో 20,25,993 టూ వీలర్స్ అమ్ముడయ్యాయి.
- త్రీ చక్రవాహన టోకు అమ్మకాలు 79,683 నుంచి 84,077 యూనిట్లకు పెరిగాయి.

త్రైమాసిక ప్రాతిపదికన....

వార్షిక ప్రాతిపదికన క్యూ2లో 10.39 లక్షల పీవీ అమ్మకాలు అమ్ముడయ్యాయి. టూ వీలర్స్ విక్రయాలు 7% వృద్ధి చెంది 55.62 లక్షల యూనిట్లు అమ్ముడయ్యాయి. త్రి చక్రవాహన విక్రయాలు 10% వృద్ధి చెంది 2,29,239 యూనిట్ల అమ్మకాలు జరిగాయి. ఇదే సెప్టెంబర్ త్రైమాసికంలో 2.4 లక్షల వాణిజ్య వాహన విక్రయాలు జరిగాయి.

సెబీకి డ్యూరోఫ్లెక్స్ ప్రాస్పెక్టస్



న్యూఢిల్లీ: మ్యాట్రెస్‌ల తయారీ సంస్థ డ్యూరోఫ్లెక్స్ తమ పబ్లిక్ ఇష్యూకి సంబంధించిన ముసాయిదా పత్రాలను (డీఆర్‌హెచ్‌పీ) మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి సమర్పించింది. దీని ప్రకారం రూ. 183.6 కోట్ల విలువ చేసే షేర్లను తాజాగా జారీ చేయనుండగా, 2.25 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) కింద ప్రమోటర్లు, ప్రస్తుత ఇన్వెస్టర్లు విక్రయించనున్నారు. తాజా షేర్ల జారీ ద్వారా సమీకరించిన నిధులను కొత్తగా 120 స్టోర్స్ (కంపెనీ ఓన్డ్, కంపెనీ ఆపరేటెడ్ – కోకో) ప్రారంభించేందుకు, ప్రస్తుత స్టోర్స్.. తయారీ ప్లాంటు లీజులు–అద్దెలు చెల్లించేందుకు, మార్కెటింగ్ వ్యయాలు, ఇతరత్రా కార్పొరేట్ అవసరాలకు కంపెనీ వినియోగించుకోనుంది. 1963లో ప్రారంభమైన డ్యూరోఫ్లెక్స్, మార్కెట్ వాటాపరంగా దేశీయంగా టాప్ 3 మ్యాట్రెస్‌ల తయారీ సంస్థల్లో ఒకటిగా ఉంది. డ్యూరోఫ్లెక్స్, స్లీపీహెడ్ బ్రాండ్స్ పేరిట మ్యాట్రెస్‌లు, సోఫాలు, ఇతరత్రా ఫర్నిచర్లు మొదలైనవి విక్రయిస్తోంది. 2025 జూన్ 30 నాటికి దేశవ్యాప్తంగా 73 కోకో స్టోర్స్, 5,500 పైగా జనరల్ ట్రేడ్ స్టోర్స్ ఉన్నాయి. 2023 ఆర్థిక సంవత్సరంలో రూ. 1,057 కోట్లుగా ఉన్న ఆదాయం 2025 ఆర్థిక సంవత్సరంలో రూ. 1,134 కోట్లకు చేరింది.

ఎన్‌ఎండీసీ స్టీల్‌కి బీఐఎస్ లైసెన్సు

రాయ్‌పూర్: భారతీయ నాణ్యతా ప్రమాణాలకు సంబంధించి బీఐఎస్ లైసెన్సు లభించినట్లు ప్రభుత్వ రంగ దిగ్గజం ఎన్‌ఎండీసీ స్టీల్ (ఎన్ఎస్ఎల్) వెల్లడించింది. తద్వారా నిర్దిష్ట విభాగంలో దేశీయంగా ఈ లైసెన్సు పొందిన తొలి కంపెనీగా నిల్చినట్లు తెలిపింది. వరల్డ్ స్టాండర్డ్స్ డే 2025 కార్యక్రమం సందర్భంగా చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి చేతులు మీదుగా ఎన్ఎండీసీ స్టీల్ సీజీఎం అమృత్ నారాయణ్ దీన్ని అందుకున్నట్లు కంపెనీ పేర్కొంది.

డివైజ్ టెస్టింగ్‌కి 'ల్యాబ్ ఇన్ ఎ బాక్స్'

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎంటర్‌ప్రైజ్ డివైజ్ టెస్టింగ్‌కి సంబంధించి 'ఏఐ ఆధారిత ల్యాబ్ ఇన్ ఎ బాక్స్' సొల్యూషన్‌ని ప్రవేశపెట్టినట్లు క్వాలిటీ ఇంజినీరింగ్ సంస్థ క్వాలిజీల్, డివైజ్ ఇన్‌ఫ్రా కంపెనీ పీక్లాడీ వెల్లడించాయి. మరింత మెరుగ్గా, సురక్షితంగా టెస్టింగ్‌ను నిర్వహించేందుకు ఇది ఉపయోగపడుతుందని క్వాలిజీల్ సహ వ్యవస్థాపకుడు మధు మూర్తి తెలిపారు. ఐఓఎస్, ఆండ్రాయిడ్ డివైజ్‌లను కచ్చితత్వంతో పరీక్షించేందుకు ఈ సొల్యూషన్ సహాయకరంగా ఉంటుందని పీక్లాడీ సహ వ్యవస్థాపకుడు అవినాష్ తివారీ వివరించారు. బ్యాంకింగ్, హెల్త్‌కేర్ తదితర రంగాలకు ఇది అనువుగా ఉంటుందని పేర్కొన్నారు.

అమీర్ చంద్ ఐపీవోకు రెడీ

సెబీ నుంచి గ్రీన్‌సిగ్నల్



న్యూఢిల్లీ: బాస్మతి బియ్యం ఎగుమతి సంస్థ అమీర్ చంద్ జగదీష్ కుమార్(ఎక్స్‌పోర్ట్స్) లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఇందుకు తాజాగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇష్యూ ద్వారా హర్యానా కంపెనీ రూ. 550 కోట్లు సమీకరించే ప్రణాళికల్లో ఉంది. ఇందుకు కొత్తగా ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. ఈ ఏడాది జూన్‌లో సెబీకి దరఖాస్తు చేసిన కంపెనీ తాజాగా అనుమతి పొందింది. ఐపీవో నిధులను వర్కింగ్ క్యాపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. ఏరోప్లేన్ బ్రాండు కంపెనీ ప్రధానంగా బాస్మతి బియ్యం ప్రాసెసింగ్‌తో పాటు ఎగుమతులు చేపడుతోంది. దేశీయంగా లిస్టెడ్ కంపెనీలు కేఆర్‌బీఎల్, ఎల్‌టీ ఫుడ్స్‌సహా సర్వేశ్వర్ ఫుడ్స్ తదితరాలతో పోటీ పడుతోంది. 2024 డిసెంబర్‌తో ముగిసిన 9 నెలల కాలంలో రూ. 1,421 కోట్ల ఆదాయం, రూ. 49 కోట్ల నికర లాభం ఆర్జించింది.

రూ.3,900 కోట్లు సమీకరించిన జెప్టో

- రూ.61,600 కోట్లకు కంపెనీ విలువ
- త్వరలో 40 శాతానికి దేశీ ఇన్వెస్టర్ల వాటా



న్యూఢిల్లీ: క్విక్‌కామర్స్ సంస్థ జెప్టో తాజాగా 450 మిలియన్ డాలర్ల (రూ.3,900 కోట్లు సుమారు) నిధులను సమీకరించింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ 7 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఏడాది క్రితం 350 మిలియన్ డాలర్ల నిధుల సమీకరణ నాటికి కంపెనీ మార్కెట్ విలువ 5 బిలియన్ డాలర్లుగా ఉండడం గమనార్హం. అక్కడి నుంచి చూస్తే 40 శాతం పెరిగినట్టు తెలుస్తోంది. తాజా నిధుల సమీకరణంలో అధిక భాగం కొత్త ఈక్విటీ షేర్ల జారీ రూపంలోనే ఉంది. అలాగే తొలినాళ్లలో పెట్టుబడులు పెట్టిన ఇన్వెస్టర్లలో కొందరు స్వల్ప వాటాలను విక్రయించారు. ఈ విడతలో కాల్‌పర్స్ నుంచి ఎక్కువగా పెట్టుబడులు వచ్చాయి. ప్రస్తుతం కంపెనీ ఖాతాల్లో 900 మిలియన్ డాలర్ల మేర నికర నగదు నిల్వలు ఉన్నాయని, భవిష్యత్తు అవసరాలకు పూర్తిగా సరిపోతాయని కంపెనీ సీఈవో, సహ వ్యవస్థాపకుడు ఆదిత్ పలీచా తెలిపారు. త్వరలో పబ్లిక్ ఇష్యూ చేపట్టాలనుకుంటున్న జెప్టోలో ప్రస్తుతం దేశీ ఇన్వెస్టర్ల వాటా 12 శాతంగా ఉండగా, కొన్ని వారాల్లోనే ఇది 40 శాతానికి చేరుకుంటుందని చెప్పారు. క్విక్‌కామర్స్ విభాగంలో బ్లింకిట్, ఇన్‌స్టామార్ట్‌లకు గట్టిపోటీనిస్తున్న జెప్టో పట్ల ప్రైవేటు ఇన్వెస్టర్లలో బలమైన విశ్వాసం కనిపిస్తోంది. రోజువారీ 17 లక్షల ఆర్డర్లను స్వీకరిస్తున్నట్టు.. మెజారిటీ డార్క్‌స్టోర్లు లాభాల్లోకి వస్తున్నట్టు పలీచా తెలిపారు. గతేడాది నిధుల సమీకరణ నాటితో పోల్చితే ఈ విడత మెజారిటీ స్టోర్లు లాభాల్లోకి వచ్చినట్టు చెప్పారు.

విస్తరణపై వ్యయం

తాజాగా సమకూరిన పెట్టుబడులతో బ్యాలన్స్ షీట్‌ను మెరుగ్గా నిర్వహించగలమని, మోస్తరు విస్తరణకు వ్యయం చేయొచ్చని పలీచా చెప్పారు. ఒక వైపు కార్యకలాపాలను విస్తరిస్తూనే, లాభాల్లోకి రావడంపై దృష్టి సారించినట్టు పేర్కొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

17-10-2025

విశాఖ	545–00
చిత్తూరు	573–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	550–00
విజయవాడ	560–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	525–00
వరంగల్	527–00
రిటైల్ ధర	5.85

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
NESTLEIND	1,279.50	4.76
TATACONSUM	1,148.70	3.1
TITAN	3,636.00	2.45
AXISBANK	1,195.90	2.25
KOTAKBANK	2,195.00	2.11

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ETERNAL	340.5	-3.91
HDFCLIFE	743	-2.38
SHRIRAMFIN	673.5	-0.54
INFY	1,470.90	-0.24
JIOFIN	312.1	-0.18

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	10,791
ఎన్ఎస్ఈ	1,11,717
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,75,453
ఎఫ్ఐఐ	+ 997
డీఐఐ	+ 4076

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	57.53	$ 58.27
బ్రెంట్	61.85	$ 61.91

క్యూ2 ఫలితాలు

నెస్లే ఇండియా లాభం డౌన్ ‣ రూ. 743 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో ఎఫ్ఎంసీజీ దిగ్గజం నెస్లే ఇండియా ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 17 శాతం క్షీణించి రూ. 743 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2024–25) ఇదే కాలంలో మ్యాగీ, నెస్‌కేఫ్, కిట్‌కాట్ బ్రాండ్ల దిగ్గజం రూ. 900 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 11 శాతం బలపడి రూ. 5,630 కోట్లను దాటింది. గతేడాది క్యూ2లో రూ. 5,075 కోట్ల టర్నోవర్ అందుకుంది. మొత్తం వ్యయాలు 13 శాతం పెరిగి రూ. 4,617 కోట్లకు చేరాయి. దేశీ ఆదాయం 11 శాతం ఎగసి రూ. 5,411 కోట్లను తాకగా.. ఎగుమతులు 14 శాతం పుంజుకుని రూ. 219 కోట్లకు చేరినట్లు కంపెనీ చైర్మన్, ఎండీ మనీష్ తివారీ పేర్కొన్నారు.

బీఎస్ఈలో నెస్లే ఇండియా షేరు 4.5 శాతం జంప్ చేసి రూ. 1,277 వద్ద ముగిసింది.

ఇండియన్ బ్యాంక్ లాభం ప్లస్ ‣ రూ. 3,018 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం ఇండియన్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో స్టాండెలోన్ నికర లాభం 12 శాతం ఎగసి రూ. 3,018 కోట్లను తాకింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 2,706 కోట్లు ఆర్జించింది. వడ్డీ ఆదాయం 7 శాతం వృద్ధితో రూ. 11,964 కోట్లకు చేరింది. గత క్యూ2లో రూ. 11,125 కోట్ల వడ్డీ ఆదాయం అందుకుంది. మొండి రుణాలకు ప్రొవిజన్లు రూ. 1,099 కోట్ల నుంచి రూ. 739 కోట్లకు తగ్గాయి. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 3.48%ం నుంచి 2.6 శాతానికి తగ్గాయి.

ఫలితాల నేపథ్యంలో ఇండియన్ బ్యాంక్ షేరు బీఎస్ఈలో 0.5% క్షీణించి రూ. 772 వద్ద ముగిసింది.

ఐవోబీ లాభం హైజంప్ ‣ రూ. 1,226 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్(ఐవోబీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) రెండో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 58 శాతం జంప్‌చేసి రూ. 1,226 కోట్లను తాకింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 777 కోట్లు మాత్రమే ఆర్జించింది. వడ్డీ ఆదాయం 16 శాతం ఎగసి రూ. 5,856 కోట్లకు చేరింది. గత క్యూ2లో రూ. 5,055 కోట్ల వడ్డీ ఆదాయం సాధించింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 2.72 శాతం నుంచి 1.83 శాతానికి తగ్గాయి.

ఫలితాల నేపథ్యంలో ఐవోబీ షేరు బీఎస్ఈలో 1.2 శాతం నష్టంతో రూ. 40 వద్ద ముగిసింది

ఎల్‌టీఐ మైండ్‌ట్రీ లాభం 10 శాతం అప్



న్యూఢిల్లీ: ఐటీ సంస్థ ఎల్‌టీఐ మైండ్‌ట్రీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ. 1,381 కోట్ల లాభం (కన్సాలిడేటెడ్) ప్రకటించింది. గత క్యూ2లో నమోదైన రూ. 1,251 కోట్లతో పోలిస్తే 10 శాతం వృద్ధి సాధించింది. సమీక్షాకాలంలో ఆదాయం రూ. 9,433 కోట్లతో పోలిస్తే రూ. 10,394కు పెరిగింది. కంపెనీ ఆదాయం ఒక క్వార్టర్‌లో రూ. 10,000 కోట్ల మైలురాయిని అధిగమించడం ఇదే ప్రథమం. రెండో త్రైమాసికంలో అన్ని విభాగాలు మెరుగ్గా రాణించాయని సంస్థ సీఈవో వేణు లాంబు తెలిపారు. 6.5 శాతం వృద్ధితో బీఎఫ్ఎస్ఐ విభాగం మొత్తం ఆదాయంలో 36.2 శాతం వాటా నమోదు చేసిందని పేర్కొన్నారు. మొత్తం ఆదాయంలో ఉత్తర అమెరికా మార్కెట్ వాటా 74.2 శాతంగా నమోదైంది. యూరప్ వాటా 14.7 శాతంగా ఉంది.

సైయెంట్ డివిడెండ్ రూ. 16



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో ఇంజినీరింగ్, టెక్నాలజీ సేవల సంస్థ సైయెంట్ ఆదాయం రూ. రూ. 1,781 కోట్లుగా (కన్సాలిడేటెడ్) నమోదైంది. క్రితం క్యూ2లో ఇది రూ. 1,849 కోట్లు. ఇక లాభం రూ. 179 కోట్ల నుంచి రూ. 127.5 కోట్లకు తగ్గింది. కంపెనీ ఒక్కో షేరుపై రూ. 16 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. స్థూల ఆర్థిక పరిస్థితులు, రాజకీయభౌగోళిక అంశాలపరంగా సవాళ్లు నెలకొన్నప్పటికీ అంచనాలకు అనుగుణంగా ఫలితాలు రాబట్టడం ద్వారా నిలకడగా వృద్ధి సాధించినట్లు సైయెంట్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ కృష్ణ బోదనపు తెలిపారు. సైయెంట్ సెమీకండక్టర్స్ పటిష్టంగా పుంజుకుని 12 శాతం వృద్ధి నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కీలకమైన డిజిటల్, ఇంజినీరింగ్, టెక్నాలజీ (డీఈటీ) విభాగాల ఆదాయం వార్షికంగా 4.5 శాతం పెరిగి రూ. 1,438 కోట్లకు చేరినట్లు చెప్పారు. సమీక్షాకాలంలో కొత్తగా ఏడు కస్టమర్లను దక్కించుకున్నట్లు కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుకమల్ బెనర్జీ చెప్పారు.

బీఎస్ఈలో గురువారం సైయెంట్ షేరు సుమారు 5 శాతం పెరిగి రూ. 1,180 వద్ద క్లోజయ్యింది.

జీల్ లాభం క్షీణత ‣ రూ. 77 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో జీ ఎంటర్‌టైన్‌మెంట్(జీల్) నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 63 శాతం క్షీణించి రూ. 77 కోట్లకు పరిమితమైంది. కంటెంట్‌పై పెట్టుబడులు ప్రభావం చూపాయి. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 209 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం 2 శాతం బలహీనపడి రూ. 1,996 కోట్లకు చేరింది. గతేడాది క్యూ2లో రూ. 2,034 కోట్ల టర్నోవర్ అందుకుంది. మొత్తం వ్యయాలు 7 శాతం పెరిగి రూ. 1,880 కోట్లను దాటాయి. ప్రకటనల ఆదాయం 11 శాతం నీరసించి రూ. 806 కోట్లకు చేరగా.. సబ్‌స్క్రిప్షన్ విభాగం 5 శాతం పుంజుకుని రూ. 1,023 కోట్లను తాకింది. ఓటీటీ ప్లాట్‌ఫామ్ జీ5 ఒక త్రైమాసికంలో అత్యధికంగా రూ. 300 కోట్ల ఆదాయం(రికార్డ్) అందుకోవడం గమనార్హం!

బీఎస్ఈలో జీల్ షేరు 0.5 శాతం నీరసించి రూ. 109 వద్ద ముగిసింది.

సౌత్ ఇండియన్ బ్యాంక్ లాభం అప్ ‣ రూ. 351 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ సంస్థ సౌత్ ఇండియన్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో స్టాండెలోన్ నికర లాభం 8 శాతం ఎగసి రూ. 351 కోట్లను తాకింది. ప్రొవిజన్లు తగ్గడం లాభించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 325 కోట్లు ఆర్జించింది. నికర వడ్డీ ఆదాయం 8 శాతం క్షీణతతో రూ. 808 కోట్లకు పరిమితమైంది. నికర వడ్డీ మార్జిన్లు 3.24 శాతం నుంచి 2.8 శాతానికి బలహీనపడ్డాయి. వడ్డీయేతర ఆదాయం 26 శాతం ఎగసి రూ. 516 కోట్లకు చేరింది. ప్రొవిజన్లు, కంటింజెన్సీలు 43 శాతం క్షీణించి రూ. 63 కోట్లను తాకాయి. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 4.4 శాతం నుంచి 2.93 శాతానికి తగ్గాయి. బ్రాంచీల సంఖ్య 948కు చేరింది.

ఫలితాల నేపథ్యంలో సౌత్ ఇండియన్ బ్యాంక్ షేరు బీఎస్ఈలో 0.4 శాతం లాభంతో రూ. 33 వద్ద ముగిసింది.

ఎటర్నల్ లాభం రూ.65 కోట్లు ‣ రూ.13,590 కోట్లు



న్యూఢిల్లీ: ఫుడ్ డెలివరీ, క్విక్ కామర్స్ దిగ్గజం ఎటర్నల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో రూ. 65 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ఆర్జించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 176 కోట్లు ఆర్జించింది. అయితే జొమాటో, బ్లింకిట్ బ్రాండ్ల కంపెనీ ఫలితాలు పోల్చతగదని కంపెనీ పేర్కొంది. పేటీఎమ్ మాతృ సంస్థ వన్97 కమ్యూనికేషన్స్ నుంచి ఆర్బ్‌జెన్ టెక్నాలజీస్(మూవీ టికెటింగ్), వేస్ట్‌ల్యాండ్ ఎంటర్‌టైన్‌మెంట్(ఈవెంట్స్) బిజినెస్‌ల కొనుగోలు 2024 ఆగస్ట్‌లో పూర్తికావడాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించింది. కాగా.. మొత్తం ఆదాయం రూ. 4,799 కోట్ల నుంచి రూ. 13,590 కోట్లకు జంప్‌చేసింది. మొత్తం వ్యయాలు సైతం రూ. 4,783 కోట్ల నుంచి రూ. 13,813 కోట్లకు పెరిగాయి. క్విక్‌కామర్స్ నుంచి నికర ఆర్డర్ విలువ 137 శాతం దూసుకెళ్లి రూ. 11,679 కోట్లను తాకడం ఆదాయంలో వృద్ధికి సహకరించింది. దీంతో ఈ విభాగం నుంచి 756 శాతం అధికంగా రూ. 9,891 కోట్లు సమకూరింది. అయితే హైపర్‌ప్యూర్ ఆదాయం 55 శాతం క్షీణించి రూ. 1,023 కోట్లకు పరిమితమైంది.

ఫలితాల నేపథ్యంలో ఎటర్నల్ షేరు బీఎస్ఈలో 1.7 శాతం క్షీణించి రూ. 348 వద్ద ముగిసింది.

రజత్ పాటీదార్ సూపర్ సెంచరీ

● వెంకటేశ్ అయ్యర్ అర్ధశతకం
మధ్యప్రదేశ్ 305/6 ● పంజాబ్‌తో రంజీ మ్యాచ్



ఇండోర్: టీమిండియా బ్యాటర్ రజత్ పాటీదార్ (185 బంతుల్లో 107 బ్యాటింగ్; 12 ఫోర్లు) సూపర్ సెంచరీతో చెలరేగాడు. ఫలితంగా పంజాబ్‌తో జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో మధ్యప్రదేశ్ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది. ఎలైట్ గ్రూప్ 'బి'లో భాగంగా జరుగుతున్న పోరులో పంజాబ్ తొలి ఇన్నింగ్స్‌లో 232 పరుగులకు ఆలౌట్ కాగా... రెండో రోజు గురువారం ఆట ముగిసే సమయానికి మధ్యప్రదేశ్ 93 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 305 పరుగులు చేసింది. రజత్ పాటీదార్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకోగా... భారత ఆల్‌రౌండర్ వెంకటేశ్ అయ్యర్ (114 బంతుల్లో 73; 7 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీతో మెరిశాడు. హిమాన్షు మంత్రి (40; 5 ఫోర్లు, 1 సిక్స్), శుభమ్ శర్మ (41; 4 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. 155 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన దశలో వెంకటేశ్ అయ్యర్‌తో కలిసి రజత్ పాటీదార్ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. ఈ జంట ఆరో వికెట్‌కు 147 పరుగులు జోడించింది. ఈ క్రమంలో మధ్యప్రదేశ్ జట్టు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది. పంజాబ్ బౌలర్లలో నమన్ ధిర్, ప్రేరిత్ దత్తా చెరో 3 వికెట్లు పడగొట్టారు. చేతిలో 4 వికెట్లు ఉన్న మధ్యప్రదేశ్ జట్టు 73 పరుగుల ఆధిక్యంలో ఉంది. పాటీదార్‌తో పాటు సారాన్ష్ జైన్ (2 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.

తమిళనాడు బ్యాటర్ల వైఫల్యం

మరోవైపు కోయంబత్తూర్ వేదికగా జార్ఖండ్‌తో జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో తమిళనాడు టాపార్డర్ విఫలమైంది. ఎలైట్ గ్రూప్ 'ఎ'లో భాగంగా జరుగుతున్న పోరులో ఓవర్‌నైట్ స్కోరు 307/6తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన జార్ఖండ్... చివరకు 419 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ ఇషాన్ కిషన్ (247 బంతుల్లో 173; 15 ఫోర్లు, 6 సిక్స్‌లు) భారీ సెంచరీతో చెలరేగగా... సాహిల్ రాజ్ (183 బంతుల్లో 77; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) హాఫ్‌సెంచరీతో రాణించాడు. తమిళనాడు బౌలర్లలో గుర్‌జప్‌నీత్ సింగ్ 4 వికెట్లు తీశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన తమిళనాడు... గురువారం ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 11 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 18 పరుగులు చేసింది. కెప్టెన్ నారాయణ్ జగదీశన్ (3), బాలసుబ్రహ్మణ్యం సచిన్ (0), ప్రదోశ్ రంజన్ పాల్ (9), ఆంద్రె సిద్ధర్థ్ (2), బాబా ఇంద్రజిత్ (0) విఫలమయ్యారు. జార్ఖండ్ బౌలర్లు సాహిల్ రాజ్ (2/8), జతిన్ పాండే (3/10) ధాటికి తమిళనాడు బ్యాటర్లు నిలవలేకపోయారు. ఒకరి తర్వాత ఒకరు పెవిలియన్‌కు క్యూ కట్టారు. చేతిలో 5 వికెట్లు ఉన్న తమిళనాడు... ప్రత్యర్థి స్కోరుకు ఇంకా 401 పరుగులు వెనుకబడి ఉంది. షారుఖ్ ఖాన్ (4 బ్యాటింగ్), అంబరీశ్ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

విదర్భ 463 ఆలౌట్

డిఫెండింగ్ చాంపియన్ విదర్భ జట్టు నాగాలాండ్‌తో మ్యాచ్‌లో భారీ స్కోరు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 302/3తో గురువారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ 130.2 ఓవర్లలో 463 పరుగులకు ఆలౌటైంది. అమన్ మొఖడే (308 బంతుల్లో 183; 19 ఫోర్లు) భారీ సెంచరీ సాధించగా... యశ్ రాథోడ్ (71; 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకంతో రాణించాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన నాగాలాండ్ 41 ఓవర్లలో 3 వికెట్లకు 81 పరుగులు చేసింది. డేగ నిశ్చల్ (32 బ్యాటింగ్; 2 ఫోర్లు), చేతన్ బిస్త్ (26 బ్యాటింగ్; 3 ఫోర్లు, 1 సిక్స్) పోరాడుతున్నారు. చేతిలో 7 వికెట్లు ఉన్న నాగాలాండ్ ప్రత్యర్థి స్కోరుకు ఇంకా 382 పరుగులు వెనుకబడి ఉంది.

రుతురాజ్ పోరాటం

టాపార్డర్ విఫలమైన చోట రుతురాజ్ గైక్వాడ్ (151 బంతుల్లో 91; 11 ఫోర్లు) విలువైన ఇన్నింగ్స్ ఆడటంతో... మహారాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 84.1 ఓవర్లలో 239 పరుగులకు ఆలౌటైంది. కేరళ బౌలర్ల ధాటికి ఒక దశలో 18/5తో నిలిచిన మహారాష్ట్ర ఆ తర్వాత లోయర్ ఆర్డర్ పోరాటంతో తేరుకుంది. జలజ్ సక్సేనా (49; 4 ఫోర్లు), వికీ ఓస్త్వాల్ (38), రామకృష్ణ ఘోష్ (31) ఆకట్టుకున్నారు. కేరళ బౌలర్లలో నిధీశ్ 5 వికెట్లతో సత్తాచాటాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన కేరళ జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 10.4 ఓవర్లలో 3 వికెట్లకు 35 పరుగులు చేసింది. చేతిలో 7 వికెట్లు ఉన్న కేరళ... ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 204 పరుగులు వెనుకబడి ఉంది.

అభినవ్, లలిత్ డబుల్ సెంచరీలు

చండీగఢ్‌తో జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో గోవా బ్యాటర్లు పరుగుల పండగ చేసుకున్నారు. ఓవర్‌నైట్ స్కోరు 291/3తో గురువారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన గోవా... చివరకు 160.4 ఓవర్లలో 566 పరుగులకు ఆలౌటైంది. అభినవ్ తేజ్‌రాణా (320 బంతుల్లో 205; 21 ఫోర్లు, 4 సిక్స్‌లు), లలిత్ యాదవ్ (393 బంతుల్లో 213; 22 ఫోర్లు, 4 సిక్స్‌లు) ద్విశతకాలతో మెరిశారు. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్ టెండూల్కర్ (1) ఆకట్టుకోలేకపోయాడు. చండీగఢ్ బౌలర్లలో విషు కశ్యప్ 7 వికెట్లు తీశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన చండీగఢ్ ఆట ముగిసే సమయానికి 8 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 34 పరుగులు చేసింది. శివమ్ బాంబ్రీ (2) అవుట్ కాగా... అర్జున్ ఆజాద్ (21 బ్యాటింగ్), కెప్టెన్ మనన్ వొహ్రా (11 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. అర్జున్ టెండూల్కర్ ఒక వికెట్ తీశాడు.

విహారి విఫలం

భారత టెస్టు జట్టులో తిరిగి చోటు దక్కించుకోవాలనుకుంటున్న హనుమ విహారి... రంజీ ట్రోఫీలో నిరాశ పరిచాడు. ఈ సీజన్‌కు ముందు త్రిపుర జట్టుకు మారిన అతడు... తొలి ఇన్నింగ్స్‌లో 16 పరుగుల స్వల్ప స్కోరుకే వెనుదిరిగాడు. ఢిల్లీ వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో సర్వీసెస్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 359 పరుగులకు ఆలౌట్ కాగా... అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన త్రిపుర గురువారం ఆట ముగిసే సమయానికి 34 ఓవర్లలో 4 వికెట్లకు 56 పరుగులు చేసింది. హనుమ విహారి 56 బంతులు ఎదుర్కొని 16 పరుగులు చేసి వెనుదిరిగాడు. భారత ఆటగాడు విజయ్ శంకర్ (10 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.

- ముంబైతో జరుగుతున్న మ్యాచ్‌లో జమ్మూకశ్మీర్ కెప్టెన్ పారస్ డోగ్రా (169 బంతుల్లో 112 బ్యాటింగ్) అజేయ శతకంతో రాణించాడు.
- అరుణాచల్ ప్రదేశ్‌తో పోరులో బిహార్ బ్యాటర్ ఆయుశ్ లహరుకా (247 బంతుల్లో 226; 37 ఫోర్లు, 1 సిక్స్) డబుల్ సెంచరీతో కదంతొక్కాడు.

పోరాడి ఓడిన రిత్విక్ జోడీ



సాక్షి, హైదరాబాద్: అల్మాటీ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత డేవిస్‌కప్ జట్టు సభ్యుడు, హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీకి నిరాశ ఎదురైంది. కజకిస్తాన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల డబుల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ రిత్విక్ చౌదరీ-అర్జున్ ఖడే (భారత్) జోడీ తొలి రౌండ్‌లోనే వెనుదిరిగింది. మూడో సీడ్ జాకబ్ ష్నయిటర్-మార్క్ వాల్నర్ (జర్మనీ) జంటతో జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో రిత్విక్-అర్జున్ జోడీ 7-6 (7/2), 6-7 (11/13), 6-10తో 'సూపర్ టైబ్రేక్'లో పోరాడి ఓడిపోయింది. ఒక గంట 55 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రిత్విక్-అర్జున్ రెండు ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. మ్యాచ్ మొత్తంలో రెండు జోడీలు తమ సర్వీస్‌లను నిలబెట్టుకోవడం విశేషం. అయితే 'సూపర్ టైబ్రేక్'లో జర్మనీ జోడీ పైచేయి సాధించి విజయాన్ని అందుకుంది. తొలి రౌండ్‌లో ఓడిన రిత్విక్-అర్జున్ జంటకు 5,740 (రూ. 5 లక్షలు) డాలర్ల ప్రైజ్‌మనీ లభించింది. ఈ ఓటమితో రిత్విక్ సోమవారం విడుదలయ్యే ఏటీపీ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో 12 స్థానాలు పడిపోయి 70 నుంచి 82వ ర్యాంక్‌కు చేరుతాడు.

చాంపియన్ స్విమ్మర్... 25 ఏళ్లకే రిటైర్మెంట్

ఆస్ట్రేలియా ఒలింపిక్ చాంప్ టిట్మస్ ఆకస్మిక నిర్ణయం



బ్రిస్బేన్: అరిన్ ఎలిజబెత్ టిట్మస్ ఆస్ట్రేలియన్ స్విమ్మర్. అలాంటి... ఇలాంటి... స్విమ్మర్ కాదు. చాంపియన్... ఆహా... అంతకుమించే! ఈ అమ్మడు వయసు 25... పతకాల సంఖ్య బోలెడు. ఒలింపిక్స్, ప్రపంచ చాంపియన్‌షిప్, కామన్వెల్త్ గేమ్స్‌లాంటి ప్రతిష్టాత్మక క్రీడల్లో 32 పతకాలు. ఇందులో స్వర్ణాలే 18 అంటే... చాంపియన్ కాదు అంతకుమించి అనడంలో అతిశయోక్తి ఉండదేమో!



మెకింటోష్ (ఎడమ), లెడెకీ (కుడి)లతో టిట్మస్

మరో మెగా ఈవెంట్ లాస్ ఏంజెలిస్-2028 ఒలింపిక్స్‌కు సన్నద్ధమవుతుందనుకుంటే... ఆశ్చర్యకరంగా రిటైర్మెంట్ ప్రకటించింది. తన బంగారు క్రీడా భవిష్యత్తును పాతికేళ్లకే ముగించింది. గురువారం తన ఇన్‌స్టాగామ్‌లో వీడియో సందేశంతో ఫాలోవర్లతో పాటు అభిమానుల్ని విస్మయపరిచింది. 'నేనెప్పటికీ స్విమ్మింగ్‌నే ప్రేమిస్తాను. చిన్నప్పటి నుంచే అదే నా లోకం. అయితే అదే మొత్తం జీవితం కాదని ఇప్పుడిప్పుడే అర్థమవుతోంది. నా జీవితంలో స్విమ్మింగ్ కంటే ప్రధానమైనవి కూడా ఉన్నాయని ఈ మధ్యే గ్రహించాను. అందుకే ఇక చాలనుకుంటున్నా. ఇక్కడితోనే ఆటకు గుడ్‌బై చెప్పాలనుకుంటున్నా' అని ఆస్ట్రేలియన్ స్టార్ స్విమ్మర్ వీడియోను పోస్ట్ చేసింది. గతేడాది జరిగిన పారిస్ ఒలింపిక్స్‌లో అమెరికా గ్రేట్ కేటీ లెడెకీ, కెనడా స్టార్ సమ్మర్ మెకింటోష్‌లను వెనక్కి నెట్టి మరీ టిట్మస్ 400 మీటర్ల ఫ్రీస్టయిల్ టైటిల్‌ను నిలబెట్టుకుంది. ఈ ముగ్గురు కూడా దిగ్గజ స్విమ్మర్లు. అంతర్జాతీయ పోటీల్లో రికార్డులు నెలకొల్పినవారే కావడంతో పారిస్ ఈవెంట్‌లో గెలుపెవరిదనే అంచనాలు ఆకాశన్నంటాయి. చివరకు అరిన్ టిట్మసే 'బంగారు చేప'గా నిలిచింది. తన రిటైర్మెంట్ సందేశంలోనూ ఈ పోటీనే తన ఫేవరెట్ ఈవెంట్‌గా పేర్కొంది. హేమాహేమీలతో దీటైన పోటీని ఆస్వాదించినట్లు చెప్పింది. పారిస్ ఈవెంట్‌కు ముందు, ఆ తర్వాత కొన్ని ఆరోగ్య సమస్యల్ని సైతం ఎదుర్కొన్నట్లు అరిన్ చెప్పింది. 2023లో కూడా ఆమెకు శస్త్రచికిత్స చేసి ట్యూమర్లు తొలగించారు. అయితే ఏడాదిలోపే ఈ 'ఆపరేషన్'ను అధిగమించి పతకాల ఆపరేషన్‌ను విజయవంతం చేసుకుంది. తన 25 ఏళ్ల జీవితంలో 18 ఏళ్లు కొలనులోనే గడిచిందని ఆమె చెప్పుకొచ్చింది.

అరిన్ ఘనతలివే...

తొమ్మిదేళ్ల క్రితం అంటే 16 ఏళ్ల ప్రాయంలోనే అరిన్ టిట్మస్ అంతర్జాతీయ పతకాల వేట మొదలైంది. 2016లో మాయిలో జరిగిన జూనియర్ పాన్ పసిఫిక్ చాంపియన్‌షిప్‌లో ఆమె రజతం, కాంస్యం నెగ్గింది. ఇక సీనియర్ కేటగిరీలో అయితే బంగారు పతకాల మోతే మోగించింది. 200 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్లు, ఫ్రీస్టయిల్, 4x200 మీటర్ల రిలే ఈవెంట్లలో 2018, 2022 కామన్వెల్త్ క్రీడల్లో స్వర్ణాలు నిలబెట్టుకుంది. హాంగ్జౌ (2018), గ్వాంగ్‌జు (2019) ప్రపంచ చాంపియన్‌షిప్‌లలోనూ టైటిల్స్‌ను నిలబెట్టుకుంది. టోక్యో ఒలింపిక్స్‌తో విశ్వక్రీడల బరిలో దిగిన ఆమె 200 మీటర్లు, 400 మీటర్ల విభాగాల్లో బంగారు పతకాలు గెలిచిన ఆమె పారిస్‌లో నిలబెట్టుకుంది.

అభిషేక్, స్మృతికి ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డులు





దుబాయ్: ఆసియా కప్ టి20 టోర్నమెంట్‌లో విజృంభించిన భారత పురుషుల క్రికెట్ జట్టు ఓపెనర్ అభిషేక్ శర్మ... మహిళల వన్డే ప్రపంచకప్‌లో సత్తా చాటుతోన్న టీమిండియా ఓపెనర్ స్మృతి మంధాన సెప్టెంబర్ నెలకు గానూ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డులు దక్కించుకున్నారు. గత నెలలో అభిషేక్ ఆడిన ఏడు మ్యాచ్‌ల్లో 44.85 సగటు, 200 స్ట్రయిక్ రేట్‌తో 314 పరుగులు చేశాడు. ఈ అవార్డు కోసం అభిషేక్‌తో పాటు టీమిండియా స్పిన్నర్ కుల్దీప్ యాదవ్, జింబాబ్వే ప్లేయర్ బ్రియాన్ బెనెట్ పోటీపడగా... భారత ఓపెనర్‌నే పురస్కారం వరించింది. 'ఐసీసీ అవార్డు దక్కడం చాలా ఆనందంగా ఉంది. అది కూడా ముఖ్యమైన టోర్నీలో మెరుగైన ప్రదర్శన చేసినప్పుడు లభించడం మరింత సంతోషం. అత్యంత క్లిష్ట పరిస్థితుల నుంచి విజయాలు సాధించగల జట్టులో భాగం కావడం గర్వంగా ఉంది. టి20 ఫార్మాట్‌లో మా విజయ పరంపర అత్యుత్తమ జట్టు సంస్కృతిని ప్రతిబింబిస్తుంది' అని అభిషేక్ అన్నాడు. మరోవైపు స్మృతి మంధాన మహిళల వన్డే వరల్డ్ కప్‌నకు ముందు సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో అదరగొట్టింది. మూడు మ్యాచ్‌ల్లో వరుసగా 58, 117, 125 పరుగులు చేసింది. ఓవరాల్‌గా గత నెలలో స్మృతి 77 సగటు, 135.68 స్ట్రయిక్‌రేట్‌తో 308 పరుగులు చేసింది. దక్షిణాఫ్రికా ప్లేయర్ తజ్మిన్ బ్రిట్స్, పాకిస్తాన్ ప్లేయర్ సిద్రా అమీన్‌తో పోటీపడి స్మృతి ఈ అవార్డు దక్కించుకుంది. 'ఇలాంటి పురస్కారాలు ప్లేయర్ ఎదుగుదలకు తోడ్పడుతాయి. అత్యుత్తమ ప్రదర్శన చేస్తూ... జట్టుకు వీలైనన్ని ఎక్కువ మ్యాచ్‌లు గెలిపించడమే నా లక్ష్యం' అని స్మృతి మంధాన పేర్కొంది.

వచ్చే నెలలో 'ఖేలో ఇండియా' వర్సిటీ క్రీడలు

న్యూఢిల్లీ: వచ్చే నెలలో ఖేలో ఇండియా యూనివర్సిటీ క్రీడలు (కేఐయూజీ) నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాజస్తాన్‌లోని ఏడు నగరాల్లో నవంబర్ 24 నుంచి డిసెంబర్ 5 వరకు ఈ పోటీలు జరుగుతాయి. కేఐయూజీ ప్రోగ్రామ్‌లో భాగంగా తొలిసారిగా బీచ్ వాలీబాల్, కనోయింగ్-కయాకింగ్, సైక్లింగ్, ఖో-ఖో పోటీలను కూడా చేర్చినట్లు నిర్వాహకులు తెలిపారు. 23 మెడల్ ఈవెంట్లు కాగా, ఖో-ఖోను ప్రదర్శక క్రీడగా నిర్వహిస్తారు. బిహార్‌లో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహించినట్లే... వర్సిటీ క్రీడలను కూడా ఒకే చోట కాకుండా రాజస్తాన్‌లోని జైపూర్, అజ్మీర్, ఉదయ్‌పూర్, జోధ్‌పూర్, బికనీర్, కోటా, భరత్‌పూర్‌లలో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 12 రోజుల పాటు జరిగే ఈ వర్సిటీ ఈవెంట్‌లో ఐదు వేలకు పైగా కళాశాల అథ్లెట్లు పాల్గొనే అవకాశముంది. భారత్‌ను క్రీడా శక్తిగా మలిచే బృహత్తర కార్యక్రమంలో ఖేలో ఇండియా వర్సిటీ క్రీడలు కీలకపాత్ర పోషిస్తాయని కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ స్థాయి అథ్లెట్లను తీర్చిదిద్దే సువర్ణాధ్యాయం కళాశాల స్థాయిలో మొదలవుతుందని, ఈ కేఐయూజీ ప్రోగ్రామ్‌లో యువ అథ్లెట్లు జాతీయ స్థాయిలో తమ సత్తా నిరూపించుకునేందుకు సరైన వేదిక అని ఆయన అన్నారు.

ఆఖరి బెర్త్ యూఏఈదే

2026 టి20 ప్రపంచకప్ టోర్నీకి అర్హత



దుబాయ్: వచ్చే ఏడాది జరగనున్న అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) టి20 ప్రపంచకప్ టోర్నీకి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఏఈ) జట్టు అర్హత సాధించింది. ఆసియా క్వాలిఫయర్స్ 'సూపర్ సిక్స్'లో మూడో విజయం సాధించడం ద్వారా యూఏఈ ముందంజ వేసింది. గురువారం జరిగిన పోరులో యూఏఈ జట్టు 8 వికెట్ల తేడాతో జపాన్‌ను చిత్తు చేసి వరల్డ్‌కప్ బెర్త్ దక్కించుకుంది. ఈ క్వాలిఫయర్స్ నుంచి ఇప్పటికే నేపాల్, ఒమన్ అర్హత సాధించగా... ఇప్పుడు యూఏఈ రూపంలో మూడో టీమ్ ముందడుగు వేసింది. దీంతో 2026లో భారత్, శ్రీలంక వేదికగా జరగనున్న టి20 వరల్డ్‌కప్‌లో పాల్గొనే 20 జట్లు ఖరారైనట్లు అయింది. ఆతిథ్య హోదాలో భారత్, శ్రీలంక ప్రపంచకప్ ఆడనుండగా... 2024 వరల్డ్ కప్ ప్రదర్శన ఆధారంగా అఫ్గానిస్తాన్, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, అమెరికా, వెస్టిండీస్ ముందంజ వేశాయి. ఐర్లాండ్, న్యూజిలాండ్, పాకిస్తాన్ జట్లు ర్యాంకింగ్స్ ఆధారంగా మెగా టోర్నీకి అర్హత సాధించాయి. అమెరికా క్వాలిఫయర్స్ ద్వారా కెనడా... యూరప్ క్వాలిఫయర్స్ ద్వారా ఇటలీ, నెదర్లాండ్స్.. ఆఫ్రికా క్వాలిఫయర్స్ నుంచి నమీబియా, జింబాబ్వే... ఆసియా క్వాలిఫయర్స్ నుంచి నేపాల్, ఒమన్, యుఏఈ వరల్డ్ కప్ బెర్త్‌లు దక్కించుకున్నాయి.

మళ్లీ ఓడిన తెలుగు టైటాన్స్



న్యూఢిల్లీ: ప్లేఆఫ్స్ రేసులో ఉన్న తెలుగు టైటాన్స్‌కు వరుస పరాజయాలు కుంగదీస్తున్నాయి. టైబ్రేక్‌కు దారితీసిన గత మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ చేతిలో ఓడిన తెలుగు టైటాన్స్ గురువారం జరిగిన పోరులో యు ముంబా చేతిలో 26-33తో పరాజయం పాలైంది. టైటాన్స్ జట్టులో ఆల్‌రౌండర్, కెప్టెన్ విజయ్ మలిక్ (10) ఒంటరి పోరాటం చేశాడు. రెయిడింగ్‌లో 17 సార్లు కూతకెళ్లి 9 పాయింట్లు తెచ్చాడు. ప్రత్యర్థి రెయిడర్‌ను టాకిల్ చేసి మరో పాయింట్ సాధించాడు. సహచరుల్లో భరత్ (5) మాత్రమే మెరుగ్గా ఆడాడు. డిఫెండర్లు అంకిత్ 3, అవి దుహన్, శుభమ్ షిండే చెరో 2 పాయింట్లు చేశారు. యు ముంబా తరఫున రెయిడర్ అజిత్ చౌహాన్ (8) రాణించాడు. ఇతనికి సహచరులు సందీప్ (4), రింకూ (4), అమిర్ మొహమ్మద్ (3), పర్వేశ్ (3)లను చక్కని సహకారం లభించింది. ప్రస్తుతం 8 విజయాలతో మూడో స్థానంలో ఉన్న తెలుగు టైటాన్స్‌కు ఈ సీజన్‌లో ఇక మూడే మ్యాచ్‌లు మిగిలున్నాయి. టైటాన్స్ రేపు పుణేరి పల్టన్‌తో పోటీపడుతుంది. అనంతరం 19న గుజరాత్, 22న ఆఖరి పోరులో హరియాణా స్టీలర్స్‌తో తలపడుతుంది.

పట్నా, హరియాణా గెలుపు

అంతకుముందు హోరాహోరీగా జరిగిన తొలి మ్యాచ్‌లో మూడుసార్లు చాంపియన్ అయిన పట్నా పైరేట్స్ టైబ్రేక్‌లో బెంగళూరు బుల్స్‌పై గెలుపొందింది. నిర్ణీత సమయం ముగిసేసరికి ఇరుజట్లు 32-32 స్కోరుతో సమంగా నిలిచాయి. టైబ్రేక్‌లో పట్నా 6-5తో పైచేయి సాధించింది. పట్నా కెప్టెన్ అయాన్ రెయిడింగ్‌లో చెలరేగాడు. 20 సార్లు కూతకెళ్లిన అతను 14 సార్లు పాయింట్లతో వచ్చాడు. మిగతా వారిలో రెయిడర్ అంకిత్ కుమార్ (5), డిఫెండర్ నవ్‌దీప్ (4) రాణించారు. బెంగళూరు బుల్స్ తరఫున అలీ రెజా మీర్జాయిన్ (17) ఒక్కడే శ్రమించాడు. అనంతరం జరిగిన మూడో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 53-26తో యూపీ యోధాస్‌పై ఘన విజయం సాధించింది. స్టీలర్స్ జట్టులో శివమ్ (15), జైదీప్ (6), సాహిల్ నర్వాల్ (4) రాణించారు. యూపీ తరఫు గగన్ గౌడ (7), భవానీ రాజ్‌పుత్, హితేశ్ చెరో 3 పాయింట్లు చేశారు. నేటి మ్యాచ్‌ల్లో బెంగాల్ వారియర్స్‌తో పట్నా పైరేట్స్, తమిళ్ తలైవాస్‌తో దబంగ్ ఢిల్లీ, జైపూర్ పింక్‌పాంథర్స్‌తో యూపీ యోధాస్ తలపడతాయి.

ఒక ఫైటర్ జెట్ 3.5 కోట్ల పూసలు



యుద్ధ విహంగంపై శాంతి సందేశం

దక్షిణాఫ్రికా కళాకారుడు రాల్ఫ్ జిమాన్ సృష్టి

దక్షిణాఫ్రికాకు చెందిన కళాకారుడు రాల్ఫ్ జిమాన్ అయిదేళ్లపాటు 3.5 కోట్ల పూసలు ఉపయోగించి ఒక పాత సోవియట్ మిగ్–21 ఫైటర్ జెట్‌కు కొత్త రూపాన్ని ఇచ్చాడు. యుద్ధ చిహ్నాలను కళాఖండాలుగా మార్చే అతని 'వెపన్స్ ఆఫ్ మాస్ ప్రొడక్షన్' శ్రేణిలో ఇది చివరిది, అత్యంత ప్రతిష్ఠాత్మకమైనది. రాల్ఫ్ జిమాన్‌కు చిన్నప్పటి నుంచే ఆయుధాలతో భయంకరమైన అనుభవాలున్నాయి. 1970లలో, జోహన్నెస్‌బర్గ్‌లో 13 లేదా 14 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు, అతన్ని ఓ వ్యక్తి .45 మాగ్నమ్ తుపాకీతో బెదిరించాడు. కానీ తనకు 50 ఏళ్ల వయసు వచ్చేసరికి దాదాపు 15 నుంచి 20 సార్లు తుపాకీ గురి పెట్టినట్లు జిమాన్ గుర్తు చేసుకున్నాడు. ఈ భయంకరమైన అనుభవాల వల్లే ఆయన 'తుపాకుల వ్యతిరేకి'గా మారారు. ప్రస్తుతం లాస్ ఏంజిలెస్‌లో ఉంటున్న జిమాన్, వృత్తిరీత్యా కమర్షియల్ ఫొటోగ్రాఫర్, ఫిల్మ్‌మేకర్. దశాబ్ద కాలంగా యుద్ధ కళాఖండాలను లక్షలాది చేతితో అల్లిన పూసలు ఉపయోగించి కళాత్మక వస్తువులుగా మార్చడమే తన పనిగా పెట్టుకున్నాడు. జిమాన్ తన కళాఖండాల ద్వారా దక్షిణాఫ్రికా చరిత్రలో హింసపై ఒక సందేశాన్ని ఇవ్వాలనుకున్నాడు. అందుకోసం 2019లో అత్యంత పెద్ద సవాలుగా మిగ్–21 విమానాన్ని ఎంచుకున్నాడు.

అయిదేళ్ల కష్టం.. మిగ్–21 కళాఖండం

మొదట, జిమాన్ ఫ్లోరిడాలోని ఒక సైనిక కాంట్రాక్టర్ నుండి మిగ్–21 జెట్‌ను కొనుగోలు చేశాడు. అది ముక్కలుగా, మంచి స్థితిలో లేకపోయినా, కళాఖండంగా మార్చడానికి కచ్చితంగా సరిపోతుందని ఆయన భావించాడు. తొలుత ఆయన బృందం మిగ్ ఇంజన్‌ను తొలగించి విమానాన్ని లాస్ ఏంజిలెస్‌లోని స్టూడియోకు తరలించింది. జిమాన్ అల్యూమినియం ప్యానెల్‌లపై డిజైన్‌లను రూపొందించి, ఆ పేపర్ షీట్‌లను దక్షిణాఫ్రికాకు పంపాడు. జోహన్నెస్‌బర్గ్, క్వాజులు–నటల్, మ్పుమలంగా ప్రావిన్సుల నుండి వచ్చిన జింబాబ్వేయన్, న్డెబెలె కమ్యూనిటీలకు చెందిన 100 మందికి పైగా కళాకారులు ఈ ప్యానెళ్లను పూసలతో తయారు చేయడం ప్రారంభించారు. ఈ కళాఖండాన్ని పూర్తి చేయడానికి 5 సంవత్సరాలకు పైగా సమయం పట్టింది. 51 అడుగుల పొడవు, 24 అడుగుల వెడల్పు ఉన్న ఈ విమానంపై సుమారు 3.5 కోట్ల పూసలు అమర్చినట్లు అంచనా.

- సాక్షి, నేషనల్ డెస్క్

విద్యకు నిధి

మిగ్–21 ప్రాజెక్టుకు మద్దతు ఇచ్చిన డీటీగ్రుయిల్లె చారిటీ సంస్థ ద్వారా ఈ కళాకారుల పిల్లలు, ఇతర యువత 25 మంది విద్యకు స్పాన్సర్‌షిప్ లభిస్తోంది. వీరు వైద్యం, నర్సింగ్, ఫ్యాషన్ డిజైన్ వంటి కోర్సులు చదువుతున్నారు. ఈ అద్భుతమైన మిగ్–21 విమాన కళాఖండాన్ని అమెరికాలో ప్రదర్శన తర్వాత అమ్మకానికి ఉంచుతారు. దీనిద్వారా వచ్చే నిధులు విద్యా కార్యక్రమాలకు, ఉక్రెయిన్‌లో యుద్ధ బాధితులైన పిల్లలకు ఆర్ట్ థెరపీ అందించడానికి వినియోగిస్తారు. యుద్ధ చిహ్నాలను ఆకర్షణీయమైన కళాఖండాలుగా మార్చడం ద్వారా రాల్ఫ్ జిమాన్ కళతో శాంతి, ఆశ సందేశాన్ని ప్రపంచానికి బలంగా తెలియజేస్తున్నారు.

ఎయిర్ ఇండియా విమానప్రమాదంపై నిష్పాక్షిక విచారణ జరగాలి

- సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తితో విచారణ జరిపించండి
- అత్యున్నత న్యాయస్థానంలో పైలట్ సుమీత్ తండ్రి, ఎఫ్ఐపీ పిటిషన్

న్యూఢిల్లీ: ఈ ఏడాది జూన్ 12న అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమానం కూలిపోయిన ఘటనపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తితో నిష్పాక్షిక విచారణ జరిపించాలని ఆ ప్రమాదంలో మరణించిన విమాన పైలట్ సుమీత్ సభర్వాల్ తండ్రి పుష్కరాజ్‌తోపాటు ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలట్స్ (ఎఫ్ఐపీ) దేశ అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ఆ విచారణ సుప్రీంకోర్టు పర్యవేక్షణలో జరగాలని కోరారు. నాటి ప్రమాదంలో ప్రయాణికులు, సిబ్బంది, పైలట్లతోపాటు మెడికల్ విద్యార్థులు కలిపి 260 మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ ఘోర దుర్ఘటనపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బోర్డు (ఏఏఐబీ) దర్యాప్తు జరుపుతోంది. ఫ్యూయల్ స్విచ్‌లు ఆపివేయటం వల్లనే ప్రమాదం జరిగిందని మధ్యంతర నివేదికలో పేర్కొంది. ఈ నివేదికను విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. పైలట్ల మధ్య సమన్వయ లోపమే ప్రమాదానికి కారణంగా కనిపిస్తోందని సెప్టెంబర్ 22న వ్యాఖ్యానించింది. అయితే, ఈ నివేదికను ఎఫ్ఐపీ తీవ్రంగా వ్యతిరేకించింది. తాజా పిటిషన్‌లో కూడా ఆ నివేదికలో అనేక లోపాలు ఉన్నాయని పిటిషనర్లు ఆరోపించారు. 'ప్రమాదానికి అసలైన కారణాన్ని గుర్తించకుండా రూపొందించే అసంపూర్తి దర్యాప్తు నివేదికలతో భవిష్యత్తులో ప్రయాణికులకు ప్రమాదం జరుగుతుంది. విమానయాన భద్రత కూడా ప్రశ్నార్థకమవుతుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ని ఉల్లంఘించినట్లు కూడా అవుతుంది'అని పిటిషన్‌లో పేర్కొన్నారు. అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిర్ ఇండియా బోయింగ్ 787 విమానం గాల్లోకి లేచిన నిమిషాల వ్యవధిలోనే ఎయిర్‌పోర్టుకు సమీపంలోని బీజే మెడికల్ కాలేజీ హాస్టల్ భవనంపై కుప్పకూలింది. దానిని నడిపిన పైలట్ సుమీత్ సభర్వాల్, కోపైలట్ క్లైవ్ కుందర్‌తోపాటు 12 మంది సిబ్బంది, 229 మంది ప్రయాణికులు, 19 మంది పౌరులు మరణించారు.

రైల్వేప్లాట్‌ఫాం పైనే మహిళకు పురుడు పోసిన యువకుడు

వీడియోకాల్‌లో డాక్టర్ సూచనలతో సురక్షితంగా డెలివరీ

ముంబై: ఆ మధ్య వచ్చిన త్రీ ఇడియట్స్ సినిమాలో అత్యవసర సమయంలో ఓ డాక్టర్ వీడియోకాల్‌లో సూచనలు ఇస్తుండగా ఓ మహిళకు హీరో పురుడు పోసే సన్నివేశం ఉంటుంది. అచ్చం అలాంటి ఘటనే నిజజీవితంలో ముంబైలో జరిగింది. గత మంగళవారం రాత్రి ముంబై లోకల్ రైల్లో వికాస్ బిద్రే అనే వీడియో కెమెరామెన్ ప్రయాణిస్తుండగా అదే రైల్లో 24 ఏళ్ల అంబికా ఝా పురుటి నొప్పులతో బాధపడటం గమనించాడు. చుట్టూ మరికొందరు ఉన్నా వికాస్ మెరుపులా స్పందించి అత్యవసర స్విచ్ నొక్కి రైలును రామ్‌మందిర్ స్టేషన్‌లో ఆపేశాడు. అప్పటికే అంబికాకు ప్రసవం కావటం ప్రారంభమైంది. శిశువు సగంవరకు బయటకు వచ్చింది. దీంతో ప్లాట్‌ఫాంపై ఉన్న దుకాణాల వద్దకు పరుగెత్తి పరుపుల్లాంటివి పట్టుకొచ్చి ఆమెను పడుకోబెట్టారు. వికాస్ వెంటనే తన స్నేహితురాలైన దేవిక అనే డాక్టర్‌కు ఫోన్‌చేసి విషయం చెప్పాడు. ఆమె వీడియోకాల్ చేసి సూచనలు ఇస్తుండగా అంబికకు వికాస్ డెలివరీ చేశాడు. అంతకుముందు ప్లాట్‌ఫాం సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లినా పరిస్థితి తీవ్రతను గుర్తించి డెలివరీ చేసేందుకు వారు ముందుకు రాలేదు. దీంతో ఆమె బంధువులు మళ్లీ ప్లాట్‌ఫాం వద్దకు తీసుకురావటంతో వికాస్ ధైర్యం చేసి తన స్నేహితురాలి సహకారంతో పురుడు పోశాడు. అనంతరం తల్లి, బిడ్డను ప్రైవేటు అంబులెన్స్‌లో కూపర్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని అధికారులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను మంజీత్ ధిల్లాన్ అనే వ్యక్తి ఇన్‌స్టాగామ్‌లో పోస్ట్ చేయటంతో వికాస్‌పై ప్రశంసలు కురుస్తున్నాయి. కర్జత్ జమ్‌ఖేడ్ ఎమ్మెల్యే రోహిత్ పవార్ కూడా ఈ ఘటనపై స్పందించారు. వికాస్ చేసిన పని మహారాష్ట్రకు గర్వకారణమని పేర్కొన్నారు. దేవిక సూచనలతోనే తాను పురుడు పోయగలిగానని వికాస్ తెలిపాడు.

అవినీతి ఆరోపణలపై పట్టుబడ్డ పంజాబ్ డీఐజీ

చండీగఢ్: పంజాబ్ డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్(డీఐజీ) ఆఫ్ పోలీస్ హర్‌చరణ్ భుల్లార్‌ను లంచం ఆరోపణలపై సీబీఐ అధికారులు గురువారం అరెస్ట్ చేశారు. మండి గోబింద్‌గఢ్‌కు చెందిన తుక్కు వ్యాపారి ఆకాశ్ బట్టాపై 2023లో కేసు నమోదైంది. ఈ కేసును మాఫీ చేసేందుకు, నెలవారీ మామూళ్లతోపాటు రూ.8 లక్షల లంచం ఇవ్వాలని భుల్లార్ డిమాండ్ చేశారు. ఇందుకుగాను కిషన్ అనే మధ్యవర్తితో వ్యవహారం నడిపారు. ఈ మేరకు వ్యాపారి ఆకాశ్ నుంచి ఉప్పందుకున్న సీబీఐ అధికారులు వలపన్నారు. గురువారం చండీగఢ్‌లోఆకాశ్ నుంచి డీఐజీ తరఫున రూ.8 లక్షలు తీసుకుంటుండగా కిషన్‌ను పట్టుకున్నామని సీబీఐ తెలిపింది. ఈ సందర్భంగా డీఐజీ, మధ్యవర్తి కిషను, వ్యాపారి ఆకాశ్ మధ్య జరిగిన వాట్సాప్ సంభాషణ ఆధారంగా డీఐజీని అరెస్ట్ చేశామని పేర్కొంది డీఐజీ కార్యాలయం, నివాసంలో జరిపిన సోదాల్లో రూ.5 కోట్ల నగదు, కిలోన్నర బరువున్న ఆభరణాలు, ఆస్తి పత్రాలు, మెర్సిడెజ్, ఆడి కార్లు, 22 ఖరీదైన గడియారాలు, డబుల్ బ్యారెల్ గన్, పిస్టల్, రివాల్వర్, ఎయిర్ గన్, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని వివరించింది.

ట్రాన్స్‌జెండర్ల ముఠా తగాదాలు ఫినాయిల్ తాగిన 24 మంది సభ్యులు..

ప్రత్యర్థి గ్రూపు నాయకురాలిని అరెస్ట్ చేసిన పోలీసులు

ఇండోర్: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో గురువారం ట్రాన్స్‌జెండర్ గ్రూపు నాయకురాలిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రత్యర్థి గ్రూపుల మధ్య విభేదాలతో బుధవారం ఓ ముఠాలోని 24 మంది ట్రాన్స్‌జెండర్లు ఫినాయిల్ తాగారు. నందలాల్‌పురలో ఘటన చోటుచేసుకుంది. ఫినాయిల్ తాగిన వారందరినీ వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరికి ఎటువంటి ప్రమాదం లేదని వైద్యులు ప్రకటించారు. సప్నా గురు అలియాస్ సప్నా హాజీ(55) అనే నాయకురాలు తమతో వెట్టి చాకిరీ చేయించుకుంటోందని బాధిత ట్రాన్స్‌జెండర్లు ఆరోపిస్తున్నారు. వీరికి మద్దతుగా జర్నలిస్టులమని చెప్పుకునే పంకజ్ జైన్, అక్షయ్ కుమావత్ అనే వారు సైతం తమను వేధిస్తున్నారంటున్నారు. సప్నా హాజీపై కఠిన చర్యలు తీసుకోకుంటే తమ గ్రూపులోని మొత్తం 300 మందీ ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరిస్తున్నారు. సప్నా హాజీపై చర్య తీసుకోవాలంటూ బుధవారం రాత్రి ఒక ట్రాన్స్‌జెండర్ పెట్రోల్ పోసుకుని, నిప్పంటించుకునేందుకు కూడా యత్నించింది. వీరి గొడవపై కేసు నమోదైంది.

కూచిపూడి నర్తకి అరుణిమకు అరుదైన గౌరవం

కింగ్ ఛార్లెస్‌బ్రిటిష్ ఎంపైర్ మెడల్ అందుకున్న భారతీయ కళాకారిణి



లండన్: భారతీయ నృత్యరూపకం కూచిపూడికి బ్రిటన్‌లో ఎనలేని గుర్తింపు తెస్తూ దేశవ్యాప్తంగా భారతీయ కళకు మరింత వన్నె తెచ్చిన ప్రముఖ నాట్యకళాకారిణి అరుణిమ కుమార్‌ను యూకే సర్కార్ అరుదైన గౌరవంతో సత్కరించింది. బ్రిటన్ రాజు ఛార్లెస్–3 'గౌరవ బ్రిటిష్ ఎంపైర్ మెడల్(బీఈఎం)'తో అరుణిమను గౌరవించారు. ఒక కూచిపూడి కళాకారిణి ఈ మెడల్‌ను సాధించడం చరిత్రలో ఇదే తొలిసారి కావడం విశేషం. భారతీయ శాస్త్రీయ నృత్యాన్ని అంతర్జాతీయ వేదికలపై అద్భుతంగా ప్రదర్శిస్తూ భారత్, బ్రిటన్‌సహా పలు దేశాల మధ్య సాంస్కృతి సంబంధాల బలోపేతానికి ఆమె తన కూచిపూడి కళ ద్వారా కృషిచేశారని బ్రిటన్ రాజకుటుంబం పేర్కొంది. యూకేలో పౌర, సైనిక కార్యకలాపాల్లో విశేష కృషి చేసిన వ్యక్తులకు బ్రిటన్ రాజు ప్రతిఏటా ఈ పురస్కారాన్ని ప్రదానంచేస్తారు. అరుణిమ ఇప్పటికే బ్రిటన్ సమాజంలో ఎంతో పేరు ప్రఖ్యాత సాధించారు. బ్రిటన్ రాణి ఎలిజబెత్–2 వర్ధంతి వేడుకల్లో, బకింగ్‌హామ్ ప్యాలెస్‌లో, లండన్‌లోని యూకే ప్రధాని కార్యాలయం 10, డౌనింగ్ స్ట్రీట్‌లో అరుణిమ ఎన్నోసార్లు కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. భారతీయ నృత్యరూపం అంబాసిడర్‌గా, ఇన్‌ఫ్లుయన్సర్‌గా, సాంస్కృతిక సారథిగా అరుణిమకు మంచి పేరుంది. తనకు బ్రిటిష్ ఎంపైర్ మెడల్ రావడంపై అరుణిమ సంతోషం వ్యక్తంచేశారు. ''రాజు నుంచి గౌరవ పురస్కారం పొందడం నిజంగా ఎంతో గర్వంగా, సముచితంగా గౌరవంగా అనిపిస్తోంది. కళలో నా కృషిని అంతర్జాతీయ స్థాయిలో గుర్తించినందుకు సంతోషంగా ఉంది. ఇది నా వ్యక్తిగత గుర్తింపుగా భావించట్లేను. అంతర్జాతీయ వేదికపై భారతీయ శాస్త్రీయ నాట్యానికి దక్కిన గౌరవం. కూచిపూడి నాకు జీవితాంతం తోడుంటుంది. నా భావాల వ్యక్తీకరణకు మాధ్యం కూచిపూడి''అని ఆమె అన్నారు. ఈమెకు చెందిన 'అరుణిమ కుమార్ డ్యాన్స్ అకాడమీ'50కిపైగా దేశాల్లో 3,000కుపైగా నృత్య ప్రదర్శనలు ఇచ్చింది. ఐదేళ్ల చిన్నారి మొదలు 75 ఏళ్ల వృద్ధుల దాకా ఈమె వద్ద కూచిపూడి నేర్చుకుంటున్నారు. ఇప్పటికే ఈమెకు వందలాది మంది శిష్యులు ఉన్నారు. పద్మ భూషణ్ శ్రీమతి స్వప్నసుందరి, పద్మశ్రీ జయరామారావు వద్ద అరుణిమ శిష్యరికం చేసి కూచిపూడిలో నైపుణ్యం సాధించారు.

రెండ్రోజుల్లో 258 మంది నక్సల్స్ లొంగుబాటు

ఎక్స్‌లో వెల్లడించిన హోంమంత్రి అమిత్‌షా

సాక్షి, న్యూఢిల్లీ: గత రెండు రోజుల్లోనే 258 మంది మావోయిస్టులు పోలీసు అధికారుల ఎదుట లొంగిపోయారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించారు. గురువారం ఒక్క రోజే ఛత్తీస్‌గఢ్‌లో 170 మంది నక్సలైట్లు లొంగుబాట పట్టారని ప్రకటించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'గురువారం ఛత్తీస్‌గఢ్‌లో 170 మంది నక్సలైట్లు లొంగిపోయారు. నిన్న ఇదే రాష్ట్రంలో 27 మంది తమ ఆయుధాలను త్యజించారు. మహారాష్ట్రలో కూడా 61 మంది జనజీవన స్రవంతిలోకి తిరిగి వచ్చారు. మొత్తమ్మీద రెండు రోజుల్లో 258 మంది యుద్ధోన్మాద వామపక్ష తీవ్రవాదులు హింసను త్యజించారు' అని పేర్కొన్నారు. భారత రాజ్యాంగంపై నమ్మకముంచి, హింసను త్యజించాలనే వారి నిర్ణయాన్ని ఆయన అభినందించారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం వామపక్ష తీవ్రవాదం ముప్పును అంతం చేయడానికి చేస్తున్న అవిశ్రాంత ప్రయత్నాల ఫలితంగా నక్సలిజం తుది శ్వాస విడిచిందని లొంగుబాట్లు నిరూపిస్తున్నాయన్నారు. ఇదే సమయంలో ఇతర మావోయిస్టులకు ఆయన హెచ్చరిక జారీ చేశారు. 'ప్రభుత్వ విధానం స్పష్టంగా ఉంది. లొంగిపోవాలనుకునే వారికి స్వాగతం. తుపాకీని ప్రయోగించడం కొనసాగించే వారు బలగాల ఆగ్రహాన్ని ఎదుర్కోకతప్పదు' అని అమిత్ షా స్పష్టం చేశారు. ఇప్పటికీ నక్సలిజం మార్గంలో ఉన్నవారు తమ ఆయుధాలను విడిచిపెట్టి ప్రధాన స్రవంతిలో చేరాలని మరోసారి విజ్ఞప్తి చేశారు. 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించడమనే లక్ష్యానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఇదే సమయంలో ఒకప్పుడు తీవ్రవాద స్థావరాలుగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని అబుజ్‌మఢ్, ఉత్తర బస్తర్‌లను నేడు నక్సలిజం లేని ప్రాంతాలుగా ప్రకటించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రస్తుతం దక్షిణ బస్తర్‌లో ఉన్న నక్సలిజం ఆనవాళ్లను త్వరలోనే భద్రతా దళాలు తుడిచిపెట్టక తప్పదన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడ్డాక గత ఏడాది జనవరి నుంచి 2,100 మంది నక్సలైట్లు లొంగిపోగా 785 మంది అరెస్టయ్యారని, ఎదురుకాల్పుల ఘటనల్లో 477 మంది చనిపోయారని మంత్రి తెలిపారు.

శ్రీలంకను భారత భద్రతకు ముప్పుగా మారనివ్వను



ఢిల్లీలో పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో శ్రీలంక ప్రధాని హరిణి అమరసూర్య వ్యాఖ్య

న్యూఢిల్లీ: శ్రీలంక గడ్డపై భారత వ్యతిరేక కార్యకలాపాలను అడ్డుకుని తీరతానని శ్రీలంక మహిళా ప్రధాని హరిణి అమరసూర్య వ్యాఖ్యానించారు. ఢిల్లీలో డిగ్రీ చదువుకున్న రోజులను ఆమె గుర్తుచేసుకున్నారు. 1991–94కాలంలో ఢిల్లీ వర్సిటీ పరిధిలోని హిందూ కాలేజీలో సోషియాలజీలో డిగ్రీ చదువుకున్న నేపథ్యంలో గురువారం ఆమె పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో పాల్గొని ప్రసంగించారు. ''శ్రీలంక నిరంతరం ఒకే నిబంధనకు కట్టుబడి ఉంటుంది. పొరుగున ఉన్న మిత్రదేశం భారత్‌కు ముప్పు వాటిల్లేలా మా భూభాగాన్ని ఎలాంటి భారతవ్యతిరేక కార్యకలాపాలకు నెలవు కానివ్వను. ఈ నియమాన్ని త్రికరణ శుద్ధిగా పాటిస్తాం''అని అన్నారు. తమ దేశంలో ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమం ఉవ్వెత్తున ఎగసి గత ప్రభుత్వం కూలిపోవడంపై ఆమె మాట్లాడారు. ''ప్రజాస్వామ్యం అనేది ప్రేక్షకులు ఆస్వాదించే క్రీడ కాదు. అది నిరంతర అవిశ్రాంత కృషి. అంటే మన సమాజంతో ఎల్లప్పుడూ మమేకం కావాలి. న్యాయం కోసం పోరాడాలి. ప్రతి ఒక్కరూ తమతమ స్థాయిలో అందరి సంక్షేమం కోసం పాటుపడాలి. శ్రీలంక దేశ చరిత్రలో భారత్ శాశ్వత భాగస్వామిగా కీర్తికిరీటం పొందింది. ద్వీపం అయిన మా దేశంలో ఆర్థికసంక్షోభం తలెత్తినప్పుడు భారత్ నిజమైన నేస్తంలా ఆపన్న హస్తం అందించింది''అని ఆమె అన్నారు.

జయసూర్య తెలుసా?

ప్రజాస్వామ్యంలోని గొప్పతనాన్ని భారత్, శ్రీలంకలో చూడొచ్చు. నాలాంటి సాధారణ వ్యక్తులను సైతం సమాజంలోని సమస్యలు, విద్యావ్యవస్థ రాటుదేలేలా చేస్తాయి. దేశసేవ చేసే స్థాయికి ఎదగనిస్తాయి. పాక్ జలసంధి కేవలం 22 నాటికల్ మైళ్ల దూరం మాత్రమే సముద్రం వెంట భారత్, శ్రీలంకలను విడదీస్తోంది. కానీ ఇరుదేశాల నాగరికత, సాంస్కృతి, మత, ప్రాచీన బంధం ఏకంగా 2,000 సంవత్సరాల క్రితమే బలపడింది. ఇప్పుడు క్రికెట్ సైతం ఈ బంధాన్ని పెనవేస్తోంది. 1991లో ఇక్కడ డిగ్రీ ఆనర్స్ చదివేందుకు హిందూ కాలేజీలో తొలిసారి అడుగు పెట్టినప్పుడు నా పేరు చెప్పా. నాది శ్రీలంక అని తెలిసి చాలా మంది ఒక్కటే ప్రశ్న వేశారు. నీకు క్రికెటర్ జయసూర్య తెలుసా?''అని ఆమె అన గానే పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ అంజూ శ్రీవాస్తవసహా నాటి ఆమె స్నేహితులు పక్కున నవ్వారు. ''భారత్, శ్రీలంకలు ఒకే సంప్రదాయ వారసత్వం, విలువలు, పరస్పర గౌరవాలతో ఎదిగాయి. ఈ సంస్కృతి బంధం పోగులే ఇరు దేశాల సమాజ సౌభ్రాతృత్వాన్ని పెనవేసేలా చేశాయి. కొన్ని విషయాల్లో మనలో మనకు కొన్ని పొరపొచ్చాలు రావొచ్చు. కానీ చివరకు అందరం ఇరుగుపొరుగున కలిసే జీవిస్తున్నాం. కలిసి పనిచేస్తున్నాం. చివరకు ఒకరినొకరం గౌరవించుకుంటున్నాం. శ్రీలంక ఆర్థిక పురోభివృద్ధికి భారత్ ఎంతగానో సాయపడుతోంది. కష్టకాలంలో మా ఆర్థిక స్థిరత్వం, ప్రగతికి భారత్ అండగా నిలబడింది. 2022లో తీవ్ర ఆర్థికసంక్షోభంలో మేం కూరుకుపోతే భారత్ రుణసాయం చేసింది. ఈ సాయాన్ని మేం ఏనాటికీ మరువం. ఇరుదేశాల భాగస్వామ్యం నేటి తాత్కాలిక అగత్యం కాదు. రేపటి శాశ్వత అవసరం. గత డిసెంబర్‌లో మా దేశాధ్యక్షుడు అనుర కుమార దిస్సనాయకె ఢిల్లీలో పర్యటించడం, ఏప్రిల్‌లో లంకలో మోదీ పర్యటన బలపడుతున్న ఇరుదేశాల బంధానికి గుర్తులు''అని ఆమె అన్నారు.

అవిశ్వాసం గట్టెక్కిన ఫ్రాన్స్ ప్రధాని లెకొర్ను

పారిస్: ఫ్రాన్స్ ప్రధానిగా ఇటీవలే రెండోసారి బాధ్యతలు చేపట్టిన సెబాస్టియన్ లెకొర్ను మొదటి అడ్డంకిని విజయవంతంగా అధిగమించారు. గురువారం పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నుంచి బయటపడ్డారు. 577 మంది సభ్యులుండే పార్లమెంట్‌లో అవిశ్వాసం నెగ్గేందుకు 289 ఓట్లు అవసరం కాగా, 271 ఓట్లే పడ్డాయి. లెకొర్నుపై అవిశ్వాసం గెలిచిన పక్షంలో ఫ్రాన్స్ మరింత తీవ్రమైన రాజకీయ సంక్షోభంలోకి వెళ్లిపోయేదని పరిశీలకులు అంటున్నారు. అధ్యక్షుడు మేక్రాన్‌కు అత్యంత సన్నిహితుడిగా లెకొర్నుకు పేరుంది. లెకొర్నును గద్దెదించేందుకు యత్నిస్తే పార్లమెంట్‌ను సైతం రద్దు చేస్తానని ఇప్పటికే అధ్యక్షుడు హెచ్చరించారు. వివాదాస్పద పింఛను బిల్లును వెనక్కి తీసుకునేందుకు సిద్ధపడ్డారు. దీంతో, ప్రతిపక్ష పార్టీలు కొన్ని వెనక్కి తగ్గాయి. అయితే, ఇంతకుమించిన సవాలు ప్రధాని లెకొర్ను ముందుంది. అదే, 2026 బడ్జెట్‌ను పార్లమెంట్‌తో ఆమోదింపజేసుకోవడం. బడ్జెట్ తాము కోరుకున్న విధంగా లేకపోయినా ప్రతిపక్షాలు మళ్లీ అవిశ్వాస తీర్మానాలను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ప్రమాదాన్ని లెకొర్ను ఎదుర్కొనాల్సి ఉంటుంది.

ఎన్నికలు ఆలస్యమైతే రాష్ట్రపతి పాలన

బీజేపీ బెంగాల్ అధ్యక్షుడు సువేందు అధికారి హెచ్చరిక

జల్పాయ్‌గురి: పశ్చిమబెంగాల్ అసెంబ్లీకి 2026లో జరగనున్న ఎన్నికలతో ప్రభుత్వం మారనుందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సువేందు అధికారి జోస్యం చెప్పారు. సకాలంలో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయకుంటే రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించే అవకాశాలున్నాయని హెచ్చరించారు. జల్పాయ్‌గురి జిల్లా నగ్రాకటలో గురువారం జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) ప్రక్రియ పూర్తికాని పక్షంలో ఎన్నికలు జరగవన్నారు. 'వచ్చే ఏడాది మే 4వ తేదీకల్లా ఎస్ఐఆర్ పూర్తి చేయాల్సి ఉంది. లేకుంటే ఆ తర్వాత రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన అమలవుతుంది. ఎస్ఐఆర్ ప్రక్రియ ఎన్నికల ముందు సెమీఫైనల్స్ వంటిది. ఎన్నికల్లో టీఎంసీకి ఓటమి తప్పదు'అని సువేందు వ్యాఖ్యానించారు. '2024 అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ, బీజేపీలు పొందిన ఓట్లలో తేడా 42 లక్షలు మాత్రమే. అప్పట్లో అక్రమంగా చేర్చిన 2.4 కోట్ల మంది ఓటర్ల పేర్లను ఎస్ఐఆర్‌లో తొలగిస్తారు. అక్రమ వలసదారులు, ఇతరత్రా అనర్హుల పేర్లు సైతం ఉండవు. భవానీపూర్‌లో సీఎం మమతా బెనర్జీకి తన చేతిలో ఓటమి తప్పదు'అని అధికారి పేర్కొన్నారు.

కంఛా షెర్పా కన్నుమూత



కఠ్మాండు: ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన ఎవరెస్ట్ శిఖరాన్ని ప్రప్రథమంగా 1953లో అధిరోహించిన బృంద సభ్యుడైన కంఛా షెర్పా 92 ఏళ్ల వయస్సులో గురువారం కన్నుమూశారు. కఠ్మాండు జిల్లా కపన్‌లోని సొంతింట్లో ఆయన తుదిశ్వాస విడిచారని నేపాల్ పర్వతారోహకుల సంఘం అధ్యక్షుడు ఫుర్ గెల్జె షెర్పా వెల్లడించారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంగా బాధపడుతున్నారని తెలిపారు. న్యూజిలాండ్‌కు చెందిన ఎడ్మండ్ హిల్లరీ సారథ్యంలోని 35 మంది సభ్యుల్లో కంఛా షెర్పా ఒకరు. టెన్జింగ్ నార్గే షెరా మార్గదర్శనంలో ఈ బృందం 1953 మే 29వ తేదీన 8,849 మీటర్ల ఎత్తయిన ఎవరెస్ట్ శిఖరాన్ని విజయవంతంగా అధిరోహించింది హిల్లరీ, టెన్జింగ్‌తోపాటు శిఖరానికి ముందున్న ఆఖరి క్యాంప్‌కు చేరుకున్న ముగ్గురు షెర్పాలలో కంఛా షెర్పా ఒకరు. ఎవరెస్ట్‌కు ప్రధానమార్గంగా ఉన్న నాంచె బజార్‌లో ఈయన 1933లో జన్మించారు. 19వ ఏళ్ల వయస్సు నుంచే పర్వతారోహకుడిగా మారిన ఈయన 50 ఏళ్లు వచ్చే వరకు అలా కొనసాగుతూనే ఉన్నారు. ఈయనకు భార్య, నలుగురు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు, మనవలు, మనవరాళ్లు ఉన్నారు.

సిరియాలో పేలుడులో నలుగురు సైనికులు మృతి

దమాస్కస్: సిరియాలో రక్షణ శాఖకు చెందిన బస్సులో సంభవించిన పేలుడులో నలుగురు సైనికులు మృత్యువాతపడ్డారు. మరికొందరు గాయాలపాలయ్యారు. ఇరాక్ సరిహద్దులకు సమీపంలోని చమురు కేంద్రం కాపలాకు వెళ్తుండగా డెయిర్ ఎల్ జౌర్–మయాడీన్ నగరాలను కలిపే రోడ్డుపై గురువారం ఈ ఘటన చోటుచేసుకుందని ప్రభుత్వం తెలిపింది. పేలుడులో 9 మంది వరకు సైనికులు గాయపడినట్లు సమాచారం. ఘటనకు బాధ్యతను ఎవరూ ప్రకటించుకోలేదు. ఉగ్ర సంస్థ ఇస్లామిక్ స్టేట్(ఐఎస్)పై అనుమానాలున్నాయి.

పాకిస్తాన్‌లో ట్రక్కు బోల్తా.. ఒకే కుటుంబంలోని 15 మంది దుర్మరణం

పెషావర్: పాకిస్తాన్‌లోని ఖైబర్ ఫఖ్తున్వా ప్రావిన్స్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ట్రక్కు బోల్తా పడి అందులోని ఒకే కుటుంబానికి చెందిన 15 మంది చనిపోయారు. 8 మంది గాయపడ్డారు. మలకండ్ జిల్లా స్వాట్ మోటార్ వేపై టన్నెకు సమీపంలో గురువారం ఈ ఘటన జరిగింది. క్షతగాత్రుల్లోని 8 మందిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో స్వాట్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధితుల్లో పలువురు చిన్నారులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. స్వాట్ జిల్లా బహ్రాయిన్ తహశీల్‌లోని గిర్బాల్‌కు చెందిన బాధితులు సంచారులు. ఇతర ప్రాంతాలకు వీరు తరచూ వలస వెళ్తుంటారని అధికారులు చెప్పారు.

ఇజ్రాయెల్ దాడిలో గాయపడిన హౌతీల మిలటరీ చీఫ్ మృతి

దుబాయ్: ఇజ్రాయెల్ ఆర్మీ రెండు నెలల క్రితం చేపట్టిన వైమానిక దాడిలో గాయపడిన యెమెన్‌లోని హౌతీ రెబల్స్ మిలటరీ చీఫ్ చనిపోయాడు. మేజర్ జనరల్ మహ్మద్ అబ్దుల్ కరీం అల్–ఘమారీ చనిపోయినట్లు హౌతీలు ధ్రువీకరించారు. ఆగస్ట్ 28వ తేదీన హౌతీల ప్రధాన నేతలే లక్ష్యంగా ఇజ్రాయెల్ చేపట్టిన భారీ దాడుల్లో ప్రధాని అహ్మద్ అల్–రహావీ సహా పలువురు అత్యున్నత స్థాయి నేతలు చనిపోయారు. ఎర్ర సముద్రంలో ప్రయాణించే వాణిజ్య నౌకలే లక్ష్యంగా హౌతీలు దాడులకు పాల్పడుతున్నందుకు ప్రతీకారంగా ఇజ్రాయెల్ ఈ చర్యకు పూనుకుంది. యెమెన్‌లో దశాబ్దకాలంగా కొనసాగుతున్న సాయుధ పోరుకు కారణమని ఆరోపిస్తూ ఐక్యరాజ్యసమితి ఘమారీపై 2021లో ఆంక్షలను సైతం విధించింది. ఇతడి సారథ్యంలో యెమెన్‌తోపాటు పొరుగునున్న సౌదీ అరేబియా, యూఏఈపైనా హౌతీలు దాడులకు దిగారని ఆరోపణలున్నాయి.

ఇండోనేసియాలో కాల్పులు.. 14 మంది వేర్పాటువాదులు హతం

జకార్తా: ఇండోనేసియాలోని పపువా ప్రాంతంలో సైన్యంతో జరిగిన ఎదురుకాల్పుల్లో 14 మంది వేర్పాటువాదులు హతమయ్యారు. సెంట్రల్ పపువా ప్రావిన్స్‌లోని ఇంటన్ జయ జిల్లా సోంగ్మా గ్రామంలో బుధవారం ఘటన చోటుచేసుకుంది. డజన్ల కొద్దీ తిరుగుబాటుదార్లు మిలటరీ గ్రేడ్ ఆయుధాలు, విల్లంబులతో దాడికి దిగగా, సైన్యం ప్రతిఘటించింది. ఈ క్రమంలో 14 మంది వేర్పాటువాదులు చనిపోయారని సైన్యం తెలిపింది. అయితే, ఈ ఘటనలో తమ వాళ్లు ముగ్గురు మాత్రమే చనిపోయారని, మిగతా 11 మంది అమాయక పౌరులని వెస్ట్ పపువా లిబరేషన్ ఆర్మీ తెలిపింది. వేర్పాటువాదుల స్థావరమని ఆరోపిస్తూ ఓ ఇంటిని చుట్టుముట్టి, అందులోని వారందరినీ కాల్చి చంపారని ఆరోపించింది. గతంలో డచ్ వలస ప్రాంతంగా ఉన్న పపువాను 1960లో ఇండోనేసియా కలిపేసుకుంది. ఇండోనేసియా పాలనకు వ్యతిరేకంగా వేర్పాటువాదం అక్కడ కొనసాగుతోంది. సాయుధ గ్రూపులు తరచుగా హింసాత్మక ఘటనలకు దిగుతున్నాయి.

కపిల్ శర్మ రెస్టారెంట్‌పైకి మళ్లీ కాల్పులు

సర్రే: కమెడియన్ కపిల్ శర్మకు చెందిన కెనడాలోని రెస్టారెంట్‌పై మరోసారి దుండగులు కాల్పులకు తెగబడ్డారు. బ్రిటిష్ కొలంబియా రాష్ట్రంలోని సర్రేలో జూలై 4వ తేదీన ఈ రెస్టారెంట్‌ను తెరిచాక ఇలా కాల్పులు జరగడం ఇది మూడోసారి. గురువారం తెల్లవారు జామున 3.45 గంటల సమయంలో గుర్తు తెలియని దుండగులు కాల్పులు జరిపినట్లు సర్రే పోలీసు విభాగం తెలిపింది. ఆ సమయంలో రెస్టారెంట్ సిబ్బంది లోపలే ఉన్నారని, ఎవరికీ ఎటువంటి ప్రమాదం వాటిల్లలేదని పేర్కొంది. జూలై 10, ఆగస్ట్ 7వ తేదీన కాల్పులు జరిగాక మూతబడిన రెస్టారెంట్‌ను ఈ నెలారంభంలో తిరిగి తెరిచారు.

భారత పార్లమెంట్ సమావేశాలు దేనితో ప్రారంభమవుతాయి?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ

భారత పార్లమెంట్

1. లోక్‌సభ, అసెంబ్లీల్లో ఎస్సీ, ఎస్టీ, ఆంగ్లో-ఇండియన్ల రిజర్వేషన్లను ఎన్నో రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా 2030 సంవత్సరం వరకు పొడిగించారు?
   1) 101 2) 102 3) 103 4) 104

జ. 4;
వివరణ: భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 330, 331, 332, 333 ప్రకారం లోక్‌సభ, అసెంబ్లీల్లో ఎస్సీ, ఎస్టీ, ఆంగ్లో ఇండియన్లకు రిజర్వేషన్లను కల్పిస్తూ, ఇవి 10 సంవత్సరాల పాటు అంటే 1960 వరకు ఉంటాయని ఆర్టికల్-334లో పేర్కొన్నారు. కానీ దీన్ని ఇప్పటికి 7సార్లు పొడిగించారు.
ఇటీవల మోడీ ప్రభుత్వం 126వ రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టగా పార్లమెంట్ ఆమోదం అనంతరం రాష్ట్రపతి సంతకంతో 2019 డిసెంబర్ 12న 104వ రాజ్యాంగ సవరణ చట్టంగా అమలులోకి వచ్చింది. ప్రస్తుతం ఆర్టికల్ 334 ప్రకారం ఈ రిజర్వేషన్లు 80 సంవత్సరాలపాటు (రాజ్యాంగం అమలులోకి వచ్చిన 1950 సంవత్సరం నుంచి) అంటే 2030 వరకు అమలులో ఉంటాయి. ప్రస్తుతం లోక్‌సభలో ఎస్సీలకు 84 స్థానాలు, ఎస్టీలకు 47 స్థానాలు రిజర్వ్ చేశారు.

2. భారత పార్లమెంట్ తొలిసారిగా ఎప్పుడు సమావేశం అయింది?
   1) 1952 మార్చి 13 2) 1952 మే 13
   3) 1953 మార్చి 13 4) 1953 మే 13

జ. 2;
వివరణ: భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత రాజ్యసభ 1952 ఏప్రిల్ 3న ఏర్పడింది. లోక్‌సభ 1952 ఏప్రిల్ 17న ఏర్పడింది. ఈ రెండు సభలతో కూడిన భారత పార్లమెంట్ తొలిసారిగా 1952 మే 13న సమావేశం అయింది. భారత పార్లమెంట్ 2002 మే 13న స్వర్ణోత్సవాలు జరుపుకోగా, 2012 మే 13న వజ్రోత్సవ ఉత్సవాలు జరుపుకుంది.

3. లోక్‌సభ గరిష్ట సభ్యుల సంఖ్య ఎంత?
   1) 545 2) 550 3) 552 4) 543

జ. 3;
వివరణ: లోక్‌సభ గరిష్ట సభ్యుల సంఖ్య 552. ఇందులో 530 మంది రాష్ట్రాల నుంచి ఎన్నిక కాగా, 20 మంది కేంద్రపాలిత ప్రాంతాల నుంచి ఎన్నికవుతారు. మిగిలిన ఇద్దరు ఆంగ్లో-ఇండియన్ సభ్యులను రాష్ట్రపతి నియమిస్తారు. కానీ ప్రస్తుతం లోక్‌సభలో 545 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో 530 మంది రాష్ట్రాల నుంచి, 13 మంది కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఎన్నికయ్యారు. మిగిలిన ఇద్దరు ఆంగ్లో-ఇండియన్ సభ్యులను రాష్ట్రపతి నియమిస్తాడు.

4. లోక్‌సభలో అతి తక్కువగా అంటే ఒక్కొక్క స్థానం ఉన్న రాష్ట్రాలు ఏవి?
   1) సిక్కిం, నాగాలాండ్, గోవా
   2) సిక్కిం, గోవా, మణిపూర్
   3) సిక్కిం, నాగాలాండ్, మిజోరాం
   4) సిక్కిం, మిజోరాం, మణిపూర్

జ. 3;
వివరణ: సిక్కిం, నాగాలాండ్, మిజోరాం రాష్ట్రాల నుంచి లోక్‌సభలో ప్రాతినిధ్యం ఒక్క సీటు మాత్రమే ఉంది. అరుణాచల్‌ప్రదేశ్, గోవా, మణిపూర్, మేఘాలయ, త్రిపుర రాష్ట్రాల నుంచి ఇద్దరు సభ్యుల చొప్పున ఉన్నారు. లోక్‌సభలో ఎక్కువ సభ్యులు ఉన్న మొదటి మూడు రాష్ట్రాలు ఉత్తరప్రదేశ్ (80), మహారాష్ట్ర (48), పశ్చిమ బెంగాల్ (42).

5. రాజ్యసభకు 233 మంది ఎన్నిక ద్వారా వచ్చే సభ్యుల ఎన్నిక విధానం ఏ విధంగా ఉంటుంది?
   1) సాధారణ మెజారిటీ పద్ధతి, రహస్య ఓటు పద్ధతి
   2) సాధారణ మెజారిటీ పద్ధతి, బహిరంగ ఓటు పద్ధతి
   3) నైష్పత్తిక ప్రాతినిధ్య, రహస్య ఓటు పద్ధతి
   4) నైష్పత్తిక ప్రాతినిధ్య, బహిరంగ ఓటు పద్ధతి

జ. 4;
వివరణ: రాజ్యసభలో 245 మంది సభ్యులు ఉండగా, 233 మంది సభ్యులు రాష్ట్రాల అసెంబ్లీ సభ్యులు ఎన్నుకోగా మిగిలిన 12 మంది సభ్యులను వివిధ రంగాల్లో ప్రముఖులను రాష్ట్రపతి నియమిస్తాడు. వీరి ఎన్నిక నైష్పత్తిక ప్రాతినిధ్య ఓటు బదిలీ పద్ధతిలో బహిరంగ ఓటు విధానం ద్వారా జరుగుతుంది. రాజ్యసభ సభ్యుని ఎన్నికల్లో ఓటువేసే ఎం.ఎల్.ఎ. తాను వేసిన ఓటును పార్టీ నియమించిన ఏజెంట్‌కు చూపవలసి ఉంటుంది. క్రాస్ ఓటింగ్‌ను నిరోధించటానికి రాజ్యసభకు 2003 సంవత్సరం నుంచి బహిరంగ ఓటు విధానాన్ని ప్రవేశపెట్టారు. రాజ్యసభ సభ్యుని ఎన్నిక విధానాన్ని దక్షిణాఫ్రికా రాజ్యాంగం నుంచి స్వీకరించారు.

6. పార్లమెంట్‌కు పోటీచేసే అభ్యర్థి చెల్లించవలసిన డిపాజిట్ ఎంత?
   1) 10,000 2) 15,000
   3) 20,000 4) 25,000

జ. 4;
వివరణ: లోక్‌సభ లేదా రాజ్యసభకు పోటీచేసే అభ్యర్థి రూ.25,000 డిపాజిట్ చెల్లించాలి. లోక్‌సభ విషయంలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు మాత్రం రూ.12,500 చెల్లిస్తే సరిపోతుంది. రాజ్యసభలో ఎస్సీ, ఎస్టీలకు ఎటువంటి రిజర్వేషన్లు ఉండవు. కాబట్టి డిపాజిట్ చెల్లింపులో ఎటువంటి మినహాయింపు ఉండదు. పోలై చెల్లిన ఓట్లలో 1/6వ వంతు ఓట్లు వస్తే డిపాజిట్ వాపస్ వస్తుంది. లేనిచో డిపాజిట్ గల్లంతు అవుతుంది.

7. భారత పార్లమెంట్ సంవత్సరానికి కనీసం ఎన్నిసార్లు సమావేశం కావాలి?
   1) ఒకసారి
   2) రెండుసార్లు 3) మూడుసార్లు
   4) నిర్ణీత కనీస పరిమితి లేదు

జ. 2;
వివరణ: రాజ్యాంగం ప్రకారం భారత పార్లమెంట్ సంవత్సరానికి కనీసం రెండుసార్లు సమావేశం కావాలి. ఒక సమావేశానికి మరొక సమావేశానికి మధ్య 6 నెలల వ్యవధి ఉండరాదు. కానీ ప్రస్తుతం భారత పార్లమెంట్ సంవత్సరానికి మూడుసార్లు సమావేశం అవుతుంది. అవి



1) బడ్జెట్ సమావేశాలు(ఫిబ్రవరి నుంచి ఏప్రిల్)
2) వర్షాకాల సమావేశాలు (జూలై నుంచి సెప్టెంబర్)
3) శీతాకాల సమావేశాలు(నవంబర్ నుంచి డిసెంబర్)

అదే విధంగా భారత పార్లమెంట్ సంవత్సరానికి గరిష్టంగా ఎన్నిసార్లు అయినా సమావేశం కావచ్చు.

8. కింది ఏ బిల్లుల విషయంలో పార్లమెంట్ ఉభయ సభలకు సమాన అధికారం ఉంది?
   ఎ) సాధారణ బిల్లు
   బి) రాజ్యాంగ సవరణ బిల్లు
   సి) నూతన రాష్ట్రాల ఏర్పాటు బిల్లు
   డి) ద్రవ్యబిల్లు
   1) ఎ, బి 2) ఎ, సి
   3) ఎ, బి,సి 4) ఎ, బి, సి, డి

జ. 3;
వివరణ: సాధారణ బిల్లు, రాజ్యాంగ సవరణ బిల్లు నూతన రాష్ట్రాల ఏర్పాటు బిల్లులను పార్లమెంట్ ఉభయసభల్లో దేనిలోనైనా ప్రవేశపెట్టవచ్చు. వీటి విషయంలో రెండు సభల ఆమోదం అవసరం. అదే విధంగా రెండు సభలకు సమాన అధికారాలు ఉన్నాయి.
కానీ ద్రవ్యబిల్లు విషయంలో లోక్‌సభకే ఎక్కువ అధికారాలు ఉన్నాయి. స్పీకర్ ఒక బిల్లుని ద్రవ్యబిల్లు అని నిర్ణయించాక రాష్ట్రపతి అనుమతితో దానిని ముందుగా లోక్‌సభలో మాత్రమే ప్రవేశపెట్టాలి. లోక్‌సభ ఆమోదించిన ద్రవ్యబిల్లుని రాజ్యసభ 14 రోజుల లోపు ఆమోదించాలి లేనిచో అది ఆమోదించినట్లుగా భావించి రాష్ట్రపతి ఆమోదానికై పంపబడును.

9. సభలో సభ్యుడు కాకున్న సభకు అధ్యక్షతవహించే వ్యక్తి?
   1) లోక్‌సభ స్పీకర్
   2) లోక్‌సభ డిప్యూటీ స్పీకర్
   3) రాజ్యసభ చైర్మన్ 4) పై ముగ్గురూ

జ. 3;
వివరణ: భారత ఉపరాష్ట్రపతి పదవీ రీత్యా రాజ్యసభ చైర్మన్‌గా వ్యవహరిస్తాడు. వాస్తవానికి ఇతను రాజ్యసభ సభ్యుడు కాకున్నప్పటికీ సభకు అధ్యక్షత వహించి బిల్లుల ఆమోదానికి, సభ సజావుగా సాగటానికి కృషి చేస్తాడు. ఇతనికి మాములు సందర్భంతో ఓటు హక్కు ఉండదు. కానీ ఒక బిల్లుకి అనుకూలంగా, వ్యతిరేకంగా సమాన ఓట్లు వచ్చినప్పుడు ఓటు హక్కు ఉంటుంది. దీనినే 'కాస్టింగ్ ఓటు' లేదా 'నిర్ణాయక ఓటు' అని అంటారు.

10. లోక్‌సభలో అధికారికంగా గుర్తింపు పొందిన తొలి ప్రతిపక్ష నేత ఎవరు?
    1) జె.బి. కృపలానీ 2) మొరార్జీ దేశాయ్
    3) చరణ్‌సింగ్ 4) వై.బి. చవాన్

జ. 4;
వివరణ: పార్లమెంట్‌లో ఒక పార్టీకి ప్రతిపక్ష హోదా లభించాలంటే ఆయా సభలో 10 శాతం సీట్లను గెలుచుకోవాలి. తొలిసారిగా 1977లో జనతాపార్టీ మొరార్జీ దేశాయ్ నాయకత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా 154 స్థానాలు గెలుచుకున్న కాంగ్రెస్ ప్రతిపక్షంగా గుర్తించబడింది. కాంగ్రెస్ నేత వై.బి.చవాన్ అధికారికంగా ప్రతిపక్షనేతగా గుర్తింపు పొందాడు. అదే సంవత్సరం (1977)లో కమలాపాటి త్రిపాఠి రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా గుర్తింపు పొందాడు.

11. లోక్‌సభకు తొలిసారిగా మధ్యంతర ఎన్నిక ఎప్పుడు జరిగింది?
    1) 1967 2) 1971
    3) 1977 4) 1980

జ. 2;
వివరణ: సాధారణంగా లోక్‌సభ కాల పరిమితి 5 సంవత్సరాలు. కానీ ప్రధాని సలహా ప్రకారం దానిని ముందే రద్దు చేసే అధికారం రాష్ట్రపతికి ఉంది. ఆ సందర్భంలో నిర్వహించే ఎన్నికను మధ్యంతర ఎన్నికలు అంటారు. 1967లో జరిగిన నాలుగో లోక్‌సభను ఒక సంవత్సరం ముందు 1971లో నాటి ప్రధాని ఇందిరా గాంధీ సలహాపై రాష్ట్రపతి వి.వి. గిరి రద్దు చేశాడు. ఈ విధంగా తొలిసారిగా 1971లో మధ్యంతర ఎన్నిక జరిగింది. అనంతరం 1980లో రెండోసారి మధ్యంతర ఎన్నిక జరిగింది. లోక్‌సభకు 17 సార్లు ఎన్నికలు జరిగితే ఇందులో 7 సార్లు మధ్యంతర ఎన్నికలు (1971, 1980, 1984, 1991, 1998, 1999, 2004) జరిగాయి.

12. ఎంపీల్యాడ్స్ స్కీమ్ కింద ఒక్కొక్క ఎం.పి.కి సంవత్సరానికి నియోజకవర్గ అభివృద్ధికి ఎన్ని కోట్లు ఇస్తున్నారు?
    1) 1 2) 3 3) 5 4) 10

జ. 3;
వివరణ: పీవీ నరసింహారావు భారత ప్రధానిగా ఉన్నప్పుడు 1993లో ఎంపీల్యాడ్స్ స్కీమ్‌ను ప్రారంభించారు. మెంబర్ ఆఫ్ పార్లమెంట్ లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ స్కీమ్‌గా పిలిచే దీని కింద 1993లో ఒక్కొక్క ఎంపీకి నియోజవర్గ అభివృద్ధికి సంవత్సరానికి 5 లక్షలు కేటాయించారు. దీనిని 1994లో 1 కోటి, 1998లో 2 కోట్లు, 2011 నుంచి 5 కోట్లకు పెంచారు.

13. ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు పొందిన భారత ప్రధానులు ఎంతమంది ఉన్నారు?
    1) 2 2) 3 3) 4 4) 5

జ. 2;
వివరణ: పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్నప్పుడు పార్లమెంట్ విలువలను పెంపొందించిన వ్యక్తులకు మాజీ హోంశాఖ మంత్రి పండిత్ గోవింద్ వల్లభ్ పంత్ పేరు మీద ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డును 1993 నుంచి ఇస్తున్నారు. ఈ అవార్డును 1993లో ఇంద్రజిత్ గుప్తా పొందగా చివరగా 2017 సంవత్సరానికి భర్తృహరి మహతాబ్‌కు లభించింది.
ఈ అవార్డును ముగ్గురు ప్రధానమంత్రులు పొందారు. వారు అటల్ బిహారీ వాజ్‌పాయ్ (1994), చంద్రశేఖర్ (1995), మన్మోహన్ సింగ్ (2002).

14. ఇప్పటి వరకు లోక్‌సభకు 18 సార్లు ఎన్నికలు జరగ్గా అతి ఎక్కువ కాలం కొనసాగిన లోక్‌సభ ఎన్నోది?
    1) 3 2) 5 3) 7 4) 9

జ. 2;
వివరణ: ఐదో లోక్‌సభ 1971లో ఏర్పడింది. దీని పదవీ కాలం 1976 వరకు ఉంది. కానీ ఇందిరా గాంధీ ప్రభుత్వం 1975లో ఎమర్జెన్సీ విధించాక, 42వ రాజ్యాంగ సవరణ చట్టం (1976) ద్వారా 5వ లోక్‌సభ కాల పరిమితిని ఒక సంవత్సరం అంటే 1977 వరకు పొడిగించారు.
అదే విధంగా అతి తక్కువ కాలం కొనసాగిన లోక్‌సభ 12వ లోక్‌సభ. ఇది కేవలం 13 నెలలు(1998-99) మాత్రమే కొనసాగింది. లోక్‌సభ కాల పరిమితిని పెంచే అధికారం పార్లమెంట్‌కు ఉండగా, దానిని ముందే రద్దుచేసే అధికారం రాష్ట్రపతికి ఉంది.

15. పార్లమెంట్ సభ్యులు ఎన్ని రోజుల పాటు పార్లమెంట్ సమావేశాలకు హాజరు కాకుంటే సభ్యత్వం రద్దు అవుతుంది?
    1) 30 రోజులు 2) 60 రోజులు
    3) 3 నెలలు 4) 6 నెలలు

జ. 2;
వివరణ: పార్లమెంట్ సభ్యుడు 60 రోజుల పాటు సభాధ్యక్షుని అనుమతి లేకుండా సభకు గైర్హాజరు అయితే సభ్యత్వం కోల్పోతాడు. 1976-77లో తమిళనాడుకు చెందిన సుబ్రహ్మణ్య స్వామి ఈ విధంగానే రాజ్యసభ సభ్యత్వం కోల్పోయాడు.
అదే విధంగా పార్లమెంట్ సభ్యుడు పార్టీ ఫిరాయింపుకు పాల్పడితే సభాధ్యక్షుడు అతని సభ్యత్వాన్ని రద్దు చేస్తాడు. అతని ఎన్నిక చెల్లదు అని హైకోర్టు లేదా సుప్రీంకోర్టు తీర్పునిస్తే రాష్ట్రపతి అతని సభ్యత్వాన్ని రద్దు చేస్తాడు.

16. రాష్ట్ర జాబితాలోని అంశాలపై కూడా పార్లమెంట్ ఏ సందర్భంలో శాసనాలు రూపొందించవచ్చు?
    1) జాతీయ ప్రయోజనం
    2) రెండు రాష్ట్రాలు ఉమ్మడి ప్రయోజనం కోసం
    3) అత్యవసర పరిస్థితి అమలులో ఉన్నప్పుడు
    4) పై అన్నీ సందర్భాల్లో

జ. 4;
వివరణ: ఆర్టికల్-249 ప్రకారం జాతీయ ప్రయోజనం దృష్ట్యా రాష్ట్ర జాబితాలోని అంశంపై శాసనం చేయాలని రాజ్యసభ 2/3వ వంతు మెజారిటీతో తీర్మానం చేసినప్పుడు పార్లమెంట్ రాష్ట్ర జాబితాలోని అంశంపై కూడా శాసనం చేయవచ్చు.
ఆర్టికల్-250 ప్రకారం అత్యవసర పరిస్థితి అమలులో ఉన్నప్పుడు కూడా రాష్ట్ర జాబితాలోని అంశంపై కూడా పార్లమెంట్ చట్టం చేయవచ్చు.
ఆర్టికల్-252 ప్రకారం రెండు లేదా ఎక్కువ రాష్ట్రాలు తమ ఉమ్మడి ప్రయోజనం కోసం రాష్ట్ర జాబితాలోని అంశంపై చట్టం చేయాలని కోరితే పార్లమెంట్ చట్టం చేస్తుంది.

17. ప్రస్తుతం ఉన్న లోక్‌సభ సభ్యుల సంఖ్యను ఏ సంవత్సరం వరకు మార్చకూడదు?
    1) 2025 2) 2026
    3) 2030 4) 2035

జ. 2;
వివరణ: 84వ రాజ్యాంగ సవరణ చట్టం (2001) ద్వారా ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్యను 2026 వరకు మార్చకూడదని పేర్కొన్నారు. నియోజక వర్గాలను పునర్విభజించటానికి పై సవరణ ద్వారా 4వ డీలిమిటేషన్ కమిషన్‌ను జస్టిస్ కుల్‌దీప్ సింగ్ నేతృత్వంలో వేసినప్పుడు ఈ అంశాన్ని చేర్చారు. వాస్తవానికి ప్రారంభంలో లోక్‌సభ సభ్యుల సంఖ్య 489 ఉండేది. దానిని 1956లో 525కి, 1973లో 552కి పెంచారు. ఇది 2026 వరకు కొనసాగుతుంది.

18. భారత పార్లమెంట్ సమావేశాలు దేనితో ప్రారంభమవుతాయి?
    1) శూన్య సమయం
    2) ప్రశ్నోత్తరాలు సమయం
    3) అరగంట చర్చ 4) సావధాన తీర్మానం

జ. 2;
వివరణ: పార్లమెంట్ సమావేశాలు ప్రతిరోజూ ప్రశ్నోత్తరాల సమయంతో ప్రారంభమవుతాయి. ఇది ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్యలో ఉంటుంది. ప్రశ్నలు 3 రకాలు.
1. నక్షత్రపు గుర్తు ప్రశ్నలు: వీటికి 10 రోజుల ముందు సభాధ్యక్షుని అనుమతి తీసుకోవాలి. దీనికి మంత్రులు మౌఖికంగా సమాధానం చెప్పాలి.
2. నక్షత్రపు గుర్తు లేని ప్రశ్నలు: వీటికి కూడా 10 రోజుల ముందు సభాధ్యక్షుని అనుమతి తీసుకోవాలి. దీనికి మంత్రులు రాతపూర్వకంగా సమాధానం ఇవ్వాలి.
3. స్వల్ప వ్యవధి ప్రశ్నలు: అతి ముఖ్య విషయాలపై 3 నుంచి 10 రోజుల లోపు ముందస్తు అనుమతితో సభ్యులు ప్రశ్నలు అడగవచ్చు.

హృదయ స్పందన పెరగడానికి కారణమయ్యే హార్మోన్?

ప్రశ్నలు- వివరణలు

1. ఒక జీవిని 'ఎండమిక్ జీవి' గా పేర్కొనడానికి గల కారణం.
   1) దాని జనాభా తరిగిపోవడం
   2) భూమిపై అలాంటి జీవి ఒక్కటి కూడా మిగలకపోవడం
   3) దానిని వేటాడడం నిషేధించడం
   4) ఒక ప్రత్యేక ప్రాంతానికి మాత్రమే పరిమితమై ఉండడం

జ. 4;
వివరణ: జీవులు కొన్ని ప్రత్యేక ప్రాంతాలకే పరిమితమవుతాయి. వీటిని అరుదైన జాతులు లేదా ఎండమిక్ జాతులు అంటారు.
ఉదా: కంగారూ, ఆస్ట్రేలియా, కివీపక్షి-న్యూజిలాండ్ మొదలైనవి.

2. కింది పటంలోని ప్రయోగం ద్వారా నిరూపించే అంశం
   1) జీవులు, ఉద్దీపనలకు ప్రతిస్పందిస్తాయి
   2) జీవక్రియలు కాంతి సమక్షంలో మాత్రమే జరుగుతాయి
   3) జంతువులు మాత్రమే కాంతికి ప్రతిస్పందిస్తాయి
   4) మొక్కలు మాత్రమే కాంతికి ప్రతిస్పందిస్తాయి




జ. 1;
వివరణ: పటంలోని ప్రయోగాల్లో గాజు సీసాను చీకటి, వెలుతురు తగిలేలాగ రెండు భాగాలుగా విభజించి అందులో వానపామును వదిలి మూత మూశారు. కాంతిని ప్రసరింపచేసినపుడు అది కాంతిపడే ప్రాంతానికి ప్రయాణిస్తుంది. జీవులు ఉద్దీపనాలకు ప్రతిస్పందిస్తాయని తెలుసుకోవచ్చు.

3. వృక్షకణం ప్రత్యేకంగా ఏ కణాంగాలను కలిగి ఉంటుంది.
   1) మైటోకాండ్రియా, రైబోజోమ్లు, ప్లాస్టిడ్లు
   2) ప్లాస్టిడ్లు, కణత్వచం, లైసోజోమ్లు
   3) ప్లాస్టిడ్లు, కణకవచం, పెద్దరిక్తికలు
   4) ప్లాస్టిడ్లు, మైటోకాండ్రియా, లైసోజోమ్లు

జ. 3;
వివరణ: వృక్షకణంలో ప్లాస్టిడ్‌లు(వర్ణదాలు) కణకవచం, పెద్దరిక్తికలు ఉంటాయి. స్పష్టమైన కణకవచాన్ని చూపుతుంది. జంతు కణంలో పలుచని ప్లాస్మాత్వచం, చిన్న రిక్తికలు ఉంటాయి. ప్లాస్టిడ్‌లు ఉండవు.

4. ఏ రకపు పేపిల్లే ద్వారా ఎలాంటి రుచిని తెలుసుకోలేం?
   1) ఫిలిఫార్మ్ పాపిల్లే 2) ఫోలియేట్ పాపిల్లే
   3) సర్కంవేలేట్ పాపిల్లే 4) ఫంగిఫార్మ్ పాపిల్లే

జ. 1;
వివరణ: నాలుకపై సుమారు పదివేల రుచి కణికలు ఉంటాయి. ఇందులో ఫిలిఫార్మ్ పాపిల్లే పొలుసుల లాగా ఉంటుంది. ఇందులో ఎలాంటి రుచికణికలు ఉండకపోవడం వల్ల అవి రుచిని తెలుసుకోలేవు.



5. 'బయోపెస్టిసైడ్'గా ఉపయోగపడే బ్యాక్టీరియం ఏది?
   1) అజటోబ్యాక్టర్
   2) అజోస్పైరిల్లం
   3) బాసిల్లస్ తురెంజియన్సిస్
   4) బాసిల్లస్ పోపిల్లె

జ. 3;
వివరణ: బాసిల్లస్ తురంజెయన్సిస్(BT) జీవరసాయన ఎరువుగా ఉపయోగపడుతుంది. దీన్ని అనేక పరిశోధనల్లోనూ ఉపయోగిస్తున్నారు.

6. పాఠశాలకు వెళ్తుండగా మార్గమధ్యలో ఒక పెద్దపామును చూసిన అనిల్ హృదయ స్పందన పెరిగింది. అతని హృదయ స్పందన పెరగడానికి కారణ మయ్యే హార్మోన్ ఏది?
   1) థైరాక్సిన్ 2) అడ్రినలిన్
   3) థైరోట్రోపిన్ 4) గ్రీలిన్

జ. 2;
వివరణ: అడ్రినలిన్ హార్మోన్ శరీరంలోని అధివృక్క గ్రంధిలో విడుదలవుతుంది. ఈ హార్మోన్ మానసిక ఉద్వేగాలను నియంత్రిస్తుంది. అందువల్ల దీనిని 'పోరాట పలాయన హార్మోన్' అని అంటారు.

7. కింది వానిలో ఎక్కువ పీచు పదార్థాలను ఉన్నవేవి?
   అ. పాలు ఆ. తృణధాన్యాలు
   ఇ. నీరు ఈ. ఆకుకూరలు
   1) అ, ఆ 2) ఆ, ఇ
   3) ఇ, అ 4) ఈ, ఆ

జ. 4;
వివరణ: తృణధాన్యాలైన అన్నిరకాల గింజలు, ఆకుకూరల్లో పీచుపదార్థాలు ఉంటాయి. ఇవి జీర్ణనాళంలో ఆహారాన్ని బరువును పెంచి సులభంగా జారే విధంగా చేస్తుంది. మలబద్ధకాన్ని నిరోధిస్తుంది.

8. కింది వానిలో సరికాని జత ఏది?
   1) పత్రవృంతము: పత్రాన్ని కాండంతో జతపరుస్తుంది
   2) అంచులు: పత్రానికి ఆకారము ఇస్తాయి
   3) పత్రదళం: భాష్పోత్సేకంలో సహకరిస్తుంది
   4) నడిమి ఈనె: నీటిని మాత్రమే రవాణా చేస్తుంది.

జ. 4;
నడిమి ఈనె పత్రంలో మధ్యభాగంలో ఉంటుంది. ఇందులో ప్రసరణ కణజాలం ఉంటుంది. నీటితోపాటు పోషక పదార్థాలను సరఫరా చేయడానికి నాళికాపుంజాలను కలిగి ఉంటుంది.

9. కింది జీవుల్లో కేంద్రక పూర్వక జీవులకు సంబంధించిన జత ఏది?
   1) నీలి ఆకుపచ్చ శైవలాలు, బ్యాక్టీరియా
   2) బ్యాక్టీరియా, స్పంజికలు
   3) రైజోపస్, నీలి ఆకుపచ్చ శైవలం
   4) ఈస్ట్, పుట్టగొడుగు

జ. 1;
వివరణ: కేంద్రకం చుట్టూ నిర్దిష్టమైన త్వచం లేని కణాలను కేంద్రక పూర్వక కణాలు అంటారు. నీలి ఆకుపచ్చ శైవలాలు, బ్యాక్టీరియాల్లో ఈ స్థితి కనిపిస్తుంది. వీటిని కేంద్రక పూర్వ జీవులు అంటారు.

10. నేలను దున్నడం, పెల్లగించడం అనే ప్రక్రియ కింది వానిలో ఏ అంశానికి సహాయపడదు?
    1) వేళ్లు నేలలోకి సులభంగా చొచ్చుకొనిపోవడానికి
    2) కొన్ని అపాయకరమైన సూక్ష్మజీవులను చంపడానికి
    3) భూసారాన్ని పెంచడానికి
    4) నీరు ఇంకే సామర్థ్యాన్ని వృద్ధి చేయడానికి

జ. 3;
వివరణ: వ్యవసాయంలో నేలను దున్నడం ముఖ్యమైన ప్రక్రియ. భూసారాన్ని పెంచడం కోసం నేలను దున్నుతారు. దీని వల్ల కింద ఉన్న మట్టిపైకి, పైనున్న మట్టి కిందికి వెళ్లడంతో పాటు గాలి చొరబడుతుంది.

11. మొదటిసారిగా జన్యువుని కృత్రిమంగా సంశ్లేషణ చేసిన శాస్త్రవేత్త ఎవరు?
    1) హరగోవింద ఖొరానా
    2) పంచానన్ మహేశ్వరి
    3) బీర్బల్ సాహిని
    4) ఎల్లాప్రగడ సుబ్బారావు

జ. 1;
వివరణ: హరగోవింద ఖొరానా భారతీయ శాస్త్రవేత్త. కణంలోని కేంద్రకంలో జన్యువు ఉంటుంది. ఇది జీవుల లక్షణాలకు మూలప్రమాణం. దీన్ని 1972లో కృత్రిమ పద్ధతుల్లో ఖొరానా బృందం ఆవిష్కరించింది. నేడు బయోటిక్నాలజీలో, జీన్ ఎడిటింగ్‌లో ఈ టెక్నాలజీ ఉపయోగపడుతుంది.

ఇండియన్ జాగ్రఫీ

1. భారతదేశంలో తోట వ్యవసాయాన్ని ప్రవేశపెట్టిన విదేశీయులు ఎవరు?
   1) పర్షియన్లు 2) పోర్చుగీసువారు
   3) బ్రిటిషర్లు 4) అరబ్బులు

2. మనదేశంలో విస్థాపన వ్యవసాయానికి సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
   1) ఆంధ్రప్రదేశ్ - పోడు వ్యవసాయం
   2) మధ్యప్రదేశ్ - బేవార్
   3) అసోం - కురువా 4) కేరళ - పోనమ్

3. విస్తృత వ్యవసాయానికి సంబంధించి కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
   ఎ) ఈ వ్యవసాయ పద్ధతికి భూకమతం ఎక్కువగా ఉండాలి
   బి) ఈ పద్ధతికి జనసాంద్రత తక్కువగా ఉండాలి
   సి) ఈ పద్ధతిలో నీటిపారుదల ఎక్కువగా, యంత్రాల వినియోగం తక్కువగా ఉండాలి
   1) ఎ, బి 2) బి, సి 3) ఎ, సి 4) ఎ, బి, సి

4. భూకమత పరిమాణం తక్కువగా ఉండి, జనసాంద్రత ఎక్కువగా ఉన్న దేశాల్లో యాంత్రీకరణ లేకుండా చేసే వ్యవసాయాన్ని ఏమని పిలుస్తారు?
   1) మిశ్రమ వ్యవసాయం
   2) జీవనాధార వ్యవసాయం
   3) సాంద్ర వ్యవసాయం
   4) విస్తృత వ్యవసాయం

5. కింది వాటిలో తోట పంట కానిది ఏది?
   1) రబ్బరు 2) టీ
   3) కొబ్బరి 4) జనుము

6. వివిధ పరిశోధన కేంద్రాలు, అవి ఉన్న ప్రదేశాలకు సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
   1) ప్రపంచ వరి పరిశోధన కేంద్రం - మనీలా (ఫిలిప్పీన్స్)
   2) జాతీయ వరి పరిశోధన కేంద్రం - కోల్‌కతా
   3) భారత వ్యవసాయ పరిశోధన కేంద్రం - న్యూఢిల్లీ
   4) భారత చెరకు విత్తన పరిశోధన కేంద్రం - కోయంబత్తూర్

7. గోధుమ పంటకు సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?
   ఎ) ఇది సమశీతోష్ణ మండలం పంట
   బి) ఇది రెండో ప్రధాన ఆహార పంట
   సి) ఇది ఖరీఫ్ కాలానికి చెందిన పంట
   1) ఎ, బి 2) ఎ, సి
   3) బి, సి 4) ఎ, బి, సి

8. కింది వాటిని జతపరచండి.
   జాబితా - I
   i) ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్
   ii) ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పల్సెస్ రీసెర్చ్
   iii) కేంద్ర సముద్ర చేపల పరిశోధన సంస్థ
   iv) నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్
   జాబితా - II
   a) ఆనంద్ b) కొచ్చిన్
   c) ఢిల్లీ d) కాన్పూర్
   1) i - c, ii - d, iii - b, iv - a
   2) i - c, ii - a, iii - d, iv - b
   3) i - d, ii - c, iii - a, iv - b
   4) i - b, ii - c, iii - d, iv - a

9. భారతదేశంలో వరిని అత్యధికంగా ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రం ఏది?
   1) మధ్యప్రదేశ్ 2) ఉత్తరప్రదేశ్
   3) పశ్చిమబెంగాల్ 4) తమిళనాడు

10. హరిత విప్లవానికి సంబంధించి కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
   ఎ) హరిత విప్లవం అనే పదాన్ని మొదట ఉపయోగించిన వ్యక్తి 'విలియం. ఎస్ గాడ్'
   బి) హరిత విప్లవాన్ని మొదటిసారిగా ప్రపంచంలో వ్యాప్తి చేసిన వారు 'నార్మన్ బోర్లాగ్'
   సి) భారతదేశంలో హరిత విప్లవాన్ని అధికంగా వ్యాప్తి చేసినవారు ఎం.ఎస్. స్వామినాథన్
   1) ఎ, బి 2) బి, సి
   3) ఎ, సి 4) ఎ, బి, సి

11. కింది వాటిని జతపరచండి.

జాబితా - I	జాబితా - II
i) క్షీర విప్లవం	a) పండ్లు
ii) వెండి విప్లవం	b) చేపలు
iii) బంగారు విప్లవం	c) పాలు
iv) నీలి విప్లవం	d) కోడి గుడ్లు

   1) i - c, ii - a, iii - d, iv - b
   2) i - d, ii - c, iii - a, iv - b
   3) i - c, ii - d, iii - a, iv - b
   4) i - b, ii - d, iii - a, iv - c

12. హరిత విప్లవం వల్ల మన దేశంలో అత్యధికంగా ప్రయోజనం పొందిన పంట ఏది?
   1) వరి 2) మొక్కజొన్న
   3) జొన్న 4) గోధుమ

13. కింది వాటిలో 'గోల్డెన్ ఫైబర్' లేదా 'బంగారు పీచు' అని దేన్ని పిలుస్తారు?
   1) జనుము 2) పత్తి
   3) పొగాకు 4) సుగంధ ద్రవ్యాలు

14. పత్తి పంటకు సంబంధించి కింది వాటిలో సరైన వాక్యం ఏది?
   1) దీన్ని 'తెల్ల బంగారం' అని పిలుస్తారు
   2) పత్తిని అత్యధికంగా నల్లరేగడి నేలలో పండిస్తారు
   3) దేశంలో అత్యధికంగా ఉత్పత్తి చేసే రాష్ట్రాలు గుజరాత్, మహారాష్ట్ర
   4) పైవన్నీ సరైనవే

15. భారతదేశంలో 'ఇంద్రధనస్సు విప్లవం'ను దేనిలో భాగంగా ప్రకటించారు?
   1) మొదటి హరిత విప్లవం
   2) రెండో హరిత విప్లవం
   3) జాతీయ వ్యవసాయ విధానం - 2000
   4) జాతీయ వ్యవసాయ విధానం - 2006

16. మొదటి హరిత విప్లవం వల్ల దేశంలో తక్కువ ప్రయోజనం పొందిన పంట ఏది?
   1) పప్పుధాన్యాలు 2) నూనె గింజలు
   3) మొక్కజొన్న 4) 1, 2

17. దేశంలో పంటలు, వాటిని అత్యధికంగా పండించే రాష్ట్రాలకు సంబంధించి కింది వాటిని జతపరచండి.

జాబితా - I	జాబితా - II
i) సజ్జలు	a) కర్ణాటక
ii) రాగులు	b) మహారాష్ట్ర
iii) జొన్న	c) రాజస్థాన్

   1) i - c, ii - b, iii - a
   2) i - c, ii - a, iii - b
   3) i - a, ii - b, iii - c
   4) i - b, ii - a, iii - -c

18. బీరు, విస్కీ తయారీలో ఏ పంట గింజలను ఉపయోగిస్తారు?
   1) బార్లీ 2) సజ్జ 3) రాగులు 4) సామలు

19. 1965-66లో హరిత విప్లవాన్ని మొదటి సారిగా ఏ ప్రాంతంలో ప్రవేశపెట్టారు?
   1) పంజాబ్ 2) హర్యానా
   3) పశ్చిమ ఉత్తరప్రదేశ్ 4) పైవన్నీ

20. రెండో హరిత విప్లవానికి సంబంధించి కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
   ఎ) దీన్ని 2006 మే 26న అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రకటించారు
   బి) ఇది పప్పుధాన్యాల ఉత్పత్తికి అధిక ప్రాధాన్యం ఇచ్చింది
   1) ఎ మాత్రమే 2) బి మాత్రమే
   3) ఎ, బి సరైనవి 4) ఏదీకాదు

సమాధానాలు

1) 3	2) 3	3) 1	4) 3	5) 4
6) 2	7) 1	8) 1	9) 3	10) 4
11) 3	12) 4	13) 1	14) 4	15) 3
16) 4	17) 2	18) 1	19) 4	20) 3

సాక్షి ప్లస్
శుక్రవారం । 17-10-2025

సప్త మాతృక విగ్రహాలు ఉన్న ప్రాంతం ఏది?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

దక్షిణ భారతదేశ చరిత్ర

1. విష్ణుకుండినులు ఏర్పాటు చేసిన 'ఘటికలు' అంటే ఏమిటి?
 1) వర్తక కేంద్రాలు
 2) ఓడరేవు కేంద్రాలు
 3) విద్యా కేంద్రాలు 4) పన్నులు

జ. 3;
వివరణ: సంస్కృత భాషలో బోధించే విద్యా కేంద్రాలను 'ఘటికలు' అంటారు. తెలుగు నేలలో విష్ణుకుండినులు వీటిని ప్రథమంగా ఏర్పాటు చేశారు. భాష, సాహిత్యంను వీరు ప్రోత్సహించారు. ఘటికలలో వేదాల అధ్యయనం కీలకమైంది.

2. 'త్రివర నగర భవనగత సుందరీ హృదయ నందన' అనే బిరుదు ఉన్న విష్ణుకుండిన రాజు?
 1) రెండో మాధవ వర్మ
 2) మొదటి గోవింద వర్మ
 3) రెండో విక్రమేంద్ర వర్మ
 4) రెండో ఇంద్రవర్మ

జ. 1;
వివరణ: పొలమూరు శాసనం ప్రకారం రెండో మాధవ వర్మకు ఉన్న బిరుదు ఇది. త్రివర నగరం నర్మదా నదిపై ఉన్న జబల్‌పూర్ సమీపంలోని 'త్రిపురి' అని కొందరి అభిప్రాయం. రెండో మాధవ వర్మ కాలాన్ని విష్ణుకుండినుల పాలనా చరిత్రలో 'స్వర్ణయుగం' అంటారు.

3. 'ఉత్పత్తి పిడుగు' అనే లేఖనం ఎక్కడ లిఖించారు?
 1) మొగల్‌రాజపురం
 2) భైరవకోన 3) ఉండవల్లి
 4) గుమ్మడిదుర్రు

జ. 3;
వివరణ: విష్ణుకుండినుల కాలంలో మొగల్‌రాజపురంలో ఐదు గుహలు ప్రాధాన్యత పొందాయి. ఇందులో అర్ధనారీశ్వరమూర్తి విగ్రహం ఉంది. భైరవకోన 8 గుహలు కలిగిన శివాంకిత ప్రాంతం. ఉండవల్లిలో అనంతశయనశాయి విగ్రహం ప్రాధాన్యత పొందింది. గుమ్మడిదుర్రు ప్రముఖ బౌద్ధ క్షేత్రం.

4. భైరవకోనలోని ఎనిమిది గుహలు ఏ దేవునికి అంకితం చేశారు?
 1) విష్ణువు 2) ఇంద్రుడు
 3) బ్రహ్మ 4) శివుడు

జ. 4;
వివరణ: భైరవకోనలో విష్ణుకుండినులు 8 గుహలను తొలిపించారు. ఇవి అన్నీ శివునికి అంకితం చేశారు. ఇక్కడే త్రిముఖ దుర్గ విగ్రహం కూడా ఉంది. కుంభ శీర్షాలతో ఉన్న సింహపాద స్తంభాలు ఉన్నాయి. కాపాలికులకు ఈ ప్రాంతం రెండో కేంద్రం శ్రీశైలం (మొదటిది).

5. భూతగ్రహస్వామి అని ఏ దేవునిని అంటారు?
 1) వినాయకుడు
 2) యమధర్మరాజు
 3) బ్రహ్మదేవుడు
 4) పరమేశ్వరుడు

జ. 2;
వివరణ: విష్ణుకుండినుల కాలంలో యముడిని భూతగ్రహస్వామి అని పిలిచేవారు. వినాయకుడిని దంతముఖస్వామి అని వ్యవహరించారు. తర్వాత బ్రహ్మను పద్మ సంభవుడు అని, పరమేశ్వరుని అర్ధనారీశ్వరుడు అని అంటారు. వివిధ కాలాల్లో ఈ పేర్లతో దేవుళ్ళను పిలిచేవారు.

6. జతపరచండి.
 జాబితా-1
 1. అర్ధనారీశ్వర గుహాలయం
 2. త్రిముఖ దుర్గ శిల్పం
 3. పూర్ణకుంభం
 4. బౌద్ధక్షేత్రం
 జాబితా-2
 ఎ. బొజ్జన్నకొండ
 బి. ఉండవల్లి
 సి. భైరవకోన
 డి. మొగల్‌రాజపురం
 1) 1-డి, 2-బి, 3-ఎ, 4-సి
 2) 1-బి, 2-డి, 3-సి, 4-ఎ
 3) 1-డి, 2-సి, 3-బి, 4-ఎ
 4) 1-సి, 2-ఎ, 3-డి, 4-బి

జ: 3;
వివరణ: విష్ణుకుండినులు వివిధ ప్రాంతాలలో తమ శిల్పకళలు విస్తృతపరిచారు. అర్ధనారీశ్వరుడు అంటే శివుడు స్త్రీ, పురుష భంగిమలో కనిపిస్తాడు. దుర్గమాతకు మూడు ముఖాలతో భైరవకోనలో శిల్పీకరణ చూపరులను ఆకట్టుకుంటుంది. ఉండవల్లిలో ఉన్న పూర్ణకుంభంను చూసి సూరిశెట్టి ఆంజనేయులు చిత్రీకరించారు. దీనినే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చిహ్నంగా స్వీకరించారు. (ఇప్పుడు పూర్ణఘటం). బొజ్జన్నకొండలో బుద్ధుణ్ణి బొజ్జన్న అని పిలుస్తారు.

7. విష్ణుకుండినులు తమ రాజ్యంను దేనితో పోల్చుకున్నారు?
 1) పాంచజన్యం 2) ఖట్వాంగం
 3) కౌస్తుభం 4) స్వస్తిక్

జ. 3;
వివరణ: కౌస్తుభం అనేది మహా విష్ణువు రత్నం. ప్రపంచంలో అత్యంత విలువైనదిగా పేర్కొంటారు. ఖట్వాంగం శివుని ఆయుధం, పాంచజన్యం శ్రీకృష్ణుని శంఖం, స్వస్తిక్ సర్వాభివృద్ధికి సంకేతం.

8. విష్ణుకుండినుల రాజ్యాన్ని అంతం చేసిన పశ్చిమ చాళుక్య రాజు?
 1) మొదటి పులకేశి 2) మంగళేసు
 3) రెండో పులకేశి 4) రవికీర్తి

జ. 3;
వివరణ: చివరి విష్ణుకుండిన రాజు అయిన మంచన భట్టారకుడిని ఓడించి క్రీ.శ.624లో రెండో పులకేశి ఆ రాజ్యాన్ని ఆక్రమించాడు. తర్వాత తన సోదరుడైన కుబ్జవిష్ణువర్ధనుడికి ఆ ఆ రాజ్యాన్ని ఇచ్చాడు. ఆ రాజ్యమే వేంగి సామ్రాజ్యంగా అభివృద్ధి చెందింది.

9. గజదళాధిపతిని ఏమని పిలుస్తారు?
 1) హస్తికోశ 2) వీరకోశ
 3) స్కంధావారం 4) గుల్మిక

జ. 1;
వివరణ: హస్తి అంటే ఏనుగు లేదా గజరాజు. ఈ రకమైన దళాన్ని హస్తికోశ అని పిలుస్తారు. ఈ ఏనుగుల దళం యుద్ధ సమయాలలో అత్యంత కీలకమైన దళం. వీరకోశ అంటే పదాతి దళం. స్కంధావారం అంటే శాతవాహనుల కాలం నాటి తాత్కాలిక సైనిక శిబిరం, గుల్మిక అంటే సరిహద్దు రక్షణాధికారి అని శాతవాహనుల కాలం వివరాల ద్వారా తెలుస్తుంది.

10. శాలంకాయన రాజు హస్తివర్మ కాలంలో వేంగిపై దండెత్తిన గుప్తరాజు ఎవరు?
 1) శ్రీగుప్తుడు
 2) మొదటి చంద్రగుప్తుడు
 3) సముద్రగుప్తుడు 4) భానుగుప్తుడు

జ. 3;
వివరణ: అలహాబాద్ శాసనం ప్రకారం గుప్తరాజు సముద్రగుప్తుడు తన దక్షిణ దిగ్విజయ యాత్రలలో భాగంగా వేంగిపై దండెత్తాడు. ఈ శాసనంను హరిసేనుడు రచించాడు. గోదావరి నది ప్రాంత విషయాలు ఈ శాసనంలో ఉన్నట్లు తెలుస్తోంది.

11. చిత్రరథస్వామి పాదభక్తులము అని చెప్పుకున్న రాజులు?
 1) విష్ణుకుండినులు
 2) ఇక్ష్వాకులు 3) శాతవాహనులు
 4) శాలంకాయనులు

జ. 4;
వివరణ: శాలంకాయనుల ఆరాధ్య దైవం చిత్రరథస్వామి. ఈ దైవ స్వరూపంను సూర్యుడు అని, కొందరు శివుడు అని వ్యవహరిస్తున్నారు. శాలంకాయన అంటే నంది అని అర్థం. టాలమీ లాంటి విదేశీయులు వీరిని గురించి ప్రత్యేకంగా పేర్కొన్నారు.

12. సప్త మాతృక విగ్రహాలు ఉన్న ప్రాంతం ఏది?
 1) నారాయణ వనం
 2) నందిగామ 3) సోమశిల
 4) చేజెర్ల

జ. 4;
వివరణ: తొలిసారి శక్తి ఆరాధనకు హారీతీ దేవాలయం (నాగార్జున కొండ), పెదముడియాల మొదలగు ప్రాంతాలను ఉదహరించవచ్చు. దేవాలయాలలో సప్తమాతృకలను నెలకొల్పి ఆరాధించేవారు. చేజెర్లలో సప్తమాతృకల విగ్రహాలున్నాయి. ఆదిపరాశక్తి రూపాలే ఇవి. బ్రాహ్మణి, వైష్ణవి, మహేశ్వరి, ఇంద్రాణి, కౌమారి, వారాహి, చాముండి ఈ రూపాలు.

13. త్రిమూర్తి ఆరాధనకు ప్రాచీన ఆంధ్ర దేశంలో లభించిన ఆధారం ఏ ప్రాంతంలో ఉంది?
 1) భైరవకోన
 2) సంగమయ్య గుహ
 3) బెలుంగుహలు
 4) ఏనుగు మల్లమ్మ కొండలు

జ. 1;
వివరణ: భైరవకోనలో శివునికి ద్వారపాలకులుగా బ్రహ్మ, విష్ణు శిల్పాలు ఉన్నాయి. ఈ ప్రాంతం కాపాలికులకు రెండో కేంద్రం (మొదటిది శ్రీశైలం), సంగమయ్య గుహ శ్రీకాకుళంలో, బెలుంగుహలు కర్నూలులో, ఏనుగు మల్లమ్మ కొండలు మదనపల్లి (చిత్తూరు)లో చారిత్రాత్మక ప్రాంతాలు.

14. జతపరచండి.
 రాజవంశం:
 1. వేంగి చాళుక్యులు
 2. ఆనంద గోత్రజులు
 3. విష్ణుకుండినులు
 4. రాష్ట్రకూటులు
 చిహ్నం:
 ఎ. వృషభం
 బి. వరాహం
 సి. పంజా విసిరిన సింహం
 డి. గరుడ
 1) 1-ఎ, 2-సి, 3-డి, 4-బి
 2) 1-బి, 2-ఎ, 3-సి, 4-డి
 3) 1-సి, 2-డి, 3-బి, 4-ఎ
 4) 1-డి, 2-బి, 3-ఎ, 4-సి

జ. 2;
వివరణ: వరాహం వేంగి చాళుక్యుల చిహ్నం. ఈ రూపం విష్ణువు మూడో అవతారం (దశావతారాలలో). వృషభం ఆనందగోత్రజుల చిహ్నం. పంజా విసిరిన సింహం విష్ణుకుండినుల చిహ్నం. రాష్ట్రకూటుల చిహ్నం గరుడ (విష్ణువు వాహనం).

15. బృహత్పలాయనుల రాజధాని ఏది?
 1) వేంగి 2) కోడూరు
 3) తుమ్మలగూడెం 4) హన్మకొండ

జ. 2;
వివరణ: కోడూరు లేదా గుడూరు కృష్ణా జిల్లా మచిలీపట్నం అని గుర్తించారు. ఇది బృహత్పలాయనుల రాజధాని. వేంగి శాలం కాయనుల రాజధాని ఆ తర్వాత తూర్పు చాళుక్యుల రాజధాని, తుమ్మలగూడెం విష్ణుకుండినుల రాజధాని, హన్మకొండ తొలి కాకతీయుల రాజధాని.

16. గోలాంగులము అంటే?
 1) గరుడ 2) కోతి
 3) పంజా విసిరే సింహం
 4) సింహం

జ. 2;
వివరణ: ఆనందగోత్రజుల విజయకేతనం గోలాంగులము (కోతి) అని చేజెర్ల శిలా శాసనం చెబుతుంది. అయితే వీరి రాజలాంఛనం వృషభం. సింహం శాతవాహనులకు, పంజా విసిరే సింహం విష్ణుకుండినులకు, గరుడ గుప్తరాజుల రాజ చిహ్నాలు. ఇవి వారి వారి మత విశ్వాసాలను కూడా వ్యక్తీకరిస్తాయి.

17. తాడికొండలో శాక్యభిక్షు విహారం నిర్మించింది ఎవరు?
 1) పృథ్వీమూలుడు 2) హరివర్మ
 3) రెండో విక్రమేంద్ర వర్మ
 4) అనంతవర్మ

జ. 2;
వివరణ: హరివర్మ తాడికొండలో శాక్యభిక్షు విహారం నిర్మించాడు. ఈయన బౌద్ధ మతాభివృద్ధికి కృషి చేశాడు. ఆదుర్రులో కూడా విహారం నిర్మించి, తండ్రి పృథ్వీమూలుని నుంచి పొందిన కట్టు చెరువు గ్రామాన్ని దానం చేశాడు. మహామేఘవాహన విహారానికి కల్వచెరువును దానం చేశాడు. ఇది వర్ధమానపురంలో ఉంది. గుణపాశపురంలో ఉన్న లోకవిఖ్యాత మహా విహారానికి అట్టలువుడ గ్రామాన్ని దానం చేశాడు.

18. శాలంకాయన అంటే అర్థం ఏమిటి?
 1) చిలుక 2) సింహం
 3) నెమలి 4) నంది

జ. 4;
వివరణ: ఇక్ష్వాకుల అనంతరం ఉత్తర తీరాంధ్రలో అధికారంలోకి వచ్చినవారు శాలంకాయనులు. శాలంకాయన అంటే అర్థం నంది. శాలంకాయన అనేది గోత్రనామం. వీరు శైవ మతాభిమానులు.

19. హిరణ్య గర్భయాగం అంటే ఏమిటి?
 1) పుట్టుకతో బ్రాహ్మణుడు కాకున్నా యాగంతో కావడం
 2) పుట్టుకతో క్షత్రియుడు కాకున్నా యాగంతో కావడం
 3) పుట్టుకతో వైశ్యుడు కాకున్నా యాగంతో కావడం
 4) పుట్టుకతో శూద్రుడు కాకున్నా యాగంతో కావడం

జ. 2;
వివరణ: పుట్టుకతో క్షత్రియుడు కాకున్నా హిరణ్యగర్భయాగంతో క్షత్రియుడు కావచ్చు. ఉదాహరణకు శాలంకాయన రాజు అత్తివర్మ హిరణ్యగర్భ ప్రసవుడను అని చెప్పుకున్నాడు. పాలకులు సంతానం కోసం పుత్రకామేష్టి యాగం, రాజ్య విస్తరణకు అశ్వమేధ యాగం మొదలగు యాగాలు చేసేవారు.

20. ఖారవేలుడు జారీ చేసిన హతిగుంఫా శాసనం ఏ భాషలో ఉంది?
 1) ప్రాకృతం 2) సంస్కృతం
 3) తెలుగు 4) ఒరియా

జ. 1;
వివరణ: కళింగ రాజు ఖారవేలుడు హతిగుంఫా శాసనంను జారీ చేశాడు. ఇది ప్రాకృత భాషలో ఉంది. ఆయన 'మూషికాధిపతి' అని పిలువబడ్డాడు. ఈ శాసనంలో ఆయన రాజ్య విస్తీర్ణం మొదలగు విషయాలు ఉన్నాయి.

21. విజయనగర రాజులు ఆదరించిన తొలి తెలుగు కవి?
 1) తెనాలి రామలింగకవి
 2) ధూర్జటి
 3) పింగళి సూరన 4) నాచన సోముడు

జ. 4;
వివరణ: సంగమవంశ విజయనగర రాజు మొదటి బుక్కరాయలు ఆదరించిన తొలి తెలుగు కవి నాచన సోముడు. ఈ కవికి పెంచికలదిన్నెను బహూకరించాడు. ఉత్తర హరివంశం అనే గ్రంథాన్ని ఈయన రాశాడు. ధూర్జటి శ్రీకాళహస్తీశ్వర మహత్యం, తెనాలి రామలింగకవి పాండురంగ మహత్యం, పింగళి సూరన కళాపూర్ణోదయం మొదలగు గ్రంథాలు రాసిన ప్రముఖులు.

22. రామప్ప దేవాలయంను నిర్మించిందెవరు?
 1) రేచర్ల ప్రసాదాదిత్యుడు
 2) గోన గన్నారెడ్డి
 3) రేచర్ల రుద్రుడు
 4) గోన బుద్ధారెడ్డి

జ. 3;
వివరణ: క్రీ.శ. 1213లో గణపతి దేవుని సామంతుడు రేచర్ల రుద్రుడు, పాలంపేటలో రామప్ప దేవాలయంను నిర్మించాడు. దీని ఇటుకలు నీటిలో బెండు వలె తేలే స్వభావాన్ని కల్గి ఉన్నాయి. రంగనాథ రామాయణం రాసింది గోన బుద్ధారెడ్డి, రుద్రమకు సహకరించింది రేచర్ల ప్రసాదాదిత్యుడు, గోన గన్నారెడ్డి. వీరు కాకతీయుల కాలంలో గల ప్రముఖులు.

23. బ్రహ్మ నాయుడు పంచలోహ స్తంభంను ఎక్కడ నాటించాడు?
 1) మోటుపల్లి 2) త్రిపురాంతకం
 3) పులికాట్ 4) చేజెర్ల

జ. 2;
వివరణ: పల్నాటి బ్రహ్మనాయుడు వీర వైష్ణవాన్ని ప్రచారం చేశాడు. పంచలోహ స్తంభాన్ని త్రిపురాంతకంలో నాటించాడు. అందరూ ఒక్కటే అనేది ఆయన అభిమతం. మోటుపల్లి కాకతీయుల ఓడరేవు, పులికాట్ (ప్రళయకావేరి) వేంగి చాళుక్యుల సామంతుడు పండరంగడు నిర్మాణాలు ఉన్న ప్రాంతం, చేజెర్ల కపోతేశ్వర ఆలయం గల ప్రాంతం.

24. శ్రీలక్ష్మీ, శంఖంలను తమ శాసనాలపై చిహ్నాలుగా లిఖించుకున్న తొలి రాజులు?
 1) విష్ణుకుండినులు 2) శాలంకాయనులు
 3) తూర్పు చాళుక్యులు
 4) కాకతీయులు

జ. 1;
వివరణ: శ్రీలక్ష్మీ రాజ్య ఆర్థికాభివృద్ధికి చిహ్నం. మహా విష్ణువుకు ప్రతిరూపం శంఖం, హైందవ సంస్కృతిని వ్యాప్తి చేయటంలో విష్ణు కుండినులు కీలక పాత్ర పోషించారు.

25. రాణి రుద్రమదేవి కాలంలో ప్రసూతి వైద్యశాల నిర్మించిన ప్రాంతమేది?
 1) మందడం 2) త్రిపురాంతకం
 3) చందుపట్ల 4) పానగల్లు

జ. 1;
వివరణ: రాణి రుద్రమ దేవి కాలంలో మందడం అనే ప్రాంతంలో ఉచిత ప్రసూతి వైద్యశాలలను నిర్మించారు. త్రిపురాంతకం ప్రముఖ శైవ క్షేత్రం. చందుపట్ల రుద్రమదేవి మరణ వివరణ ఉన్న శాసనం గల ప్రాంతం, ఛాయా సోమేశ్వరాలయం గల ప్రాంతం పానగల్లు. దీనిని కుందూరు చోడులు నిర్మించారు.

What is the meaning of the phrase 'substantial moderation'

BANK EXAMS
GENERAL ENGLISH

MODEL QUESTIONS

Directions (Q.No 1-10): Read the following passage carefully and answer the questions that follow.

Five years ago, any sign of weakness in the Rupee would have been the cue for RBI officials, ministers and sundry economic commentators to lash out at Indian households for their unreasonable and unpatriotic love for gold.

And it is true that gold imports had a big role to play in India's yawning trade deficit and precarious balance of payments position in 2013.

But as the Rupee has entered shaky territory again it is oil rather than gold that has been the hot topic of debate. There's good reason for this shift.

A break down of India's import bill suggests that gold is no longer the villain of the piece when it comes to exchange rate woes. In fact, data suggest that the Indian saver's love affair with gold may be well past its prime.

When India faced a run on the Rupee and a widening trade deficit in 2013, its annual gold import bill had topped $50 billion for the second year running. Between FY10 and FY13, India saw consistently high demand for gold jewellery, bars and coins despite **galloping** global gold prices.

The bloated the country's gold import bill from about $28 billion in FY10 to a record $56 billion in FY12.

But gold imports have since seen **substantial moderation** from those excessive levels. In FY18, India's dollar outgo on gold imports amounted to just $34 billion, having shrunk 40 percent from the peak six years ago. Lest you think this is an **aberration**, gold imports have hovered in a narrow range of $27 billion to $35 billion for five years now. Bullion accounted for nearly 12 percent of the country's import bill in FY12. But its contribution is now down to about 7 percent.

This explains why debates around the current account deficit no longer **obsess** over the yellow metal.

Trends in domestic demand, tracked by the World Gold Council, show that Indian consumers have been cutting back on the volume of gold purchases in the last five years. In the years from 2010 to 2012, consumers accumulated anywhere between 900 and 1,000 tonnes of bullion a year. Jewellery accounted for about two-thirds of this volume, with bars and coins making up a third.

In the last five years though, bar and coin demand has halved from 355 tonnes in 2012 to 164 tonnes in 2017. Jewellery demand, after rising from 595 tonnes to 662 tonnes between 2012 to 2015, has flat-lined, slipping back to 573 tonnes in 2017.

As a result, aggregate domestic demand for gold has fallen by 20 percent between 2012 and 2017.

So, what has made Indian consumers cold-shoulder their favorite asset? Several factors seem to be at play.

Indian gold buyers view bullion as much as an investment as an item of adornment. We all know that any investment is most sought-after when its returns are soaring. So it was with gold.

In the five years following the global financial crisis in 2008, gold churned out bumper returns for Indian investors who hoarded it, thanks to a global flight to safe-haven assets and a steadily depreciating Rupee.

With domestic gold holders earning a 20 percent plus return for five consecutive years until 2013, investment demand for the yellow metal sky-rocketed. Gold is also seen as a hedge against inflation and the runaway price-spike in this period also **stoked** demand.

But with the global stock and bond markets staging a recovery from 2013, and inflation flagging, gold began to lose its **mojo**. As the Rupee stabilized, domestic gold investments suffered three consecutive years of negative returns from 2015 to 2017, dousing investor interest. Purchases of bars and coins, which topped 340 tonnes in 2013, had crashed to 164 tonnes by 2017.

1. The author of the passage asserts that gold is no longer the villain of the piece when it comes to exchange rate woes. Then who is the real culprit?
 1) Major steps of economic reforms taken by the incumbent government.
 2) Price hike of crude oil in global market and its impact of Indian economy.
 3) Exemption of petrol and diesel from GST
 4) All (1), (2) and (3)
 5) Only (1) and (2)
2. What is the meaning of the phrase 'substantial moderation' as used in the passage?
 A) Remarkable downward trend
 B) Noticeable upward movement
 C) Either upward or downward trend
 1) Only A 2) Only B 3) Only C
 4) None of these
 5) Other than those given as options
3. What was the impact of Indian households' unreasonable and unpatriotic love for gold in 2013 on Indian economy?
 A) Due to excessive demand by Indian household the government earned huge revenue through taxation resulting in improvement in Indian economy.
 B) The unreasonable demand of gold by Indian household gave rise to a situation of trade deficit.
 C) As a result of excessive demand of gold in Indian bullion market the balance of payments position improved.
 1) Only A 2) Only B 3) Only C
 4) Both A and B
 5) All A, B and C
4. Find the incorrect statement on the basis of the given passage.
 1) Bullion accounts for about 7 per cent of the country's import bill as of now.
 2) The consistent high demand for gold jewellery, bars and coins bloated the country's gold import bill to a record $56 billion in FY12.
 3) As per the observation of the World Gold Council, Indian consumers showed heightened inclination towards purchase of yellow metal in the last five years.
 4) Between 2012 to 2017 the aggregate domestic demand for gold has come down by 20 percent.
 5) None of the above
5. Why did people prefer to invest in gold rather than in other class of investments during the period following the global financial crisis in 2008 till 2013? Answer on the basis of the given passage.
 1) Because gold gave attractive returns on its sale
 2) Because the investment in gold was seen as a hedge against inflation
 3) Because of easy liquidity of gold
 4) Only (1) and (2)
 5) All (1), (2) and (3)

Directions (Q.No 6-8): Choose the word which is MOST SIMILAR in meaning to the word printed in bold as used in the passage.

6. **Obsess**
 1) Repulse
 2) Dominate
 3) Exude
 4) Distract 5) Rely
7. **Stoked**
 1) Slumped 2) Declined
 3) Surged 4) Supplied 5) Relied
8. **Mojo**
 1) Poison 2) Price
 3) Junk 4) Life 5) Charm

Directions (Q.No 9-10): Choose the word which is MOST OPPOSITE in meaning of the word printed in bold as used in the passage.

9. **Galloping**
 1) Jumping 2) Running
 3) Speedy 4) Halted 5) Flying
10. **Aberration**
 1) Conformity 2) Peculiarity
 3) Delusion 4) Weirdness
 5) Deviation

Directions (Q.No 11-15): Read each sentence to find out whether there is any grammatical or idiomatic error in it. The error, if any, will be in one part of the sentence, the number of that part is the answer. If there is "No error", the answer is 5. (Ignore errors of punctuation, if any).

11. (1) It is amazing how concern for / (2) the common man and the inconvenience caused to them / (3) has suddenly become / (4) a huge issue for the Opposition. / (5) No error
12. (1) Casting aspersions on the suitability / (2) of Donald Trump as president of the United States/ (3) amounts to disrespecting / (4) the American people's verdict. / (5) No error
13. (1) While Modi continues his harangue, / (2) some BJP members are behaving like Nero/ (3) playing the fiddle / (4) while Rome burnt. / (5) No error
14. (1) For India to remain a constitutional democracy / (2) we need a Supreme Court that operates/ (3) as an effective check on majority / (4) legislative and executive power. / (5) No error
15. (1) The Indian embassy in Beijing has now asked / (2) the government to consider extending / (3) the March 31 deadline for NRI / (4) as many cannot travel to India before then. / (5) No error

KEY

1) 2 2) 1 3) 2 4) 3 5) 4
6) 2 7) 3 8) 5 9) 4 10) 1
11) 2 (Replace 'them' with 'him'
12) 5
13) 4 (Replace 'burnt' with 'burns')
14) 3 (Replace 'majority' with majoritarian')
15) 3 (Replace 'NRI' with 'NRIs')